సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 214

శుక్రవారం 25-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'


kisna.com
#HarGharKisna
50+ EXCLUSIVE SHOWROOMS
KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
UPTO 100% వజ్రాభరణాల తయారీ చార్జీలపై తగ్గింపు
UPTO 20% బంగారాభరణాల తయారీ చార్జీలపై తగ్గింపు
only NATURAL DIAMONDS Natural Diamond Council
90%* బైబ్యాక్
95%* ఎక్స్ఛేంజ్
వజ్రాల నగలపై, తయారీ ఛార్జీలతో సహా
#Abki_Baar_Aapke_Liye
100+ కార్లను గెలుచుకోండి
షాపింగ్ చేయండి మరియు కారు గెలుచుకోండి*
విచారణ కోసం
franchise@kisna.com
91524 84423
మా ఇప్పటికే ఉన్న షోరూంలు: సరత్ సిటీ మాల్, గచ్చిబౌలి, హైదరాబాద్ 91005 50230 |
ఇనార్బిట్ మాల్ - సైబరాబాద్, మైండ్‌స్పేస్, మాదాపూర్, హైదరాబాద్ 81212 78807 |
దుర్గానగర్ కాలనీ, సోమాజిగూడ, హైదరాబాద్ 86554 75096 | త్యాగరాయ నగర్, ఎ. ఎస్. రావు నగర్, సికింద్రాబాద్ 86554 75100
రాబోయే షోరూమ్ : తెలంగాణ - చందా నగర్, గచ్చిబౌలి | ఆంధ్ర ప్రదేశ్ - గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం
SCAN HERE
KISNA ఇప్పుడు దేశవ్యాప్తంగా 50కి పైగా ప్రత్యేక షోరూమ్‌లలో మరియు 1,500కి పైగా షాప్-ఇన్-షాప్ లొకేషన్లలో అందుబాటులో ఉంది.


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 214

శుక్రవారం 25-10-2024



కొత్త సీజేఐగా జస్టిస్ ఖన్నా
నియమించిన రాష్ట్రపతి ముర్ము.. నవంబర్ 11న ప్రమాణ స్వీకారం -6లో



'సప్త' సుందర్
వాషింగ్టన్ సుందర్‌కు 7 వికెట్లు. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 259 ఆలౌట్ -17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మార్చిదాకా అడగొద్దు

- కొన్నాళ్లుగా వివిధ శాఖల ఆదాయం తగ్గింది
- ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది
- ఆదాయం పెంచుకునేందుకు సహకరించండి
- ఆర్థికేతర సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపుతాం..
- డీఏలు ఇచ్చే అంశంపై ఆలోచన చేస్తాం
- 317 జీవో సమస్యలను పరిష్కరిస్తామని హామీ
- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి భట్టి సారథ్యంలో మంత్రుల కమిటీ ఏర్పాటు
- దీపావళి తర్వాత ఉద్యోగ సంఘాలతో చర్చలు

ఆర్థిక అంశాల పరిశీలన ఏదైనా ఆ తరువాతే..

ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీకి స్పష్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



ఉద్యోగుల జేఏసీతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని.. వచ్చే మార్చి 31 వరకు ఎలాంటి ఆర్థికపరమైన ఒత్తిడులు చేయవద్దని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరించేందుకు సర్కారు సిద్ధంగా ఉందని.. దీనికి సంబంధించి మంత్రులతో కమిటీ వేస్తున్నామని తెలిపారు.

అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆందోళన బాట పడతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జేఏసీ ప్రతినిధులతో సీఎం రేవంత్ గురువారం సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటలపాటు జరిగిన ఈ చర్చల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి జేఏసీ నుంచి హాజరైన 36 మందికి మాట్లాడే అవకాశం కల్పించారు. వారు చెప్పిన అంశాలు, సమస్యలను విన్నారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రతినిధులను

మిగతా 2వ పేజీలో ▶

పరిస్థితి బాగోలేదు.. సహకరించండి!

ఉద్యోగుల డిమాండ్లన్నీ న్యాయమైనవేనని, వాటిని పరిష్కరించేందుకు తమకు అభ్యంతరం లేదని సీఎం రేవంత్ తెలిపారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలన్నారు. ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉందని.. కొన్నాళ్లుగా వివిధ శాఖల ఆదాయం కూడా తగ్గిందని తెలిపారు. వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు కూడా ఆర్థిక అంశాల్లో తమపై ఒత్తిడి తేవొద్దని కోరారు. ఆర్థిక అవసరాలు లేని బది లీలు, పాలనాపరమైన అంశాలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు ఉద్యోగులు సహకరించాలని కోరారు.

బాబు వదిలిన కుట్ర 'బాణం'

సొంత అన్న టార్గెట్‌గా షర్మిల అడుగులు

వైఎస్సార్ జీవించి ఉన్నప్పుడే కుటుంబ ఆస్తులన్నీ పంపకం

చెల్లెలిపై ప్రేమాభిమానాలతో తన సొంత ఆస్తుల్లోనూ వాటా ఇస్తానన్న జగన్

- తండ్రి మరణించిన పదేళ్ల తరవాత... ఈ మేరకు 2019లో ఎంఓయూ
- కేసులన్నీ తొలగిపోయాక ఆ ఆస్తుల్ని ఇస్తానని ఎంఓయూలో స్పష్టీకరణ
- దాంట్లో భాగంగా సరస్వతీ పవర్‌లో మిగిలిన 51 శాతం వాటా కూడా తల్లి విజయమ్మ పేరిటే తాత్కాలికంగా గిఫ్ట్ డీడ్ చేస్తూ జగన్ దంపతుల సంతకాలు
- కానీ గిఫ్ట్ డీడ్‌ను దుర్వినియోగం చేసిన షర్మిల.. తల్లి పేరిట షేర్లుగా మార్పు
- ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు జగన్ వద్దే ఉన్నాయని తెలిసీ.. అవి పోయాయని అబద్ధాలు
- షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారాలు గానీ, జగన్ సంతకం గానీ లేకుండానే షేర్లుగా మార్పు
- కనీసం వైఎస్ జగన్‌కు సమాచారం కూడా ఇవ్వకుండా షర్మిల చట్టవిరుద్ధ చర్యలు
- సొంత అన్న చట్టపరంగా ఇబ్బందులు పడతారని తెలిసి కూడా కుయుక్తులు
- న్యాయపరంగా జగన్‌ను ఇబ్బంది పెట్టాలనే బాబు కుట్రలో క్రియాశీలక పాత్ర
- ఇది తెలిశాక.. ఆ బదిలీ చట్టవిరుద్ధమంటూ.. ఆపాలంటూ చెల్లెలికి జగన్ లేఖ
- షర్మిల ససేమిరా అనడంతో న్యాయనిపుణుల అభిప్రాయాన్ని తీసుకున్న జగన్
- ఇది చట్ట విరుద్ధం కనక షేర్ల బదిలీని ఆపకుంటే ఇబ్బందులొస్తాయన్న నిపుణులు
- తప్పనిసరి పరిస్థితుల్లో.. చట్ట విరుద్ధ బదిలీని ఆపాలంటూ ఎన్‌సీఎల్‌టీకి జగన్
- దీనిపై ఎల్లో మీడియాలో వికృత కథనాలు.. బాబు కుట్రకు షర్మిల వంత



14 లో

ఎన్‌విడియాతో రిలయన్స్ జట్టు 17 లో

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates (NECC, Vencobb Chicken)

12 Eggs Retail Rate ₹ 72	Ex Farm Live Bird	120 kg	Dressed with Skin	206 kg
	Retail Live Bird	142 kg	Skin Less	234 kg

Issued in the interest of consumers

కాంగ్రెసోళ్లను ప్రజలే ఉరికిచ్చి కొట్టే

రోజులు దగ్గరపడ్డాయి



ఆదిలాబాద్ రైతుపోరు సభలో కేటీఆర్

- రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమా ఇచ్చే దాకా ప్రభుత్వంపై పోరాడతాం
- చంద్రబాబుతోనే కొట్లాడినం.. ఈ చిట్టినాయుడు ఎంత? సీఎంను చూసి భయపడబోమని వ్యాఖ్య

12 లో

ఆ పదిమందీ లేకపోతే ప్రభుత్వం నడవదా?



కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి ధ్వజం

- ప్రభుత్వమే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏం ప్రజాస్వామ్యం?
- ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి అంటూ ఫైర్

12 లో

వచ్చే ఆగస్టుకల్లా కాజీపేట యూనిట్



ఎంపీల భేటీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- రూ.680 కోట్లతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు
- తెలంగాణలో 15 ప్రాజెక్టులకు ఫైనల్ లొకేషన్ సర్వే..

2 లో

మూడ్రోజుల్లో దిగిపోండి



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు ఊహించని షాక్ ఎదురైంది. ఈ నెల 28లోగా రాజీనామా చేయాలని అధికార లిబరల్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు అల్టిమేటం ఇచ్చారు. లేదంటే తిరుగుబాటును ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వివరాలు 6లో



జూబ్లీహిల్స్ సొసైటీకి హైకోర్టు షాక్

- కొత్త సభ్యత్వాల ప్రక్రియ నిలిపివేయాలని ఆదేశం
- జూబ్లీహిల్స్–4 ప్లాట్ల అమ్మకాలు కూడా ఆపాలని నిర్దేశం
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి

3 లో

అనగనగా 'మునగ'



- భద్రాద్రి జిల్లా కలెక్టర్ సాగు పాఠాలు
- యూట్యూబ్‌లో జితేశ్ పాటిల్ వీడియోలు
- మునగ సాగుతో తొలి ప్రయోగాలు.. సంప్రదాయేతర పంటలపై అవగాహన

వివరాలు 13లో

ప్రపంచం చూపు.. పాకశాస్త్రం వైపు..



పర్యాటకంతోపాటు వేగంగా విస్తరిస్తున్న ఆహార రంగం

స్థానిక వంటకాలకే సై అంటున్న టూరిస్టులు.. ముందే ఇంటర్నెట్ వెతుకులాట

2033 నాటికి పాకశాస్త్ర నిపుణులకు భారీ వేతనాలు.. అగోడా, ఫుడ్ ట్రావెల్, బుకింగ్ డాట్‌కామ్ అధ్యయనాల్లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సహా యావత్ ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు పాకశాస్త్ర ప్రావీణ్యుల కోసం వెతుకుతోంది. వివిధ దేశాల ఆహార అలవాట్లు, వారికి ఆతిథ్యం ఇచ్చే విధానంపై నెటిజన్లు ఇంటర్నెట్‌ను జల్లెడ పడుతున్నారు. ప్రపంచ పర్యాటకం శరవేగంగా విస్తరిస్తుండటం, విభిన్నమైన ఫుడ్‌ను రుచి చూసేందుకు వారు ఇష్టపడుతుండటమే దీనికి కారణం. భారత్ సహా ప్రపంచ దేశాల పర్యాటకుల్లో 75 శాతం మంది తమ టూర్లలో ఆహారాన్ని కూడా ముఖ్యమైన అంశంగా భావిస్తున్నారు. ఏ దేశం వెళ్తున్నాం? అక్కడ దొరికే ఫుడ్ ఏమిటి? ఏయే వెరైటీలు దొరుకుతాయి? అనే అంశాలను ఇంటర్నెట్‌లో వెతుకుతున్నారు. దీనితో పాకశాస్త్రంలో చేయితిరిగిన వంటగాళ్లకు డిమాండ్ పెరిగింది. వరల్డ్ టూరిజంలో ఫుడ్ టెక్నాలజీ నిపుణుల అవసరం వచ్చే నాలుగేళ్లలో కనీసం మూడు రెట్లు పెరుగుతుందని అంచనా. 2023లో భారత్ పర్యాటక మార్కెట్ విలువ 23 బిలియన్ డాలర్లు ఉంది. ఇది 2033 నాటికి 182.5 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఫ్యూచర్ మార్కెట్ సంస్థ అంచనా వేసింది. ప్రపంచ పర్యాటక వెబ్‌సైట్ అగోడా, మరికొన్ని ట్రావెల్ సంస్థలు చేసిన పలు అధ్యయనాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. అధ్యయనంలో భాగంగా.. భారత్, థాయిలాండ్, లావోస్, టర్కీతోపాటు మరికొన్ని దేశాల ప్రయాణికులను ఆహారం విషయమై ప్రశ్నించారు.

నిపుణులకు భలే గిరాకీ..

ఒక అంచనా ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో ఫుడ్ టెక్నాలజీ నిపుణులు 5 లక్షల వరకూ ఉంటారు. వారిలో చాలా మంది ఇతర ప్రాంతాల నుంచి, ఇతర దేశాల నుంచి వచ్చినవారు కూడా ఉన్నారు. నైపుణ్యాన్ని, మార్కెట్‌ను బట్టి వారికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకూ వేతనాలు అందుతున్నాయి. 2033 నాటికి ఈ వేతనాలు కనీసం మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందని అగోడా అధ్యయనం చెబుతోంది. పర్యాటకులు అనేక అంశాలతో కూడిన ఆహారాన్ని అడుగుతున్నారని.. రకరకాల న్యూట్రిషన్లు, ఆయిల్ లేకపోవడం, కొన్నిరకాల పదార్థాలు లేకుండా ఉండటం వంటి కోరుతున్నారని పేర్కొంటోంది. అందుకు అనుగుణంగా ఆహారాన్ని సిద్ధం చేస్తూనే.. రుచిలో, ఇతర అంశాల్లో తేడా రాకుండా చూసుకునే నిపుణులైన వంటగాళ్లకు డిమాండ్ పెరుగుతోందని తెలిపింది. అదే సమయంలో వివిధ దేశాలకు చెందిన వంటలను సిద్ధం చేయగలిగినవారికి ప్రాధాన్యం ఉంటోందని వెల్లడించింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల సిలబస్ మారుతోందని తెలిపింది. అంతేకాదు.. మన దేశం నుంచి ఫుడ్ టెక్నాలజీ నిపుణులను వివిధ దేశాలకు పంపి అక్కడి ప్రత్యేకతలపై ఇంటర్న్‌షిప్ అందించాలనేది భారత టూరిజం, ఫుడ్ టెక్నాలజీల విభాగం ఆలోచన. తెలంగాణలో ఇప్పటికే 50కిపైగా ఫుడ్ టెక్నాలజీ కాలేజీలు ఉన్నాయి. అవన్నీ తగిన విధంగా సిలబస్ మార్పులకు సిద్ధమవుతున్నాయి.

తెలంగాణ వారసత్వ వంటలపై ఆసక్తి

వారసత్వ వంటలకు గిరాకీ పెరిగింది. ఏఐ టెక్నాలజీ విస్తృతమయ్యాక ఈ తరహా అవగాహన పెరుగుతోంది. తెలంగాణ వంటల గురించి చాలా మంది వాకబు చేస్తున్నారు. – రాజీవ్ కాలే, హాలిడేస్ సంస్థ ప్రెసిడెంట్

హైదరాబాదీ బిర్యానీకి యమ గిరాకీ..

వరల్డ్ టూరిస్టులు ఇప్పుడు హైదరాబాద్ బిర్యానీ అంటే బాగా ఇష్టపడుతున్నారు. మారుతున్న అలవాట్లకు అనుగుణంగా దీని తయారీలోనూ మార్పులు కోరుతున్నారు. చాలా మంది బిర్యానీ కోసమే హైదరాబాద్‌ను ప్రయాణ జాబితాలో చేరుస్తున్నారు. – నందకుమార్, కార్పొరేట్ టూర్స్ సంస్థ ప్రెసిడెంట్

ఏ అధ్యయనం ఏం చెబుతోంది?

● మారుతున్న ఆహార అలవాట్లు, పర్యాటకుల ప్రాధాన్యతలపై పలు సంస్థలు విభిన్న కోణాల్లో అధ్యయనాలు చేశాయి. ఆయా దేశాల్లో ఆర్థిక బలోపేతానికి ఫుడ్ టూరిజం దోహదపడుతోందని.. సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు పెరుగుతోందని గుర్తించాయి. పలు ప్రధాన అధ్యయనాలను పరిశీలిస్తే..

ప్రపంచవ్యాప్తంగా 95శాతం మంది ప్రయాణికులు సెలవుల్లో ప్రయాణించేందుకు, ఈ క్రమంలో తమను ఫుడ్ టూరిస్టులుగా చెప్పుకొనేందుకు ఇష్టపడుతున్నారు. మంచి ఆహారం ఎక్కడ దొరుకుతుందని తెలుసుకునేందుకు కన్సల్టెన్సీలను కూడా సంప్రదిస్తున్నారు.
– యూఎస్ ఆధారిత హాలిడే పోర్టల్ జెర్సీ ఐలాండ్ హాలిడేస్

ప్రయాణికుల్లో 53% మంది విదేశీ ప్రయాణాలు, పర్యటనల్లో సరికొత్త ఆహారాన్ని కోరుకుంటున్నారు. కొత్త ప్రదేశాలను చూసి ఏవిధంగా ఎంజాయ్ చేస్తున్నారో.. తమ దేశంలో లేని కొత్త ఫుడ్‌ను తీసుకుని అదే తరహాలో ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నారు.
– ఫుడ్ ట్రావెల్ అసోసియేషన్ నివేదిక

86శాతం మంది భారత్, శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియా ప్రయాణికులు స్థానిక వంటకాలను ఇష్టపడుతున్నారు. 78శాతం మంది ప్రజలు ఐకానిక్ వంటకాల వెనుక ఉన్న చరిత్ర, వారసత్వాన్ని అర్థం చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.
– బుకింగ్ డాట్ కామ్ నివేదిక

ఆయన చేసిన నేరం ఏంటి?

ప్రభుత్వ వాదనలు వినాలన్న సుప్రీంకోర్టు

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏఎస్పీ తిరుపతన్న బెయిల్ పిటిషన్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రిమాండ్‌లో ఉన్న ఏఎస్పీ మేకల తిరుపతన్న బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గురువారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున మోహిత్ రావు వాదనలు వినిపిస్తూ... ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్న, భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావులు గత మార్చి 23న అరెస్టు అయ్యారని చెప్పారు. తిరుపతన్న 211 రోజులుగా జైల్లోనే ఉన్నారని తెలిపారు. చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారని, ఇది దాఖలు చేసి కూడా మూడు నెలలవుతోందని వివరించారు. ట్రయల్ కోర్టు, హైకోర్టులను ఆశ్రయించగా... బెయిల్ పిటిషన్లను కొట్టివేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకొని... 211 రోజులుగా నిందితుడు జైల్లో ఎందుకున్నారని, ఆయన చేసిన నేరం ఏంటని న్యాయవాదిని ప్రశ్నించింది. ఇందుకు మోహిత్ రావు సమాధానమిస్తూ.... 'ఎస్ఐబీ వింగ్ అనేది నా కంట్రోల్‌లో నడుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ చేయడం, ప్రొఫైల్ తయారు చేయడం, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయడం అధికారిగా నా విధి'అని తెలిపారు. రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడేందుకు మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేశారని, చట్టవిరుద్ధంగా చేయలేదని విన్నవించారు. ఈ వాదనలపై మరోసారి న్యాయస్థానం జోక్యం చేసుకొని... ''ఇందులో నేరం ఏంటో మాకు అర్థం కావడం లేదు'అని అభిప్రాయపడింది. అయితే ప్రభుత్వ వాదనలు సైతం వినాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. అనంతరం కౌంటర్ దాఖలుచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 27కు వాయిదా వేసింది.



ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళాన్ని గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, డీజీఎం ఎంవీఎస్ సుధాకర్



సార్! కొద్దిగా మావైపు కూడా చూడండి ప్లీజ్!!

వచ్చే ఆగస్టుకల్లా కాజీపేట యూనిట్

- రూ.680 కోట్లతో సాగుతున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు
- ఏటా 600 ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల నిర్మాణం.. 3000 మందికి ఉపాధి
- తెలంగాణలో 15 ప్రాజెక్టులకు ఫైనల్ లొకేషన్ సర్వే
- ఎంపీల సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో అరుణ్‌కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ)ను వచ్చే ఆగస్టు నాటికి పూర్తి చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ యూనిట్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎల్‌హెచ్‌బీ (లింక్‌హాఫ్‌మన్ బుష్) కోచ్‌లు, ఈఎంయూ (ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్) కోచ్‌లను తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏటా 600 కోచ్‌ల నిర్మాణ సామర్థ్యంతో కాజీపేట యూనిట్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. గురువారం దక్షిణమధ్య రైల్వే పరిధిలోని పార్లమెంట్ సభ్యుల సమావేశం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగింది. ఈ సందర్భంగా పలు పెండింగ్ సమస్యలను ఎంపీలు ప్రస్తావించారు. అనంతరం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మొదట్లో రూ.250 కోట్లతో కాజీపేట్‌లో ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని, ప్రస్తుతం దానిని రూ.680 కోట్లతో రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల సుమారు మూడువేల మందికిపైగా ఉపాధి లభిస్తుందన్నారు. అమృత్ భారత పథకం కింద చేపట్టిన 40 రైల్వేస్టేషన్‌ల పునరాభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, రూ.780 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ పునరాభివృద్ధి ప్రాజెక్టు వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతుందని తెలిపారు.

15 ప్రాజెక్టులకు ఫైనల్ లొకేషన్ సర్వే

దక్షిణమధ్య రైల్వేలో 15 ప్రాజెక్టులను చేపట్టేందుకు ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ.50 వేల కోట్లతో 2647 కి.మీ. రైల్వేలైన్‌లను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రూ.17,862 కోట్ల అంచనాతో 1,447 కి.మీ. డబ్లింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఢిల్లీ తరువాత హైదరాబాద్ కేంద్రంగానే అత్యధికంగా 5 వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సకాలంలో భూమి లభించకపోవడం వల్ల ఎంఎంటీఎస్ రెండో దశతోపాటు పలు ప్రాజెక్టుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం రూ.650 కోట్లతో రాయగిరి నుంచి యాదాద్రి వరకు 31 కి.మీ. వరకు ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టును రైల్వేశాఖ సొంతంగా చేపట్టనుందన్నారు. ఔటర్‌రింగ్‌రోడ్డు చుట్టూ నిర్మించాలని ప్రతిపాదించిన రైల్ రింగ్‌రోడ్డుకు సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ప్రాధాన్యతల కోసం కసరత్తు

రానున్న కేంద్ర బడ్జెట్‌లో రైల్వే ప్రాధాన్యతలను లక్ష్యంగా చేసుకొని దక్షిణమధ్య రైల్వే నిర్వహించిన ఈ ఎంపీల సమావేశంలో తెలంగాణ ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రెడ్డి, కేఆర్ సురేశ్‌రెడ్డి, డీకే అరుణ, కడియం కావ్య, బలరాం నాయక్, రఘురాంరెడ్డితోపాటు సాగర్ ఈశ్వర్ ఖండ్రే (బీదర్), రాధాకృష్ణ దొడ్డమణి (కలబురిగి) పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన ఆర్‌యూబీలు, ఆర్‌ఓబీలు నత్తనడకన సాగుతున్నాయని, సకాలంలో పూర్తయ్యేలా గడువు విధించాలని ఈటల సూచించారు. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, జర్నలిస్టులకు, దివ్యాంగులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని రఘునందన్‌రెడ్డి కోరారు. ఏటా రెండుసార్లు ఎంపీల సమావేశం పెట్టి సమస్యలపై చర్చించాలని సురేశ్‌రెడ్డి సూచించారు. దేవరకద్ర, కొకుంట్ల, జడ్చర్ల ప్రాంతాల్లోని ఆర్‌యూబీలు, ఆర్‌ఓబీలను సకాలంలో పూర్తి చేయాలని డీకే అరుణ కోరారు. కాజీపేట రైల్వే ఆసుపత్రిలో కనీస సదుపాయాలు కల్పించాలని కడియం కావ్య కోరారు. ఎంపీల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఉంటుందని జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ చెప్పారు. 2023–24 ఆర్థిక ఏడాదిలో 141 మిలియన్ టన్నుల సరుకు రవాణాద్వారా అత్యధికంగా రూ.13,620 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు తెలిపారు.

మార్చి దాకా అడగొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్దేశించి సీఎం రేవంత్ 15 నిమిషాల పాటు మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు.

డీఏలపై ఆలోచన చేస్తాం..

ప్రభుత్వం ఇవ్వాల్సిన 5 డీఏలను తక్షణమే విడుదల చేయాలని సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కనీసం మూడు డీఏలను వెంటనే ఇవ్వాలని.. 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో డీఏలపై ప్రకటన చేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్ స్పందిస్తూ.. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని, ఎంతో కొంత న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. పెండింగ్ బిల్లులు, నగదు రహిత ఆరోగ్య కార్డుల జారీ అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నామని తెలిపారు. డీఏల విషయంలో ప్రభుత్వానికి ఒకట్రెండు రోజులు సమ యం ఇవ్వాలని కోరారు.

317 జీవో సమస్యలను పరిష్కరిస్తాం..

స్థానిక జిల్లాలకు ఉద్యోగుల బదిలీ కోసం తీసుకొచ్చిన 317 జీవోతో ఏర్పడ్డ సమస్యలను పరిష్కారిస్తామని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ భరోసా ఇచ్చారు. ఈ అంశంపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన సీల్డ్ కవర్ నివేదికను శుక్రవారం ఉద్యోగ ప్రతినిధుల ముందే తెరుస్తామని చెప్పారు. అందులోని అంశాలను పరిశీలించి, తగిన సలహాలు ఇస్తే.. సమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

భట్టి నేతృత్వంలో మంత్రుల కమిటీ..

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో.. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో కమిటీ వేస్తున్నట్టు సీఎం రేవంత్ వెల్లడించారు. దీపావళి పండుగ తర్వాత ఈ కమిటీ సంఘాల నేతలతో సంప్రదింపులు జరుపుతుందని.. ఈ క్రమంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వానికి సూచనలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి జనరల్ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కో–చైర్మన్ చావా రవితోపాటు పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టితో భేటీ అయిన ఉద్యోగుల జేఏసీ నేతలు

సీఎంకు సమస్యలు వివరించాం

ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రతినిధులంతా సీఎంతో నేరుగా మాట్లాడారు. అన్ని సమస్యలను ఆయన ముందు పెట్టారు. తొలి సమావేశం సుహృద్భావ వాతావరణంలోనే జరిగింది. సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం సహకరిస్తుందని భావిస్తున్నాం.
– మారం జగదీశ్వర్, జేఏసీ అధ్యక్షుడు

కనీసం 2 డీఏలైనా ఇవ్వాలి

తక్షణమే రెండు డీఏలైనా ఇస్తే ఉద్యోగులకు ప్రభుత్వంపై నమ్మకం కుదురుతుంది. ప్రతీ దానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో ముడిపెట్టడం సరికాదు. ప్రభుత్వంతో కలసి ప్రజలకు సేవ చేసేందుకు ఉద్యోగులు అన్నివేళలా కృషి చేస్తారు.
– చావా రవి, జేఏసీ కో-చైర్మన్

కొంత సానుకూలం

సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. ప్రభుత్వం మార్చి 31 వరకూ సమయం కావాలని కోరింది. ఇది న్యాయమైన కోరికే. అయితే, పెండింగ్‌లో ఉన్న 5 డీఏల విషయంలో కనీసం రెండు ఇవ్వడానికి కేబినేట్ నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం.
– పింగిలి శ్రీపాల్‌రెడ్డి, జేఏసీ అదనపు సెక్రటరీ జనరల్

సీపీఎస్ వెంటనే రద్దు చేయాలి

ప్రభుత్వంపై నయాపైసా భారం పడని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను వెంటనే రద్దు చేయాలి. సీపీఎస్‌తో రెండు దశాబ్దాలుగా సామాజిక భద్రత లోపిస్తోంది. భవిష్యత్తులోనూ ఇది అధిక భారంగా మారుతుంది. కాంగ్రెస్ పాలనలో ఉన్నప్పుడు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు ఈ విధానాన్ని రద్దు చేశాయి. రాష్ట్రంలోనూ సీపీఎస్‌ను రద్దు చేస్తే ఎల్బీ స్టేడియంలో రెండు లక్షల కుటుంబాలతో ధన్యవాదాలు తెలుపుతాం.
– సీఎంకు సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ వినతి


ఈహెచ్‌ఎస్ ట్రస్ట్ ఏర్పాటు చేయండి

ఉద్యోగుల బేసిక్ వేతనం నుంచి ఒకశాతం ఇస్తాం: లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం వెంటనే 'ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)' ట్రస్టును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి కోరారు. ఆ ట్రస్టుకు ఉద్యోగుల తరఫున బేసిక్ వేతనంలో ఒక శాతం మొత్తాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గుతుందన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులతో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమైన సందర్భంగా పలు విజ్ఞప్తులు చేశారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని, తద్వారా ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు ఇతర ప్రయోజనాలు అడుగుతామని తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ భవిష్యత్తులో ప్రభుత్వానికి భారంగా పరిణమిస్తుందని.. దాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.50 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల వరకు ఆదాయం సమకూర్చే అసైన్‌మెంట్ భూముల క్రమబద్ధీకరణ చేపట్టాలని సూచించారు.

రూ.300 కోట్లతో 'షూఆల్స్' కర్మాగారం!

మంత్రి శ్రీధర్‌బాబుతో దక్షిణ కొరియా షూ కంపెనీ చైర్మన్ భేటీ



మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయిన దక్షిణ కొరియా షూ కంపెనీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: మెడికల్, స్మార్ట్ బూట్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న షూఆల్స్ కొరియన్ కంపెనీ తెలంగాణలో కర్మాగారం ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తం చేసిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 750 ఎకరాలు కేటాయిస్తే రూ. 300 కోట్లతో అత్యాధునిక షూ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పుతామని చెప్పిందన్నారు. దక్షిణ కొరియా నుంచి వచ్చిన షూఆల్స్ చైర్మన్ చెవోంగ్ లీ, ఆ సంస్థ ప్రతినిధులు గురువారం సచివాలయంలో తనను కలిసినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. 87 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించగల గిగా ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచారన్నారు. మెడికల్ చిప్‌తో కూడిన బూట్ల సోల్స్, జీపీఎస్ అమర్చిన బూట్లు, 10 వేల అడుగులు వేస్తే గంటకు 25 వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే బూట్లతోపాటు మధుమేహం, కీళ్ల నొప్పుల బాధితులకు నడకలో ఉపశమనం కలిగించే పలు రకాల ఉత్పత్తులను తాము తయారు చేస్తామని చెవోంగ్ లీ పేర్కొన్నట్లు శ్రీధర్‌బాబు వివరించారు. అలాగే 5 వేల ఎకరాలు కేటాయిస్తే ఆసియాలో ఎక్కడాలేని విధంగా స్మార్ట్ హెల్త్‌సిటీని నెలకొల్పే ప్రతిపాదనను కొరియా బృందం చేసిందన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు రైన్లాండ్ ఆసక్తి

రాష్ట్రంలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు జర్మనీ దేశంలోని రైన్లాండ్ రాష్ట్రం ఆసక్తి కనబర్చిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రైన్లాండ్ రాష్ట్ర ఆర్థిక, రవాణా, వ్యవసాయ మంత్రి డానియేలా ష్మిట్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం గురువారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కూప్లెర్, హైదరాబాద్ కాన్సుల్ అమితా దేశాయ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో రసాయనాలు, ఫార్మా ఉత్పత్తులు, బయో టెక్నాలజీ, వ్యాక్సిన్‌లు, ప్యాకేజింగ్, పౌల్ట్రీ, వ్యవసాయం, ఆటోమొబైల్స్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో భాగస్వామ్యం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

రాష్ట్రంలో సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తాం

మంత్రి తుమ్మల



మలేసియాలోని ఎఫ్‌జీవీ కంపెనీలో రిఫైనరీ మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాబోయే రోజుల్లో రాష్ట్రంలో సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తామని, అందుకు తగిన అవకాశాలను పరిశీలిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మలేసియా పర్యటనలో ఉన్న మంత్రి తుమ్మల సీడ్ గార్డెన్ ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. అనంతరం ఎఫ్‌జీవీ కంపెనీ సీడ్ గార్డెన్, నర్సరీలు, అధునాతన సాంకేతిక పద్ధతులతో నడుపుతున్న విత్తన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఎఫ్‌జీవీ కంపెనీ రిఫైనరీ మొక్కలను సందర్శించి అక్కడ తయారు చేసే వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ...ఎఫ్‌జీవీ కంపెనీ నుంచి ఇప్పటికే రాష్ట్రానికి సీడ్స్‌ను చాలావరకు తెప్పించుకున్నామన్నారు. రాష్ట్రంలో సీడ్ గార్డెన్ ఏర్పాటుకు ఎఫ్‌జీవీ కంపెనీ సహాయ సహకారాలు అందజేయాలని కోరగా వారు సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు తెలిపారు. వివిధ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్ గురించి అక్కడ కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు.

కేంద్ర సంప్రదింపుల కమిటీల్లో ఎంపీలకు చోటు

టెక్స్‌టైల్స్‌లో చామల, స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీలో మల్లు, కావ్యలకు చోటు



చామల కిరణ్



మల్లు రవి



కడియం కావ్య

సాక్షి, న్యూఢిల్లీ/కాజీపేట రూరల్: వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కమిటీల్లో రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఎంపీలకు చోటు లభించింది. టెక్స్‌టైల్స్ శాఖ కమిటీలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీలో మల్లు రవి, కడియం కావ్యలకు అవకాశం కల్పిస్తూ ఆయా మంత్రిత్వ శాఖలు గురువారం ఉత్తర్వులు జారీ చేశాయి. కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీకి చైర్మన్‌గా ఆ శాఖ మంత్రి గిరిరాజు సింగ్ వ్యవహరించనుండగా, సభ్యునిగా చామలకు అవకాశం దక్కింది. ఈ కమిటీలో సహాయ మంత్రి పవిత్రతో పాటు ఎనిమిది మంది లోక్‌సభ, నలుగురు రాజ్యసభ, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు కలిపి.. మొత్తం 14 మంది సభ్యులుగా ఉన్నారు. కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్ సంప్రదింపుల కమిటీలో ఎంపీలు మల్లు రవి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యలకు చోటు దక్కింది. కమిటీకి కేంద్ర స్కిల్ డెవలప్ మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. లోక్‌సభ, రాజ్యసభల నుంచి ఏడుగురు చొప్పున 14 మంది, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 16 మంది సభ్యులతో ఈ కమిటీ పని చేయనున్నట్లు ఆయా మంత్రిత్వ శాఖలు వెల్లడించాయి.

స్కిల్ డెవలప్‌మెంట్‌కు కృషి

సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఎ.కె.జైన్‌తో తెలంగాణ, కర్ణాటక ఎంపీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

సీఎం దృష్టికి పీఆర్ కార్యదర్శుల సమస్యలు




సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, పద్మావతి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినట్టు తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ (టీపీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సీఎంతో గురువారం టీజీజేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో.. 2018 నూతన పీఆర్ చట్టానికి సవరణలతో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరినట్టు వివరించారు. వీరి ప్రొబేషన్ వ్యవధిని రెండేళ్లకు తగ్గిస్తూ సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీని 4 గ్రేడ్లుగా విభజించి, క్యాడర్ స్ట్రెంత్ ఇవ్వాలని కోరినట్టు వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. స్థానిక ఎన్నికల్లోగా పీఆర్ మంత్రి, సెక్రటరీ, కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి.. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు.

జూబ్లీహిల్స్ సొసైటీకి హైకోర్టు షాక్

కొత్త సభ్యత్వాల ప్రక్రియ నిలిపివేయాలని ఆదేశం

- జూబ్లీహిల్స్–4 ప్లాట్ల అమ్మకాలు కూడా ఆపాలని నిర్దేశం
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి హైకోర్టు భారీ షాకిచ్చింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కొత్త సభ్యత్వాల ప్రక్రియపై ముందుకు వెళ్లవద్దని, వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే, సొసైటీల చట్టానికి విరుద్ధంగా గండిపేట్ మంచిరేవులలో జూబ్లీహిల్స్–4 పేరిట నిర్వహిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపార ఒప్పందాన్ని కూడా ఆపేయాలని తేల్చిచెప్పింది. వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి, కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్‌తోపాటు మరో ప్రతివాది జూబ్లీహిల్స్ సొసైటీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను నవంబర్ 14కు వాయిదా వేసింది. జూబ్లీహిల్స్ సొసైటీ అక్రమాలపై తాను ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ వ్యాపారవేత్త జ్యోతిప్రసాద్ కొసరాజు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ అక్రమాలపై విచారణ జరిపేలా కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేయాలని, రియల్ వ్యాపార ఒప్పందాన్ని, సభ్యత్వ నమోదును నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు.

స్థలాలు పొందని వారు 10 శాతానికి మించొద్దు...

పిటిషనర్ తరఫున న్యాయవాది వై.రామారావు వాదనలు వినిపిస్తూ.. 'చట్టాలను ఉల్లంఘిస్తూ జూబ్లీహిల్స్ సొసైటీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ఈ సొసైటీ విషయంలో స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ (విచారణాధికారి) విచారణ నివేదిక ఉన్నా కొత్త సభ్యులను చేర్చుకునే ప్రక్రియ ప్రారంభించింది. కోఆపరేటివ్ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం స్థలాలు ఉంటేనే కొత్త సభ్యులను చేర్చుకోవాలి. స్థలాలు పొందని సభ్యుల సంఖ్య 10 శాతానికి మించకూడదు. అలాగే మంచిరేవులలో జూబ్లీహిల్స్ ఫేజ్–4 పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీసింది. కొత్త సభ్యులుగా చేరే వారు రూ.5 లక్షలు చెల్లించి ప్లాట్ బుక్ చేసుకోవాలని షరతు విధించింది. ఓ ప్రైవేట్ వెంచర్ సంస్థతో చట్టవిరుద్ధంగా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అక్రమాలపై సెప్టెంబర్ 24న, అక్టోబర్ 9న ఫిర్యాదు చేసినా కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కోఆపరేటివ్ సొసైటీస్ చట్టంలోని సెక్షన్ 51 ప్రకారం విచారణ జరపాల్సిన రిజిస్ట్రార్ ఏ నిర్ణయం తీసుకోలేదు. దీన్ని ఆసరాగా చేసుకున్న సొసైటీ సభ్యత్వ నమోదులో దూకుడుగా ముందుకెళ్తోంది. ఇది ప్రస్తుతం ప్లాట్లు పొందని సభ్యులకు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుంది. దాదాపు 1,800 మంది సభ్యులు ప్లాట్ల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త సభ్యుల చేరిక విషయం గానీ, ప్రైవేట్ ఒప్పందం గురించి గానీ కలెక్టర్‌కు తెలియదు. ఆయన అనుమతి కూడా లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సొసైటీని వాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు'అని చెప్పారు.

రిజిస్ట్రార్ పరిశీలనలో ఉంది..

ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సెప్టెంబర్ 24న వినతిపత్రం అందిందని, అయితే అది పిటిషనర్ ఇచ్చింది కాదని పేర్కొన్నారు. ఈ నెల 9న పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రం రిజిస్ట్రార్ పరిశీలనలో ఉందని చెప్పారు. దీనిపై వివరాలు అందించేందుకు సమయం కావాలని కోరారు. పిటిషనర్ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కొత్త సభ్యత్వాలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపార ఒప్పందాన్ని వెంటనే నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ సొసైటీ అక్రమాలపై బాధితుల పక్షాన 'సాక్షి'వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే.





26 నుంచి సోమశిల–శ్రీశైలం

లాంచీ ప్రయాణం


- చిన్నారులకు, పెద్దలకు వేర్వేరుగా టికెట్ ధరలు
- అప్ అండ్ డౌన్ ప్రయాణానికి పెద్దలకు రూ.3000
- చిన్నారులకు రూ.2,400...
- రాష్ట్ర పర్యాటక శాఖ వెల్లడి



సోమశిలలో ఏసీ లాంచీ

కొల్లాపూర్: సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణ సేవలు ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లాంచీలో ప్రయాణానికి చిన్నపిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా టికెట్ల ధరలను నిర్ణయించారు. వన్‌వే ప్రయాణానికి పెద్దలకు రూ.2,000, చిన్నపిల్లలకు రూ.1,600, వెళ్లి రావడానికి (అప్ అండ్ డౌన్) ప్రయాణానికి పెద్దలకు రూ.3,000, చిన్నపిల్లలకు రూ.2,400గా టికెట్ ధరలు నిర్ణయించారు. ప్రయాణికులకు భోజన వసతులు కల్పించనున్నారు. ఈ నెల 26 నుంచి ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని లాంచీ మేనేజర్ శివకృష్ణ తెలిపారు. లాంచీ ప్రయాణ వివరాలు, టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు మొబైల్ నంబర్ 7731854994కు సంప్రదించవచ్చు.





> ఒక వ్యక్తి అల్లాహ్ ముందు తలవంచి, సదాచార సంపన్నుడై ఉండి, ఏకాగ్రచిత్తుడైన ఇబ్రాహీము ధర్మాన్ని అనుసరిస్తే – ధర్మం రీత్యా అతని కంటే ఉత్తముడు మరెవడు కాగలడు?
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 25 అక్టోబర్ 2024

కాంగ్రెస్‌కు 'హరియాణా' దరువు!

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడటంతో ఆ రాష్ట్రాల్లో పార్టీలన్నీ అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఒంటరిగా పోటీ చేసి నెగ్గేంత విశ్వాసం ఏ పార్టీకీ లేకపోవటంతో కూటములుగా కదులుతున్నాయి. మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమిలో సీట్ల సర్దుబాటు రెండురోజుల క్రితమే కుదరగా, విపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లో బుధవారం సర్దుబాటు ప్రక్రియ పూర్తయింది. అయినా అరడజను సీట్లకు సంబంధించి ఇంకా పంచాయతీ తెగలేదు. జార్ఖండ్‌లో సైతం బీజేపీ, జేఎంఎం శిబిరాల్లో సర్దుబాట్లు ఒక కొలిక్కివచ్చాయి. కేంద్రంలో అధికారం ఉంది గనుక బీజేపీకి పెద్దగా దిగులేమీ లేదు. సొంత పార్టీలో అధిష్టానం మాట చలామణి అవుతుంది. కూటమి పక్షాలు సైతం కాస్త అటూ ఇటూగా బీజేపీకి తలాడిస్తాయి. ఎటొచ్చీ సమస్యంతా కాంగ్రెస్‌కే. కొత్తగా ఎన్నికలొచ్చి పడినప్పుడల్లా పాత ఖాతాలు ముందేసుకుని ఇంటా బయటా కూడా ఒత్తిళ్లు తెచ్చేవారు ఎక్కువే. మొన్నటి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ బొక్కబోర్లా పడ్డాక, దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ... సొంత పార్టీలో సరే సరి... కూటముల్లో కూడా కాంగ్రెస్ అధినేతల మాటకు విలువుండటం లేదు. అందుకు తాజా సర్దుబాట్లు, ఆ సందర్భంగా వచ్చిన విమర్శలు తార్కాణం. హరియాణాలోని 90 స్థానాల్లో బీజేపీ 48 గెల్చుకోగా అంతర్గత పోరుతో సతమతమైన కాంగ్రెస్ 37తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అది మొదలు కశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్ మొదలుకొని యూపీ, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లోని మిత్రుల వరకూ అన్నిచోట్లా ఆ పార్టీ పనితీరుపై, దురహంకారంపై విమర్శలు వచ్చిపడ్డాయి. పార్టీ రాష్ట్ర నాయకత్వాల నుంచి వచ్చిన ప్రతిపాదనలు మిత్రుల ముందుపెట్టగానే వారు అంతెత్తున విరుచుకు పడటంతో కాంగ్రెస్ అధినాయకత్వానికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది.

హరియాణా ప్రభావం ఏ స్థాయిలో ఉందో మహారాష్ట్ర పంపకాలే రుజువుచేస్తాయి. అక్కడి 288 స్థానాల్లో ఎంవీఏ ప్రధాన పక్షాలు కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్), ఉద్ధవ్ నేతృత్వంలోని యూబీటీ శివసేనలు సమానంగా అంటే 85 సీట్ల చొప్పున పోటీచేయటానికి బుధవారం అంగీకారం కుదిరింది. కూటమిలోని సమాజ్‌వాదీ, ఆప్, సీపీఐ, సీపీఎం, ఇతరేతర పార్టీల కోసం 18 స్థానాలు విడిచిపెట్టగా, ముంబైలో 3, విదర్భలో 12 స్థానాలు అనిశ్చితిలో ఉన్నాయి. ఈ 15 తమకే ఇవ్వాలన్నది కాంగ్రెస్ డిమాండ్. పాతకాలంలో వేరు. కాంగ్రెస్ మెజారిటీ సీట్లలో పోటీచేసేది. ఎన్సీపీ, ఇతర మిత్ర పక్షాలూ సరిపెట్టుకునేవి. గత అసెంబ్లీ ఎన్నికల సంగతే చూస్తే అప్పట్లో కాంగ్రెస్ 145 చోట్ల పోటీచేసింది. యూపీఏ కూటమిలోని ఎన్సీపీ 123, ఇతరులు 17 తీసుకున్నారు. మరో మూడు ఇతరులకిచ్చారు. అప్పుడు శివసేన బీజేపీతో చెలిమి చేసి 124 తీసుకోగా, బీజేపీ 152 చోట్ల పోటీ చేసింది. ఇలా ప్రతిచోటా హరియాణా భంగపాటు కాంగ్రెస్‌కు పెద్ద అడ్డంకిగా మారింది. అధినేతలు తమ వారికి హరియాణా సంగతి గుర్తుచేస్తుంటే... మిత్రులు సైతం కాంగ్రెస్‌కు ఆ బాణీయే వినిపించటం గమనించదగ్గది. తమకు అన్యాయం జరుగుతోందని అధిష్టానానికి మొరపెట్టుకున్న పార్టీ నేతల తరఫున పవార్, ఉద్ధవ్ ఠాక్రేలతో కాంగ్రెస్ సీనియర్ నేతలు మాట్లాడినా పెద్దగా ఫలించకపోవటంతో కూటమి నుంచి బయటకు రావాలన్న ప్రతిపాదన కూడా వచ్చిందంటున్నారు. చివరకు పవార్ జోక్యం తర్వాతైనా ఉద్ధవ్ శివసేన ఆ 15 వదులుకోవటానికి సిద్ధపడటం లేదు. నామినేషన్ల పర్వం ముగిసేనాటికి తిరుగుబాట్లు, కప్పదాట్లు సహజంగానే ఉంటాయి. కానీ బలంగా బేరసారాలాడే స్థితి కాంగ్రెస్‌కు లేదన్నది వాస్తవం.

బీజేపీలో అసమ్మతి స్వరాలు అక్కడక్కడ వినిపిస్తున్నా అవి పట్టించుకోవాల్సినంతగా లేవని ఆ పార్టీ అధినాయకత్వం నిర్ణయానికొచ్చేయటం గమనించదగ్గది. మిత్రుల అసంతృప్తిని సైతం అది బేఖాతరు చేస్తోంది. అంతా సవ్యంగా సాగుతున్నప్పుడూ, అనుకోని విజయాలు సైతం చేజిక్కించుకుంటున్నప్పుడూ సహజంగానే ఎవరినీ లెక్కచేసే పరిస్థితి ఉండదు. పాలక మహాయుతిలో కుదిరిన ఒప్పందం ప్రకారం బీజేపీ 152–155 స్థానాల్లో పోటీచేయాలని నిర్ణయించగా, షిండే శివసేనకు 78–80 మధ్య, అజిత్ పవార్ ఎన్సీపీకి 52–54 మధ్య ఇవ్వాలన్న అవగాహన కుదిరింది. ఇప్పటికే వంద స్థానాల్లో బీజేపీ తన అభ్యర్థుల్ని కూడా ప్రకటించింది. అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీలో అసంతృప్తి లేకపోలేదు. అలాగే మిత్రులనుంచి కూడా సణుగుడు జాస్తిగానే ఉంది. అయినా అందరినీ దారికి తేవొచ్చన్న అభిప్రాయంతోనే బీజేపీ పెద్దలుండటం గమనించదగ్గది.

ఇప్పటికే మూడో జాబితా కూడా విడుదల చేసి మొత్తం 41 స్థానాల్లో అభ్యర్థుల్ని ఖరారు చేసుకున్న జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నుంచి కాంగ్రెస్‌కు 29కి మించి వచ్చేలా లేవు. 81 స్థానాలున్న జార్ఖండ్ రాష్ట్రంలో ఆర్జేడీ, వామపక్షాలకు 11 స్థానాలివ్వాలని నిర్ణయించారు. 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్న ఉత్తరప్రదేశ్‌లో కనీసం మూడైనా సాధించుకోవాలని చూసిన కాంగ్రెస్‌కు సమాజ్‌వాదీ నేత అఖిలేష్ యాదవ్‌నుంచి సానుకూల స్పందన రాకపోవటం కూడా హరియాణా షాక్ ఫలితమే. అక్కడ రెండు స్థానాలివ్వాలని ఎస్పీ నిర్ణయించినా అసలు పోటీకి దిగరాదని కాంగ్రెస్ అనుకోవటం ఆ పార్టీ దయనీయ స్థితికి నిదర్శనం. పూలమ్మిన చోటే కట్టెలమ్మడం అంటే ఏమిటో కాంగ్రెస్‌కు అడుగడుగునా అర్థమవుతోంది. అధికారంలో ఉన్నన్నాళ్లూ కన్నూ మిన్నూగానక వ్యవహరిస్తే ఏమవుతుందో ఇప్పటికే చాలాసార్లు రుజువైంది. తనను తాను సరిదిద్దుకోలేని నిస్సహాయత ఆ పార్టీని ఆవరించటంవల్ల మరోసారి అదే భంగపాటు ఎదురైంది. అందుకు ఎవరిని నిందించగలరు? చేసుకున్నవారికి చేసుకున్నంత!

తేడా స్పష్టంగా కనబడుతోంది కానీ...

విశ్లేషణ



డి. పాపారావు

'తేడా సుస్పష్టం' అంటూ మన ప్రధాని మోదీ పేరిట సోషల్ మీడియాలో ఒక గణాంక విన్యాసం జరుగుతోంది. దాని ప్రకారంగా మోదీ 'విజయాలు' అనే శీర్షిక కింద 2014 నాటికీ, అంటే మోదీ అధికారం చేపట్టిన నాటికీ, నేటికీ (2024) ఈ పదేళ్లలో దేశం ఎంతగా 'పురోగమించిందో' చెబుతూ కొన్ని గణాంకాలను విడుదల చేశారు. ఇక్కడి ప్రశ్న ఈ గణాంకాల వాస్తవికత గురించినది కాదు. కొన్ని విషయాలలో సందేహాలూ, అవాస్తవాలూ ఉన్నా వాటిల్లోని సింహభాగం నిజమే కావచ్చు. కాకుంటే ప్రశ్నల్లా 2014–2024 నడుమ కాలంలోని ఈ సోకాల్డ్ విజయాలలో మోదీ గారి పాలన ప్రభావం ఎంత? మోదీ ప్రధానిగా ఉన్నా లేకున్నా వీటిలోని కొన్ని వాటికవే జరిగి ఉండేవి కావా?

ప్రధానిగా నరేంద్ర మోదీ పదేళ్ల పాలన 'విజయ గాథ' అంటూ ప్రచారం చేస్తున్న వాటిల్లో ఒక్కో గణాంకాన్ని పరిశీలిద్దాం. మొదటగా 'స్థూల జాతీయ ఉత్పత్తి' (జీడీపీ) చూద్దాం. భారత జీడీపీ 2014 నాటికి 1.8 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. అది 2024 నాటికి 3.7 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. అది నిజమే. రెట్టింపయ్యింది. ఇక్కడ గమనించవలసింది, భారత జీడీపీ 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయిని చేరేందుకు 1947 నుంచీ 2010 వరకూ అంటే, 63 సంవత్సరాలు పట్టింది. అక్కడి నుంచి 2 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోవడం కేవలం ఏడేళ్లు, అంటే 2017 నాటికి జరిగింది. ఆ స్థితి నుంచి 2020 నాటికి ఈ గణాంకం 3 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. అంటే, కేవలం 2017–20 మధ్యన మూడేళ్లలో మరో లక్ష కోట్ల డాలర్ల మేర దేశ జీడీపీకి జతకూడింది.

ఇటువంటి పరిణామం, అన్ని రంగాలలోనూ జరిగేదే. ఉదాహరణకు, సాంకేతిక పురోగతినే తీసుకుంటే 300 ఏళ్ల క్రితం ఆవిరి యంత్రాన్ని కనుగొన్నారు. తరువాతి 100 సంవత్సరాల కాలంలో మరింత సాంకేతిక పురోగతి జరిగింది. ఈ మొత్తం కాలంతో సరితూగగల సాంకేతిక పురోగమనం, ఆ తరువాతి 50 ఏళ్ల కాలంలోనే జరిగింది. దీనంతటినీ తలదన్ని తరువాతి 2–3 దశాబ్దాల కాలంలోనే, పెద్ద గంతులలో సాంకేతిక పరిజ్ఞానం పురోగమించింది. ప్రస్తుతం చూసుకుంటే ప్రతి 5 సంవత్సరాలు లేకుంటే అంతకంటే తక్కువ కాలంలో కూడా సాంకేతిక రంగంలో ఊహించనలవి కాని మార్పులు జరుగుతున్నాయి. కాబట్టి, ఒక వస్తువు లేదా అంశం దాని ఆరంభ స్థానం నుంచి దూరంగా వెడుతున్న కొద్దీ దాని ప్రయాణ వేగం మరింతగా పుంజుకుంటుందన్నది సహజ సూత్రం. అదే సహజ సూత్రం ప్రకారంగా మన ఆర్థిక వ్యవస్థ కూడా ఎదిగిందన్నది పై గణాంకాలను చూస్తే అర్థం అవుతుంది.

కాబట్టి, ఇదంతా అత్యంత సాధారణ పరిణామ క్రమం. దీనిలో మోదీ జోడించిన అదనపు శక్తి యుక్తులూ ఏమీ లేవన్నది నిజం! మించి, స్వయంగా మోదీ గారి వాగ్దానాల ప్రకారంగా మన దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోవలసి వుంది. ఇప్పటికే 2024 అక్టోబర్ మాసంలో వున్నాం. అంటే, మరో 6 నెలల్లో ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయిపోతుంది. ఈలోగా, 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక స్థాయిని చేరుకోగలమా? లేదనేదే జవాబు. మన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకారమే, భారత్ 2027–28 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించగలదు. అదీ కథ! నిజానికి దేశ ఆర్థిక పురోగతికి మోదీ విధానాలైన పెద్ద నోట్ల రద్దు, అవకతవక జీఎస్టీ వినాశకరంగా పరిణమించాయి. ఈ అవాంతరాలు లేకుంటే సాధారణ స్థితిలోనే మన జీడీపీ బహుశా 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయిని చేరి ఉండేది!



గుడ్డివాళ్ల రాజ్యంలో ఒంటి కన్ను

ఆ ప్రచారం ప్రకారం, రెండవ గణాంకం ప్రపంచంలో భారత దేశ ర్యాంకు గురించినది. 2014లో ప్రపంచంలో 10వ స్థానంలో వున్న మన ర్యాంకు (జీడీపీ పరంగా) ప్రస్తుతం 5వ స్థానానికి చేరింది. దీనిలోనూ, అనేక తిరకాసులు ఉన్నాయి. 2008 ఆర్థిక సంక్షోభం అనంతరం ప్రపంచంలోని ధనిక దేశాల అన్నింటి స్థితిగతులూ దిగజారిపోతున్నాయి. ఫలితంగా, వాటి జీడీపీలు దిగజారుతున్నాయి. కాగా, ఈ ఆర్థిక సంక్షోభం భారత్‌ను అంతగా ప్రభావితం చేయలేదు. దేశంలోని జాతీయ బ్యాంకులు రుణాల మంజూరులో, పాశ్చాత్య దేశాల బ్యాంకుల్లా దురాశకు పోకుండా హేతుబద్ధంగా, క్రమబద్ధంగా వ్యవహరించడం దీనికి ఒక ప్రధాన కారణం. అప్పటికే దేశంలో అమలులో వున్న జాతీయ ఉపాధి హామీ పథకం ప్రజల కొనుగోలు శక్తిని కాపాడింది. మరి ఈ స్థితిలో జీడీపీ పరంగా మనం వున్న చోటునే మిగిలిపోయినా, లేకుంటే సాధారణ సరళ రేఖలో సాదాగానే ముందుకు పురోగమించినా ఇతర దేశాలతో పోలిస్తే మన ర్యాంకు మెరుగుపడి తీరుతుంది. ఇటువంటి స్థితి గురించే, రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ '(మన దేశ ఆర్థిక స్థితి) గుడ్డి వాళ్ళ రాజ్యంలో, ఒంటి కన్ను రాజును పోలి వుంది' అని వ్యాఖ్యానించారు.

ఇక మూడవ గణాంకం, ఎగుమతులకు సంబంధించినది. దీని ప్రకారంగా 2014లో 200 బిలియన్ డాలర్లుగా ఉన్న మన ఎగుమతులు 2024 నాటికి 700 బిలియన్ డాలర్లను దాటాయి. ఇది నిజం. కానీ, పూర్తి నిజం కాదు. వాస్తవంలో, నేడు మన ఎగుమతుల పెరుగుదల వేగం దిగజారుతోంది. అనేక మాసాల పాటు, ఎగుమతుల గణాంకాలు పతనాన్ని సూచించాయి. తగిన స్థాయిలో ఎగుమతులు లేక దేశంలోని వస్త్రాలు, బంగారు ఆభరణాలు వంటి ప్రధాన ఉపాధి కల్పనా రంగాలలో ఉద్యోగాలు పోతున్నాయి. పారిశ్రామిక ఉత్పత్తి రంగాలకు ప్రోత్సాహం పేరిట 14 రంగాలకు అందిస్తోన్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు కేవలం 2–3 రంగాలలోనే విజయవంతం అవుతున్నాయి. నిజానికి, ఒక దేశం తాలూకు వాణిజ్య సమతుల్యత లేదా లోటు అనేది అటు ఎగుమతులు, ఇటు దిగుమతులు రెండింటికీ సంబంధించిన అంశం. ఎగుమతి, దిగుమతుల మధ్య సమతుల్యత లేకుంటే, అంటే, మన ఎగుమతుల కంటే, దిగుమతుల స్థాయే అధికంగా ఉంటే, అది వాణిజ్య లోటుకు దారి తీస్తుంది. మన ఆర్థిక వ్యవస్థలోని పరిస్థితి అదే.

ఇక తరువాతి గణాంకం, దేశంలోని మెట్రో నగరాల గురించినది. 2014 లోని 5 మెట్రో నగరాల నుంచి నేడు మనం 20 మెట్రో నగరాల స్థాయికి ఎదిగామంటూ ఈ ప్రచారపత్రం చెబుతోంది. ఈ అంశంలో కూడా గమనించవలసింది, ప్రపంచ వ్యాప్తంగా నగరీకరణ నేడు వేగం పుంజుకుందనేది. మన దేశంలో 2023 నాటికి నగర జనాభా కేవలం 36.36% గానే ఉంది. ప్రపంచ స్థాయిలో చూస్తే 56% జనాభా నగర ప్రాంతాలలో ఉంది. బీజేపీ పాలనలో నగర ప్రాంత జనాభా పెరుగుదల వేగం బహుశా అధికంగా ఉంటే ఉండి ఉండవచ్చు. కానీ, ఈ పెరుగుదల వెనుక గ్రామీణ ప్రాంతాలనూ, రైతాంగాన్నీ నిర్లక్ష్యం చేయడం వంటి ప్రతికూల ధోరణులు కూడా దాగి ఉన్నాయి.

గణాంకాల గారడీ

ఇక తరువాతి గణాంకం, వివాదాస్పదమైన 2014లో కేవలం 40%గానే ఉన్న దేశంలోని విద్యుత్ ఉన్న గ్రామాల సంఖ్య 2024లో 95 శాతానికి పెరిగిందన్నది. దీనికి సంబంధించి ఒకే అంశాన్ని ప్రస్తావించదలిచాను. ద్రౌపదీ ముర్ము గ్రామానికి కూడా 2022లో ఆమె రాష్ట్రపతి అయ్యేనాటికి సరైన విద్యుత్ వసతి లేదు. తరువాతి కీలక గణాంకం హైవేలకు సంబంధించినది. దీని ప్రకారంగా 2014లో 25,700 కిలోమీటర్ల పొడవున్న జాతీయ హైవేలు 2024 నాటికి 53,700 కిలోమీటర్లకు పెరిగాయి. మోదీ మంత్రివర్గంలో తన వంతు పాత్రను సాధ్యమైనంత సమర్థవంతంగా నిర్వహించిన, రోడ్లు రహదారుల శాఖామంత్రి నితిన్ గడ్కరీ సమర్థతను అంతగా శంకించలేను.

మరో గణాంకం యూనికార్న్‌లకు సంబంధించినది. అంటే, వంద కోట్ల డాలర్ల స్థాయిని చేరుకున్న అంకుర సంస్థల గురించినది. దేశంలో 2014లో ఒకే ఒక్క యూనికార్న్ ఉంటే, అది 2024 నాటికి 114కు పెరిగింది. మంచిదే. కానీ, దేశంలోని వేలాది స్టార్టప్‌లలో ఈ విజయవంతమైన యూనికార్న్‌లు కొద్దిపాటివే. నిజానికి పెద్ద సంఖ్యలో అంకుర సంస్థలు విఫలం అవుతున్నాయి. ఒక అధ్యయనం ప్రకారం, దేశంలోని అంకుర సంస్థలలో 90% మేర మొదటి ఐదేళ్ల కాలంలోనే మూతపడిపోతున్నాయి. స్థూలంగా మోదీ విజయగాథ ప్రచారం గురించి చెప్పాలంటే, 'తేడా స్పష్టంగా' కనబడుతూనే ఉంది. ఆ తేడా కనికట్టులో ఉంది. గణాంకాల గారడీలో ఉంది.

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అటు వైపేనా?



రష్యాలోని బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి హాజరుకాని సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌ను కలిశారని వార్త. పశ్చిమాసియానూ, ప్రపంచవ్యాప్త ముస్లింలనూ మళ్లీ మళ్లీ దెబ్బకొట్టిన ఒక దేశం ఏదైనా ఉందంటే... అది సౌదీ అరేబియా. సిగ్గుచేటు.

– గజాలా వహాబ్, సంపాదకురాలు

భారతీయం



నేను గమనిస్తున్నంత వరకూ భారతీయ పురుషులకు హాఫ్ జాకెట్ అనేది వాస్తవికంగా ఫార్మల్ డ్రెస్ అయిపోయిందని తెలియడం సంతోషంగా ఉంది. ఆ భయానక సూట్లు, సఫారీ సూట్లు, టైల నుంచి మనం దూరంగా జరిగిపోతున్నాం.

– అరుణ్ కృష్ణన్, రచయిత

బలమైన తర్కం



అమెరికా: మా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది కాబట్టి మేము బలంగా ఉన్నాం. బ్రిటన్: మాకు బలమైన తలసరి ఆదాయం ఉంది కాబట్టి మేము బలంగా ఉన్నాం. జర్మనీ: మాకు బలమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయి కాబట్టి మేము బలంగా ఉన్నాం. ఇండియా: మేము బలవంతులం, ఎందుకంటే మా ప్రధాని ఏ సహాయం లేకుండా విమానం లోంచి దిగుతారు.

– రోషన్ రాయ్, అంట్రప్రెన్యూర్

శాంతి ప్రయోజనం



ఒకవేళ ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య శాంతి కుదిరితే, ఇరాన్ నుంచి వాళ్లు పొందుతున్న దానికన్నా ఇజ్రాయెల్ పర్యాటకుల నుంచి లెబనాన్ ఎక్కువ లబ్ధి పొందుతుంది.

– ఉరి కుర్లియాంచిక్, రచయిత

పెద్ద భ్రమ



తన సొంత చిత్తభ్రమను నమ్మడాన్ని పిచ్చి అంటారు. వేరొకరి చిత్తభ్రమను నమ్మడాన్ని మతం అంటారు.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

అలుపెరగని పోరాటశీలి

స్వాతంత్రోద్యమ సమరంలోనూ, ఆ తర్వాత ప్రజా జీవితంలోనూ తనదైన పాత్ర పోషించిన యోధుడు కామ్రేడ్ వంక సత్యన్నారాయణ (సత్యం). 1946లో ఇప్పటి ముంబైలో జరిగిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య మహాసభలో పాల్గొన్న నాటినుంచి 2018 అక్టోబర్ 25వ తేదీ మరణించే వరకూ ఆయన త్రికరణశుద్ధిగా కమ్యూనిస్ట్ యోధుడిగానే మెలిగారు. పీడిత ప్రజలను సంఘటితం చేస్తూ... భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) నేతగా క్రియాత్మకంగా వ్యవహరించారు. 92 ఏళ్ల వయసులో తన స్వీయచరిత్రను 'తొమ్మిది పదులు' శీర్షికన గ్రంథస్తం చేశారు. తద్వారా అలనాటి రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలను వెలుగులోకి తెచ్చారు.

దేశరక్షణ చట్టం కింద 18 ఏళ్ల వయసులోనే ఆయన్ని బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి సబ్ జైళ్లలో శిక్ష అనుభవిస్తుండగానే... 1942లో ఆలీపూర్ జైలుకు తరలించారు.



వంక సత్యన్నారాయణ

ఈ జైలులోనే దాస్ క్యాపిటల్, మార్క్స్ ఏంగెల్స్ ఇతర రచనలు, డార్విన్ సిద్ధాంతంపై సీనియర్ కమ్యూనిస్ట్ ఖైదీలు పాఠాలు చెప్పేవారు. అలా ఆయన మార్క్సిజం, హేతువాద దృక్పథాలను అర్థం చేసుకోవడానికీ, ఆచరించడానికీ ఈ జైలు జీవితం ఎంతగానో ఉపకరించింది. ఇద్దరు ప్రమాదకారులుంటే తక్కువ ప్రమాదకారితో కలిసి పెద్ద ప్రమాదకారిని ఎదుర్కోవడానికి జత కట్టే విధానాన్ని ఎత్తుగడగా చేసుకునేవారు.

1955లో పెనుగొండ నియోజకవర్గం నుంచి జమీందార్ జవ్వాది లక్ష్మయ్య నాయుడిపై పోటీచేశారు. పార్టీ ఆదేశాల మేరకు పార్టీ ఫండ్ వసూలు చేయవలసి రావడంతో తన ప్రత్యర్థి దగ్గరకే వెళ్లి చందా అడిగారు. 'నాపై పోటీ చేస్తూ నన్నే చందా అడుగుతావా' అన్నారు లక్ష్మయ్యనాయుడు. పార్టీ ఆదేశం మేరకు తప్పటం లేదని చెప్పగా... లక్ష్మయ్యనాయుడు ఎంతో ఉదారంగా రూ. 1,116 చందా ఇచ్చారు. అయితే ఈ ఎన్నికల్లో సత్యం ఓడిపోయారు. 1962లో తిరిగి ఆయనపైనే పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఇదే నియోజకవర్గం నుంచి 1972, 1994ల్లోనూ అసెంబ్లీకి సత్యం ఎన్నికయ్యారు. ఆయన శాసన సభ్యులకు తరచూ సూచనలిస్తుండేవారు. శాసన సభ్యులు విషయ పరిజ్ఞానం, వాక్పటిమ, తక్షణం స్పందించే గుణం, ధైర్యం, చొరవ వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలనేవారు. ఆయన మాట్లాడుతుంటే అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ శ్రద్ధగా ఆలకించేవారు. మొత్తానికి వంకా సత్యం జీవితం అందరికీ ఆదర్శనీయం.

– వంక రవీంద్ర నాథ్, ఏపీ శాసన మండలి సభ్యులు

(నేడు వంక సత్యన్నారాయణ వర్ధంతి)

మెస్సయ్య దాటిపోయాక...

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

ఆస్పత్రి ప్రారంభోత్సవానికి పెద్దాయన వచ్చాడు. ఆయన రాకముందే రంగస్థలాన్ని చాలా శ్రద్ధగా సిద్ధం చేశారు. ఎంతగానంటే రెండు గంటల ముందు నుంచే ఫొటోగ్రాఫర్లు మండుటెండలో ఎదురు చూసేట్లు. తీరా ఆయనొచ్చాక ఎడమ వైపు ఫొటోగ్రాఫర్ల బృందాన్ని చూసి చీదరించుకున్నాడు. ఎందుకంటే అక్కడనుంచి ఫొటోలు తీస్తే ఆయన ముఖం కనపడదు. నీడలు మాత్రమే వస్తాయి. ఆగమేఘాల మీద అది కూడా సరి చేశారు. అపుడు తీరిగ్గా 'ప్రాచీన భాష లిపిలో, లోహపు కడ్డీకి చుట్టుకున్న పాములాగా కనిపించే మతచిహ్నం' ఉన్న శిలాఫలకానికి మొక్కి, లేచి నిలబడి హఠాత్తుగా చెట్టు కూలినట్లు నేల మీద పడిపోయాడు. ఆ పడిపోవడం ఉద్దేశపూర్వకంగా చేశాడేమో అన్నట్లు చేతులు రెండూ రెండు వైపులా కచ్చితంగా పెట్టినట్లు పడిపోయాయి. ఆయన ఆస్పత్రికి ప్రణామం చేస్తున్నాడేమో, కొత్త తంతు రిహార్సల్ ఏమో అనుకున్నారు. కానీ పెద్దాయన చచ్చిపోయాడు. మెస్సయ్య దాటిపోయాడు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధాని అయిన పెద్దాయన అంతమై పోయాడు. ఆ తర్వాత ఏం జరిగింది?

2023లో ఆకార్ పటేల్ ఇంగ్లిష్‌లో 'ఆఫ్టర్ మెస్సయ్య' నవల రాశారు. దాన్ని తెలుగులోకి 'నియంత అంతం' పేరుతో ఎస్. వేణుగోపాల్ అనువాదం చేస్తే 'మలుపు' సంస్థ ప్రచురించింది. ఈ నవల అంతా కల్పనే. కానీ వాస్తవ భ్రాంతిని కలిగించే కల్పన. 'జరుగుతున్నది ఇదే కదా!' అని విస్తుపరిచే సంభావ్యత ఉన్న కల్పన. నియంత పాలించే కాలంలో ఆయన వైభవ కాంతి ముందు మిగతా లోకమంతా మసకలు కమ్ముతుంది. దేశభక్తి, మత రాజకీయాలు వినా ప్రజలకి గత్యంతరం ఉండదు. అభివృద్ధికి నిర్వచనాలు మారిపోతాయి. ప్రభుత్వాలను, వ్యవస్థలను, ప్రజలను తోలుబొమ్మలు చేసి ఆడించిన సూత్రగాడి తాళ్ళు పుటుక్కున తెగి దేశమంతా సంక్షోభపు చీకట్లలో మునిగినపుడు, 'ఆయన తర్వాత ఎవరు?' అన్న ప్రశ్న పుట్టిన చోట కొత్త రాజకీయాలు మొదలవుతాయి.

రాజకీయ పార్టీలలో నియంతృత్వ ధోరణుల వల్ల నాయకుల మరణం తర్వాత ప్రత్యామ్నాయం అంత తొందరగా తేలదు. దానికోసం కుమ్ములాటలు దేశానికి కొత్త కాదు. నియంతకి కుడిభుజంగా ఉండే జయేష్ భాయి, మత రాజకీయాల ద్వారా నూతనశక్తిగా ఎదిగే స్వామీజీల మధ్య పదవి కోసం జరిగే పోరు భారత రాజకీయ చరిత్ర పొడుగూతా జరిగిన అక్రమాలను స్ఫురింపజేస్తుంది. రిసార్టు డ్రామాలూ, కార్పొరేట్లతో లావాదేవీలూ, తమ ప్రయోజనాలకి అనుగుణమైన వాస్తవాలను నిర్మించే మీడియాల 'పెనవేత రాజకీయాలూ' అన్ని వ్యవస్థలనూ ప్రభావితం చేసి చట్టాన్నీ, న్యాయాన్నీ తమకి అనుగుణంగా ఎలా మలుచుకుంటాయో చదివినపుడు దేశపౌరులుగా అభద్రతకి లోనవుతాము. రాజ్యం ఎపుడూ తన మీద ఎవరో దాడి చేయబోతున్నారనీ, తను బలహీనమైనదనీ ఊహించుకుంటుంది. అందుకోసం తన సమస్త శక్తులతో ఆ దాడిని ముందుగానే నిర్మూలించాలని అనుకుంటుంది. స్వతహాగా క్రూరమైన బలం ఉండడం వల్ల రాజ్యస్వభావం హింసతో కూడినదనీ, ప్రభుత్వాల హృదయమూ, ఆత్మా హింసేననీ నవల మొత్తం చెబుతుంది. అంతేకాదు 'రాజ్యం అనేది ఒక హింసాత్మక రాజకీయ జంతువు'. ఈ జంతువుని చెడ్డవారు అధిరోహించినా అది హింసే. మంచి వారు అధిరోహించినా హింసేనని తెలిసినపుడు కొంత వెలుగు మన ఆలోచనల మీద ప్రసరించి ఎరుక, దిగులూ కలుగుతాయి.



ఆదివాసుల హక్కుల కోసం పనిచేసే మీరా – పార్టీలో ఒక సీనియర్ నాయకుని కూతురు. అనివార్య పరిస్థితుల్లో ఆపద్ధర్మ ప్రధాని అవుతుంది. పీడిత ప్రజలకోసం పనిచేసే మంచి వ్యక్తి ప్రధాని అయినా రాజ్యస్వభావం మారదు. ఆదివాసీ హక్కులను పరిరక్షించే ఒక చిన్న చట్టం అమలులోకి తేవడానికి మీరా, అనేక అడ్డంకులను ఎదుర్కొని, తన విలువలను పణంగా పెట్టాల్సి వచ్చినపుడు అంబేడ్కర్ గుర్తుకు వస్తారు. రాజ్యాంగం... హింస నుంచి పీడితులకు రక్షణ కల్పిస్తుందని నమ్మి, ఆ సాధనలోనూ, హిందూ కోడ్ బిల్లుని ఆమోదింపజేసే సందర్భంలోనూ అంబేడ్కర్ రాజ్యం పెట్టిన ఒత్తిడికీ, హింసకూ లోనయ్యి కూడా ఎంత గట్టిగా నిలబడ్డారో, దానికోసం ఎంత త్యాగం చేశారో, ఎంత రాజీపడ్డారో చరిత్ర చెబుతుంది.

ఆ ఒక్క చట్టం కోసం ప్రత్యర్థి ముఠాలకి మీరా ప్రయోజనాలు సమకూర్చాల్సి వస్తుంది. ఆదివాసీల మేలు కోసం చట్టం చేయడానికి మీరా రాజ్య హింసకు లోబడి పని చేసిందని తెలుసుకున్న ఆదివాసీ ప్రతినిధి బృందంవారు ఆమె ప్రతిపాదనలను తిరస్కరిస్తూ ఒక మాట అంటారు. 'పీడనకు గురయ్యాము కనుక పీడనను తిరస్కరించడం కాదు, అసలు పీడన అనేదే చెడ్డది కనుక దాన్ని మొత్తంగా తిరస్కరించాలని, ఒక పీడనను తొలగించడం కోసం మరో చోట మరో సమూహాన్ని పీడనకు గురి చేయడం భావ్యం కాదని' చెబుతారు. చివరికి పదవి నుంచి దిగిపోయి ఆదివాసీ పోరాటాలలో భాగం కావాలని కోరుకుంటుంది మీరా.


ఉనికిలో ఉన్న రాజ్య వ్యవస్థే హింసాత్మకం అయినపుడు, ఎంత మంచి వ్యక్తీ దాన్ని మార్చలేనపుడు, మరి ఎటువంటి పరిపాలనా ప్రత్యామ్నాయాన్ని ఈ నవల సూచించింది! బహుశా ఈ చర్చ పాఠకులలో జరగాలని రచయిత కోరుకుని ఉండొచ్చు. లేదా మీరా ఎంచుకున్న మార్గాన్ని మనకు సూచనప్రాయంగా అందించి ఉండొచ్చు. 'ఏ రాయి అయితేనేమి' అన్న నిర్లిప్తత పెరిగిపోయిన వర్తమానంలో భిన్న రాజకీయ శ్రేణుల మధ్య ప్రత్యామ్నాయ రాజకీయాల మీద చర్చ జరగాలి. 'గమ్యమే మార్గాన్ని సమర్థిస్తుంది' అన్న సూత్రాన్ని డీ కోడ్ చేయాలి.

వ్యాసకర్త 'ప్రరవే' ఏపీ కార్యదర్శి
malleswari.kn2008@gmail.com

గురువే మార్గదర్శి

ఆత్మయే జీవాత్మ. ఇదొక్కటే శాశ్వతమైంది. మిగిలిన వన్నీ అశాశ్వతాలే. అశాశ్వతమైన ఏ ఒక్క దానిలో కూడా నిజమైన ఆనందం (సచ్చిదానందం) ఉండదు. ఐనప్పటికీ, మానవుడు అశాశ్వతమైన వస్తువుల్లోనే ఆనందాన్ని అన్వేషిస్తూ ఉంటాడు. ఆ విధంగా అజ్ఞానంతో జీవిస్తూ, తనను తానే మోసగించుకుంటూ ఉంటాడు.

దత్తబోధ




శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

నీ అంతరాత్మకు నీవు లోబడి ఉన్నప్పుడే సచ్చిదానందాన్ని అనుభవించగలవు. కానీ, ఈ విషయం మనం అనుకున్నంత సులభం కాదు. సచ్చిదానంద స్థితికి చేరాలంటే, మానవుడు తీవ్ర ప్రయత్నం చెయ్యాలి. ఎంత వరకు చిత్తం (మనస్సు) కల్మషంతో నిండి ఉంటుందో, అంతవరకు మానవుడు ఆత్మను అనుసరించలేడు. కాబట్టి అన్వేషకుడు (భక్తుడు) మున్ముందుగా చిత్తశుద్ధిని పొందాలి. నీవు సద్గురువు సంపర్కంలోనికి రాగానే ఆత్మవికాసానికై భిన్నమైన పద్ధతులు... అనగా 'సేవ', 'హోమం', 'తీర్థయాత్ర', 'ధ్యానం', 'అర్చన', 'నామ సంకీర్తన' వంటివాటిని ఆచరించమని ఉపదేశం లభిస్తుంది. నీవు ఎల్లప్పుడు అంకితభావంతో చిత్తశుద్ధికై సాధన చేస్తే నీపై గురువు దయావృష్టి కురుస్తుంది. మున్ముందుగా కావలసింది ఇదే. నీ గురించి నీవే నడవాలి. అంతేకాని గురువు నడవడు. అయితే ఆయన నీకు సరైన మార్గాన్ని చూపిస్తాడు.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం,శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.నవమి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** పుష్యమి ప.12.09 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** రా.1.36 నుండి 3.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.09 నుండి 12.57 వరకు, **అమృత ఘడియలు:** ఉ.5.33 నుండి 7.10 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.39.


హైడల్.. పవర్ ఫుల్

జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో గణనీయంగా పెరిగిన విద్యుదుత్పత్తి



గురువారం సాగర్ 20 గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

- వార్షిక లక్ష్యం 4,050 ఎంయూలు కాగా ఇప్పటికే 3,828 ఎంయూల ఉత్పత్తి
- మరో 2,206 ఎంయూల జల విద్యుదుత్పత్తి సరిపడా నీటినిల్వలు
- తీవ్ర నష్టాల్లో ఉన్న డిస్కంలకు భారీ ఊరట
- విస్తార వర్షాలతో జలాశయాలకు కొనసాగుతున్న వరద



గురువారం శ్రీశైలం ఆనకట్ట నాలుగు గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు

సాక్షి, హైదరాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను ఈ ఏడాది జల విద్యుత్ ఆదుకుంది. కృష్ణా పరీవాహకంలోని ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు నిరంతర వరద కొనసాగుతోంది. ప్రస్తుత ఏడాది (2024–25)లో 4,050 మిలియన్ యూనిట్ల(ఎంయూ) జలవిద్యుదుత్పత్తి జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) అంచనా వేసింది. ఇప్పటికే 3,828.52 ఎంయూల ఉత్పత్తి జరిగింది. కృష్ణా పరీవాహకానికితోడు గోదావరి పరిధిలోని సింగూరు, నిజాంసాగర్, పోచంపాడు జలాశయాల్లో ప్రస్తుతం గరిష్ట నీటిమట్టం మేరకు నిల్వలుండగా, ఎగువ నుంచి ఇంకా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం కృష్ణా జలాశయాల్లో 584.1, గోదావరి జలాశయాల్లో 137.5 కలిపి మొత్తం 721.6 టీఎంసీల నిల్వలున్నాయి. ఈ నిల్వలతో మరో 2,206 ఎంయూల జలవిద్యుదుత్పత్తి చేసుకోవచ్చు. అంటే ఈ ఏడాది రికార్డు స్థాయిలో 6,034 ఎంయూల జలవిద్యుదుత్పత్తికి అవకాశముంది.

దిగివచ్చిన జలవిద్యుత్ ధరలు

తెలంగాణ పరిధిలో 2,442 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి కేంద్రాలుండగా, అందులో 2,324 మెగావాట్ల వాటాను మన రాష్ట్రం కలిగి ఉంది. వీటికి సంబంధించిన విద్యుత్ ఫిక్స్‌డ్ కాస్ట్ వ్యయం 2024–25లో రూ.1,129 కోట్లు అవుతుందని డిస్కంలు అంచనా వేశాయి. విద్యుదుత్పత్తి జరిగినా, జరగకపోయినా జెన్‌కోకు ఈ మేరకు ఫిక్స్‌డ్ ధర వ్యయాన్ని డిస్కంలు చెల్లించాల్సి ఉంటుంది. తీవ్ర వర్షాభావంతో గతేడాది(2023–24) 830 ఎంయూల జలవిద్యుదుత్పత్తి మాత్రమే జరిగింది. జలవిద్యుత్ కేంద్రాల విద్యుత్ ఫిక్స్‌డ్ ధర 2022–23లో యూనిట్‌కు రూ.2.32 ఉండగా, 2023–24లో ఉత్పత్తి తగ్గడంతో రూ.8.51కు పెరిగింది. దీంతో డిస్కంలు తీవ్రంగా నష్టపోయాయి. డిస్కంల సగటు విద్యుత్ కొనుగోలు వ్యయం గణనీయంగా పెరిగి యూనిట్‌కు రూ.5.72కు చేరడానికి కారణమైంది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే ఇది 2.69 శాతం అధికం. ఈ ఏడాది 6000 ఎంయూలకు పైగా జలవిద్యుదుత్పత్తి జరిగే అవకాశాలుండడంతో మళ్లీ వాటి ఫిక్స్‌డ్ కాస్ట్ వ్యయం గణనీయంగా తగ్గనుంది. యూనిట్‌కు కేవలం రూ.1.9 పైసల ఫిక్స్‌డ్ కాస్ట్ వ్యయం అవుతుందని అంచనా. జలవిద్యుత్ కేంద్రాల విద్యుత్‌కు ఫిక్స్‌డ్ కాస్ట్ మాత్రమే ఉంటుంది. వెరియబుల్ కాస్ట్ ఉండదు. మొత్తంగా రూ.1129 కోట్ల వ్యయానికే 6,000 ఎంయూల జలవిద్యుత్ లభించనుంది. తీవ్ర ఆర్థిక నష్టాల్లో ఉన్న డిస్కంలకు ఇది భారీ ఊరటతో పాటు వినియోగదారులకు భవిష్యత్‌లో విద్యుత్ చార్జీల పెంపు, ట్రూ అప్ చార్జీల వసూళ్ల నుంచి కొంత వరకు ఉపశమనం లభించనుంది. రాష్ట్రంలోని జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో అత్యధికంగా 2021–22లో 5,371 ఎంయూలు, ఆ తర్వాత 2022–23లో 5,741 ఎంయూల జలవిద్యుదుత్పత్తి అయ్యింది.

ప్రస్తుత ఏడాది జలవిద్యుదుత్పత్తి లక్ష్యం.. ఇప్పటి వరకు జరిగిన ఉత్పత్తి ఇలా..

జలవిద్యుత్ కేంద్రం	వార్షిక లక్ష్యం (ఎంయూల్లో)	ఇప్పటి వరకు జరిగిన ఉత్పత్తి (ఎంయూల్లో)
జూరాల	154.69	305.45
దిగువ జూరాల	295.99	287.55
శ్రీశైలం	1,513.63	1,513.82
నాగార్జునసాగర్	1,636.26	1,424.08
సాగర్ ఎడమ కాల్వ పవర్ హౌస్	97.33	61.81
పులిచింతల	224.81	179.06
నిజాంసాగర్	7.74	-
పోచంపాడు-2	20.11	39.12
సింగూరు	19.98	16.48
పెద్దపల్లి మినీ హైడ్రో	3.41	0.98
పాలేరు	1.09	0.17
మొత్తం	4,050.98	3,828.52

మరమ్మతులు జరగక.. 459 ఎంయూల విద్యుదుత్పత్తికి గండి

రాష్ట్రంలో మొత్తం 2,442 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాలుండగా, సుదీర్ఘకాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో మొత్తంగా 301.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి జరగడం లేదు. మొత్తం జలవిద్యుదుత్పత్తి సామర్థ్యంలో 12.35 శాతం నిరుపయోగంగా మారింది. ఒకవేళ వీటికి సకాలంలో మరమ్మతులు నిర్వహించి పునరుద్ధరించి ఉంటే పూర్తి స్థాపిత సామర్థ్యం మేరకు 2,442 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి చేసుకోవడానికి ఈ ఏడాది అవకాశముండేది మరమ్మతులు జరపకపోవడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఏకంగా 459 ఎంయూల జలవిద్యుదుత్పత్తికి గండిపడింది. యూనిట్‌కు అత్యల్పంగా రూ.2.5 ధరతో లెక్కించినా సుమారు రూ.100 కోట్ల నష్టం జరిగినట్టు అంచనా. పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి జరిగి ఉంటే ఇప్పటి వరకు మొత్తం 4,287 ఎంయూలకు పైగా విద్యుత్ ఉత్పత్తి జరిగి వార్షిక లక్ష్యాన్ని దాటిపోయేది.

క్లుప్తంగా...

పీఎస్‌లో దొంగ ఆత్మహత్యాయత్నం ?

నారాయణపేట: పోలీస్‌స్టేషన్‌లో ఓ దొంగ ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లాకేంద్రంలో జరిగిన పలు చోరీల కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. వీరిని విచారించడానికి ఓ పోలీస్‌స్టేషన్‌కు అదేరోజు రాత్రి తీసుకెళ్లారు. ఇద్దరినీ భోజనం చేయాలని ఓ కానిస్టేబుల్ చెప్పగా.. అంతలోనే ఓ దొంగ బాత్రూమ్‌కని వెళ్లి ..బాత్రూం కడిగే ద్రవాన్ని కొంత తాగి వచ్చి భోజనం చేశారు. దీంతో వాంతులు కావడంతో పోలీసులు వెంటనే నారాయణపేట జిల్లా ఆస్పత్రికి రాత్రి 11.30 గంటల సమయంలో తరలించి ప్రాథమిక చికిత్సత చేయించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అర్ధరాత్రి 12 గంటలకు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితి విషమిస్తుందని చెప్పడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఆ దొంగ ఆరోగ్యం కుదుటపడటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నట్టు తెలిసింది. దొంగలను అదుపులోకి తీసుకున్న విషయాన్ని మాత్రం పోలీసులు ధ్రువీకరించలేదు.

సెల్‌ఫోన్ చోరీ చేశాడని దాడి.. వ్యక్తి మృతి!

సారంగపూర్: సెల్‌ఫోన్ దొంగతనం చేశాడని విచక్షణారహితంగా కొట్టడంతో ఒక వ్యక్తి మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన తుల చిన్నయ్య (45) నాలుగు రోజుల క్రితం గ్రామంలోని ఓ ఇంట్లో కార్యక్రమం జరగడంతో భోజనానికి వెళ్లాడు. ఆ ఇంట్లో సెల్‌ఫోన్ కనిపించడంతో తస్కరించాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు అనుమానంతో.. చిన్నయ్యను తనిఖీ చేయగా అతని వద్ద ఫోన్ దొరికింది. దీంతో ఫోన్ యజమానితోపాటు అతని కుటుంబ సభ్యులు చిన్నయ్యను విచక్షణారహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన చిన్నయ్యను కుటుంబ సభ్యులు నిర్మల్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమిషనర్‌తో బల్దియాకు ఆర్థిక భారం

- నెలకు రూ.1.49 లక్షల వేతనం
- చెల్లించలేని స్థితిలో రాయికల్ మున్సిపాలిటీ
- ఇన్‌చార్జిని నియమించాలని తీర్మానం



రాయికల్: అసలే కొత్తగా ఏర్పడిన బల్దియా.. పైగా పన్నుల వసూలు చాలా తక్కువ. అలాంటి రాయికల్ మున్సిపాలిటీకి కమిషనర్‌గా రూ.1.49 లక్షల వేతనం ఉన్న గ్రేడ్–1 స్థాయికి చెందిన జగదీశ్వర్‌గౌడ్‌ను నియమించారు. వచ్చిన పన్నులతో పారిశుధ్య సిబ్బంది, కార్మికులకే వేతనాలు చెల్లించలేని పరిస్థితి. ఇంతటి దుర్భర స్థితిలో ఉన్న తాము కమిషనర్‌కు ప్రతినెలా జనరల్‌ఫండ్ నుంచి అంత వేతనం చెల్లించలేమని, బల్దియాకు గ్రేడ్–1 స్థాయి కమిషనర్ కాకుండా.. ఇన్‌చార్జి కమిషనర్‌ను నియమించాలని ఆగస్టు 31న నిర్వహించిన సమావేశంలో పాలకవర్గం తీర్మానం చేసి సీడీఎం (హైదరాబాద్)కు పంపింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రభుత్వం గత ఫిబ్రవరి 21న జగదీశ్వర్‌గౌడ్‌ను బల్దియాకు కమిషనర్‌గా నియమించింది. ఆయనకు 8 నెలలుగా మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచే జీతాలు చెల్లిస్తున్నారు. కనీసం ఆయన వేతనానికి సరిపడా కూడా పన్నులు వసూలు కాకపోవడంతో రాయికల్ పట్టణాభివృద్ధికి కేటాయించిన రూ.104.91 కోట్ల నిధుల నుంచే ప్రతినెలా రూ.1.49లక్షల వేతనం చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో గ్రేడ్–1 కమిషనర్ అయిన జగదీశ్వర్‌గౌడ్‌ను అదే స్థాయిలో ఉన్న మున్సిపాలిటీకి పంపించాలని, రాయికల్‌కు మాత్రం ఇన్‌చార్జి కమిషనర్‌ను నియమించాలని కోరుతూ సీడీఎంకు తీర్మానం పంపినట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తెలిపారు. చిన్న మున్సిపాలిటీ అయిన రాయికల్‌కు ఇన్‌చార్జి కమిషనర్.. లేదా ఎంపీడీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తే కొంతైనా ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉందని ప్రజలు, పాలకవర్గ సభ్యులు అంటున్నారు.

రెండో రోజూ అమోయ్‌కుమార్‌ను ప్రశ్నించిన ఈడీ

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భూ అక్రమాలపై ఈడీ ఫోకస్
- పలు రికార్డులను ఈడీకి అందించిన అమోయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను వరుసగా రెండో రోజూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమోయ్‌కుమార్ ఈడీ కార్యాలయంలోనే ఉన్నారు. ఈడీ అధికారుల సూచనల మేరకు అమోయ్‌కుమార్ గురువారం పెద్ద సంఖ్యలో రికార్డులను తెచ్చి వారికి సమర్పించినట్టు తెలిసింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో భూ కేటాయింపుల్లో అక్రమాలపై పలు కీలక వివరాలను ఈడీ అధికారులు సేకరించినట్టు తెలిసింది. భూదాన్ భూములు, నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూముల అక్రమ కేటాయింపుల ద్వారా రూ.కోట్లు ఆర్థికలావాదేవీలు జరిగినట్లు ఈడీ ప్రాథమికంగా గుర్తించింది. ఈ మేరకు మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించింది. రెండు జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో అమోయ్‌కుమార్ ఇచ్చిన అనుమతులు, రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించిన కీలక సమాచారం ఈడీ రాబడుతోంది. కాగా, మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్‌భూముల అంశంపైనే ఈడీ అధికారులు ప్రధానంగా దృష్టి పెట్టినట్టు తెలిసింది. కాగా, శుక్రవారం మరోసారి విచారణకు రావాలని ఈడీ అధికారులు అమోయ్‌కుమార్‌ను ఆదేశించినట్టు సమాచారం.

పారామెడికల్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

- ఈ ఏడాది నుంచి కొత్తగా 28 కాలేజీలు... 1,680 సీట్లు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు పారామెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీకి పారామెడికల్ బోర్డు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 30వ తేదీలోపు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు కాపీలను సంబంధిత జిల్లా డీఎంహెచ్‌వో ఆఫీసులో అందజేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారీగా నవంబర్ 11వ తేదీ లోపు కౌన్సెలింగ్ పూర్తి చేసి, అదే నెల 20వ తేదీలోపు సెలక్షన్ లిస్టును విడుదల చేస్తామని తెలిపారు. 25వ తేదీ నుంచి క్లాసులు మొదలవుతాయని పేర్కొన్నారు. పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, సీట్ల కేటాయింపులో బైపీసీ చదివిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు. ఒకవేళ బైపీసీ చదివిన విద్యార్థులు లేకపోతే, ఎంపీసీ చదివిన విద్యార్థులకు సీట్లను కేటాయిస్తారు. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు లేకపోతే, మిగిలిన కోర్సులు చదివిన విద్యార్థులకు సీట్లను కేటాయిస్తారు. దరఖాస్తు ఫారాలను బోర్డు వెబ్‌సైట్ (https://tgpmb.telangana.gov.in/) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలు, కాలేజీలు, కోర్సుల వారీగా సీట్ల వివరాలను సైతం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

కొత్తగా అందుబాటులోకి 28 కాలేజీలు...

రాష్ట్రంలో 206 ప్రైవేటు పారామెడికల్ కాలేజీలు ఉండగా, 40 ప్రభుత్వ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 28 కాలేజీలు ఈ ఏడాదే నుంచే అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో కాలేజీలో రెండు కోర్సులను ప్రారంభించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఈ కాలేజీలను ఏర్పాటు చేశారు. ప్రతి కోర్సుకు 30 సీట్లు కేటాయించారు. దీంతో మొత్తంగా 28 కాలేజీల్లో కలిపి 1,680 సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.

మైనర్ బాలికతో వెట్టి.. ఆపై దొంగతనం నెపం

- పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడంతో మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ బాలిక మృతి.. గద్వాలలో ఘటన
- రూ. 10 లక్షలు ఇచ్చి బయటపడేందుకు రాజీ యత్నాలు
- సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు

గద్వాల: మైనర్ బాలికతో వెట్టి చేయించుకోవడమే కాకుండా బంగారం దొంగతనం నేరం మోపడంతో ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక (16)ను చట్టవిరుద్ధంగా సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి తన ఇంట్లో పనికి పెట్టుకున్నాడు. అంతేకాకుండా ఇంట్లో బంగారం దొంగిలించిందని, బాలికను విచారించాలని పోలీసులను కోరాడు. ఈ క్రమంలో ఆ బాలికను మల్దకల్ మండల పోలీసులు పోలీసుస్టేషన్‌కు పిలిచి విచారించారు. అయితే తాను చేయని దొంగతనాన్ని తనపై మోపారని మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను కర్నూలు ఆస్పత్రికి తరలించగా, 10 రోజుల పాటు చికిత్సపొంది గురువారం మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు ఇచ్చి కేసు నుంచి బయటపడేందుకు రాజశేఖర్‌రెడ్డి రాజీయత్నాలు చేసినట్లు తెలిసింది. బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మల్దకల్ ఎస్‌ఐ నందీకర్ తెలిపారు. కాగా, మైనర్ బాలికపై దొంగతనం నేరం మోపి ఆమె మృతికి బండ్ల రాజశేఖర్‌రెడ్డి కారణమయ్యాడని బీజేపీ, నడిగడ్డ హక్కుల సంఘం నాయకులు మండిపడ్డారు. ఆయనపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

జువెనైల్ జస్టిస్ చట్టం కింద కేసు నమోదు

బాలిక ఈ ఏడాది మార్చి నుంచి రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పని చేస్తోందని, ఆగస్టులో తన ఇంట్లో బంగారు గొలుసుపోయిందని ఆయన బాలికపై అనుమానం వ్యక్తం చేశాడని, ఆ తర్వాత గొలుసు దొరికిందని చెప్పి ఆమెను ఇంటికి పంపించారని ఎస్ నందీకర్ తెలిపారు. అయితే ఈ నెల 11న బంగారు గొలుసుపోయిందని రాజశేఖర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఆ మరుసటిరోజు ఉదయం బాలిక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందని చెప్పారు. అక్టోబర్ 21న జువెనైల్ జస్టిస్ చట్టం కింద కేసు నమోదు చేశామని, బాలిక మరణించడంతో తగిన సెక్షన్లు జోడించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు.

పిచ్చెక్కి దాడి చేసిన ఆవు

- 13 మందికి గాయాలు





ప్రమాదంలో మృతి చెందిన ఆవు. (ఇన్‌సెట్‌లో) ఆవు దాడిలో గాయపడిన మహిళ

ఎడపల్లి (బోధన్): నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలో పిచ్చెక్కిన ఆవు స్వైర విహారం చేసి 13 మందిని గాయపరిచింది. గ్రామంలో మూడు రోజుల క్రితం ఒక ఆవును కుక్కలు కరిచాయి. ఈ క్రమంలో మతిస్థిమితం తప్పిన ఆవు.. గురువారం ఉదయం నుంచి గ్రామంలో తిరుగుతూ పలువురిపై దాడి చేసి గాయపరిచింది. సాయంత్రం ఆటోపై దాడి చేయడంతో అందులోని ముగ్గురికి గాయాలయ్యాయి. ఆవు సైతం గాయపడి మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వంశీచందర్ రెడ్డి గ్రామానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. వెటర్నరీ సిబ్బంది ఆవును పరీక్షించి కళేబరాన్ని తరలించారు.

అన్నం బాగోలేదన్న తండ్రికి దెబ్బలు

- కొడుకులపై పోలీసులకు ఫిర్యాదు



కృష్ణయ్య వీపుపై గాయాలు

మానవపాడు: అన్నం బాగోలేదని.. వాసన వస్తోందని చెప్పినందుకు కన్నతండ్రిపై ఇద్దరు కొడుకులు దాడి చేసి కొట్టారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. జల్లాపురం గ్రామానికి చెందిన గుర్రం బండినాయక కృష్ణయ్య (72) భార్య అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం చనిపోయింది. ఆయనకు ఇద్దరు కుమారులు వెంకటేశ్, బీచుపల్లి, ఓ కుమార్తె ఉన్నారు. కృష్ణయ్యకు ఐదున్నర ఎకరాల పొలం ఉంది. ఏడాది క్రితం మూడు ఎకరాల పొలాన్ని అమ్మగా వచ్చిన రూ.28 లక్షలను కొడుకులిద్దరూ చెరో రూ.14 లక్షల చొప్పున పంచుకున్నారు. తన పోషణకు ఇద్దరూ చెరో రూ.2 లక్షల చొప్పున బ్యాంక్‌లో డిపాజిట్ చేయమని కృష్ణయ్య కోరినా వారు పట్టించుకోలేదు. ప్రస్తుతం చిన్న కుమారుడు బీచుపల్లి వద్ద ఉంటున్నాడు. కాగా.. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో అన్నం, చారు నీళ్లనీళ్లుగా ఉండి వాసన వస్తోందని.. ఇలాంటి అన్నం పెడతారా? అని కోడళ్లను కృష్ణయ్య గట్టిగా నిలదీశాడు. దీంతో కొడుకులిద్దరూ వచ్చి కర్రలతో తండ్రిని చితకబాదారు. మనస్తాపం చెందిన వృద్ధుడు గురువారం విలేకరులకు తన గోడును వెళ్లబోసుకుని.. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకటేశ్, బీచుపల్లిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పత్తి తీతకు కూలీల కొరత

- మహారాష్ట్ర నుంచి తీసుకొస్తున్న రైతులు
- పెరిగిన కూలి... కుంగదీస్తున్న అకాల వర్షాలు
- పెరుగుతున్న తేమతో 'మద్దతు'పై గుబులు



తాంసి మండలం పొన్నారి గ్రామం వద్ద ఓ రైతు రోడ్డు పక్కన నిల్చుండి ఆదిలాబాద్ నుంచి ఆటోలో రావాల్సిన కూలీల కోసం ఎదురుచూస్తున్నాడు. పత్తితీత కోసం ముందుగానే కూలీలను మాట్లాడుకున్నాడు. ఉదయం వారి కోసం ఎదురుచూస్తుండగా ఓ ఆటో ఆ గ్రామం దాటుకొని వెళుతోంది. దాంట్లో తాను మాట్లాడిన కూలీలే ఉండటంతో ఆటోను నిలిపాడు. కూలీలను ఆటో దిగి తన చేనులోకి రావాలని పిలిచాడు. అయితే ఆ కూలీలు మరో ఊరిలో కూలి డబ్బు ఎక్కువ ఇస్తున్నారని, అక్కడకు వెళుతున్నామని చెప్పారు. అంతే కూలి తానే ఇస్తానని చెప్పి వారిని ఆటో దింపి తన చేనులోకి తీసుకెళ్లాడు. ప్రస్తుతం పత్తితీత కొనసాగుతుండగా, ఆదిలాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లో కూలీల కోసం రైతులు పడుతున్న ఆవేదన అంతాఇంతా కాదు. ఆటోలను నిలిపి మరీ కూలీలను చేనులోకి తీసుకెళ్లేందుకు ఇలా పలువురు పడరాని పాట్లు పడుతున్నారు. 'సాక్షి'బుధవారం పత్తి చేల పరిశీలనకు వెళ్లినప్పుడు ఈ దృశ్యం కనిపించింది.



ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం జామిడిలో పత్తి ఏరుతున్న మహారాష్ట్ర కూలీలు

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మూడు వైపులా మహారాష్ట్ర సరిహద్దుగా ఉంది. స్థానికంగా కూలీల కొరత కారణంగా మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో కూలీలు ఏటా పత్తితీత కోసం ఇక్కడకు వస్తారు. కిన్వట్ తాలుకా యేందా అనే గ్రామం నుంచే సుమారు 500 మంది కూలీలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్నారు. ఇలా మహారాష్ట్రలోని అనేక గ్రామాల నుంచి ఈ సమయంలో కూలి పనుల కోసం ఇక్కడకు వస్తారు. 40 రోజుల పాటు ఇక్కడే ఉండి పత్తి ఏరుతున్నారు. ఈ సమయంలో దంపతులిద్దరూ రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదిస్తున్నట్టు కూలి పనులకు వచ్చిన గణేశ్ చెప్పాడు.

పెరిగిన కూలి

పత్తితీతకు కూలి పెరిగింది. గతేడాది కిలో ఏరితే రూ.7 చెల్లించేవారు. ఈ ఏడాది రూ.8కు పెంచారు. కొన్ని పరిస్థితుల్లో కూలీలు దొరకకపోతే రూ.9 కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం పత్తి పంటకు సంబంధించి మొదటి తీత మొదలైంది. పంట విస్తీర్ణం బట్టి రైతులు కూలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక్కో కూలీ రోజు సుమారు 60 నుంచి 70 కిలోల వరకు పత్తి ఏరుతారని జామిడికి చెందిన రైతు నాగిరెడ్డి చెప్పాడు. స్థానిక కూలీలకు రోజువారి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, మహారాష్ట్ర కూలీలకైతే వారంవారం లేనిపక్షంలో మొత్తం పని అయిపోయిన తర్వాత వారు ఊరికి వెళ్లే సమయంలో తీసుకుంటారన్నాడు.

మద్దతు ధరపై గుబులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 11 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. నల్లరేగడి భూముల్లో 8 నుంచి 10 క్వింటాళ్లు, చెలక భూముల్లో 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కొద్ది రోజులుగా స్వల్పంగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతుల్లో మద్దతు ధరపై బెంగ నెలకొంది. నాణ్యమైన పత్తికి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉంది. ప్రైవేట్‌లో మాత్రం రూ.7వేల లోపే పలుకుతోంది. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించింది. ఆదిలాబాద్‌లో శుక్రవారం నుంచి సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించనుంది. అయితే పత్తిలో తేమ కారణంగా మద్దతు ధరలో కోత పెడతారన్న బెంగ ప్రస్తుతం పత్తి రైతుల్లో కనిపిస్తోంది. దీంతో గిట్టుబాటు ధర వస్తుందో.. లేదోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లకు మద్దతు

- రూ.1,000 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్
- ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రివర్గం


మంత్రి వైష్ణవ్

న్యూఢిల్లీ: అంతరిక్షరంగంలో స్టార్టప్ కంపెనీలకు మరింత ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా రూ.1,000 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ భేటీ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. వెంచర్ క్యాపిటల్ ఫండ్‌తో దాదాపు 35 స్టార్టప్ కంపెనీలకు మద్దతు లభించే అవకాశం ఉంది. దీనివల్ల అంతరిక్ష రంగంలో ప్రైవేట్‌రంగ భాగస్వామ్యం మరింత వృద్ధి చెందుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. స్పేస్ టెక్నాలజీలో ఆధునిక పరిశోధనలతోపాటు అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో భారత్ నాయకత్వం బలోపేతం కావడానికి ఈ నిధి దోహదపడతుందని చెబుతున్నారు. వేయి కోట్లతో నిధికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ నిధి నుంచి అర్హత కలిగిన స్టార్టప్‌ల్లో రెండు దశల్లో పెట్టుబడులు పెడతారు. మొదటి దశలో రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు, రెండో దశలో రూ.10 కోట్ల నుంచి రూ.60 కోట్ల దాకా పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 57 కిలోమీటర్ల నూతన రైలు మార్గంతోపాటు ఉత్తర బిహార్‌లో 256 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ డబ్లింగ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టుల విలువ రూ. 6,798 కోట్లు. ఇందులో అమరావతిలో రైల్వే లైన్‌కు రూ.2,245 కోట్లు ఖర్చు చేయనున్నారు.

వయసు నిర్ధారణకు 'ఆధార్' ప్రామాణికం కాదు

న్యూఢిల్లీ: వయసు నిర్ధారణకు ఆధార కార్డు ప్రామాణికం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరిహారం నిమిత్తం రోడ్డు ప్రమాద మృతుడి వయసును నిర్ధారించడానికి ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోవచ్చని పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఆధార్ కార్డును బట్టి కాకుండా పాఠశాల టీసీలో పేర్కొన్న తేదీని పుట్టిన తేదీగా పరిగణించాలని జువెనైల్ జస్టిస్ యాక్ట్-2015 టీసీలో పేర్కొన్న తేదీకి చట్టపరమైన గుర్తింపునిస్తోందని తెలిపింది. 'ఆధార్ గుర్తింపు కార్డుగా పనికొస్తుందే తప్ప పుట్టినతేదీని నిర్ధారించడానికి కాదని దాన్ని జారీచేసే యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా 2023లో సర్క్యులర్ ద్వారా స్పష్టం చేసింది' అని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం పేర్కొంది. 2015లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి మోటర్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ రూ. 19.35 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. మృతుడి వయసును టీసీ ఆధారంగా లెక్కించి (45 ఏళ్లు) పరిహారాన్ని గణించింది. పంజాబ్- హరియాణా హైకోర్టు ఆధార్ కార్డు ఆధారంగా వయసును గణించి (47 ఏళ్లుగా) పరిహారాన్ని రూ. 9.22 లక్షలకు తగ్గించింది. దీన్ని బాధిత కుటుంబం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా వయసు నిర్ధారణకు ఆధార్ కార్డును ప్రామాణికంగా పరిగణించలేమని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

ఈసారి 95 విమానాలకు బాంబు బెదిరింపులు

11 రోజుల్లో మొత్తం 250 సర్వీసులకు బాంబు హెచ్చరికలు



న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థలకు చెందిన దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. గురువారం మొత్తం 95 విమానాల సర్వీసుల్లో బాంబులు పెట్టినట్లు బెదిరింపులు వచ్చాయి. ఇవన్నీ వట్టివేనని తేలింది. ఇందులో ఆకాశ ఎయిర్‌కు చెందిన 25, ఎయిరిండియా, ఇండిగో, విస్తారలకు చెందిన 20 చొప్పున, స్పైస్ జెట్, అలయెన్స్ ఎయిర్‌లకు చెందిన ఐదేసి విమానాలు ఉన్నాయి. దీంతో గడిచిన 11 రోజుల్లో 250కు పైగా సర్వీసులకు బెదిరింపులు అందినట్లయింది. సామాజిక మాధ్యమాల ద్వారా ఆగంతకులు చేసిన హెచ్చరికలతో అధికార యంత్రాంగం, రక్షణ బలగాలు, విమానాశ్రయాల సిబ్బందితోపాటు ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు, అసౌకర్యానికి లోనయ్యారు. విమానయాన సంస్థలకు ఆర్థికంగా నష్టం వాటిల్లింది. ఇండిగోకు చెందిన హైదరాబాద్-గోవా, కోల్‌కతా-హైదరాబాద్, కోల్‌కతా-బెంగళూరు, బెంగళూరు-కోల్‌కతా, ఢిల్లీ-ఇస్తాంబుల్, ముంబై-ఇస్తాంబుల్, బెంగళూరు-ఝర్సుగూడ, హైదరాబాద్-బగ్డోరా, కోచి-హైదరాబాద్ తదితర సర్వీసులున్నాయి. బుధవారం మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న దుమ్నా విమానాశ్రయాన్ని పేల్చి వేస్తానంటూ ఆ ఆగంతకుడు ఫోన్‌లో చేసిన బెదిరింపు వట్టిదేనని తేలింది.

మెటా, ఎక్స్‌లను సమాచారం కోరిన కేంద్రం

విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతుండటాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. వీటి వెనుక ఉన్న వారిని గుర్తించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రజా సంక్షేమంతో ముడిపడి ఉన్న అంశం కావడంతో పలు విమానయాన సంస్థలకు పదేపదే అందుతున్న బెదిరింపు హెచ్చరికలకు సంబంధించిన పూర్తి డేటాను అందజేయాలని సామాజిక మాధ్యమ వేదికలైన మెటా, ఎక్స్‌లను కోరింది.

సుప్రీంకోర్టు రిపోర్టర్‌కు లా డిగ్రీ అక్కర్లేదు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో అక్రిడేషన్‌కు దరఖాస్తు చేసుకొనే రిపోర్టర్లు తప్పనిసరిగా న్యాయవిద్యను అభ్యసించి ఉండాలనే నిబంధనను ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఎత్తివేశారు. 'సుప్రీంకోర్టు వార్తలను కవర్ చేసే రిపోర్టర్లకు లా డిగ్రీ ఉండాలనే నిబంధన ఎందుకు పెట్టారో తెలియదు. దాన్ని ఎత్తివేస్తూ ఫైల్‌పై సంతకం చేశాను. ఇక మరింత మంది సుప్రీంకోర్టు అక్రిడేషన్ పొందొచ్చు' అని సీజేఐ చంద్రచూడ్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. నవంబరు 10వ తేదీన పదవీ విరమణ చేయనున్న జస్టిస్ చంద్రచూడ్ తన హయాంలో పలు సంస్కరణలు తెచ్చారు. ఈ-ఫైలింగ్‌ను ప్రవేశపెట్టారు. హైబ్రిడ్ విచారణ పద్ధతి (ప్రత్యక్ష విచారణ, ఆన్‌లైన్ విచారణలను కలగలిపి) తెచ్చారు.

వాయు కాలుష్యానికి మార్నింగ్ వాక్ ఆపేశా

దేశ రాజధానిలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని మార్నింగ్ వాక్‌ను ఆపేశానని సీజేఐ చంద్రచూడ్ తెలిపారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు రాకుండా ఉండాలంటే ఇంటికే పరిమితం కావాలని డాక్టర్ తనకు సూచించారని వెల్లడించారు. 'ఈ రోజు నుంచే మార్నింగ్ వాక్ ఆపేశా. సాధారణంగా ఉదయం 4-4.15కు మార్నింగ్ వాక్‌కు వెళతా' అని తెలిపారు.

వివాదాలకు చర్చలే శరణ్యం

- బ్రిక్స్ సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్
- అంతర్జాతీయ చట్టాలకు ఎవరైనా సరే లోబడి ఉండాల్సిందే
- ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలన్నీ కఠిన వైఖరి అవలంబించాలి



కజన్: వివాదాలు, విభేదాలను చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాల్సిందేనని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పునరుద్ఘాటించారు. యుద్ధాలతో సాధించేదీ ఏమీ ఉండదని తేల్చిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కొనసాగుతున్న సంఘర్షణలు, ఉద్రిక్తతలు చల్లారాలంటే చర్చలపై తక్షణమే దృష్టి పెట్టాలని సూచించారు. రష్యాలోని కజన్ నగరంలో బ్రిక్స్ ఔట్‌రీచ్/బ్రిక్స్ ప్లస్ సదస్సులో చివరి రోజు గురువారం జైశంకర్ మాట్లాడారు. ఇది యుద్ధాల శకం కాదంటూ భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. శాంతియుత చర్చలు, దౌత్య మార్గాలపై దృష్టి పెడితే వివాదాలు సమసిపోతాయని పేర్కొన్నారు. దేశాల మధ్య ఒప్పందాలు కుదిరినప్పుడు వాటిని తప్పనిసరిగా గౌరవించాలని అన్నారు. అంతర్జాతీయ చట్టాలకు ఎవరైనా సరే లోబడి ఉండాలని, ఎలాంటి మినహాయింపులు ఉండొద్దని తేల్చిచెప్పారు. ప్రపంచానికి ముప్పుగా మారిన ఉగ్రవాదంపై కఠిన వైఖరి అవలంబించాలని సూచించారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై జైశంకర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీర్ఘకాలపు సవాళ్లను ఎదిరించే విషయంలో కొత్తగా ఆలోచించడానికి ప్రపంచం సిద్ధంగా ఉండాలని చెప్పారు.

ఐరాస భద్రతా మండలిని సంస్కరించాల్సిందే

ప్రపంచీకరణ ప్రయోజనాలు అందరికీ సమానంగా అందడం లేదని, ఈ నిజాన్ని బ్రిక్స్ వేదిక గుర్తించాలని జైశంకర్ కోరారు. కోవిడ్ మహమ్మారితో పాటు వేర్వేరు సంఘర్షణల కారణంగా గ్లోబల్ సౌత్ దేశాలపై భారం మరింత పెరిగిందన్నారు. వైద్యం, ఆహారం, ఇంధన భద్రత విషయంలో ప్రతికూల ప్రభావం పడిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో 'సరిసమానమైన ప్రపంచ క్రమం' అవసరమని అభిప్రాయపడ్డారు. మౌలిక సదుపాయాల విషయంలో వివిధ దేశాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయని, ఇవి వలసవాద పాలన నుంచి వారసత్వంగా వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యత్యాసాలను సరి చేయాలన్నారు. సరుకుల సరఫరా కోసం దేశాల మధ్య అనుసంధానం మరింత పెరగాలన్నారు. ఇతర దేశాల ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని గౌరవిస్తూ ఆ దిశగా అన్ని దేశాలూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచస్థాయి సంస్థలు, అభివృద్ధి బ్యాంకుల్లో సంస్కరణలు తక్షణావసరమని జైశంకర్ తెలిపారు. ముఖ్యమంత్రి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు వెంటనే ప్రారంభించాలని అన్నారు. భద్రతా మండలిలో మరికొన్ని దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆతిథ్యం ఇచ్చిన బ్రిక్స్ సదస్సుకు పదికిపైగా బ్రిక్స్ సభ్యదేశాలతోపాటు దాదాపు 40 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

నూతన సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

- నియమించిన రాష్ట్రపతి ముర్ము
- వచ్చే నెల 11న ప్రమాణ స్వీకారం
- ఆరు నెలలపాటు పదవిలో కొనసాగనున్న జస్టిస్ ఖన్నా



సాక్షి, న్యూఢిల్లీ: భారత సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ గురువారం ఈ విషయం 'ఎక్స్'లో వెల్లడించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో సంప్రదించి నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నాను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జస్టిస్ ఖన్నా నియామకం నవంబర్ 11వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. కొత్త సీజేఐ వచ్చే నెల 11న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన స్వల్పకాలమే పదవిలో ఉంటారు. 2025 మే 13న పదవీ విరమణ చేయనున్నారు. అంటే కేవలం ఆరు నెలలపాటు సీజేఐగా కొనసాగుతారు. జస్టిస్ ఖన్నా 1960 మే 14న జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయ విద్య అభ్యసించారు. 1983లో న్యాయవాద వృత్తిలో అడుగుపెట్టారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో అడ్వొకేట్‌గా నమోదయ్యారు. వేర్వేరు కోర్టుల్లో పనిచేశారు. తీస్ హజారీ జిల్లా కోర్టు, ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా వ్యవహరించారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2006లో అదే కోర్టులో శాశ్వత జడ్జిగా చేరారు. ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ చైర్మన్‌గా సేవలందించారు. వృత్తిలో అంచెలంచెలుగా ఎదుగుతూ 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా, భోపాల్‌లోని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగానూ పనిచేస్తున్నారు.

కీలక తీర్పులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఖన్నా పలు కీలక తీర్పులు వెలువరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు(ఈవీఎంలు) సంబంధించి వీవీప్యాట్లలోని 100 శాతం ఓట్లను లెక్కించాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2024లో కొట్టివేసిన డివిజన్ బెంచ్‌కు ఆయన నేతృత్వం వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని 2024లో చరిత్రాత్మక తీర్పు ఇచ్చారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సమర్థిస్తూ 2023లో తీర్పు ఇచ్చిన ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా సభ్యుడిగా ఉన్నారు. వివాహ బంధం పూర్తిగా విఫలమైన సందర్భాల్లో దంపతులకు నేరుగా విడాకులు మంజూరు చేసే అధికారం ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టుకు ఉందని 2023లో స్పష్టంచేశారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) పరిధిలోకి సుప్రీంకోర్టు కార్యాలయం వస్తుందంటూ 2019లో మరో కీలక తీర్పు వెలువరించారు.

ఉమ్మడి భద్రత కోసం పనిచేయాలి: జిన్‌పింగ్

కజన్: గ్లోబల్ సౌత్ దేశాలు కలిసికట్టుగా ఆధునికత దిశగా ముందుకు సాగుతుండడం ప్రపంచ చరిత్రలో, మానవ నాగరికతలో అపూర్వమైన ఘట్టమని చైనా అధినేత జిన్‌పింగ్ ప్రశంసించారు. శాంతి, ఉమ్మడి భద్రత కోసం బ్రిక్స్ ప్లస్ దేశాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన బ్రిక్స్ ఔట్‌రీచ్ సదస్సులో ప్రసంగించారు. బ్రిక్స్‌ప్లస్ దేశాల శాంతి ప్రపంచ శాంతితో ముడిపడి ఉందన్నారు. ఉమ్మడి ప్రగతి కోసం ఆయా దేశాలన్నీ స్వయంగా చోదక శక్తిగా మారాలని సూచించారు. దేశాల మధ్య సమాచార మార్పిడి, సంప్రదింపులు మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ గ్లోబల్ సౌత్‌ను ఎప్పటికీ తమ గుండెల్లో నిలుపుకుంటామని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. తమ మూలాలను మర్చిపోవడం లేదన్నారు.

ముగిసిన బ్రిక్స్ సదస్సు

రష్యాలో మూడు రోజులపాటు జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు గురువారం ముగిసింది. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా సభ్యదేశాలు కాగా, కొత్తగా ఇరాన్, ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ, సౌదీ అరేబియా సభ్యదేశాలుగా చేరాయి. కూటమిలో సభ్యత్వం కోసం తుర్కియే, అజర్‌బైజాన్, మలేసియా దరఖాస్తు చేసుకున్నాయి. మరికొన్ని దేశాలు సైతం బ్రిక్స్‌లో చేరడానికి ఆసక్తి ప్రదర్శించాయి. ముగింపు సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రసంగించారు. రష్యాను ఒంటరిని చేసేందుకు అమెరికా సాగించిన ప్రయత్నాలు ఫలించలేదని చెప్పారు. ప్రపంచంలో బ్రిక్స్ పాత్రను పశ్చిమ దేశాలకు ప్రత్యామ్నాయంగా అభివర్ణించారు.

మహిళా జర్నలిస్ట్‌కు సుప్రీం బాసట

మమతా త్రిపాఠిపై కఠిన చర్యలొద్దని ఆదేశం

- మీ వైఖరేంటో తెలియజేయండి
- యూపీ సర్కార్‌కు నోటీసులు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ నియామకాల్లో రెండు కులాలకు మాత్రమే ప్రాధాన్యత దక్కుతోందని, ఇతర కులాల పట్ల వివక్ష చూపుతున్నారని విమర్శలు చేసినందుకు నాలుగు ఎఫ్ఐఆర్‌లను ఎదుర్కొంటున్న మహిళా పాత్రికేయురాలు మమతా త్రిపాఠికి సర్వోన్నత న్యాయస్థానం బాసటగా నిలిచింది. ఆమెపై కఠిన చర్యలకు ఉపక్రమించకుండా సుప్రీంకోర్టు ఆమెకు రక్షణగా నిలిచింది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలంటూ ఆమె పెట్టుకున్న పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారించింది. ఈ అంశంలో మమతపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ అంశంలో మీ వైఖరేంటో తెలపాలని యూపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ నోటీసులు జారీచేసింది. రాజకీయ దురుద్దేశంతో, పత్రికా స్వేచ్ఛను కాలరాసేందుకు కుట్రపన్ని మమతపై నేరసంబంధ సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారని ఈ సందర్భంగా మమత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదించారు.

మమత చేసిన వ్యాఖ్యలేంటి?

కొన్ని వారాల క్రితం తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో మమత పలు పోస్ట్‌లు పెట్టారు. వాటిల్లో 'యాదవ్ రాజ్ వర్సెస్ ఠాకూర్(సింగ్) రాజ్' అంటూ ఉత్తరప్రదేశ్‌లో కేవలం రెండు వర్గాలకు మాత్రమే ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత దక్కుతోందని విమర్శించారు. అంతకుముందు మరో జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్ సైతం యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌ను విమర్శిస్తూ ఒక భారీ కథనాన్ని వెలువరిచారు. '' అఖిలేశ్ యాదవ్ సీఎంగా ఉన్న కాలంలో రాష్ట్ర మీడియా మొత్తం యాదవుల గురించే ప్రత్యేక కథనాలను వండివార్చింది. ఇక యోగి ఆదిత్యనాథ్ హయాంలో ఠాకూర్‌ల రాజ్యం గురించిన చర్చ కొనసాగుతోంది'' అని ఆయన పోస్ట్‌చేశారు. అఖిలేశ్‌యాదవ్ కాలంలో యాదవులకే ప్రభుత్వ నియామకాల్లో అధిక ప్రాధాన్యత దక్కిందని, అలాగే యోగి హయాంలో ఠాకూర్‌లకు కీలక పదవులు దక్కాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కొలువుల్లో కొనసాగుతున్న సంబంధిత ఉన్నతాధికారుల జాబితాలో కొంత భాగాన్ని బహిర్గతంచేశారు. 'కుల వివక్ష ఉందా? లేదంటే ఠాకూర్ కులస్తులకే కొలువులు కట్టబెడతారా?' అని ప్రశ్నించారు. ఈ పోస్ట్‌పై స్పందిస్తూ మమత త్రిపాఠి మరికొన్ని పోస్ట్‌లుచేశారు. దీంతో ప్రభుత్వం వీరిపై కేసులు మోపింది. ప్రభుత్వం నేరుగా కేసులు బనాయించకుండా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ పంకజ్ కుమార్ అనే వ్యక్తిమాటున ఫిర్యాదులు ఇప్పించి ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయించిందని ఆరోపణలున్నాయి. '' ప్రజాస్వామ్యానికి నాలుగో మూలస్తంభమైన పత్రికాస్వేచ్ఛను అణగదొక్కి నిజాలు, వాస్తవాభిప్రాయాలను అణచివేయలేరు. ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసినంత మాత్రాన ప్రభుత్వ తప్పులు ఒప్పులు అయిపోవు. ప్రభుత్వాలపై పాత్రికేయులు చేసే సద్విమర్శలపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయలేరని రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)'(భావప్రకటనా స్వేచ్ఛ) స్పష్టంచేస్తోంది' అని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఇటీవల మరో జర్నలిస్ట్‌కూ రక్షణ

ఇదే ఉదంతంలో అక్టోబర్ 4న లక్నోకు చెందిన మరో జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్ సైతం తనపై మోపిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోర్టును ఆశ్రయించిన విషయాన్ని న్యాయవాది దవే గుర్తుచేశారు. మమతపై నమోదైన ఎఫ్ఐఆర్‌లలో ఒకదాంట్లో అభిషేక్ సహనిందితునిగా ఉన్నారని, ఈనెలలో అయనకు ఇచ్చినట్లే కఠిన చర్యల నుంచి రక్షణను మమతకు కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. 'ఎక్స్'లో పోస్ట్‌లు పెట్టారన్న ఒకే ఒక్క కారణంతో పాత్రికేయులను ప్రభుత్వం వేధిస్తోందని ఆయన వాదించారు. దీంతో '' కేవలం ప్రభుత్వాన్ని విమర్శించారని పాత్రికేయులపై కేసులు మోపడం తగదు' అని ఆనాడు సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.



పాత్రికేయుల హక్కులను రాజ్యాంగం రక్షిస్తోంది: సుప్రీం

ఇటీవల మరో జర్నలిస్ట్ అభిషేక్‌కు రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంగా సుప్రీంకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. '' ప్రజాస్వామ్య దేశాల్లో ప్రతి వ్యక్తి భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాల్సిందే. పాత్రికేయుల హక్కులకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఏ) కింద రక్షణ ఉంది. పాత్రికేయుల రచనలు ప్రభుత్వానికి విమర్శలుగా అనిపించినంత మాత్రాన వారిపై ప్రభుత్వం నేర సంబంధకేసులు మోపడం తగదు'' అని కోర్టు స్పష్టంచేసింది. కేసు తదుపరి విచారణను కోర్టు 4 వారాలు వాయిదా వేసింది.

కశ్మీర్‌లో ఉగ్ర కాల్పులు

ఇద్దరు జవాన్లు, ఇద్దరు పోర్టర్లు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ముష్కరులు ఆర్మీ వాహనంపైకి కాల్పులకు దిగారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం గుల్‌మార్గ్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలోని బారాముల్లా జిల్లా నగిన్ పోస్ట్ సమీపంలో వాస్తవాధీన రేఖకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలోని బొటపత్రి వద్ద ఘటన జరిగింది. ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు జవాన్లు నేలకొరగ్గా ఆర్మీ పోర్టర్లుగా పనిచేసే ఇద్దరు స్థానికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమమే అయినప్పటికీ నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన వాహనం గురువారం సాయంత్రం ఆఫ్రావట్ రేంజ్‌లోని నగిన్ పోస్ట్ వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఉగ్రవాదులను పాకిస్తాన్ బోర్డర్ యాక్షన్ టీం(బ్యాట్) సభ్యులుగా అనుమానిస్తున్నారు. ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలోకి భారీగా బలగాలను తరలించి, కూంబింగ్ చేపట్టినట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. సరిహద్దులకు అత్యంత సమీపంలో గతంలోనూ వీరు ఆర్మీపై దాడులకు పాల్పడిన ఘటనలున్నాయి. తాజా ఘటనను సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. మరోఘటన.. బారాముల్లా పట్టణ కోర్టులోని ఓ గదిలో గ్రెనేడ్ పేలిన ఘటనలో ఒక కానిస్టేబుల్ గాయపడ్డారు.

మూడ్రోజుల్లో దిగిపోండి

- లేదంటే తిరుగుబాటును ఎదుర్కొనేందుకు సిద్ధంకండి
- కెనడా ప్రధాని ట్రూడోకు సొంత పార్టీ సభ్యుల అల్టిమేటం

ఒట్టావా: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు ఊహించని షాక్ ఎదురైంది. అక్టోబర్ 28లోగా రాజీనామా చేయాలని అధికార లిబరల్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు అల్టిమేటం జారీచేశారు. రాజీనామా చేయకపోతే తిరుగుబాటును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి కెనడా ప్రభుత్వ వైఖరి కారణంగా భారత్, కెనడా దౌత్య సంబంధాల్లో ప్రతిష్టంభన నెలకొనడం తెల్సిందే. ఈ నేపథ్యంలో లిబరల్ ఎంపీలతో ట్రూడో సమావేశమయ్యారు. బుధవారం జరిగిన ఈ అంతర్గత సమావేశంలో దాదాపు 20 మంది సభ్యులు ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని ఊహించి ఈ డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే మూడు గంటల పాటు జరిగిన సమావేశం అనంతరం చిరునవ్వులు చిందిస్తూ బయటికి వచ్చిన ట్రూడో.. లిబరల్స్ ఐక్యంగా, బలంగా ఉన్నారని మీడియాకు వెల్లడించారు. పార్టీలోని 153 మంది చట్టసభ సభ్యుల్లో 24 మంది ట్రూడో నాలుగోసారి పోటీ చేసే ప్రణాళికలను విరమించుకోవాలని, ప్రధాని పదవికి రాజీనామా చేయాలని కోరుతూ లేఖపై సంతకాలు చేసినట్లు సమాచారం.

వెన్నుపోటు పొడిచింది

- ప్రజాస్వామ్య కెనడా నుంచి మేం ఊహించని అనైతిక వైఖరి ఇది
- కెనడా నుంచి తిరిగొచ్చిన భారత హైకమిషనర్ సంజయ్ వర్మ వ్యాఖ్య


భారత హైకమిషనర్ సంజయ్ వర్మ

న్యూఢిల్లీ: ఒక ఖలిస్తానీ వేర్పాటువాద ఉగ్రవాదికి వంతపాడుతూ భారత్ వంటి ప్రజాస్వామ్య దేశం పట్ల కెనడా అత్యంత అనైతికంగా వ్యవహరించిందని అక్కడి నుంచి తిరిగొచ్చిన భారత హైక మిషనర్ సంజయ్ కుమార్ వర్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. కెనడాలో ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యోదంతంలో సంజయ్ వర్మసహా పలువురు దౌత్యాధికారులను విచారిస్తామని కెనడా ప్రకటించడం, కెనడా చర్యపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ భారత్ తన దౌత్యాధికారులను వెంటనే వెన క్కి రప్పించి, కెనడా దౌత్యాధికారులను బహిష్కరించడం తెల్సిందే. హఠాత్తుగా భారత్– కెనడా దౌత్యబంధంలో భారీ బీటలు వారిన వేళ సంజయ్ గురువారం 'పీటీఐ'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.

పాలకవర్గం మొదలు పార్లమెంట్‌దాకా

'' కెనడాలో పాలకవర్గం మొదలు రక్షణ బలగాలు, చివరకు పార్లమెంట్‌దాకా అన్ని రాజ్యాంగబద్ధ సంస్థల్లో ఖలిస్తానీ సానుభూతిపరులు చొరబడ్డారు. ఇలా ఖలిస్తానీవాదులు తమ అజెండాను బలంగా ముందుకు తోస్తున్నారు. భారత సార్వభౌమత్వాన్ని సైతం సవాల్ చేసే సాహసం చేస్తున్నారు. మన సమగ్రతను అక్కడి ఎంతోమంది కెనడియన్ పార్లమెంటేరియన్లు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. తోటి ప్రజాస్వామ్య మిత్రదేశంగా భారత సమగ్రతను కెనడా గౌరవిస్తుందని భావించా. కానీ వాళ్లు వెన్నుపోటు పొడిచారు. అత్యంత అనైతికంగా వ్యవహరించారు. ఖలిస్తానీవాదుల కారణంగా కెనడా విదేశాంగ విధానం పెడతోవలో వెళ్తోంది. ఓటు బ్యాంక్‌ను కాపాడుకునేందుకు రాజకీయనేతలకు ఖలిస్తానీ వాదుల మద్దతు అవసరమైంది. ఇదే చివరకు ఇరుదేశాల దౌత్యసత్సంబంధాల క్షీణతకు ప్రధాన హేతువు. రోజురోజుకూ కెనడా రాజకీయ ముఖ చిత్రంపై ఖలిస్తానీవాదుల పాత్ర పెద్దదవుతోంది. అక్కడి భారతీయ సంతతి ప్రజలు ప్రశాంత జీవనం గడుపుతుంటే ఖలిస్తానీవాదులు మాత్రం తమ అనైతిక డిమాండ్ల కోసం తెగిస్తున్నారు. 'ఖలిస్తాన్' వాదనను ఖలిస్తానీవాదులు కెనడాలో ఒక వ్యాపారంగా మార్చేశారు. ఆయుధాలు, మత్తుపదార్థాల అమ్మకాలు, మానవుల అక్రమ రవాణా, వ్యభిచారం, బెదిరింపులు వంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారు. ఓట్లు పోతాయన్న భయంతో అక్కడి ప్రభుత్వం ఇవన్నీ తెల్సి కూడా కళ్లుమూసుకుంటోంది'' అని అన్నారు.

దౌత్య రక్షణ తొలగిస్తామన్నారు

తనతోపాటు మరో ఐదుగురు దౌత్యసిబ్బందిని కెనడా బహిష్కరించిన ఘటనను వర్మ గుర్తుచేసుకున్నారు. '' అక్టోబర్ 12వ తేదీ సాయంత్రం టొరంటో ఎయిర్‌పోర్ట్‌లో ఉన్నప్పుడు నాకొక మెసేజ్ వచ్చింది. అర్జంటుగా కెనడా విదేశాంగ శాఖకు వచ్చి అధికారులను కలవాలని ఆ సందేశంలో ఉంది. 13వ తేదీన గ్లోబల్ అఫైర్స్ కెనడా(విదేశాంగశాఖ) ఆఫీస్‌కు నేను, డెప్యూటీ హైకమిషనర్ వెళ్లాం. 'నిజ్జర్ హత్య కేసులో మీ ప్రమేయంపై మిమ్మల్ని ఇంటరాగేషన్ చేయాల్సి ఉంది. రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు మిమ్మల్ని విచారిస్తారు. వీటికి అవరోధంగా ఉన్న, మిమ్మల్ని కాపాడుతున్న 'దౌత్యరక్షణ'ను తీసేస్తాం' అని కెనడా అధికారులు మాతో చెప్పారు. దాంతో మాకో విషయం స్పష్టమైంది. దౌత్యనీతిని అవహేళన చేస్తూ, నిబంధనలకు నీళ్లొదిలేస్తూ హైకమిషనర్‌ను ప్రశ్నిస్తామని చెప్పడంతో నిర్ఘాంతపోయాం. పలు దేశాల్లో దౌత్యవేత్తగా పనిచేసిన నా 36 సంవత్సరాల కెరీర్‌లో ఇలాంటి అవమానాన్ని ఏ దేశంలోనూ ఎదుర్కోలేదు. నిజ్జర్‌హత్యసహా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు మేం పాల్పడలేదు. అయినా దౌత్యవేత్తలతో వ్యవహరించాల్సిన పద్ధతి ఇదికాదు'' అని ఆయన అన్నారు.

'గడియారం' అజిత్ పవార్ వర్గానికే

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(అజిత్ పవార్) అధ్యక్షుడు అజిత్ పవార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గడియారం గుర్తును అజిత్ పవార్ వాడుకోవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, ఈ గుర్తు వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉన్నట్లు ప్రచార సామగ్రిపై ముద్రించాలని సూచించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గడియారం గుర్తుపై అజిత్ పవార్ వర్గం, శరద్ పవార్ వర్గం మధ్య మొదలైన వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఎన్నికల ప్రచారంలో ఈ గుర్తును అజిత్ పవార్ వర్గం ఉపయోగించుకోకుండా ఆదేశించాలని కోరుతూ శరద్ పవార్ వర్గం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గడియారం గుర్తుతో శరద్ పవార్‌కు ఎంతో అనుబంధం ఉంది. గుర్తు విషయంలో ప్రజల్లో గందరగోళానికి తావు లేకుండా అజిత్ పవార్ వర్గానికి కొత్త గుర్తు కేటాయించాలని శరద్ పవార్ వర్గం సూచించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం గడియారం గుర్తును అజిత్ పవార్ వర్గం ఎన్నికల ప్రచారంలో వాడుకోవచ్చంటూ తేల్చిచెప్పింది. అయితే, ఎన్నికల ప్రచారంలో శరద్ పవార్ వర్గానికి నష్టం కలుగకుండా హామీ పత్రం సమర్పించాలని అజిత్ పవార్ వర్గాన్ని కోర్టు ఆదేశించింది. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. ఎన్సీపీ రెండుగా చీలిపోగా అజిత్ వర్గానికి గడియారం గుర్తును ఈసీ కేటాయించింది.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం, 25, అక్టోబర్, 2024



సీతాఫల్.. వెరైటీస్ ఫుల్

ఈ సీజన్‌లో సీతా ఫలాన్ని ఆధారం చేసుకుని రుచులను వడ్డించే రెస్టారెంట్స్, ఐస్‌క్రీమ్ పార్లర్స్ సైతం నగర వాసులకు వెరైటీలను అందించేందుకు సిద్ధమవుతున్నాయి. - సిటీప్లస్‌లో



క్యాట్ ఫెస్ట్.. ఆల్ సెట్..

నగరంలో వినూత్నంగా క్యాట్ ఫెస్ట్ ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 13కు పైగా క్యాట్ బ్రీడ్‌లతో 400కు పైగా పిల్లులతో పెట్ లవర్స్ సందడి చేయనున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురిసే అవకాశం ఉంది. గరిష్టంగా 32, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





దీపావళి సమీపిస్తుండటంతో నగర మార్కెట్లలో కొనుగోళ్ల సందడి నెలకొంది. పండగ పూట ఇళ్లలో దీపాలు వెలిగించేందుకు మట్టి ప్రమిదలు సిద్ధంగా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో ప్రమిదల విక్రయాలు ఊపందుకున్నాయి.

వెలుగుల పండగకు ప్రమిదల శోభ

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి

వీటిని అన్ని లావాదేవీలకు ఉపయోగించవచ్చు



వినియోగదారులకు రూ.10 నాణేలు అందజేస్తున్న ధారాసింగ్

సుల్తాన్‌బజార్: పది రూపాయల నాణేలు చట్టబద్ధమైనవి. వీటిని రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని ఏపీ, తెలంగాణ, కర్ణాటక సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ధారా సింగ్ నాయక్ సూచించారు. గురువారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ప్రజలకు, వినియోగదారులకు రూ.10 నాణేలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు రూ.10 నాణేల వాడకంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఈ నాణేలు చెల్లుబాటవుతున్నాయన్నారు. పది రూపాయల నాణేలు అన్ని చోట్లా తీసుకోవచ్చు.. అనే పోస్టర్లను రద్దీ ప్రాంతాల్లో, ప్రజా రవాణా ప్రాంతాల్లో ప్రజల అవగాహన కోసం అందుబాటులో ఉంచామని తెలిపారు. రూ.10 నాణేల వినియోగంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. రూ.10 కరెన్సీ నోట్లు త్వరగా చిరిగిపోవడం, వాటి ముద్రణ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో నాణేలను రిజర్వ్ బ్యాంక్ తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు రూ.10 నాణేల వాడకాన్ని ఉపయోగించాలన్నారు.

భూసేకరణ వేగిరమే పూర్తి చేయండి

అధికారులకు కమిషనర్ ఇలంబర్తి ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ) మొదటి దశలోని పెండింగ్ పనుల్లో మూడింటిని గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తనిఖీ చేశారు. ఎస్సార్‌డీపీ కింద చేపట్టిన పనుల్లో ఆరు పనులు అసంపూర్తిగా ఉండటంపై గత ఆదివారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో బుధవారం మూడు పనుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్, గురువారం మిగతా మూడింటిని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. నల్లగొండ చౌరస్తా ఫ్లై ఓవర్, ఉప్పల్ ఫ్లై ఓవర్ పనులకు ఇంకా భూసేకరణ మొత్తం జరగలేదని జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ దేవానంద్ వివరించడంతో వాటికి సంబంధించిన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా భూసేకరణ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలో ఫలక్‌నుమా ఆర్‌ఓబీ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్‌ఓబీ, ఫ్లై ఓవర్ల పనులు వేగిరమే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలన్నారు. కమిషనర్ వెంట ఇంజినీరింగ్ అధికారులు, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ తదితరులు ఉన్నారు.

నిమ్స్‌లో 'కియోస్క్' ఓపీ చీటీ

లక్డీకాపూల్: సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు సైతం సునాయసంగా పరిష్కారం చూపించే నిమ్స్ ఆస్పత్రి రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దృష్టి సారించింది. ఓ ఐటీ సంస్థ సహకారంతో ప్రయోగాత్మకంగా మిలీనియం బ్లాక్‌లో కియోస్క్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రధానంగా రివ్యూ ఓపీకి వచ్చే రోగులకు వైద్య సేవలు త్వరితగతిన అందించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసింది. వెంట వెంటనే రెండు మూడు సార్లు ఆస్పత్రికి వచ్చే రోగులు సైతం క్యూలో నిల్చోకుండానే కియోస్క్ సహాయంతో వైద్యుడి వద్దకు వెళ్లే వెసులుబాటు కలుగుతుంది. నిమ్స్ ఓపీ కార్డుకు 14 రోజుల వరకు కాలపరిమితి ఉంటుంది. రూ.100 చెల్లించి పొందిన ఓపీ కార్డుతో ఆయా రోగులకు ప్రత్యేకంగా సీఆర్ నంబర్ కేటాయిస్తుంది. దీని ఆధారంగా ఓపీ కౌంటర్ల వద్ద కాకుండా కియోస్క్ వద్ద ఓపీ చీటీ పొందవచ్చు. ఈ యంత్రం పని తీరు బాగుంటే ఆస్పత్రిలోని మిగిలిన అన్ని విభాగాలలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న యోచనలో నిమ్స్ యాజమాన్యం ఉంది.

కొత్వాల్ బన్‌గయా మేజిస్ట్రేట్

- ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు నిర్వహించిన సీపీ ఆనంద్
- ఎంఐఎం–కాంగ్రెస్ మధ్య వివాదంపై సాగిన విచారణ

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా (ఎగ్జిక్యూటివ్) మారారు. బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో కార్యనిర్వాహక న్యాయస్థానం నిర్వహించిన ఆయన హుమయూన్‌నగర్ పోలీసులు తన ముందు ఉంచిన సమాచారాన్ని పరిశీలించారు. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నేత ఫెరోజ్ ఖాన్ మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ నెల 7న ఫిరోజ్ గాంధీ నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించడానికి ఫెరోజ్ ఖాన్ తన అనుచరులతో కలిసి వెళ్లారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న మాజిద్ హుస్సేన్, ఆయన అనుచరులు ఈ పర్యటనకు అభ్యంతరం చెప్పారు. దీంతో వీరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఫలితంగా రేగిన ఘర్షణ స్థానికుల్లో తీవ్ర భయాందోళన కలిగించింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు పక్షాలను చెదరగొట్టడంతో పాటు కేసు నమోదు చేశారు. ఈ అంశాన్ని పోలీసులు ఆనంద్ నిర్వహించిన మేజిస్ట్రేట్ (ఎగ్జిక్యూటివ్) కోర్టు ముందు ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ నేత ఫెరోజ్ ఖాన్ సహా ఇరుపక్షాలు హాజరై తమ వాదనలు వినిపించాయి. వీటిని విన్న ఆనంద్ ఇరు వర్గాలు వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.



చెరువుల అనుసంధానంతోనే

వరదల కట్టడి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని చెరువులకు పునరుజ్జీవం కల్పించి, వాటిని అనుసంధానిస్తేనే వరదల నుంచి విముక్తి లభిస్తుందని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చీఫ్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. దీనికోసం స్వచ్ఛంద సంస్థలు, లేక్ మెన్‌లతో పాటు జలవనరుల అభివృద్ధికి సంబంధించిన పరిశోధకులు, నిపుణులతో చర్చిస్తున్నట్లు ఆయన వివరించారు. గురువారం బుద్ధ భవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఆయన వాటర్–ఉమెన్ రైట్స్ ఉద్యమకారిణి డాక్టర్ మన్సీబాల్ భార్గవతో సమావేశమయ్యారు. ప్రస్తుతం నగరంలో చెరువుల పరిస్థితిని సమీక్షిస్తూ వాటికి పునరుజ్జీవం కల్పించడానికి హైడ్రా తీసుకుంటున్న చర్యలపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. చెరువుల పునరుద్ధరణతోనే నగరానికి వరద ముప్పు తప్పుతుందంటూ ఆమె పునరుద్ఘాటించారు. శరీరానికి నాడీ వ్యవస్థ ఎంత ముఖ్యమో చెరువులకు నాలా వ్యవస్థ అంతే అవసరమని వివరించారు. నాలాలు పక్కాగా ఉంటే వరద నీరు సాఫీగా చెరువుకు చేరుతుందని, చెరువుల అనుసంధానం ఉన్నప్పుడే ఒక దాని తర్వాత మరోటి నిండుతుందని పేర్కొన్నారు. కాంక్రీట్ కట్టడాలతో కాకుండా సహజసిద్ధంగా చెరువులను పునరుద్ధరించినప్పుడే వాటిలో జీవకళ ఉంటుందని, ఆ నీరు జీవరాసులకు ఉపయోగపడుతుందని భార్గవ పేర్కొన్నారు. అలా తక్కువ ఖర్చుతో చెరువులకు పునరుజ్జీవం సాధ్యమవుతుందంటూ ఆయా విధానాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుత పర్యావరణ పరిస్థితుల్లో నెల రోజుల్లో కురవాల్సిన వర్షం ఒక్క రోజులోనే, ఒక్క రోజులో కురవాల్సిన వర్షం గంటలో పడి నగర జీవనాన్ని అతలాకుతలం చేస్తోందని, ఇలాంటి పరిస్థితులకు నీటి కాల్వలు, నాలాలు పరిష్కారమవుతాయని ఆమె అన్నారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగించి నగరం ముంపునకు గురి కాకుండా చేయడం ఓ శస్త్ర చికిత్స లాంటిదని ఆమె వ్యాఖ్యానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవీ రంగనాథ్

ఫేస్‌బుక్ టు వాట్సాప్!



ఆ ఫొటోలే వినియోగించి వాట్సాప్ డీపీ..

డీపీ ఫ్రాడ్స్‌లో వెలుగులోకి వచ్చిన కొత్త పంథా

తొలుత ఫ్రెండ్ రిక్వెస్ట్ ద్వారా ఫేస్‌బుక్‌లోకి ఎంట్రీ

- అందులోని ఫొటోల ఆధారంగా వాట్సాప్ డీపీ సృష్టి
- ఆపై ఫ్రెండ్స్ లిస్టులో లాక్ చేయని ప్రొఫైల్స్ గుర్తింపు
- దాని ద్వారా చాటింగ్ చేస్తూ డబ్బు కావాలని అభ్యర్థన
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పటికప్పుడు తమ పంథాను మార్చేసే సైబర్ నేరగాళ్లు నానాటికీ సవాళ్లు విసురుతూనే ఉన్నారు. ఒకప్పుడు ఫేస్‌బుక్, ఆపై డీపీ ఫ్రాడ్స్ చేసే 'ఈ– నేరగాళ్లు' ఇప్పుడు ఈ రెండిటినీ 'కలిపేశారు'. ఫేస్‌బుక్ ద్వారా ఎంటరైన తర్వాత వాట్సాప్ డీపీ వరకు వెళ్తున్నారు. లాక్ చేయని ప్రొఫైల్స్‌లోని వివరాల ఆధారంగా చాటింగ్ చేస్తూ డబ్బు డిమాండ్ చేస్తున్నారు. ఈ స్కామ్స్‌లో ఆర్థిక నష్టం అంతగా లేకున్నా.. న్యూసెన్స్ చాలా ఎక్కువగా ఉంటోంది. ఇటీవల కాలంలో ఈ తరహా స్కామ్స్ పెరిగాయని చెబుతున్న సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రొఫైల్ లాక్ చేసినప్పటికీ 'రిక్వెస్ట్'తో..

ఫేస్‌బుక్ ఆధారంగా జరిగే సైబర్ నేరాలపై కొంత వరకు అవగాహన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అనేక మంది తమ ఫేస్‌బుక్ ప్రొఫైల్స్‌ని కచ్చితంగా లాక్ చేసి ఉంచుతున్నారు. అలా ఉన్న వాటిని కేవలం ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వాళ్లు మాత్రమే చూడగలరు. దీనికి విరుగుడుగా సైబర్ నేరగాళ్లు ఫ్రెండ్ రిక్వెస్ట్ ఎత్తు వేస్తున్నారు. ఎక్కువగా యువతులు, కొన్ని సందర్భాల్లో సదరు ఫేస్‌బుక్ యూజర్‌కు పరియచం ఉన్న వారి పేరుతో నకిలీ ప్రొఫైల్ క్రియేట్ చేస్తున్నారు. దీని ఆధారంగా తాము టార్గెట్ చేసిన వారికి రిక్వెస్ట్ పంపుతున్నారు. దీన్ని యాక్సెప్ట్ చేసిన మరుక్షణం సైబర్ నేరగాళ్లకు ఆ ఫేస్‌బుక్ ప్రొఫైల్ చూసే అవకాశం దక్కుతోంది.

నకిలీ ప్రొఫైల్‌తో డబ్బు డిమాండ్..

ఇలా ఓ వ్యక్తి ఫేస్‌బుక్ ఖాతాలోకి ఎంటర్ అవుతున్న సైబర్ నేరగాడు అందులోని వివరాలు, ఫొటోల ఆధారంగా నకిలీ ప్రొఫైల్ క్రియేట్ చేస్తున్నాడు. దీని ఆధారంగా మెసెంజర్‌లో చాటింగ్ చేస్తూ డబ్బు అడగటంతో పాటు ఫ్రెండ్స్ లిస్టులోని వారికే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతున్నాడు. వీటిని అందుకున్న వాళ్లల్లో అనేక మంది తమ స్నేహితుడే మరో ప్రొఫైల్ క్రియేట్ చేసుకున్నాడని భావించి యాక్సెప్ట్ చేస్తున్నారు. ఆపై వారితోనే ఇదే పంథా అవలంబిస్తున్నారు. మరోపక్క సదరు వ్యక్తి ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వారిలో ఎవరైతే తమ ప్రొఫైల్‌లో ఫోన్ నంబర్ ఉంచుతున్నారో వారిని మరో విధంగా టార్గెట్ చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్లు తాము రూపొందించిన నకిలీ ప్రొఫైల్‌లోని ఫొటోలు, వర్చువల్ నంబర్లు వాడి వాట్సాప్ ఖాతాలు తెరుస్తున్నారు. వీటికి డీపీలుగా అసలు యజమానులవి పెడుతున్నారు. ఈ వాట్సాప్ ఖాతాల ఆధారంగా ఫ్రెండ్స్ లిస్టులోని వ్యక్తుల ఫోన్ నంబర్లకు సందేశాలు పంపుతున్నారు. ఫేస్‌బుక్ మెసెంజర్‌లో అడిగినట్లే వీటి ద్వారానూ అత్యవసరమని, గూగుల్ పే లిమిట్ అయిపోయిందని చెబుతూ డబ్బు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందేశాలు అందుకునే ఎదుటి వ్యక్తుల్లో కేవలం డీపీలు మాత్రమే వాళ్ల తన స్నేహితుడు, బంధువు డబ్బు అడుగుతున్నాడని భావించి బదిలీ చేస్తున్నారు.

చిన్న మొత్తాలే కావడంతో నో కంప్లైంట్..

సైబర్ నేరాల్లో ఎవరి పేరుతో అయితే నకిలీ ప్రొఫైల్, డీపీ క్రియేట్ అయ్యాయో... వారితో పాటు నగదు బదిలీ చేసిన వాళ్లు సైతం సైబర్ క్రైమ్ ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. అయితే.. సైబర్ క్రిమినల్స్ కొల్లగొడుతున్నది చిన్న మొత్తాలే కావడంతో అత్యధికులు పోలీసుస్టేషన్ల వరకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ఇది నేరగాళ్లకు కలిసి వచ్చే అంశంగా మారుతోంది. మరోపక్క ఫిర్యాదు, కేసు నమోదు జరిగినా.. ఉత్తరాదిలో ఉండే ఈ నేరగాళ్ల కోసం ఇక్కడ నుంచి పోలీసు బృందాలు పంపడం కష్టసాధ్యంగా మారింది. దీంతో చిన్న మొత్తాలతో ముడిపడి ఉన్న కేసుల్లో దాదాపు అన్నీ మూతపడటం కూడా నేరగాళ్లకు అనుకూలంగా మారుతోంది.

రిటైల్‌కు రూ.11 వేలు.. | హోల్‌సేల్‌కు రూ.66 వేలు..

బాణాసంచా దుకాణాలకు తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ ఫీజు

- లైసెన్స్ లేకున్నా, నిబంధనలు అతిక్రమించినా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి పండగను పురస్కరించుకొని బాణాసంచా (పటాకుల) దుకాణాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. లైసెన్స్ లేకుండా దుకాణాల ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులివ్వబోమని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి స్పష్టం చేశారు. రిటైల్ అమ్మకాల కోసం దుకాణాలు ఏర్పాటు చేసేవారు రూ.11 వేలు, హోల్‌సేల్ విక్రయాలకు రూ. 66వేలు ట్రేడ్ లైసెన్స్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.



దరఖాస్తు ఇలా..

బాణాసంచా దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది నిబంధనలకనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్ణీత ట్రేడ్ లైసెన్స్ ఫీజును చెల్లించి జీహెచ్‌ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ ఐడెంటిఫికేషన్ నంబర్ కోసం సిటిజన్ సర్వీస్ సెంటర్/ జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ (www.ghmc.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిమాండ్ డ్రాఫ్ట్, డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించవచ్చన్నారు. గుర్తింపు కోసం ఆధార్ కార్డు, పాన్ కార్డు ప్రతులు ఇవ్వాలని కోరారు. బాణాసంచా షాపులను ఫుట్‌పాత్‌లు, జనావాసాల మధ్య ఏర్పాటు చేయరాదని తెలిపారు.

తగిన ఫైర్ సేఫ్టీ ఉండాలి..

కాలనీలు, బస్తీలకు దూరంగా ఓపెన్ గ్రౌండ్‌లో/ పెద్ద హాల్‌లో తగిన ఫైర్‌సేఫ్టీతో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుకోని ప్రమాదం జరిగితే మంటలను ఆర్పడానికి వీలుగా అగ్నిమాపక నిరోధక పరికరాలు సిద్ధంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి స్టాల్ వద్ద, చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దుకాణాలకు దగ్గరగా ఎట్టి పరిస్థితుల్లోనూ బాణాసంచా కాల్చకూడదని, షాపులో ఏర్పాటు చేసే లైట్లు ఇతరత్రా కరెంటు పరికరాలకు నాణ్యమైన విద్యుత్ వైర్‌ను వినియోగించాలని సూచించారు. బాణాసంచా స్టాల్‌లో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినట్లయితే స్టాల్ హోల్డర్‌దే బాధ్యతని, చట్టపరమైన చర్యలకు బాధ్యుడని తెలిపారు. ఈ విషయాన్ని తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్‌లో పొందుపరచనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు పాటించాలి..

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఫైర్ క్రాకర్స్ అయిన సిరీస్ క్రాకర్స్/లడీస్ తయారీ, అమ్మకాలు, వినియోగంపై నిషేధం ఉందని, వాటి అమ్మకాలకు అనుమతించరని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ యాక్ట్ 1955/న్యాయస్థానాలు/పీసీబీ/ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు.

బాణాసంచా విక్రయ స్టాళ్లను సంబంధిత డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి అధికారుల బృందం కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తుందని కమిషనర్ పేర్కొన్నారు.

చర్లపల్లి టెర్మినల్ రెడీ



వచ్చే నెలలోనే ప్రారంభం



- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- ఎంఎంటీఎస్ రైళ్లను సకాలంలో నడపాలని ఎంపీల వినతి
- సర్వీసులపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి
- నగరంలో దశాబ్దాలుగా పూర్తి కాని ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు

సాక్షి, సిటీబ్యూరో: చర్లపల్లి రైల్వే టెర్మినల్ వచ్చే నెలలో ప్రారంభం కానుంది. స్టేషన్‌కు రాకపోకలు సాగించేందుకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా ఆలస్యమైందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్లనే వినియోగించుకొనేలా నవంబర్‌లో టెర్మినల్ సేవలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో నిర్వహించిన పార్లమెంట్ సభ్యుల సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సుమారు రూ.430 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో చర్లపల్లి టెర్మినల్ నిర్మించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నాలుగో రైల్వే టెర్మినల్‌గా ఇది ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్ల నుంచి నడిచే పలు రైళ్లు ఇక చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనున్నాయి. చర్లపల్లి స్టేషన్‌కు ఎంఎంటీఎస్ సర్వీసులను కూడా వినియోగంలోకి తేనున్నట్లు మంత్రి చెప్పారు. మొదట 25 జతల రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 9 ప్లాట్‌ఫామ్‌లు, నాలుగు పిట్‌లైన్‌లు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్రయాణికుల కోసం ప్రత్యేక విశ్రాంతి గదులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు తరహా అనుభూతిని కలిగించే తొలి స్టేషన్‌గా చర్లపల్లి అందుబాటులోకి రానుంది. మరోవైపు ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ రెండో దశ పూర్తయిన నేపథ్యంలో అక్కడి నుంచి రాయగిరి వరకు యాదాద్రి ప్రాజెక్టును చేపట్టేందుకు రైల్వేశాఖ సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎంఎంటీఎస్‌కు కొరవడిన సమయపాలన..

ఈ సమావేశం సందర్భంగా పలువురు ఎంపీలు నగరంలో ఎంఎంటీఎస్ సేవల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సికింద్రాబాద్–మేడ్చల్, ఉందానగర్– మేడ్చల్, బొల్లారం–సికింద్రాబాద్, లింగంపల్లి– రామచంద్రాపురం, సికింద్రాబాద్– ఘట్కేసర్ తదితర రూట్లలో ఎంఎంటీఎస్ లైన్‌లు పూర్తయినప్పటికీ రైళ్లు మాత్రం సకాలంలో నడవడం లేదని పేర్కొన్నారు. ఏ రైలు ఎప్పుడొస్తుందో గ్యారంటీ లేకపోవడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ సదుపాయాలను ఆశ్రయిస్తున్నట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి స్టేషన్‌కు అన్ని వైపులా రైల్వే లైన్‌లు ఉన్నప్పటికీ ఎంఎంటీఎస్ సర్వీసులు లేవన్నారు. ఎంఎంటీఎస్ ట్రిప్పులు పెంచాలని, సమయపాలనపైన ప్రయాణికుల్లో నమ్మకం కలిగించాలని కోరారు. ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడకుండా 12 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేస్తే వాహనాల రాకపోకలకు అవకాశం ఉంటుందన్నారు. బొల్లారం, వాజ్‌పేయినగర్, సఫిల్‌గూడ, అల్వాల్, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో ఏళ్లుగా ఆర్‌యూబీల నిర్మాణం పెండింగ్ దశలోనే ఉందని చెప్పారు. అనంతరం దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ విలేకరుల సమావేశంలో మాట్లాడిన సందర్భంగా ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణపైన క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఇటీవల ప్రయాణికుల సంఘాలతోనూ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమయపాలనను మెరుగుపర్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

వీధుల్లో వ్యభిచారం!

- బస్టాప్‌లు, నిర్మానుష్య ప్రాంతాలే అడ్డాలు
- సైబరాబాద్ పోలీసుల జాయింట్ ఆపరేషన్స్
- నెల రోజుల్లో 53 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్ల బైండోవర్


స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, పోలీస్ అధికారులు

మూసాపేట: రాష్ట్రంలో వ్యభిచారం చట్టరీత్యా నేరం. దీంతో సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టారు. కమిషనరేట్ పరిధిలో బస్టాప్‌లు, నిర్మానుష్య ప్రాంతాలలో అడ్డాలు ఏర్పాటు చేసుకొని వీధుల్లో వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకుల ఆటకట్టించారు. గత నెల రోజుల్లో వివిధ ప్రాంతాల్లో వ్యభిచారం నిర్వహిస్తున్న 53 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లను బైండోవర్ చేశారు. వ్యభిచారంపై నిఘా పెట్టేందుకు మానవ అక్రమ రవాణా విభాగం (ఏహెచ్‌టీయూ, షీ టీమ్స్‌తో పాటు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీసులతో బాలానగర్ డీసీపీ కే సురేష్ కుమార్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీటికి కూకట్‌పల్లి ఏసీపీ కే శ్రీనివాస రావు నేతృత్వం వహిస్తున్నారు. ఇందులో ఒక ఏసీపీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 7 మంది ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, 36 మంది కానిస్టేబుళ్లతో మొత్తం 49 మంది సిబ్బంది ఉంటారు. బుధవారం రాత్రి భాగ్యనగర్ బస్టాప్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ల పరిధిలో జాయింట్ ఆపరేషన్స్ నిర్వహించి 31 మంది మహిళలు, నలుగురు ట్రాన్స్‌జెండర్లను బైండోవర్ చేశారు. బీఎన్‌ఎస్‌ఎస్ చట్టంలోని సెక్షన్-35 కింద నోటీసులు జారీ చేశారు. వీరిపై అనైతిక ట్రాఫిక్ (నివారణ) చట్టం-1956 కింద కూకట్‌పల్లిలో మూడు, కేపీహెచ్‌బీలో ఒక కేసు నమోదయ్యాయి. ఈ నెల ప్రారంభంలో నిర్వహించిన జాయింట్ ఆపరేషన్స్‌లోనూ 22 మందిని పోలీసులు పట్టుకున్న సంగతి తెలిసిందే.

టాలీవుడ్ నిర్మాత శివరామకృష్ణ బెయిల్ రద్దు

- స్టేట్ ఆర్కైవ్స్ ఉద్యోగితో కలిసి నకిలీ పత్రాలు సృష్టి
- వీటి ఆధారంగా రాయదుర్గంలో ఖరీదైన భూమి కబ్జా
- కేసు నమోదు చేసి ఈ నెల 17న అరెస్టు చేసిన పోలీసులు
- మరుసటి రోజే బెయిల్, రద్దు చేయాలని పోలీసుల పిటిషన్
- ఆమోదించిన న్యాయస్థానం, మళ్లీ జైలుకు వెళ్లిన నిర్మాత



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ శివార్లలోని రెండు ప్రాంతాల్లో ఉన్న ఖరీదైన భూములపై కన్నేసి, నకిలీ పత్రాలతో కబ్జా చేసే ప్రయత్నం చేసిన టాలీవుడ్ నిర్మాత, రియల్టర్ బూరుగుపల్లి శివరామకృష్ణ కేసులో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. అరెస్టు అయిన మరుసటి రోజే బెయిల్‌పై బయటకు వచ్చిన ఈయన గురువారం మళ్లీ కటకటాల్లోకి వెళ్లారు. బెయిల్ రద్దు చేయడంతో పట్టుకున్న ఉస్మానియా యూనివర్శిటీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శివరామకృష్ణతో పాటు బెయిల్ పొందిన మరో నిందితుడు లింగమయ్య ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారు. శివరామకృష్ణ శ్రీవెంకటేశ్వర ఎస్టేట్స్ సంస్థకు మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. రాయదుర్గం పైగా విలేజ్‌లోని సర్వే నం.46లో ఉన్న 83 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు యాచారంలోని మరో 10 ఎకరాల ప్రైవేట్ భూమిపై కన్నేశారు. వీటిపై నకిలీ పత్రాలు సృష్టించిన శివరామకృష్ణ తార్నాకలో ఉన్న స్టేట్ ఆర్కైవ్స్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.చంద్రశేఖర్‌ను సంప్రదించారు. అతడి సహాయంతో వీటికి మద్దతుగా స్టేట్ ఆర్కైవ్స్ నుంచి ఓ నకిలీ పహాణీ, సేత్వార్ రూపొందించి, అటెస్టేషన్ చేయించి తీసుకున్నారు. వీటి ఆధారంగా సైదాబాద్‌కు చెందిన రియల్టర్ ఎం.లింగమయ్యతో కలిసి రంగంలోకి దిగిన శివరామకృష్ణ రాయదుర్గంలోని భూమి తనదే అంటూ అందులో పాగా వేశారు. యాచారంలో ఉన్న ప్రైవేట్ భూమి మీద వివాదం సృష్టించారు. శివరామకృష్ణ సమర్పించినవి నకిలీ పత్రాలని తేల్చిన న్యాయస్థానం అది ప్రభుత్వ భూమిగా ప్రకటించింది. దీనిపై నమోదైన కేసును దర్యాప్తు చేసిన ఉస్మానియా యూనివర్శిటీ పోలీసులు ఈ నెల 17న శివరామకృష్ణ, చంద్రశేఖర్, లింగమయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే అనారోగ్య కారణాలు చూపిన శివరామకృష్ణ, లింగమయ్య ఆ మరుసటి రోజే బెయిల్ పొందారు. వీటిని రద్దు చేయాలని కోరుతూ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఇరువురికీ మంజూరు చేసిన బెయిల్ రద్దు చేసింది. దీంతో గురువారం శివరామకృష్ణను పట్టుకున్న పోలీసులు వైద్య పరీక్షల అనంతరం జైలుకు తరలించారు. స్టేట్ ఆర్కైవ్స్ ఉద్యోగి చంద్రశేఖర్ ఇప్పటికీ జైల్లోనే రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే కారుకు సైరన్ తొలగింపు

ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా


ఎమ్మెల్యే వాహనానికి సైరన్‌ను తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్‌ఐ గోపి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గురువారం రోడ్డునెంబర్-17లోని బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్‌ఐ టి.గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో అనధికారికంగా తమ వాహనాలకు ఏర్పాటు చేసుకున్న 25 సైరన్‌లను తొలగించారు. అదే విధంగా మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి వాహనానికి కూడా నిబంధనలకు విరుద్ధంగా సైరన్ ఏర్పాటు చేయగా దానిని తొలగించి రూ.1000 జరిమానా విధించారు. ఎంవీ యాక్ట్ ప్రకారం వాహనాలకు సైరన్లు బిగించరాదని పోలీసులు తెలిపారు. సైరన్లు ఏర్పాటు చేసుకుంటే రూ.1000 జరిమానా విధిస్తామన్నారు.

కొత్త సీవరేజీ పైపులైన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి


పాతబస్తీలో పనులు పరిశీలిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: సీవరేజీ పైపులైన్ అలైన్‌మెంట్ సరిగా లేని చోట కొత్త పైపు లైన్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. సీవరేజీ ఓవర్ ఫ్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం పాత బస్తీ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ముసారంబాగ్‌లో మురుగు సమస్యలు మళ్లీ రాకుండా..ఎప్పటికప్పుడు డీ-సిల్టింగ్ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం యాకత్‌పురాలోని మౌలానా చిల్లా ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు విస్తరణ, నాలా నిర్మిస్తున్న సమయంలో పూడిక పెరిగి. కొన్ని రోజుల నుంచి మురుగు రోడ్లపైకి ప్రవహించడాన్ని గుర్తించారు. మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి కొత్త సీవరేజీ పైపు లైన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తక్షణ చర్యగా డీ-సిల్టింగ్ పనులు చేయాలని చెప్పారు. తర్వాత సీతాఫల్‌మండిలోని మహ్మద్ గూడ ప్రాంతంలో పర్యటించి కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, సీజీఎం నాగేందర్, జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమ పేరుతో యువతిని నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి యం.వాణి తీర్పు చెప్పారు. దీనికి సంబంధించి కోర్టు ఏపీపీ మంజులా దేవి తెలిపిన మేరకు...మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కాశీ విశ్వనాథ్ (29) అదే గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. రెండేళ్ల అనంతరం పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు గురువారం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. అలాగే బాధితురాలికి రూ.3 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

'హాక్ 2.0'కు కసరత్తు!

- వచ్చే నెల 6న నిర్వహించాలని నిర్ణయం
- ముఖ్య అతిథిగా ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు
- నిర్ణయించిన హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచడానికి, ప్రతి ఒక్కరినీ సైబర్ వారియర్స్‌గా తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్స్‌ను మరోసారి నిర్వహించాలని సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ నిర్ణయించారు. గత ఏడాది ఆయన నగర పోలీసు కమిషనర్‌గా ఉండగా తొలి హాక్-2023 సమ్మిట్ నిర్వహించారు. తాజాగా మరోసారి హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్-2024కు (హాక్ 2.0) సన్నాహాలు చేస్తున్నారు. నగర పోలీసు విభాగం, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) సంయుక్తంగా నిర్వహించే ఈ సమ్మిట్ వచ్చే నెల 6న నగరంలోని ది పార్క్ హోటల్‌లో జరుగనుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రతి ఏడాదీ ఇలాంటి సమ్మిట్స్ నిర్వహించాలని, సైబర్‌తో పాటు ట్రాఫిక్, నార్కోటిక్స్, ఉమెన్ సేఫ్టీ విభాగాలకు వీటిని విస్తరించాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గతంలోనే నిర్ణయించారు. యువత... ప్రధానంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న చేపట్టబోయే సైబర్ సమ్మిట్‌లో కొన్ని విద్యా సంస్థలకు చెందిన సైబర్ స్క్వాడ్స్‌ను ఆవిష్కరించే అవకాశం ఉంది. వీళ్లు వారి పాఠశాలల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తారు. ఎప్పటికప్పుడు కొత్త ముప్పులు పుట్టుకువస్తున్న ఈ తరుణంలో ప్రతి ఒక్కరికీ సైబర్ సెక్యూరిటీ అన్నది అత్యంత కీలకాంశంగా మారింది. దీనికోసమే సిటీ పోలీసులు, హెచ్‌సీఎస్సీ కలిసి పని చేస్తూ ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నాయి.

సబ్ స్టేషన్ల నిర్మాణంలో కొత్త టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

ఉప ముఖ్యమంత్రిని కోరిన కాంట్రాక్టర్స్ అసోసియేషన్



సాక్షి, సిటీబ్యూరో: టీజీ ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రెసిడెంట్ పారునంది భాస్కర్ నేతృత్వంలో గురువారం ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. 200 సబ్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి అమలులోకి తీసుకురానున్న కొత్త టెండర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందించారు. పాత విధానాన్ని కొనసాగిస్తూ, టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలో రిజిస్టర్ అయిన కాంట్రాక్టర్లకు మాత్రమే టెండర్ల ద్వారా అవకాశం ఇవ్వాలని కోరారు. ప్యాకేజీ రూపంలో బడా కాంట్రాక్టర్లకు ఇవ్వద్దని కోరారు. ఇలా చేస్తే ప్రభుత్వంతో పాటు డిస్కమ్‌లకు భారీ నష్టం వస్తుందని మంత్రికి వివరించారు. నిరుద్యోగులైన డిప్లొమా హోల్డర్లు, ఇంజినీర్లు కాంట్రాక్టు లైసెన్స్ తీసుకొని రెండు మూడు దశాబ్దాలుగా విద్యుత్ శాఖను నమ్ముకొని జీవిస్తున్నారని, అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరాలో కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పోలీసులపై దాడి..ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: పీకలదాకా మద్యం సేవించి అర్ధరాత్రి రోడ్లపై ఆవారాగా తిరుగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులను 'రోడ్లపై ఎందుకు ఉన్నారు..ఇంట్లోకి వెళ్లండని' హితవు పలికినందుకు పోలీసులను చితకబాదిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..శ్రీనగర్‌కాలనీ గణపతి కాంప్లెక్స్ సమీపంలోని శాలివాహననగర్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో రాజు, శేఖర్ అనే బ్లూ కోల్ట్స్ పోలీసులు విధి నిర్వహణలో తిరుగుతున్నారు. అదే సమయంలో శాలివాహననగర్‌లో నివసించే కార్తీక్, అశోక్ అనే ఇద్దరు అన్నదమ్ములతో పాటు మోహన్ అనే వీరి స్నేహితుడు ముగ్గురూ మద్యం మత్తులో ఊగిపోతూ రోడ్లపై తిరుగుతున్నారు. ఇంట్లోకి వెళ్లండి..ఇంత రాత్రివేళ రోడ్లపై ఏమి చేస్తున్నారంటూ పోలీసులు వారికి చెప్పారు. వెళతాంలే..మీరు మాకు చెప్పాల్సిన అవసరం లేదు..అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. అయినా సరే ఎంతో విజ్ఞతతో పోలీసులు వారి ముగ్గురిని ఇళ్లకు పంపించేందుకు ప్రయత్నిస్తుండగా ముగ్గురూ కలిసి పోలీసులపై దాడి చేసి చితకబాదారు. అరగంట పాటు రోడ్డుపై న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇందులో అశోక్, మోహన్‌లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తుండగా, కార్తీక్ డీజే ప్లేయర్‌గా పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేడ్ 4 ఆస్టియో ఆర్థరైటిస్‌కు ఎపియోన్‌లో చికిత్స...

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం అనేక మందిని వేధిస్తోన్న ఆర్థరైటిస్‌లో గ్రేడ్ 4కు సూపర్ పిఆర్‌పి చికిత్సను తాము అందిస్తున్నామని నగరానికి చెందిన ప్రముఖ చికిత్సా కేంద్రం ఎపియోన్ పెయిన్ మేనేజ్మెంట్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. ప్లాస్మాథెరపీ వ్యవస్థాపకులు డా.సుధీర్‌దారా మోకాలి కీళ్ల నొప్పి గ్రేడ్ 4 ఆర్థరైటిస్‌కు చికిత్స అందించేందుకు సూపర్ పిఆర్‌పిని పరిచయం చేశారని, సాధారణ పిఆర్‌పితో పోలిస్తే దీనిలో 25రెట్లు అధికంగా గ్రోత్ ఫ్యాక్టర్లు ఉంటాయని వివరించారు. అంతేకాకుండా వేగంగా నయం అయేందుకు వీలుగా యాక్టివేటర్లు కూడా ఉంటాయని తెలియజేశారు. గ్రేడ్ 4 ఆస్టియో ఆర్థరైటిస్ చికిత్సలో గొప్ప ఫలితాలు అందిస్తున్న ఈ సూపర్ పిఆర్‌పి...కేవలం ఎపియోన్‌లో మాత్రమే లభ్యమన్నారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు


యువకున్ని స్తంభానికి కట్టేసిన స్థానికులు

రాజేంద్రనగర్: స్కూల్ నుండి ఇంటికి సైకిల్‌పై వస్తున్న బాలుడిని భయభ్రాంతులకు గురిచేసి సైకిల్‌పై బలవంతంగా తీసుకెళ్తుండగా..బాలుడు అరవడంతో స్థానికులు గమనించి పట్టుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...ఎర్రబోడ ప్రాంతానికి చెందిన మైనర్ బాలుడు స్థానిక పాఠశాలలో చదువుతున్నాడు. గురువారం సాయంత్రం పాఠశాల నుండి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా జనప్రియ వద్దకు రాగానే ఓ 25 ఏళ్ల యువకుడు అడ్డగించాడు. సైకిల్ ముందు భాగంలో కూర్చోవాలని, తాను సైకిల్ నడిపిస్తానంటూ బాలుడిపై ఒత్తిడి చేశారు. బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆ బాలుడు రక్షించాలని కేకలు వేయడంతో స్థానిక యువకులు గమనించి..యువకుడిని పట్టుకొని స్తంభానికి కట్టివేశారు. అనంతరం రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో ఉన్నాడని, సంఘటనపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సుస్మితకు 'డా. సరోజినీ నాయుడు జాతీయ అవార్డు'



సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అందించే 'డాక్టర్ సరోజినీ నాయుడు ఇంటర్నేషనల్ అవార్డ్ ఫర్ వర్కింగ్ ఉమెన్'ను నగరానికి చెందిన సుస్మిత అందుకున్నారు. ప్రస్తుతం అమెరికాలోని టెక్సాస్‌లో నివసిస్తున్న సుస్మిత భారత్‌లో బాల కార్మికులకు విద్యను అందించడం, బాలల వేధింపులకు వ్యతిరేకంగా పోరాడడం, మహిళా సాధికారతను ప్రోత్సహించడంలో విశేషంగా కృషి చేస్తున్నారు. సామాజిక కార్యకర్తగా, విద్యావేత్తగా, పర్యావరణవేత్తగా ఆమె చేసిన కృషికిగానూ ఏఏఎఫ్‌టీ విశ్వవిద్యాలయం సహకారంతో, ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ, ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఫిల్మ్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందించారు. నోయిడా వేదికగా అందించిన ఈ అవార్డును తెలంగాణాతో పాటు దక్షిణాదిలో ఒకరిగా సుస్మిత అందుకున్నారు.

బై బ్యాక్ బురిడీ!

- కష్టమర్లను ముంచిన నిర్మాణ సంస్థ
- అధిక వడ్డీ పేరుతో పెట్టుబడుల సేకరణ
- 120 మంది నుంచి రూ.24 కోట్లు వసూలు
- నలుగుర్ని అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రీలాంచ్, సాఫ్ట్ లాంచ్ పేర్లతో స్థిరాస్తి కొనుగోలుదారులు, పెట్టుబడిదారులను మోసం చేస్తున్న రియల్టీ సంస్థలు..తాజాగా బై బ్యాక్ స్కీమ్‌కు తెరలేపారు. ముందస్తుగా కొంత మేర కంపెనీలో డిపాజిట్ చేస్తే ప్రతీ నెలా అధికంగా వడ్డీ చెల్లించడంతో పాటు కొంత స్థలం లీజు డీడ్ చేసిస్తామని మోసం చేయడం ఈ స్కీమ్ స్కామ్. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 120 మంది బాధితుల నుంచి రూ.24 కోట్లు వసూలు చేసి, బిచాణా ఎత్తేసిన స్క్వేర్స్ అండ్ యార్డ్స్ ఇన్‌ఫ్రా, యాడ్ అవెన్యూస్ కంపెనీలకు చెందిన నలుగురు ప్రతినిధులను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. డీసీపీ కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..

◆ ఏపీలోని చిలకలూరిపేటకు చెందిన బైర చంద్రశేఖర్, విజయవాడకు చెందిన వేములపల్లి జాన్సీ, రెడ్డిపల్లి కృష్ణ చైతన్య, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంకు చెందిన గరిమెళ్ల వెంకట అఖిల్ నలుగురు కలిసి డైరెక్టర్లుగా పేర్కొంటూ కూకట్‌పల్లిలోని మంజీరా ట్రినిటీ మాల్‌లో స్క్వేర్స్ అండ్ యార్డ్స్ ఇన్‌ఫ్రా, యాడ్ అవెన్యూస్ పేర్లతో రెండు స్థిరాస్తి సంస్థలను ఏర్పాటు చేశారు. నెలకు అధిక వడ్డీ చెల్లిస్తామంటూ కస్టమర్లకు, పెట్టుబడిదారులకు ఆశ పెట్టారు. రూ.17 లక్షలు డిపాజిట్ చేస్తే వంద నెలల పాటు ప్రతీ నెలా రూ.20 వేల వడ్డీ చెల్లిస్తామని, అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలోని తిరుమలగిరిలో 267 గజాల వ్యవసాయ భూమిని రిజిస్టర్ చేసి ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ భూమిలో శాండల్‌వుడ్ చెట్లను పెంచుతామని, 13-15 ఏళ్ల తర్వాత ఈ చెట్లను విక్రయించగా వచ్చిన సొమ్ములో 50 శాతం లాభాలను కూడా అందిస్తామని ఆశ పెట్టారు.

◆ బాధితులను నమ్మించేందుకు లీజు డీడ్ మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ), చెక్‌లను అందించారు. కొన్ని నెలల పాటు వడ్డీ చెల్లించి, ఆ తర్వాత చెల్లించడం మానేశారు. వడ్డీలు చెల్లించకపోవడంతో కస్టమర్లు ఆఫీసుకు రావడం మొదలుపెట్టారు. దీంతో నిందితులు కూకట్‌పల్లి నుంచి జూబ్లీహిల్స్‌కు కార్యాలయాన్ని మార్చి, తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఎట్టకేలకు కార్యాలయ జాడను బాధితులు పట్టేయడం, చెల్లించిన సొమ్ము తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేయడంతో నిందితులు రాత్రికి రాత్రే ఆఫీసుకు తాళం వేసి పరారయ్యారు. దీంతో కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన అల్లం నాగరాజు ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ ఠాణాలో తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 కింద కేసులు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలతో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

లక్ష మందికి సంతాన భాగ్యం

15 ఏళ్లలో ఘనత సాధించామన్న 'ఒయాసిస్' నిర్వాహకులు

సాక్షి, సిటీబ్యూరో: గత 15 ఏళ్లుగా దాదాపు లక్ష మందికి సంతాన భాగ్యం కలిగించామని ఒయాసిస్ ఫర్టిలిటీ సెంటర్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ డాక్టర్ దుర్గారావు అన్నారు. ఇది తమ సంస్థ సాధించిన గొప్ప మైలురాయి అని, ఈ కీలక ఘట్టాన్ని చేరుకోవడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ..దేశంలో సంతానలేమి సమస్య చాపకింద నీరులా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో ఫర్టిలిటీ రేటు 2.01గా ఉందని, అదే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 1.8 మాత్రమే ఉందని, ఇది కాస్త ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ప్రతి నాలుగు జంటల్లో ఒక జంట సంతానలేమి సమస్యతో బాధపడుతోందని వివరించారు. నగరాలు, పట్టణాల్లో సంతానలేమి సమస్య మరింత తీవ్రతమరం అవుతోందని పేర్కొన్నారు. ఇందుకు జీవన శైలి, ఆహారపు అలవాట్లే ప్రధాన కారణమని వివరించారు. సంతానం గురించి ఆందోళన చెందుతూ తమ వద్దకు వచ్చిన ఎంతో మంది దంపతులకు తాము భరోసా కల్పించి, దాదాపు లక్ష మంది ఇళ్లల్లో సంతోషాలు నింపామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ గాదెల, చీఫ్‌ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పుష్కరరాజ్ షెనాయ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా చేస్తే సహించం

మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్


మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్

పంజగుట్ట: ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా చేస్తే సహించేది లేదని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా అవమానం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ దళిత సంఘాల నాయకులతో కలిసి మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్దే నిరసన వ్యక్తం చేస్తారని తెలిపారు. గత 13 సంవత్సరాలుగా ప్రభుత్వానికి సంబంధం లేకుండా నిర్విరామంగా ప్రతీ రోజు విగ్రహం ప్రాంగణంలో శుభ్రం చేసి మహనీయునికి పూలమాల వేస్తున్న ఏకైక విగ్రహం అంబేడ్కర్ విగ్రహం అన్నారు. విగ్రహం వెనకవైపు అభివృద్ధి చేస్తే తాము వ్యతిరేకం చెప్పమని అవసరమైతే కూలీలుగా మారి శ్రమదానం చేస్తామని, కానీ విగ్రహం కనిపించకుండా చుట్టూ గోడ నిర్మిస్తే సహించేది లేదన్నారు. విగ్రహం వెనకవైపు సుందరీకరణ చేసి దానికి అంబేడ్కర్ ప్రాంగణంగా పేరుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దాసరి విశాల్, ఉమాకాంత్‌రావు, నర్సింహ్మయ్య, నవీన్, సత్యనారాయణ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో కొనసాగుతున్న నిరసన


నిరసనకు దిగిన ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఏఎఫ్ఏయూ) కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు గురువారం మధ్యాహ్నం 1 నుంచి 1.30 వరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనకు దిగారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు విశ్వవిద్యాలయంలోని పరిపాలనా భవనం ఎదుట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ పల్లవీకాబ్డే, కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ మహేష్‌గౌడ్, జేఏసీ నేతలు యాకేష్ దైద, కాంతం ప్రేంకుమార్, రవీంద్రనాథ్ సోలమన్, డాక్టర్ ఎల్‌వీకే రెడ్డి, ఎండీ హబీబుద్దీన్, రజనీకాంత్, షబ్బీర్, రాములు, నారాయణరావు, రుషేంద్రమణి, అవినాష్, కిషోర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'ఎంయూఎన్ 1.0' సదస్సు

సదస్సులో 250 మందికిపైగా పాల్గొన్న విద్యార్థులు



ఎంయూఎన్ 1.0 సదస్సులో విద్యార్థులు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మొట్టమొదటి ఐక్యరాజ్య సమితి నమూనా ఎంయూఎన్ 1.0 సదస్సును విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యాలను పెంపొందించడం, ప్రపంచ సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు కొనసాగింది. దీనికి జంట నగరాల్లోని వలు పాఠశాలల నుంచి 250 మందికి పైగా 8 నుంచి 12 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైబర్ ఉగ్రవాదం, అంతర్జాతీయ శాంతి భద్రతలపై సైబర్ క్రైమ్ ప్రభావం, ట్రిపుల్ ప్లానెటరీ సంక్షోభాన్ని ఎదుర్కోవడం, సాంస్కృతిక వారసత్వం, విద్యా వ్యవస్థలకు రక్షణ కల్పించడం, మహిళల భద్రత, లాటిన్ అమెరికన్ డ్రగ్ ట్రాఫికింగ్, స్పేస్ మిలటరైజేషన్, ప్రపంచ భద్రత వంటి ఎన్నో అంతర్జాతీయ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ భావితరం నాయకులను తయారు చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఎంయూఎన్ విద్యార్థులకు ప్రపంచ సమస్యల గురించి విమర్శనాత్మకంగా ఆలోచించడానికి, పరిష్కారాల కోసం ఈ వేదిక మంచి అవకాశమన్నారు. డైరెక్టర్ వరలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందజేశారు.

రక్తదానంతో ప్రాణదాతలుకండి

ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండెంట్

వెంగళరావునగర్ : రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడటానికి వీలు కలుగుతుందన్నారు. కేవలం యూనిఫారం వేసుకుని ప్రజలకు సేవలందించడం మాత్రమే కాకుండా ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల ఎన్నో కుటుంబాలకు దీపాన్ని వెలిగించవచ్చని సూచించారు. రక్తహీనత వల్ల ప్రతి ఏడాది వేలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, అలాంటి వారికి చేయూతనందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. తొలుత రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రక్తదానాన్ని చేసిన వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ చంద్రశేఖర్, రవిచంద్ర, రాంబాబు, కెవీవీ ప్రసాద్, అప్పారాయ్, ఆర్‌ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, రాజేష్, శ్యాం, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయి జాబ్ కేలెండర్ విడుదల చేయాలి

లిబర్టీ: ప్రభుత్వం ప్రకటించిన విధంగా జాబ్ కేలెండర్ పూర్తిస్థాయిలో విడుదల చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. ఉన్నత చదువులు చదివి విద్యావంతులైన నిరుద్యోగులు జాబ్ కేలెండర్ అమలు కోసం ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గురువారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. లక్షలాది మంది ఉన్నత చదువులు చదివి గ్రూప్–2,3,4 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రెండు లక్షల పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా పోస్టులను భర్తీ చేయాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నట్లుగానే దశల వారీగా నోటిఫికేషన్లు ఇచ్చి ఎలాంటి అవరోధాలు లేకుండా సంపూర్ణంగా జాబ్ కేలెండర్ అమలు చేస్తే యువత ప్రభుత్వం పక్షాన ఉంటుందని కుమారస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలున్నారు.

10 నెలలు.. 100 ఫిర్యాదులు..!

షేక్‌పేట మండల పరిధిలో ఎక్కువగా కబ్జాలపై ఫిర్యాదులు
శాఖలవారీగా దరఖాస్తులను వేరుచేస్తున్న అధికారులు
అక్రమార్కులపై చర్యలు తీసుకుంటున్నాం : తహసీల్దార్


ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేస్తున్న ప్రజలు

బంజారాహిల్స్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ఏర్పాటు చేసిన ప్రజావాణికి ఫిర్యాదులు పెద్దసంఖ్యలో వస్తున్నాయి. గత యేడాది డిసెంబర్ 1వ తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ 10 నెలల కాలంలో ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాభవన్‌లో షేక్‌పేట మండల పరిధిలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ 100 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎక్కువగా ప్రభుత్వ స్థలాలు కబ్జా అవుతున్నాయని, వాటిని కూల్చివేయాలని వచ్చినవే అధికంగా ఉన్నాయి. తమ ఆస్పత్రి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి కింద డబ్బులు మంజూరు చేయాలంటూ 25 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ స్థలం కబ్జా అవుతుందంటూ ఒకరు..భూదాన్ ల్యాండ్ కబ్జాకు గురవుతుందంటూ మరొకరు..దరఖాస్తు చేశారు. రోడ్డుపక్కన ఆక్రమణలు తొలగించాలంటూ ప్రియాన్షు అగర్వాల్ ఫిర్యాదు చేశారు. జీఓ 59 కింద తాను దరఖాస్తు చేసుకున్నానని, అయితే క్రమబద్ధీకరణ కాలేదని, తాను చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ మీనాక్షి అనే మహిళ ఫిర్యాదు చేశారు. దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలంటూ రమేష్‌నాయుడు, వితంతు పింఛన్ మంజూరు చేయాలంటూ జీ.రామలక్ష్మిలు దరఖాస్తు చేసుకున్నారు. శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతుందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. స్థలాలకు సంబంధించిన సమస్యలపై కొందరు దరఖాస్తు చేసుకోగా, వీధివ్యాపారులు తమకు న్యాయం చేయాలంటూ 20 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. 32 ఎకరాల స్థలం కబ్జాకు గురవుతుందని, దీని విలువ రూ.15 వేల కోట్లు ఉంటుందని, బోగస్ డాక్యుమెంట్లతో ఆక్రమించారని ఓ వ్యక్తి ఆ వివరాలతో కూడిన ఫిర్యాదును అందజేశారు. అలాగే వికలాంగుల స్థలాన్ని కబ్జా చేశారంటూ న్యాయం చేయాలంటూ మరో వ్యక్తి ఫిర్యాదు చేసుకున్నారు. షేక్‌పేట మండలానికి వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సీఎంఆర్ఎఫ్, కార్మికశాఖ తదితర సమస్యలు ఉండగా దేనికవే శాఖల వారీగా వేరు చేసి అందజేస్తున్నట్లు షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డి తెలిపారు. స్థలాలు కబ్జాకు గురవు తున్నాయంటూ ఫిర్యాదులు రాగానే తాము వెంటనే వాటిని కూల్చివేస్తున్నామని వెల్లడించారు. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల కోసం చేసుకున్న దరఖాస్తులను విచారించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని, కొత్త పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిన వెంటనే వీరికి అర్హత ఉంటేనే లబ్ధిదారులు అవుతారని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులకు పంపుతున్నామన్నారు. వీధి వ్యాపారులకు సంబంధించిన సమస్యలను జీహెచ్ఎంసీకి పంపుతున్నామని వెల్లడించారు. ఈ దరఖాస్తులు వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కార్పొరేటర్‌కు వినతి



శ్రీనగర్‌కాలనీ: రహమత్‌నగర్ డివిజన్ జంక్షన్‌ను మరింత సుందరీకరణ, ట్రాఫిక్ నియంత్రణకు ఏఏ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి స్థానిక నేతలు, చిరు వ్యాపారులతో గురువారం చర్చించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల్లో ఎవరికీ ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని చిరు వ్యాపారులు సీఎన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ కోసం సమష్టిగా పోరాడాలి


మాట్లాడుతున్న చిట్యాల ఆనంద్

శ్రీనగర్‌కాలనీ: ఎస్సీల్లో ఏబీసీడీ వర్గీకరణ కోసం సమష్టిగా పోరాడాలని నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ఇంచార్జి చిట్యాల ఆనంద్ కోరారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ నేతల సమావేశం రహమత్‌నగర్ డివిజన్‌లోని కమలానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు తెలంగాణా అసెంబ్లీ తీర్మానాన్ని కాలయాపన చేయకుండా త్వరగా చేపట్టాలని కోరారు. అదే విధంగా వర్గీకరణ జరిగే వరకు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నేతలు రామకృష్ణ మాదిగ, యాదయ్య, హనుమంతు, రామకృష్ణ, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మళ్లించి రూ.30 వేలు చోరీ

వెంగళరావునగర్: దృష్టి మళ్ళించి నగదు చోరీ చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన ఖురేష్ ఓ షాపును నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీ రాత్రి ఇద్దరు వ్యక్తులు ఖురేష్ షాపునకు సరకులు కొనుగోలు చేయడం కోసం వచ్చారు. అదే సమయంలో మరో వ్యక్తి అక్కడకు రావడంతో ఖరేష్ అతడితో మాట్లాడుతున్న సమయంలో ఆ ఇద్దరు వ్యక్తులు ఐదు నిముషాల్లో మళ్లీ వస్తామని చెప్పి అక్కడ నుంచి వెళ్ళిపోయారు. అనంతరం ఖురేష్ తన క్యాష్ కౌంటర్‌ను చెక్ చేసుకోగా రూ.30 వేల నగదు కనిపించలేదు. వెంటనే ఆ ఇద్దరు వ్యక్తుల కోసం వెతకగా వారి జాడ కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనుల వివరాలు తెలపండి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఏమేమి చేపట్టాలో తమ దృష్టికి తీసుకువస్తే వాటికి నిధులు మంజూరు చేయిస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారని, ఈ కమిటీల్లో మహిళా సమాఖ్యల సభ్యులు ఉన్నారని, వారితో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు అందజేస్తామని అధికారులు తెలిపారు. పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని ఆయన పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా అమ్మ ఆదర్శ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా పాఠశాలల్లో పెండింగ్ పనులు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలను తనకు తెలియజేయాలన్నారు.

అక్రమ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని జహీరానగర్ చౌరస్తా, ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ చౌరస్తాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ప్రైవేటు హాస్టళ్లు కొనసాగుతున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులను కోరారు. హాస్టళ్లలో వందల మందికి పైగా వసతి పొందుతుండడంతో మంచినీటి వినియోగంతో పాటు డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చుతోందన్నారు. కొన్ని ఆస్పత్రులకు సంబంధించిన నర్సులు ఈ బిల్డింగ్స్‌లో ఉంటున్నారని తనకు ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఈ హాస్టళ్ల వల్ల డ్రైనేజీ, పారిశుధ్య, మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ బిల్డింగ్‌లకు నీటి సరఫరాను నిలిపివేశామని, ట్యాంకర్లను కూడా పంపించడం లేదని జలమండలి జీఎం హరిశంకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

లింక్ క్లిక్ చేస్తే ఓటీఎస్ బకాయి వివరాలు

జలమండలి జీఎం హరిశంకర్

బంజారాహిల్స్: మంచినీటి బకాయిలు పడ్డ వినియోగదారులకు ఒకేసారి బకాయిలు చెల్లించడం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు జలమండలి వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్ తెలిపారు. దళారీ వ్యవస్థకు అవకాశం ఇవ్వకుండా ఆన్‌లైన్ సిస్టం ద్వారా ఓటీఎస్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దీని ద్వారా నల్లా బకాయిలు ఉన్న వినియోగదారుడికి నేరుగా లింక్ వెళుతుందని ఆయన తెలిపారు. ఆ లింక్ క్లిక్ చేయగానే ఓటీఎస్‌కు సంబంధించిన బకాయిల వివరాలతోపాటు, ఎంత మొత్తం చెల్లించాలో పేమెంట్ లింక్ కూడా పొందుపర్చామన్నారు. ఆ పేమెంట్ లింక్‌పై క్లిక్ చేస్తే ఆటోమేటిక్‌గా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా డబ్బులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అఫిడవిట్ నమూనా కూడా ఇందులో పొందుపర్చడం జరిగిందన్నారు. అండర్ టేకింగ్ అవకాశాన్ని కూడా కల్పించామన్నారు. తమ పరిధిలో సుమారుగా మంచినీటి బకాయిదారులు 44 వేల మందికి పైగా ఉన్నారని, వీరంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బకాయిలు చెల్లించడంలో మధ్యవర్తులను నమ్మవద్దని, నేరుగా వినియోగదారుడే డబ్బులు చెల్లించుకోవాలని సూచించారు.

ఈషా హోమ్ స్కూల్‌పై ఆరోపణలు అవాస్తవం

విలేకరుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు


సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పంజగుట్ట: ఈషా హోమ్ స్కూల్‌పై గతంలో పనిచేసిన వలంటరీ టీచర్ ఆరోపణలు పూర్తి అవాస్తవమని, వాటిని పూర్తిగా ఖండిస్తున్నట్లు ఈషా హోమ్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు జే.రాధిక, వినోద్, పరిమళ, వి.రాధిక, వంశీలు మాట్లాడుతూ తమ పిల్లలు ఈషా హోం స్కూల్‌లో ఎంతో సురక్షితంగా ఆనందంగా ఉన్నారని అక్కడ పిల్లలకు శ్రద్ధగా చదువుతో పాటు, క్రీడలు, యోగా, మంచి సంస్కారం కూడా నేర్పుతున్నారని తెలిపారు. కాగా ఇటీవల దంపతులు వారి కుమారుడిపై 2019లో లైంగిక వేధింపులు జరిగాయని ఆరోపించారని, నిజంగా వేధింపులు జరిగితే 2022 వరకు అక్కడే ఎందుకు చదివించారని ప్రశ్నించారు. అంతే కాకుండా ఆరోపణలు చేసిన విద్యార్థి తల్లి అదే పాఠశాలలో 2022 నుంచి 2024 వరకు స్వచ్ఛందంగా వలంటరీ టీచర్‌గా ఎందుకు విధులు నిర్వహించారో చెప్పాలని తెలిపారు. పాఠశాల యాజమాన్యం ఆమెను 2024లో విధుల నుంచి తొలగించాక కక్షపూరితంగా ప్రెస్‌మీట్ పెట్టి ఈ ఆరోపణలు చేసిందన్నారు. ఆమె స్కూల్‌పై ఆరోపణలు చెయ్యడంతో తమను స్నేహితులు, బంధువులు స్కూల్‌పై వచ్చిన ఆరోపణల గూర్చి అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి సమస్య పరిష్కరించుకోవాలి కాని నిరాధార ఆరోపణలు చెయ్యకూడదని సూచించారు.

కాంగ్రెస్ పాలనలో పెరిగిన దాడులు

పంజగుట్ట: రాష్ట్రంలో కొంతకాలంగా ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగాయని రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన బీజేపీ పాలనను తలపిస్తుందని పలు ముస్లిం సంఘాల నేతలు ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సామాజికవేత్త సారా మాథ్యూస్, మహ్మద్ అబ్దుల్ అజీజ్, షకీల్, సయ్యద్ మాజీద్, కుమార్‌లు మాట్లాడుతూ మతతత్వ శక్తులను ఓడించాలనే దృఢ సంకల్పంతో ముస్లింలు అంతా ఐక్యమై కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముస్లింలపై దాడులు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వచ్చిన సంవత్సరంలోనే రాష్ట్రంలో 20 చిన్న, పెద్ద మతపరమైన ఘటనలు జరిగాయన్నారు. గత నెలరోజులుగా మొత్తం ముస్లిం సామాజిక వర్గంపై దాడులు చేస్తూ ఇప్పటి వరకు సుమారు రూ. 50 కోట్ల మేర ఆస్తిని నష్టం చేశారని తెలిపారు. ఇప్పటికైనా ముస్లిం కుటుంబాలపై దాడులు చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తాగి న్యూసెన్స్ చేయవద్దన్నందుకు దాడి

వెంగళరావునగర్: మద్యం తాగి న్యూసెన్స్ చేయవద్దన్నందుకు వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బీహార్‌కు చెందిన విజయ్‌సింగ్ గత కొన్నేళ్లుగా కూలీ పనులు చేసుకుంటూ రహమత్‌నగర్‌లో భార్యాపిల్లలతో ఉంటున్నాడు. ఇటీవల తన భార్య పిల్లలతో విజయవాడ పుట్టింటికి వెళ్ళింది. విజయ్‌సింగ్ అన్న రాంబాబు ఒక రూంను రాజు అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. రాజు తరచూ మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తుండగా విజయ్‌సింగ్ చాలాసార్లు అతనిని వారించాడు. దీనిని మనసులో పెట్టుకున్న రాజు తన స్నేహితుడు బాలేందర్‌ను తీసుకుని ఈనెల 23 రాత్రి విజయ్‌సింగ్ ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఒంటరిగా పడుకున్న విజయ్‌సింగ్‌పై దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


డివిజన్‌లో సిబ్బందితో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

కాచిగూడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ హైదరాబాద్‌కు సహకరించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి కోరారు. గురువారం జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి స్పెషల్ డ్రైవ్ ద్వారా మట్టి దిబ్బలను, చెత్తకుప్పలను తొలగింప చేశారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను జీవీపీ పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇళ్లలోని చెత్తను స్వచ్ఛ ఆటోలకు మాత్రమే అందివ్వాలని కోరారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పడేయొద్దని సూచించారు. జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, సూపర్‌వైజర్ తిరుపతి, ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, సతీష్, కామేష్, శ్రీధర్, అర్జున్, యాదగిరి, మధు, పూజ తదితరులు పాల్గొన్నారు.

వెలుగులకు నోచుకోని స్ట్రీట్ లైట్లు

ఫిర్యాదుపై నామమాత్రపు చర్యలు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీలో స్ట్రీట్ లైట్లు వెలుగులకు నోచుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల తాము ఈ విషయమై ఫిర్యాదు చేయగా వీధిదీపాలకు మరమ్మతులు చేశామంటూ సంబంధిత సిబ్బంది తాము ఇచ్చిన ఫిర్యాదును క్లోజ్ చేశారన్నారు. తీరా చూస్తే ఆ వీధి దీపాలకు మరమ్మతులే చేపట్టలేదని, దీంతో వెలగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు సిబ్బంది సమస్యలపై ఫిర్యాదులు చేస్తే తూతూమంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని, దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వ్యవహారంపై విచారణ జరపాలని బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై 5న మహాధర్నా

లిబర్టీ: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5వ తేదీన మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ బి.వెంకటేశం తెలిపారు. చలో హైదరాబాద్ పేరిట వేలాదిమంది ఆటో డ్రైవర్లతో మహాధర్నా నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. గురువారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ఆటో డ్రైవర్లు తరలివచ్చి డ్రైవర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు పదినెలలు అవుతున్న డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఏఒక్క సమస్యను పరిష్కరించలేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి ఆటో డ్రైవర్లకు రూ. 12 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి లేక ఆటోలు నడుపుకుంటున్న ఆటో డ్రైవర్లకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని కోరారు. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను విస్మరించడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని వెంకటేశం కోరారు.

తెగిన చేతిని అతికించిన యశోద వైద్యులు


పేషెంట్‌తో కలిసి వివరాలు వెల్లడిస్తున్న యశోద డాక్టర్ శ్రీనివాస్

మేడ్చల్: కంపెనీ పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చెయ్యి తెగిపడింది. వెంటనే వారు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి తెగిన చేతిని అతికించారు. మేడ్చల్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. యశోద ఆస్పత్రి డాక్టర్ జీఎస్ శ్రీనివాస్ చికిత్స వివరాలు వెల్లడించారు. శామీర్‌పేట్ మండలం తుర్కపల్లిలోని పరిశ్రమలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రామ్‌సేవక్ అనే కార్మికుడు గతనెల 24న పని చేస్తుండగా ప్రమాదవశాత్తు చెయ్యి తెగిపోయింది. దీంతో గంటలోపు కార్మికుడిని యశోద ఆస్పత్రికి తరలించగా డాక్టర్ జీఎస్ శ్రీనివాస్ తన బృందంతో కలిసి 12 గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేసి తెగిపడ్డ చేతిని అతికించారు. ఆపరేషన్ జరిగి నెల రోజులు పూర్తికావడంతో రామ్‌సేవక్ తన చేతిని సాధారణంగా వాడే స్థాయికి చేరాడు. ఇలాంటి ఆపరేషన్లు చాలా అరుదుగా జరుగుతాయని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. విరిగిన భాగాన్ని ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఐస్ మధ్యలో పెట్టి గంటలోపు ఆస్పత్రికి తీసుకురావడం వల్ల సర్జరీ విజయవంతం అయ్యిందని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తెగిపడ్డ అవయవాలను ఐస్ మధ్యలో ఉంచి సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రికి తరలిస్తే అతికించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు.

ఉర్దూ 'డీ-రిజర్వేషన్' ప్లీజ్!

బ్యాక్‌లాగ్ రిజర్వ్‌డ్ పోస్టులను ఓపెన్ కేటగిరికి మార్చండి

- తక్షణమే మెరిట్ రెండో జాబితా ప్రకటించాలి
- రెండు రోజులుగా గాంధీభవన్‌కు అభ్యర్థుల తాకిడి
- వైఎస్‌ఆర్ హయంలో బ్యాక్‌లాగ్ పోస్టులకు డీ-రిజర్వేషన్
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు, టీపీసీసీ నేతల హామీ
- డీఎస్సీ-2024 ఉర్దూ మెరిట్ అభ్యర్థుల ఆందోళన ఉధృతం


ఓపెన్ కేటగిరిలో భర్తీ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేస్తున్న మెరిట్ అభ్యర్థులు(ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ-2024 ఉర్దూ మీడియం బ్యాక్‌లాగ్ పోస్టులను డీ-రిజర్వేషన్ ద్వారా ఓపెన్ కేటగిరీ కింద భర్తీ చేయాలని డీఎస్సీ మెరిట్ అభ్యర్థులు ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. రిజర్వ్ కేటగిరీలో అర్హులైన అభ్యర్థులు లేక భర్తీ కానీ ఉర్దూ మీడియం పోస్టుల రిజర్వేషన్లను తొలగించి ఓపెన్ కేటగిరీ అభ్యర్థులతో మెరిట్ ఆధారిత నియామకాల ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. రెండు రోజులుగా గాంధీ భవన్‌కు తరలివచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ డిమాండ్‌ను వ్యక్తం చేస్తున్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాక్‌లాగ్ రిజర్వ్‌డ్ పోస్టులను డీ-రిజర్వేషన్ చేసి ఓపెన్ కేటగిరీలో భర్తీ చేసేందుకు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కూడా బ్యాక్‌లాగ్ పోస్టులను ఓపెన్ కేటగిరీ కింద భర్తీ చేసేందుకు అనుమతించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని మెరిట్ అభ్యర్థులు మంత్రులు, టీపీసీసీ నేతలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖలు రాశారు.

నగానికి పైగా బ్యాక్‌లాగ్

ఎప్పటి మాదిరిగా ఈసారి కూడా డీఎస్సీ ఉర్దూ మీడియం పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో సగానికి పైగా పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడిపోయాయి. డీఎస్సీ-2024లో ఉర్దూ మాధ్యమానికి 1,183 పోస్టులు కేటాయించినప్పటికీ ఎస్సీ, ఎస్టీ ఇతరత్రా రిజర్వేషన్ కేటగిరి కారణంగా అర్హులైన అభ్యర్థులు లేక సుమారు 666 పోస్టులు భర్తీకి నోచుకోనున్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవంగా ప్రభుత్వం డీఎస్సీలు నిర్వహిస్తున్నా.. ఉర్దూ మీడియం పాఠశాలల ఖాళీల భర్తీ మాత్రం పూర్తిస్థాయిలో జరగడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉర్దూ మీడియంలో రిజర్వేషన్ కేటగిరి పోస్టులకు అభ్యర్థులు అందుబాటులో లేక 50 శాతం కంటే ఎక్కువ పోస్టుల భర్తీ సమస్యగా తయారైంది. ఓపెన్ కేటగిరి మెరిట్ అభ్యర్థులకు మాత్రం రిజర్వేషన్ కేటగిరి శాపంగా మారింది. దీంతో టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో తమకు తీరని అన్యాయం జరుగుతోందని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా డ్రాప్‌అవుట్ రేటు పెరిగి ఉర్దూ మీడియం పాఠశాలలు మూతపడే స్థాయికి చేరుకుంటున్నట్లు ఆందోళన వ్యక్తమవుతోంది.

వైఎస్సార్ హయాంలో డీ-రిజర్వేషన్

వైఎస్సార్ ప్రభుత్వం డీఎస్సీ- 2006 ఉర్దూ మీడియంలోని బ్యాక్‌లాగ్ పోస్టులను డీ-రిజర్వ్ చేయడానికి 2008 ఫిబ్రవరి 12న జీవోఎంస్ నంబర్ 21 ద్వారా ఉత్తర్వులను జారీ చేసింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల కింద మహిళలకు కేటాయించిన పోస్టులను మాత్రం ఓపెన్ కేటగిరీకి కింద మహిళా అభ్యర్థులతోనే భర్తీ చేసే విధంగా సూచనలు చేసింది. దీంతో అప్పట్లో రిజర్వ్ పోస్టులను డీ-రిజర్వేషన్ ద్వారా ఓపెన్ కేటగిరికి వర్తింపజేశారు.

మెరిట్ రెండో జాబితా ప్రకటించాలి

డీఎస్సీ-24 బ్యాక్‌లాగ్ పోస్టులను డీ-రిజర్వేషన్ ద్వారా ఓపెన్ కేటగిరీ కింద మార్చేసి తక్షణమే రెండో మెరిట్ జాబితా ప్రకటించాలని ఉర్దూ ట్రైన్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. ప్రస్తుతం మిగిలిపోయిన పోస్టులన్నింటికీ మెరిట్ ఆధారిత నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.

నగరంలో నేడు

1. మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్ పేరిట మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
2. ఆరోరా డిజైన్ అకాడమీ ఆధ్వర్యంలో రూట్ అండ్ వింగ్స్ సెలబ్రేషన్స్ ఆఫ్ హెరిటేజ్ అండ్ ఐడెంటిటీపై బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని చిలిస్ రెస్టారెంట్ సమీపంలో ఉన్న ఆరోరాస్ క్యాంపస్‌లో ఇండోర్ వర్క్‌షాపు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఏజీ వర్సిటీని ప్రథమ స్థానానికి తీసుకెళ్తాం

- ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య


ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య అన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, ఉద్యోగులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 60 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం మన విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 37వ ర్యాంకులో ఉందని అన్నారు. కార్యక్రమంలో టాసా అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.విద్యాసాగర్, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అమృతరెడ్డి, విద్యార్థుల ప్రతినిధులు పూజ, బాలకోటి, పూర్వ విద్యార్థుల ప్రతినిధి కవిరాజ్, విశ్వవిద్యాలయం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చేనెల 24న భారీ బహిరంగ సభ

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునర్ సమీక్షించాలని, ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 24వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు మాల సామాజిక వర్గానికి చెందిన యువతీ యువకులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పలువురు కోరారు. బహిరంగ సభకు చెన్నూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ప్రత్యేక బాధ్యతలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్న మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టకుండా వర్గీకరణను నిలిపివేయాలని కోరారు.

వీసీకి విద్యార్థుల స్వాగతం


భారీ గజమాలతో స్వాగతం

ఏజీవర్సిటీ: వీసీగా ఆల్దాస్ జానయ్య బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో గురువారం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం నుంచి వీసీ భవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారీ గజమాలతో సన్మానించారు. జేఏసీ చైర్మన్ రాజ్‌కుమార్, ఏబిఎస్‌ఏ అధ్యక్షుడు మధుకర్, సిబ్బంది శంకర్, బాలకోటి, రాకేష్, బాబిత్ రాజ్‌గౌడ్, శేఖర్ పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామన్‌గౌడ్


నియామక పత్రాన్ని అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూరగౌని రామన్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రవీంద్ర భారతిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఈ నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. బీసీ కులగణన వెంటనే చేపట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి రామన్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కేంద్ర, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓలేటి పార్వతీశంకు భీమన్న పురస్కారం


ఓలేటి పార్వతీశంకు భీమన్న పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిత్యానందరావు, గౌరీశంకర్, హైమవతి భీమన్న తదితరులు

చిక్కడపల్లి: బోయి భీమన్న రచనలు జాతిని జాగృతం చేశాయని తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. భీమన్న సాహితీ నిధి, కళానిలయం సాంస్కృతిక సంస్థల సంయుక్తాధ్వర్యంలో మహాకవి బోయి భీమన్న జయంతిని గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. జాతిని జాగృతం చేసిన భీమన్న రచనలు సమాజానికి దర్పణాలన్నారు. సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశానికి భీమన్న పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు టి.గౌరీశంకర్, హైమవతి భీమన్న, గురజాడ శోభాపేరిందేవి, సుంకర సత్యనారాయణ, సురేందర్, సందీప్ పాల్గొన్నారు.

బడి స్థలాన్ని రక్షించి.. న్యాయం చేయండి


ప్రభుత్వ పాఠశాల స్థలం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

నాగోలు: బడి స్థలాన్ని రక్షించి, న్యాయం చేయాలని నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం భోజన విరామ సమయంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బండ్లగూడ ప్రభుత్వ పాఠశాల నుంచి గతంలో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో ప్రైవేట్ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడి పేదవిద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించి నిర్మాణాలు చేపట్టిన కబ్జాదారులు అక్రమంగా ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. నిరసన ర్యాలీలో బండ్లగూడ గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన యూఎస్‌ఏ బృందం


చిన్నారులతో యుఎస్‌ఏ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు

ఉప్పల్: నాచారం ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బిల్ అండ్ గేట్స్ ఫౌండేషన్ యుఎస్‌ఏ వాషింగ్టన్ ప్రతినిధి బృందం గురువారం తార్నాకలోని ఎన్‌ఐఎన్ న్యూట్రీషన్ డైరెక్టర్ మీటూ కపూర్‌తో కలిసి సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే న్యూట్రిషన్ డైట్‌ను పరిశీలించారు. అక్కడ చిన్నారుల ప్రతిభ, వారి యాక్టివిటీని పరిశీలించి అభినందించారు. చిన్నారులపై అంగన్‌వాడీ అధికారులు, టీచర్ స్వాతి తీసుకుంటున్న శ్రద్ధను వారు ప్రశంసించారు. చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందించి వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటు అందిస్తున్నందుకు యూఎస్‌ఏ ప్రతినిధి బృందం హర్షం వ్యక్తం చేశారు. న్యూట్రిషన్ ఆహార పదార్థాలు తీసుకున్న చిన్నారులు ఎంతో చలాకీగా ఉన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యూఎస్‌ఏ ప్రతినిధి బృందం సభ్యులు జోనాథర్ గోర్‌స్టెయిన్, రుచిక సచిదేవ, హెలెన్ ఒల్సెన్‌తో పాటు సునీతా కృష్ణన్(న్యూఢిల్లీ) పూజ, సైంటిస్టు ఎస్.అర్లప్ప, అల్వాల్ ప్రాజెక్ట్ సీడీపీవో స్వాతి, సూపర్‌వైజర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మూసీ నిర్వాసితులకు భరోసా!

- పరివాహక ప్రాంతాల్లో పోటాపోటీగా పర్యటనలు
- ఒక వైపు ఈటల, మరో వైపు అక్బరుద్దీన్ పర్యటన
- మరోవైపు కూల్చివేత పనుల కోసం టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నిర్వాసితులకు మేమున్నామంటూ భరోసా కల్పించేందుకు ప్రధాన రాజకీయ పక్షాలు పడరాని పాట్లు పడుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీలు మూసీ పరివాహక పరిధిలో సుడిగాలిలా పర్యటిస్తుండగా, తాజాగా మజ్లిస్ కూడా రంగంలోకి దిగింది. ఏకంగా మీ ఇళ్లకు మా రక్షణ అంటూ భరోసా కల్పిస్తోంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా కూల్చివేతల ప్రక్రియ తాత్కాలికంగా ఆగిన నివాసితులకన మాత్రం భయం వీడటం లేదు. మూసీ అంశాన్ని రాజకీయ అస్త్రంగా మార్చుకున్న ప్రధాన రాజకీయ పక్షాలు ఏకంగా ప్రత్యేక కార్యాచరణతో రంగంలో దిగాయి. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలతో కలిసి పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర నిర్వహిస్తూ బీజేపీ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తున్నారు. పాతబస్తీలోని మూసీ పరివాహక పరిధిలో మజ్లిస్ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పాదయాత్ర నిర్వహించి నివాసితులతో ముచ్చటిస్తూ భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. పక్షం రోజులుగా మూసీ పరివాహక పరిధిలో రాజకీయ నేతల పర్యటనలతో సందడిగా తయారైంది.

మూసారంబాగ్‌లో బీజేపీకి చేదు అనుభవం

మూసీ పరివాహక ప్రాంతాల్లో గురువారం పర్యటించిన బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డిలకు చేదు అనుభవం ఎదురైంది. మూసారంబాగ్‌లోని అంబేడ్కర్ కాలనీవాసులు ఏకంగా నిలదీసి పర్యటనపై అసహనం వ్యక్తం చేశారు.

కూల్చివేత కోసం టెండర్లు

మూసీ పరివాహక పరిధిలో నివాసాల కూల్చివేతకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే నదీ గర్భంలో ఖాళీ అయిన నివాసాలను కూల్చివేశారు. మరికొన్ని నివాసాలు కూల్చివేయాల్సి ఉంది. దీపావళి పండుగ తర్వాత మిగతా గృహాల కూల్చివేత ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే కొందరు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. అయితే కోర్టు వివాదాలు లేని నదీ గర్భంలోని గృహాలపైనే ముందుగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా కూల్చివేతకు సంబంధించి కాంట్రాక్టు పనులు ఏజెన్సీకి అప్పగించేందుకు టెండర్ ప్రక్రియ కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది.

సంస్కృత, ఆంధ్ర భాషా సాహిత్యాల్లో ఉద్దండుడు శేషేంద్ర

చిక్కడపల్లి: శేషేంద్ర శర్మ సంస్కృత ఆంధ్ర భాషా సాహిత్యాల్లో ఉద్దండ పండితులని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ అన్నారు. త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళా వేదికపై గురువారం గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ యాదిలో పేరిట సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ శేషేంద్ర శర్మ కవిత్వం ప్రగతి శీల సామ్యవాద శైలి అన్నారు. ఎవరికీ తలవంచని కవి, అందుకే ఆయనకు బిరుదులు, పురస్కారాలు దక్కలేదేమో అన్నారు. సముద్రం.. ఒకరి కాళ్ల ముందు నిలబడి మొరగదు అనే కవిత ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు జనార్దన మూర్తి, కళాభిమాని వి.వెంకటరావు, గానసభ సంయుక్తకార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.


శేషేంద్ర శర్మకు నివాళులర్పిస్తున్న ఆచార్య గౌరీశంకర్, జనార్దనమూర్తి తదితరులు

చదువుకు డబ్బుల్లేవు.. మూసీ సుందరీకరణకు ఎక్కడివి?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేతలు


కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో అభివాదం చేస్తున్న బీసీ నేతలు

కాచిగూడ: 12 లక్షల మంది విద్యార్థుల ఫీజులు చెల్లించడానికి రూ.4 వేల కోట్లు ఇవ్వడం లేదు. కానీ.. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్ల నిధులు ఎక్కడి నుంచి తెస్తారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన గురువారం కాచిగూడలో జరిగిన సమావేశంలో పలువురు బీసీ నేతలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పి.ధనుంజయ్‌ని బీసీ జేఏసీ నల్గొండ జిల్లా చైర్మన్‌గా నియమిస్తూ నియామకపు పత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో కమీషన్లు దండుకోవడానికి ఉన్న శ్రద్ధ, పిల్లల చదువుపై సంక్షేమానికి ఖర్చు చేయడంలో ఈ ప్రభుత్వానికి శ్రద్ధ లేదన్నారు. నవంబర్ మొదటి వారంలో బీసీ శ్రేణులను జాగృతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నామని తెలిపారు. రాష్ట్ర పాలన సంక్షోభంలో పడిందని, ఫీజు బకాయిలు ఇవ్వకపోవడంతో కాలేజీలు బంద్ చేస్తున్నారన్నారు. హాస్టళ్లలో గురుకులాల అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో గురుకులాలకు తాళాలు వేస్తున్నారని, ఇంత దారుణమైన అధ్వాన స్థితికి ఎప్పుడు దిగజారలేదన్నారు. ప్రభుత్వం విద్యపై పూర్తి నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నీలం వెంకటేష్, నందగోపాల్, అనంతయ్య, ఉదయ్, నరేందర్, వనమాల రమేష్, చాపల యాదయ్య, విజయ్ యాదవ్, గంజి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌టీఐని సందర్శించిన జమ్మూ కశ్మీర్ పాత్రికేయులు


ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ ప్రయోగశాలను సందర్శిస్తున్న బృందం

లక్డీకాపూల్: విద్యానగర్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్ఎస్‌టీఐ)ను జమ్మూ కశ్మీర్‌కు చెందిన పాత్రికేయులు గురువారం సందర్శించారు. పీఐబీ, శ్రీనగర్ డిప్యూటీ డైరెక్టర్ తారిక్ రాథర్ నేతృత్వంలోని ఈ బృందంలో 14 మంది పాత్రికేయులు ఉన్నారు. ఎన్ఎస్‌టీ విద్యార్థులతో కలిసి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక శ్రీనివాసన్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ఎన్ఎస్‌టీఐ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను పాత్రికేయులకు వివరించారు. వీరు అంతకుముందు వివిధ కోర్సులకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులతో ముచ్చటించారు. సంస్థ వారికి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందం వెంట పీఐబీ- హైదరాబాద్ మీడియా కమ్యూనికేషన్ అధికారిణి వర్గంటి గాయత్రి ఉన్నారు.

హెచ్చార్సీని ఆశ్రయించిన లాఠీచార్జ్ బాధితులు

నాంపల్లి: ముత్యాలమ్మ దేవాలయం వద్ద లాఠీచార్జ్‌కు గురైన బాధితులు వెంకటేష్, సాయి నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. అకారణంగా తమపై లాఠీచార్జ్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అమ్మవారి విగ్రహంపై దాడి జరిగిందని తెలుసుకుని తాము అక్కడికి వెళ్లామని, పోలీసులు తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల గేట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- ప్రముఖ ఇంజినీర్ కన్నయ్యనాయుడు
- 'ఎస్కీ'లో సాగునీటి ప్రాజెక్టులపై వర్క్‌షాప్


ఎస్కీలో అధికారులు, ఉద్యోగులు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రముఖ ఇంజినీర్ కన్నయ్యనాయుడు

రాయదుర్గం: సాగునీటి ప్రాజెక్టుల గేట్లను ఎప్పటికప్పుడు గమనించాలని సాగునీటి రంగ నిపుణుడు, ప్రముఖ ఇంజినీర్ నాగినేని కన్నయ్యనాయుడు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో గురువారం 'సాగునీటి ప్రాజెక్టుల గేట్లు ఫెయిల్ అయినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై' వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దేశంలో నిర్మించిన అనేక భారీ సాగునీటి ప్రాజెక్టులతో పాటు మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా కోట్లాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతున్నాయన్నారు. అయితే ఆనకట్ట ఎత్తుకంటే నీటిస్థాయి పెరిగినప్పుడు వరదలు సంభవిస్తాయి కాబట్టి.. ఈ ప్రమాదాలను ఎదుర్కోవడానికి ప్రతి డ్యామ్‌కు స్పిల్‌వే గేట్లు బిగిస్తారని చెప్పారు. నీటి మట్టాలను నియంత్రించడంలో ఈ గేట్లు ఉపయోగపడతాయన్నారు. గేట్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు అవసరమన్నారు. లేకుంటే అత్యవసర సమయంలో తెరుచుకోవన్నారు. ఇటీవల తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడం అందరినీ ఆందోళనకు గురిచేసిందని కన్నయ్యనాయుడు గుర్తు చేశారు. డ్యామ్‌లో నీళ్లు ఉండగానే కొట్టుకుపోయిన గేట్ స్థానంలో మరో గేటు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ అధికారులు డాక్టర్ ఆదినారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బాత్‌వేర్‌లో.. ఎక్సోటికా సిరీస్‌

సాక్షి, సిటీబ్యూరో: ఆక్వా ప్లంబింగ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ కు చెందిన ప్రముఖ బ్రాండ్‌ ప్లంబర్‌ బాత్‌వేర్‌, తమ సరికొత్త–ఎక్సోటికా బాత్‌ వేర్‌ కలెక్షన్‌ నగర మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని బ్రాండ్‌ నగర ప్రతినిధులు తెలిపారు. బాత్‌రూమ్‌లు కిచెన్‌లను ఆధునీకరించడానికి నలుపు, రోజ్‌ గోల్డ్‌, షాంపైన్‌ గోల్డ్‌, తెలుపు తదితర రంగుల్లో అద్భుతమైన రూపాల్లో లైఫ్‌ టైమ్‌ వారెంటీ కలిగిన ఉత్పత్తులు అందిస్తున్నామని, ధర రూ.2,500 నుండి రూ.1 లక్ష వరకూ ఉంటాయన్నారు.

అమెజాన్‌లో సంభవ్‌ హాకథాన్‌.. కాంటెస్ట్‌

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆన్‌లైన్‌ వాణిజ్య వేదిక అమెజాన్‌ ఇండియా.. జాతీయస్థాయిలో సంభవ్‌ హాకథాన్‌ పేరిట పోటీని నిర్వహిస్తోంది. రేపటి తరాన్ని సృజనాత్మకత వైపు ప్రోత్సహించడంతో పాటు చిన్న, మధ్య తరహా ఈ కామర్స్‌ వ్యాపారులను ఏఐ ఆధారిత ఆవిష్కరణల వైపు మళ్లించేందుకు ఈ పోటీ నిర్వహిస్తున్నట్టు అమెజాన్‌ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీలో 18 ఏళ్లు నిండిన విద్యార్థుల నుంచి వ్యాపారుల వరకూ ఎవరైనా సరే పాల్గొనవచ్చని, సృజనాత్మక ఆవిష్కరణలు, సమస్య పరిష్కార ఉపాయాలే కీలకంగా ఈ పోటీ సాగుతుందన్నారు. నవంబరు 24 వరకూ ఐడియాలతో కూడిన ఎంట్రీలు స్వీకరిస్తామని, డిసెంబరు 10 తుది ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.



రేపు.. రామ్‌ మిరియాల లైవ్‌..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గాయకుడు రామ్‌ మిరియాల సిటీ నైట్‌ పార్టీ లవర్స్‌కి వీనుల విందు పంచనున్నారు. గచ్చిబౌలిలోని అబానా క్లబ్‌ అండ్‌ కిచెన్‌లో శనివారం రాత్రి 8 గంటల నుంచి రామ్‌ మిరియాల లైవ్‌ మ్యూజిక్‌ అతిథులకు అందిస్తున్నారు. ప్రైవేట్‌ ఆల్బమ్స్‌ ద్వారా కూడా సంగీతాభిమానులకు దగ్గరైన రామ్‌ మిరియాల ఇటీవల తన పాటలు, సంగీతం ద్వారా తెలుగు సినీ ప్రేక్షకులకు అభిమాన గాయకుడిగా మారారు.







సీతాఫల్‌.. వెరైటీస్‌ ఫుల్‌

నగరంలో మొదలైన సీజన్‌

- మార్కెట్లో నోరూరించే పండ్లు అందుబాటులో
- విభిన్న రకాల ఐస్‌క్రీమ్స్‌లోనూ మిక్స్‌డ్‌ ఫ్రూట్‌
- రెస్టారెంట్స్‌లో రబ్డీ, ఖీర్‌ తదితర రూపాల్లోనూ ప్రత్యక్షం...



ఈ సీజన్‌లో సీతాఫలం రుచి చూడని వాళ్లు అరుదేనేమో... పండ్లలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమృతం లాంటి రుచిని కోల్పోకుండా అందించే ఏకైక ఫలంగా సీతాఫలాన్ని చెప్పుకోవచ్చు. దాదాపు అందరికీ అందుబాటు ధరల్లోనే ఉండే ఈ ఫలం.. ఇప్పుడు నగర మార్కెట్లో సందడి చేస్తోంది. మరోవైపు ఈ సీజన్‌లో సీతాఫలాన్ని ఆధారం చేసుకుని రుచులను వడ్డించే రెస్టారెంట్స్‌, ఐస్‌క్రీమ్‌ పార్లర్స్‌ సైతం నగర వాసులకు వెరైటీలను అందించేందుకు సిద్ధమైపోతున్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో

స్వీట్‌ విత్‌ ఫ్రూట్‌..

రబ్డీ అనేది భారతీయ వంటకాల్లో ఒక క్లాసిక్‌ డెజర్ట్‌, ఇది చాలా కాలం నుంచి వండి వడ్డిస్తున్నారు. సంప్రదాయ పండుగలు లేదా ప్రత్యేక సందర్భాల్లో, విందు వినోదాల చిహ్నంగా దీనిని వడ్డిస్తారు. రబ్డీకి సీతాఫలాన్ని జోడించడం వల్ల ప్రత్యేకమైన రుచిని మాత్రమే కాకుండా మరిన్ని బలవర్ధకాలు సంతరించుకుని ఉత్తమ పోషకాహారంగా మారుతోంది. పండుకు సహజంగా ఉండే తీపి దీనికి చక్కెర అతిగా జత చేయాల్సిన అవసరాన్ని తగ్గిస్తుంది, వంటకాన్ని ఆరోగ్యకరమైనదిగా చేస్తుంది. ఈ సీజన్‌లో వచ్చే కర్వా చౌత్‌, దీపావళి తదితర పండుగల సమయాల్లో కుటుంబ సమేతంగా ఆస్వాదించేందుకు ఈ డెజర్ట్‌ బాగా వినియోగిస్తారు.



ఐస్‌క్రీమ్స్‌ షురూ..

నగరంలో పలు ఐస్‌క్రీమ్‌ పార్లర్స్‌ ఈ సీజన్‌లో సీతాఫల్‌ ఐస్‌క్రీమ్స్‌ విక్రయాలకు పేరొందాయి. సీజనల్‌ పండ్లతో చేసిన ఐస్‌క్రీమ్స్‌ను అందించడంలో పేరొందిన నేచురల్స్‌లో ఇప్పటికే సీతాఫల్‌ ఐస్‌క్రీమ్స్‌ అందుబాటులోకి వచ్చాయి. అదే విధంగా క్రీమ్‌ స్టోన్‌ తదితర పేరున్న పార్లర్స్‌లోనూ ఇవి అందిస్తున్నారు.. ఇక పాతబస్తీలో అచ్చమైన ఆర్గానిక్‌ ఐస్‌క్రీమ్స్‌కు దశాబ్దాల నాటి నుంచి కేరాఫ్‌గా ఉన్న ఫేమస్‌ ఐస్‌క్రీమ్స్‌ కూడా సీతాఫల్‌ హిమ క్రీముల్ని అందిస్తోంది. నగరంలోని అబిడ్స్‌లో ఉన్న నార్సింగ్‌ భేల్‌పూరి జ్యూస్‌ సెంటర్‌ సైతం ఈ వంటకాలకు పేరొందింది. సీతాఫల్‌ మలాయ్‌ పేరుతో ఈ ఫుడ్‌ అవుట్‌లెట్‌ అందించే సీజనల్‌ రుచి ఫుడ్‌ లవర్స్‌కి చిరపరిచితమే. ఇలా అనేక రకాలుగా సిటీలోని సీతాఫల ప్రియుల్ని రారమ్మని ఆహ్వానించేందుకు ఓ వైపు రుచిని మరోవైపు ఆరోగ్య ఫలాన్ని అందించేందుకు రెస్టారెంట్స్‌, ఐస్‌క్రీమ్‌ పార్లర్స్‌, కేఫ్స్‌ పోటీపడుతున్నాయ్‌.





కాదే ఫలమూ తినడానికి అనర్హం అన్నట్టే.. కాదే ఫలమూ మేళవింపునకు అనర్హం అంటున్నారు నగరంలోని చెఫ్స్‌. సీతాకాలంలో విరివిగా లభ్యమయ్యేది సీతాఫలం. ఇది తీపి, క్రీము గుజ్జుతో కూడిన ఉష్ణమండల ఫలం ఇది. ఈ పండులో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్స్‌ సమృద్ధిగా ఉన్నందున గణనీయమైన పోషక విలువలను కలిగి ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన చర్మాన్ని అందిస్తుంది. జీర్ణక్రియను సైతం మెరుగుపరుస్తుంది. అయితే మ్యాంగో సీజన్‌లో మామిడి పండ్లను వంటకాలలో విరివిగా జత చేసే నగర నలభీములు.. సీతాఫలంతోనూ పలు రకాల వంటకాలు తయారు చేస్తూ నోరూరించడం ఆహార ప్రియులకు సుపరిచితమే.

ఆరోగ్యానికి మేలు..

ఉపవాసం సమయంలో ప్రత్యేక ట్రీట్‌గా కూడా దీనిని వడ్డిస్తారు. రబ్డీ పాలలోని కాల్షియం ప్రొటీన్‌ కంటెంట్‌ ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది, దీనికి బాదం, పిస్తాలను గార్నిష్‌గా ఉపయోగిస్తారు. కాబట్టి అవసరమైన కొవ్వు, ఆమ్లాలు, విటమిన్‌–ఈ లను ఇవి అందిస్తాయి. ఒక లీటరు పాలు, పావు కిలో బెల్లం, అర టీస్పూన్‌ యాలకుల పొడి, సీతాఫలం గుజ్జు ఒక కప్పుతో చేసిన ఈ రబ్డీని కూల్‌గా సర్వ్‌ చేసుకోవచ్చు.

మరెన్నో రుచులు..



ఇవే కాకుండా పలు రెస్టారెంట్స్‌లో కస్టర్డ్‌ యాపిల్‌ ఖీర్‌, కుల్ఫీ తదితరాలను కూడా తయారు చేస్తున్నారు. కస్టర్డ్‌ యాపిల్‌తో పుడింగ్‌ కూడా చేస్తున్నారు. ఫిర్ని అనే నార్త్‌ ఇండియన్‌ డిజర్ట్‌ కూడా దీన్ని జోడిస్తున్నారు. కస్టర్డ్‌ యాపిల్‌ పల్ప్‌ను వేడి వేడి జిలేబీ తదితర స్వీట్స్‌పై దీన్ని జతచేసి సర్వ్‌ చేయడం కూడా కొన్ని రెస్టారెంట్స్‌లో పరిపాటిగా మారింది.








క్యాట్‌ ఫెస్ట్‌.. ఆల్‌ సెట్‌..

నగరంలో వినూత్నంగా క్యాట్‌ షో

- 13కు పైగా బ్రీడ్‌లతో 400 పిల్లుల ప్రదర్శన
- పెట్‌ లవర్స్‌ కోసం ఫన్‌ గేమ్‌లు సైతం
- జంతు సంరక్షణలో భాగంగా పెట్‌ అడాప్షన్‌ జోన్‌



నగరంలో డాగ్‌ ఫెస్ట్‌లు చూశాం, ప్లాంట్‌ ఫెస్ట్‌లు చూశాం.. కానీ వినూత్నంగా క్యాట్‌ ఫెస్ట్‌ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్యాట్‌ ఫెస్ట్‌లో భాగంగా దాదాపు 13కు పైగా క్యాట్‌ బ్రీడ్‌లతో 400 లకు పైగా పిల్లులతో పెట్‌ లవర్స్‌ సందడి చేయనున్నారు. ఈ ఆదివారం నిర్వహించనున్న క్యాట్‌ ఫెస్ట్‌ కోసం దేశీయ జాతులతో పాటు విదేశాలకు చెందిన ఆకర్షణీయమైన పిల్లులు సంసిద్ధమవుతున్నాయి. ఈ షోలో భాగంగా పిల్లుల ప్రదర్శన మాత్రమే కాకుండా వివిధ వినోద కార్యక్రమాలను నిర్వహించనున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



ప్రస్తుత తరుణంలో నగరవాసుల పెట్‌ జాబితాలో పిల్లులు కూడా చేరిపోయాయి. గత కొంత కాలంగా డాగ్స్‌తో పాటు విరివిగా పిల్లులను సైతం పెంచుతున్నారు. ఈ హబీ పెరుగుతన్న నేపథ్యంలో పిల్లుల పెంపకం, బ్యూటీ, పోషక ఆహారం తదితర అంశాలపైన అవగాహన పెంచుకోడానికి పలువురు పెట్‌ అండ్‌ క్యాట్‌ లవర్స్‌ ఈ షోలో పాల్గొనున్నారు. రాజేంద్రనగర్‌లోని హెచ్‌ఎఫ్‌ కన్వెన్షన్‌ వేదికగా ఈ ఆదివారం క్యాట్‌ షో జరగనుంది.

ఛాంపియన్‌షిప్‌ క్యాట్‌ షోలు..

ఇందులో ప్రత్యేకంగా ఛాంపియన్‌షిప్‌ క్యాట్‌ షోతో పాటు పిల్లుల హెల్త్‌ చెకప్‌, న్యూట్రిషన్‌ జోన్‌, పెట్‌ ఇండస్ట్రీ ప్రదర్శనలు, నిపుణుల సెషన్స్‌, పెట్‌ లవర్స్‌–చిన్నారుల ప్రత్యేక ఫన్‌ గేమ్స్‌ నిర్వహించనున్నారు. ఈ క్యాట్‌ పెట్‌ షోలో దాదాపు ఆరు వేల మంది పాల్గోనున్నారని, 80కి పైగా పెట్‌ బ్రాండ్స్‌, 400 లకు పైగా విభిన్న జాతుల పిల్లులు ఇక్కడ సందడి చేయున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ షోలో పాల్గొనాలనుకునే వారు ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్‌ బుక్‌ చేసుకోవాలి.

అడాప్షన్‌ జోన్‌లు..

ఛాంపియన్‌షిప్‌ క్యాట్‌ షోలో పాల్గొనే పిల్లులను కూడా ముందుగానే రిజిస్టర్‌ చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. పెంపుడు పిల్లులు లేనివారు, ఇతర జంతు ప్రేమికులు సైతం ఇందులో పాల్గొనవచ్చు. జంతు సంరక్షణ, జీవవైవిధ్యంలో భాగంగా పిల్లులను సంరక్షించాలనే ఉద్దేశంతో ఇక్కడ పెట్‌ అడాప్షన్‌ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.



స్వీట్‌ క్రాకర్స్‌..

మతాబుల రూపాల్లో చాక్లెట్ల తయారీ

ఇద్దరు అక్కాచెల్లెళ్ల వినూత్న ఆలోచన

డీ మెల్ట్‌ పేరుతో క్లౌడ్‌ కిచెన్‌ ఏర్పాటు..

ఈ ఫొటోలో ఉన్నవి ఏంటో చెప్పండి చూద్దాం.. చాలా కాన్ఫిడెంట్‌గా టపాసులు అనుకుంటున్నారు కదా! అయితే మీరు..తప్పులో కాలేసినట్లే..! అవి టపాసుల్లాంటి టపాసులు..కానీ టపాసులు కాదు.. ఎందుకంటే ఈ పటాసులతో పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదు.. పొగ రాదు. నిప్పు రవ్వలు అసలే ఎగసి పడవు. మరి అవన్నీ రాకపోతే అవి పటాసులు ఎందుకు అవుతాయి? అని ఆశ్చర్యపోతున్నారా.. అవును అక్కడికే వస్తున్నాం.. మీకొచ్చిన డౌటనుమానం కరెక్టే. ఎందుకంటే అవి నిజమైన టపాసులు కావు. అవి చాక్లెట్స్‌.. అరరే.. చూస్తే టపాసుల్లా భలే ముద్దుగా ఉన్నాయే అనుకుంటున్నారా..? స్వీట్స్‌ను టపాసుల్లాగా చేయాలన్న ఆలోచనతో ఇలా వినూత్నంగా ఇద్దరు అక్కాచెల్లెళ్లు వీటిని తయారు చేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



దీపావళి సంబరాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. స్వీట్లు, టపాసులతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. స్నేహితులు, బంధువులకు స్వీట్లు పంచుకుంటూ దీపావళి శుభాకాంక్షలు చెప్పుకొంటుంటారు. టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకుంటారు. అయితే ఈ రెండింటినీ మిళితం చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేశారు గజ్జల హరితారెడ్డి, లిఖితారెడ్డి. ఇద్దరు అక్కా చెల్లెళ్లు అనుకున్నదే తడవుగా ఇలా టపాసులను తయారు చేశారు. అదేనండీ టపాసుల్లాంటి చాక్లెట్లు.

కాస్త భిన్నంగా ఉండాలని..

ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న వీరిద్దరూ ప్రిపరేషన్‌ సమయంలో వచ్చే ఒత్తిడిని తట్టుకునేందుకు ఇలా ఇంట్లోనే చాక్లెట్లు తయారుచేయడం అలవాటుగా మార్చుకున్నారు. అలా అలా.. వీరు చేస్తున్న చాక్లెట్లు, కుకీలకు మంచి ప్రశంసలు వస్తుండటంతో డీమెల్ట్‌ పేరుతో చిన్నపాటి క్లౌడ్‌ కిచెన్‌ ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. దీపావళికి ఏదైనా వినూత్నంగా తయారు చేయాలని ఆలోచించగా.. ఈ ఐడియా వచ్చిందని, ఈ స్వీట్స్‌ చూసి ముందు టపాసులు అనుకుంటున్నారని, అసలు విషయం తెలిసి చాలా మంది ఆశ్చర్యపోతున్నారని హరితారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తోంది.





క్లుప్తంగా...

నాంపల్లి కోర్టుకు దీపాదాస్ మున్షీ

సిటీ కోర్టులు (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ దాఖలుచేసిన పరువు నష్టం కేసు విచారణకు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ గైర్హాజరయ్యారు. దీంతో నవంబర్ 5న జరిగే తదుపరి విచారణకు ప్రభాకర్ హాజరుకావాలని కోర్టు ఆయన తరఫు న్యాయవాదికి సూచించింది. గురువారం నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో జరిగిన విచారణకు మున్షీ హాజరయ్యారు. తాను కాంగ్రెస్ నేతల నుంచి బెంజ్ కారు లబ్ధి పొందినట్లు ప్రభాకర్ అసత్యపు ఆరోపణలు చేశారంటూ మున్షీ పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎంపీ టికెట్ ఆశావహుల్లో ఒకరు మున్షీకి బెంజ్ కారు కొనిచ్చినట్లు తన దగ్గర సాక్ష్యాలు కూడా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఆమెకు కారును ఎవరు గిఫ్ట్ ఇచ్చారన్నది మాత్రం ఆయన చెప్పలేదు. తనపై నిరాధార ఆరోపణలు చేశారని మున్షీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలి

వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం ఆయన ఓ ప్రకటనలో స్పందించారు. సొంత పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తున్న విషయాన్నయినా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

హామీలు అమలు చేయలేక 'పొలిటికల్ బాంబులు'

మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేక, వాటిని డైవర్ట్ చేసేందుకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పొలిటికల్ బాంబులు పేలుతాయని అంటున్నారని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు అభిలాష్ రంగినేని, కురువ విజయ్‌కుమార్‌తో కలసి గురువారం ఆయన తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను విమర్శించకపోతే మంత్రులకు పూట గడవడంలేదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారని, ఆయనకు రాజకీయ విలువలు లేవని ధ్వజమెత్తారు.

నేడు బీజేపీ మహాధర్నా

మూసీ పరీవాహక, హైడ్రా కూల్చివేతలపై నిరసన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూలుస్తోందంటూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద బీజేపీ శుక్రవారం మహాధర్నా చేపట్టనుంది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ధర్నాలో మరో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, నగర కార్పొరేటర్లు పాల్గొననున్నారు. మూసీ ప్రాజెక్టు వల్ల కలుగుతున్న ఇబ్బందులు, కష్టాల గురించి నేరుగా బాధితుల చేత ప్రజలకు తెలియజేయాలని బీజేపీ భావిస్తోంది. అలాగే నగర శివార్లలో చెరువులను ఆక్రమించారంటూ పేదలు, దిగువ, మధ్యతరగతి ప్రజల ఇళ్లను ప్రభుత్వం 'హైడ్రా' పేరుచెప్పి ఇళ్లు కూల్చేసి వారిని నిరాశ్రయులుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నేతలు ధర్నా నిర్వహించనున్నారు.

కాంగ్రెసోళ్లను ప్రజలే ఉరికిచ్చి కొట్టే రోజులు దగ్గరపడ్డాయి

- రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమా ఇచ్చే దాకా ప్రభుత్వంపై పోరాడతాం
- చంద్రబాబుతోనే కొట్లాడినం.. ఈ చిట్టినాయుడు ఎంత? సీఎంను చూసి భయపడం
- మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అక్కడి బంధువులకు కాంగ్రెస్ మోసాలను వివరించండి
- ఆదిలాబాద్ రైతుపోరు సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



గురువారం ఆదిలాబాద్‌లో రైతు పోరుబాట సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, ఆదిలాబాద్: ప్రజలే మర్లవడి కాంగ్రెసోళ్లను ఉరికిచ్చి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. గరీబులు, రైతులు, విద్యార్థులతోపాటు తనపై కేసులు పెడతానంటే ఊరుకొనేవారెవరూ లేరన్నారు. ఈ ప్రభుత్వం ఎవరినీ వదలకుండా అందరినీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమా ఇచ్చే దాకా.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి వచ్చే వరకు పోరాడదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ఆదిలాబాద్ నుంచే అగ్గి అంటుకుందని.. ఈ సర్కారుపై మూడేళ్లు కొట్లాడేది ఉందని.. అందుకు పోరాట తోవ చూపారన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు పోరుబాట సభలో కేటీఆర్ పాల్గొన్నారు.

ప్రజలు కేసులు పెడితే ఒక్క కాంగ్రెసోడైనా మిగులుతాడా?

రుణమాఫీ కాలేదని రైతులు ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేస్తే పోలీసులు వారిని జైల్లో పెడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. వంద రోజుల్లో అన్నీ చేస్తామని మాట తప్పిన వారిని జైల్లో పెట్టాలా లేక పేద ప్రజలను జైల్లో పెట్టాలా అని ప్రశ్నించారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు వరుసపెట్టి కేసులు పెడితే ఒక్క కాంగ్రెసోడైనా మిగులుతాడా అంటూ ధ్వజమెత్తారు. తమ పార్టీకి శక్తినిస్తే రైతుల పక్షాన పోరాడతామని, జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అంటే.. భారత రాష్ట్ర సమితే కాకుండా భారత రైతు సమితి కూడా అని ఆయన పేర్కొన్నారు.

అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలి..

'పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు చట్టబద్ధంగా నడుచుకోవాలి. లేదంటే మా టైమ్ వస్తది. ఎవరైనా ఎక్కువ చేస్తే పేర్లు రాసి పెట్టుకోండి. మిత్తితో సహా చెల్లిస్తాం. పెద్ద పెద్దోళ్లను చూసినం.. చంద్రబాబుతోనే కొట్లాడినం.. ఈ చిట్టినాయుడు ఎంత? అతన్ని చూసి మనం భయపడాల్నా?' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ పక్కనే ఉన్న మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా అక్కడి బంధువులు, శ్రేయోభిలాషులకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో చేసిన మోసాల గురించి వివరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మన పత్తికి సైతం గుజరాత్ ధర ఇవ్వాల్సిందే..

కాంగ్రెస్ కంటే బీజేపీ నేతలు మరింత ప్రమాదకారులని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ బీజేపీ నేతలేనని వివరించారు. 'గుజరాత్‌లో పత్తి క్వింటాల్‌కు రూ. 8,800 ఇస్తున్నారు. అక్కడికన్నా తెలంగాణలో పత్తి నాణ్యమైనదని పరిశ్రమ వర్గాల వారే నేను మంత్రిగా ఉన్నప్పుడు చెప్పారు. అందుకే గుజరాత్‌లో ఇచ్చినట్టే పత్తికి ఇక్కడ కూడా ధర ఇవ్వాలని బీజేపీపై కొట్లాడాలి' అని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ రెండు దొందూ దొందేనన్నారు. పీఎం మోదీ ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోసగిస్తే.. రేవంత్‌రెడ్డి రూ. 15 వేలు రైతుల ఖాతాల్లో వేస్తానని వేయలేదని విమర్శించారు. ఈ సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, లోలం శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది

పీడీఎస్‌యూ 50 ఏళ్ల సభలో వక్తలు



అమరులకు నివాళులర్పిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని.. ఉత్తరాది రాష్ట్రాల్లో ఫాసిజం నాట్యం చేస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభ సందర్భంగా గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి ఠాగూర్ ఆడిటోరియం వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభకు పీడీఎస్‌యూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు పి.మహేశ్, బి.మధు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సైంటిస్టు, కవి డాక్టర్ గౌహర్ రజా, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, రచయిత్రి కాత్యాయిని, బి.ప్రదీప్, సాదినేని వెంకటేశ్వర్లు, పి.ప్రసాద్ తదితరులు అమరులకు జోహార్లు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం డాక్టర్ గౌహర్ రజా మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలనలో ఫాసిజం వ్యాప్తి చెందిందని, దేశంలో అనేక చోట్ల జరుగుతున్న దాడుల్లో భాగమే సీఏఏ అని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఉన్నత విద్య, పరిశోధనలు, ప్రాజెక్టులు, ప్రయోగాలకు నిధులు కేటాయించకుండా.. దేవుళ్ల పేరుతో ఆలయాలు, వివిధ రకాల పూజలు, ఇతర అనుత్పాదక రంగాలకు అధికంగా కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ పదిమంది లేకపోతే ప్రభుత్వం నడవదా?

కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ధ్వజం

- ప్రభుత్వమే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏం ప్రజాస్వామ్యం?
- ఏ విధంగా చూసినా కాంగ్రెస్‌కు 20 మంది ఎమ్మెల్యేలు అధికంగా ఉన్నారు... అలాంటప్పుడు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేను తీసుకోవాల్సిన అవసరమేంటి?
- ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి అంటూ ఫైర్



సాక్షి, హైదరాబాద్: 'సీపీఐతో కలిసి కాంగ్రెస్ పార్టీకి 66 మంది ఎమ్మెల్యేలున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు కలిసినా 46 మంది మాత్రమే. ఎంఐఎం తటస్థంగా ఉన్నా... ప్రతిపక్షానికన్నా 20 మంది ఎమ్మెల్యేలు అధికంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలను తీసుకోవలసిన అవసరమేంటి? ఆ పదిమంది లేకపోతే ప్రభుత్వం నడవదా? రాహుల్‌గాంధీ ఏం చెప్పారు.. ఏం జరుగుతోంది? మన నాయకుడు రాహుల్ గాంధీనా? కేసీఆరా? ప్రభుత్వమే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏం ప్రజాస్వామ్యం? రాష్ట్రంలో జరుగుతున్న ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి. ఆయన ఇంట్లో సమావేశమై అక్కడి నుంచే రాజకీయం నడుపుతున్నారు..' అని సీనియర్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం శాసనసభ ఆవరణలోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

పోచారంను చేర్చుకునేటప్పుడే వ్యతిరేకించా..

'పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పార్టీలో చేర్చుకునేటప్పుడే నేను వ్యతిరేకించా. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేత కాకుండా అడ్డుపడిందే పోచారం శ్రీనివాస్‌రెడ్డి. అలాంటి నాయకుడిని కాంగ్రెస్‌లో చేర్చుకుని ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చారు. ప్రభుత్వం కూలిపోతుందని ఫిరాయింపులను ప్రోత్సహించామనడం అర్థరహితం. ప్రభుత్వం ఎలా పోతది? పూర్తి మెజారిటీతో ప్రభుత్వం మన చేతిలో ఉంది. స్పీకర్ ఉన్నాడు. ఎవరైనా ఫిరాయిస్తే స్పీకర్ సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు కదా. అధికార పార్టీలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందంటే ప్రజాస్వామ్యం ఎందుకు? అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ ముసుగేసుకొని అధికార పార్టీలోకి వచ్చిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. పార్టీ ఫిరాయించిన 10 నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. దీంతో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు..' అని జీవన్‌రెడ్డి చెప్పారు.

అధిష్టానానికి లేఖలు

'జగిత్యాలలో జరిగిన హత్య నన్ను తీవ్రంగా బాధించింది. నియోజకవర్గంలో ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నా. అందుకే నా భవిష్యత్తు కార్యాచరణ ఏంటో చెప్పాలని అధిష్టానాన్ని కోరా..' అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితర పార్టీ పెద్దలకు లేఖలు రాసినట్లు వివరించారు.

సంతోష్ ఎవరి అండతో ఈ హత్య చేశాడో ఎమ్మెల్యే చెప్పాలి

'కాంగ్రెస్ ముసుగేసుకుని పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అండతో వారి అనుచరులు ఆధిపత్యం కోసం హత్యలు చేసే స్థాయికి ఎదిగారు. జగిత్యాలలో నా అనుయాయుడు గంగారెడ్డిని కిరాతకంగా హత్య చేసిన సంతోష్ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కోసం డబ్బులు పంచాడు. గంగారెడ్డిని రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే హత్య చేశాడు. ఏకంగా పోలీస్‌స్టేషన్‌లో రీల్స్ చేసినా, పోలీసులు పట్టించుకోలేదు. హత్యకు, తనకు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే సంజయ్ చెపుతున్నాడు. సంజయ్‌కు హత్యతో సంబంధం ఉందని నేను అనలేదు. ఎవరి అండ చూసుకుని హత్య చేశాడో ఎమ్మెల్యే చెప్పాలి..' అని జీవన్‌రెడ్డి అన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ వ్యాఖ్యలతోనే చేరికలు

- కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్
- ముఖ్య అనుచరుడిని హత్య చేశారనే బాధలో జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు... కేసీఆర్‌ను రోల్‌మోడల్‌గా తీసుకోవలసిన ఖర్మ మాకేంటి?

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని, రాష్ట్రపతి పాలన తప్పదని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలతో ప్రభుత్వానికి అండగా ఉండాలనే కొందరు ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్ కుమార్ కూడా అలాగే కాంగ్రెస్‌లో చేరారన్నారు. సంజయ్ చేరికను అప్పట్లో జీవన్‌రెడ్డి వ్యతిరేకిస్తే కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు పరిస్థితిని వివరించిందని పేర్కొన్నారు. మహేశ్ గౌడ్ గురువారం గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితిని సృష్టించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టాలని ప్రయత్నిస్తూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రకటనలు చేశారని, ఆ నేపథ్యంలో పది మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కాపాడేందుకు ముందుకు వచ్చారని అభిప్రాయపడ్డారు. నాటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని ఏఐసీసీ నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను కూల్చిన ఘటనల నేపథ్యంలో ఎమ్మెల్యేలు తమ వెంట నడిచారని, దీనికి పార్టీలోని అన్ని స్థాయిల్లో ఏకాభిప్రాయం ఉందన్నారు. కేసీఆర్‌ను రోల్‌మోడల్‌గా చేసుకోవలసిన ఖర్మ తమకు లేదన్నారు. తనకు ఆప్తుడైన గంగారెడ్డి హత్యతో జీవన్‌రెడ్డి తీవ్రంగా ఆవేదన చెందారని, ఆ బాధలో పార్టీ ఫిరాయింపులపై మాట్లాడారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కేటీఆర్ సోషల్ మీడియాను నమ్ముకున్నారని, అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అసత్య ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా హాండిల్స్ అన్నీ దుబాయ్, సింగపూర్‌లో ఉన్నాయన్నారు. హైడ్రాతో ఒకే ఒక్క పేద కుటుంబం ఇల్లు కూలిందని, మిగతావన్నీ పెద్దల అక్రమ కట్టడాలేనని స్పష్టంచేశారు. మూసీనదిలో మెట్రో పిల్లర్లు మాత్రమే ఉన్నాయని, ప్రజల రవాణాకు సంబంధించి అవి అవసరమని, వాటి వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం లేదన్నారు. అలాగే ఎంజీబీఎస్ బస్‌స్టేషన్ మూసీలో లేదని, మూసీ ఒడ్డున ఉందన్నారు. ప్రజా ప్రయోజనం కోసం ఇలాంటివి తప్పవని, వీటికీ మూసీ ఆక్రమణలకు పోలిక ఏంటని ప్రశ్నించారు.



సోషల్ మీడియా సమన్వయకర్తల సమావేశంలో దీపా దాస్‌మున్షీ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

దేశ రాజకీయాల్లో సోషల్ మీడియా కీలకపాత్ర

టీపీసీసీ సోషల్ మీడియా సమన్వయకర్తల సమావేశంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ

సాక్షి, హైదరాబాద్: దేశ రాజకీయాల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రగతి పథంలోకి దూసుకెళ్తున్న రాష్ట్ర అభివృద్ధి గురించి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన టీపీసీసీ సోషల్ మీడియా సమన్వయకర్తల సమావేశానికి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఎదగడానికి రేవంత్‌రెడ్డి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ...సోషల్ మీడియా అనేది అన్నీ రాజకీయ పార్టీలకు కీలకంగా మారిందన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాల ద్వారా 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ... ప్రజల శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో తెలియజేసేలా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో సోషల్ మీడియా కన్వీనర్ మన్నే సతీశ్, గుత్తా అమిత్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రుచిరా చతుర్వేది, విపిన్ యాదవ్, నవీన్ పెట్టెం, సుప్రియా శ్రీనేట్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

దూషణలకు దిగితే తగిన రీతిలో బదులిస్తాం

కేటీఆర్‌కు మంత్రి సీతక్క హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: అధికారం కోల్పోయామన్న దుగ్ధతో మాజీ మంత్రి కేటీఆర్ దూషణలకు దిగితే సహించేది లేదని, ఆయనకు తగిన రీతిలో సమాధానం చెబుతామని మంత్రి సీతక్క హెచ్చరించారు. తండ్రి చాటు బిడ్డగా పదేళ్లు మంత్రిగా వెలగబెట్టిన కేటీఆర్.. ఇప్పుడు సభ్యతా సంస్కారాలు మరచి సీఎం కుర్చీని అవమాన పరిచేలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ రామ్‌లీలా మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడమే కేటీఆర్ పని అని ఆరోపించారు. బీఆర్ఎస్‌ను గత ఎన్నికల్లో రైతులు తరిమికొట్టినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదన్నారు. గత ప్రభుత్వం విడతల వారీగా, అరకొరగా చేసిన రుణమాఫీ వడ్డీలకు కూడా సరిపోక రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు మంజూరు చేయలేదని.. ఫలితంగా 61 శాతం రైతులకు ప్రైవేటు రుణాలు దిక్కైనట్లు గత ప్రభుత్వమే తెలంగాణ సామాజిక అభివృద్ధి నివేదికలో ఒప్పుకుందని ఆమె గుర్తు చేసారు. తమ ప్రభుత్వం మాత్రం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీకి పూనుకుందని తెలిపారు.

'మూసీ' పేరిట మళ్లీ అప్పు అవసరమా?

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ 'మూసీ పునరుజ్జీవం' పేరుతో భారీ ఎత్తున అవినీతికి తెరదీస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గత ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా అప్పు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుందని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ కూడా మూసీ పేరిట మరో లక్షన్నర కోట్లు అప్పు చేసి దీనిని ఏటీఎంలా వాడుకోవాలని చూస్తోందని మండిపడ్డారు. ఈ అప్పు వివిధ రకాల పన్నుల రూపంలో ప్రజలపై పెను భారంగా మారుతుందని గురువారం ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం ఉద్యోగులకు జీతాలివ్వడమే గగనమైంది. గత పాలకులు చేసిన దాదాపు రూ.6 లక్షల కోట్ల పైచిలుకు అప్పులకు 10 నెలల్లోనే రూ.60 వేల కోట్లు వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే నానా తంటాలు పడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. డబ్బుల్లేక రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది' అని విమర్శించారు. 'ఈ పరిస్థితుల్లో మరో లక్షన్నర కోట్లు అప్పు చేయడం దుర్మార్గం' అని పేర్కొన్నారు.

38 లక్షల ఓటర్లను పార్టీ సభ్యులుగా చేర్పించాలి

- బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్
- క్రియాశీల సభ్యత్వాలు అందుకున్న కిషన్‌రెడ్డి, చంద్రశేఖర్



కిషన్‌రెడ్డికి సభ్యత్వం అందజేస్తున్న బన్సల్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో పోటీ చేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థులకు పోలైన 77 లక్షల ఓట్లలో కనీసం సగం మందిని అంటే దాదాపు 38 లక్షల మందిని పార్టీ సభ్యులుగా చేర్పించేలా కృషి చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ పార్టీ నేతలకు సూచించారు. రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నందున ఈ నెల 30 దాకా ఈ కార్యక్రమాన్ని కొనసాగించి..నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో మెంబర్‌షిప్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీలైనంత ఎక్కువమందిని సభ్యులుగా చేర్చాలని ఆదేశించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, మరికొందరు నేతలకు సునీల్ బన్సల్ క్రియాశీల సభ్యత్వాలను అందజేశారు. ఇప్పటికే 25.5 లక్షల మంది (ఆన్‌లైన్‌లో 21 లక్షలు, ఆఫ్‌లైన్ నాలుగున్నర లక్షలు) సభ్యులుగా చేరినట్టుగా పార్టీవర్గాలు వెల్లడించాయి. పట్టణ ప్రాంతాలతోపాటు కమ్యూనికేషన్ నెట్‌వర్క్ అంతగా లేని గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు పుస్తకాల ద్వారా నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. సభ్యత్వ నమోదు ముగిశాక వచ్చేనెల 10వ తేదీ నుంచి పోలింగ్ బూత్ కమిటీలకు సన్నాహాలు, ఆ తర్వాత మండల, జిల్లా ఆ తర్వాత రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక పూర్తిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎన్నికలకు సన్నద్ధం, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలు, నిరసనలు తదితర అంశాలపై పార్టీ నేతలతో సునీల్‌బన్సల్ ప్రత్యేకంగా సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలు, ప్రభుత్వపరంగా వైఫల్యాలు, ఇంకా నెరవేర్చని వాగ్దానాలపై నిలదీసేలా వివిధ రూపాల్లో ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవాలని నిర్ణయించారు.

స్థానిక పోరుకు సిద్ధం కావాలి

త్వరలో జరగబోయే గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బీజేపీ నిర్ణయించింది. ఈ ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని, అన్ని స్థానాలకు పోటీ చేయాలని పార్టీ తీర్మానించింది. స్థానిక ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వడం ద్వారా పార్టీ క్షేత్రస్థాయి నుంచి బలోపేతం కావాలంటే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని పార్టీనేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా 9 ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించనున్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో కనీసం రెండు స్థానాలను గెలుచుకునే దిశగా నేతలు పనిచేయాలని ఓ నిర్ణయానికి వచ్చారు.

ఏక్ పోలీస్ విధానం అమలు చేయండి



బెటాలియన్‌లో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని సిరిసిల్లలో ధర్నాకు దిగిన పోలీసుల భార్యలు



ఎర్రవల్లి కూడలిలో జాతీయ రహదారిపై బైఠాయించిన బెటాలియన్ పోలీస్ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పుతున్న ఎస్ఐలు

రోడ్డెక్కిన బెటాలియన్ పోలీసుల భార్యలు.. సిరిసిల్లలో చంటి పిల్లలతో ధర్నా

సిరిసిల్లక్రైం: రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని కోరుతూ బెటాలియన్‌లో విధులు నిర్వర్తించే పోలీసుల భార్యలు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో గురువారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే విధానంలో పరీక్ష పెట్టి పోలీస్ ఉద్యోగాలకు ఎంపిక చేసి, విధుల్లో ఒక్కో రకమైన నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. బెటాలియన్ విధుల్లోకి వెళ్లిన తమవారు ఇంటికి రావడానికి నెలల సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 'నాన్న ఎక్కడ.. అమ్మా' అని పిల్లలు అడుగుతుంటే కన్నీళ్లు వస్తున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. ధర్నా విషయం తెలుసుకున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడకు చేరుకొని ఆందోళన విరమించాలని సూచించగా, వారు వినకపోగా నినాదాలు చేస్తూ నిరసనను తీవ్రతరం చేశారు. ఈ క్రమంలోనే వారిని వ్యాన్‌లో సర్దాపూర్ బెటాలియన్‌కు తరలించారు. 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా ఏదైనా సమస్య ఉంటే వినతిపత్రం ఇస్తే ఉన్నతాధికారులకు చెబుతామని, కానీ ఎవరూ వినతిపత్రం ఇవ్వలేదన్నారు.

పదో బెటాలియన్ పోలీస్ కుటుంబసభ్యులు కూడా..

ఎర్రవల్లి: బీచుపల్లి పదో బెటాలియన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లిలోని జాతీయ రహదారి–44 కూడలిలో గురువారం బైఠాయించారు. ఏక్ స్టేట్–ఏక్ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న అలంపూర్ సీఐ రవిబాబు ఆధ్వర్యంలో ఇటిక్యాల, కోదండాపురం ఎస్ఐలు వెంకటేష్, స్వాతి సిబ్బందితో అక్కడికి చేరుకొని పోలీస్ కుటుంబీకులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా పలువురు టీజీఎస్పీ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ బెటాలియన్ పోలీసులకు ఐదేళ్లు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరారు.

టీజీఎస్పీ కానిస్టేబుళ్ల సమస్యలు పరిష్కరించాలి

కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యుల ధర్నాకు కేటీఆర్ సంఘీభావం

డిచ్‌పల్లి (నిజామాబాద్ రూరల్): తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ బెటాలియన్స్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. గురువారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని టీజీఎస్పీ 7వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు ఒకే పోలీస్ విధానం ఉండాలని డిమాండ్ చేస్తూ 44వ నంబరు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. అదే సమయంలో ఆదిలాబాద్ జిల్లాకు వెళుతున్న కేటీఆర్ తన వాహనం దిగి వచ్చి ఆందోళన చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. ఒక వేళ ప్రభుత్వం తమ భర్తలను సస్పెండ్ చేస్తే హైదరాబాద్ వరకు వెళ్లి మరీ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. తమకు ఎంత బాధ కలిగితే ఇలా చంటి పిల్లలతో కలిసి ఎండలో రోడ్డుపైకి వస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. బెటాలియన్ కానిస్టేబుళ్ల సమస్యను ప్రభుత్వం తొందరగా తేల్చాలని లేదంటే బీఆర్ఎస్ తరఫున వారికి అండగా ఉండి, అవసరమైతే నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఆయన వెంట ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్, బాల్క సుమన్, జాజుల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అనగనగా మునగ

భద్రాద్రి జిల్లా కలెక్టర్ సాగు పాఠాలు



సంప్రదాయేతర పంటల సాగు ద్వారా ఏజెన్సీ రైతులు అధిక ఆదాయం సాధించేలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ పక్కా ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు వీలుగా యూట్యూబ్ చానల్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఈ చానల్ ద్వారా ప్రత్యేక వీడియోలు అప్‌లోడ్ చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

-సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

యూట్యూబ్‌లో జితేశ్ వి.పాటిల్ వీడియోలు

మునగ సాగుతో తొలి ప్రయోగాలు

సంప్రదాయేతర పంటలపై అవగాహన

మునగ అంటే మొదటి మెట్టు

'కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం' పేరుతో ఉన్న యూట్యూబ్ చానల్‌లో జితేశ్ వి.పాటిల్ 40 నిమిషాల నిడివి గల వీడియోను ఈనెల 23న అప్‌లోడ్ చేశారు. జిల్లాలో ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారని, ఈ సంప్రదాయ పంటల సాగు వల్ల ఎకరానికి రూ.20 వేలకు మించి ఆదాయం రావడం లేదని ఆ వీడియోలో కలెక్టర్ స్పష్టం చేశారు. మునగ సాగు చేయడం ద్వారా కనిష్టంగా రూ.75 వేలు, గింజలు, ఆకుల అమ్మకం ద్వారా మరో రూ.25 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరంగా చెప్పారు.

ఖర్చు లేకుండా సాగు

ఎకరంలో వెయ్యి మునగ చెట్లు నాటొచ్చని కలెక్టర్ పాటిల్ తెలిపారు. మొక్క నాటింది మొదలు దిగుబడి వచ్చే వరకు రైతులకు ప్రభుత్వం ఏ విధంగా అండగా ఉంటుంది, రైతులు నిర్వర్తించాల్సిన బాధ్యతలు ఏంటనేవి వివరించారు. విత్తనాలు, మెటీరియల్ కాంపోనెంట్ అంతా కలిపి ఎకరానికి రూ.33 వేల దాకా ఖర్చు వస్తుందని, ఇదే సమయంలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలకు ఉపాధి హామీ పథకం తోడైతే రూ.34,500 వరకు రైతుకు సాయం అందుతుందన్నారు. మునగ సాగుకు ఉపాధి హామీ పథకం వర్తించాలంటే ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులై ఉండాలని చెప్పారు.

మార్కెటింగ్ ఈజీ

ఒక మునగ చెట్టుకు కనిష్టంగా 180.. గరిష్టంగా 500కు పైగా కాయలు వస్తాయని తెలిపారు. ఒక చెట్టుకు 180 కాయల దిగుబడి అనుకుంటే... రూపాయికి రెండు కాయల వంతున అమ్మినా ఎకరం మీద రూ.75 వేల ఆదాయం కచ్చితంగా వస్తుందన్నారు. తక్కువ రేటుకు అమ్మితే హైదరాబాద్ నుంచి వ్యాపారులే వచ్చి మునగ కాయలు తీసుకెళతారని, మార్కెటింగ్ చేయాల్సిన అవసరమే ఉండదని చెప్పారు.

నవంబర్‌లో మొదలు

నవంబర్ రెండో వారంలో విత్తనాల కొనుగోలుతో మొదలయ్యే 'మిషన్ మునగ' జూన్ చివరి వారంలో దిగుబడి తీసుకునే వరకు కొనసాగనుంది. ప్రతీ నెల, ప్రతీ వారం ఏ పని చేయాలనే అంశంపై రూపొందించిన రూట్‌మ్యాప్‌ను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు, సిబ్బందికి పంపారు. రాబోయే రబీ సీజన్‌లో జిల్లాలో కనీసం పది వేల ఎకరాల్లో మునగ సాగు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కలెక్టర్ ఆలోచనలు ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిపై ఇప్పుడు ఉంది.



టేకులపల్లి మండలంలో మునగ సాగుపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

అవగాహన తెచ్చుకొని

భద్రాద్రి జిల్లా కలెక్టర్‌గా ఈ ఏడాది జూన్ 15న జితేశ్ వి.పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కొన్నాళ్లకే అశ్వారావుపేట మండలంలో పెద్దవాగుకు గండిపడింది. బాధిత రైతులతో మాట్లాడుతున్న సందర్భంలోనే జిల్లా రైతులు తక్కువ ఆదాయం పొందుతున్న అంశాన్ని కలెక్టర్ గుర్తించారు. అప్పటి నుంచి జిల్లాలో సాగు జరుగుతున్న తీరుతెన్నులు ఆయన పరిశీలించారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా రైతులకు అధిక ఆదాయం రావాలంటే మునగ సాగే మేలనే నిర్ణయానికి వచ్చారు. అంతటితో ఆగిపోకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి పక్కా రోడ్‌మ్యాప్ రూపొందించారు. మలిదశలో మునగ సాగుతో పాటు రెండు ఎకరాల పొలంలో మునగ, వెదురు సాగుతో పాటు చేపలు, తీరోటీగల పెంపకంపై దృష్టి పెట్టనున్నారు.

క్లుప్తంగా...

యుద్ధప్రాతిపదికన ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేయాలి

రాబిన్స్ కంపెనీకి మంత్రి ఉత్తమ్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకాల పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహించి 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అమెరికన్ కంపెనీ రాబిన్స్ ప్రతినిధులను ఆదేశించారు. టన్నెల్ బోరింగ్ పనులు నిర్వహిస్తోన్న రాబిన్స్ సీఈ లాఖోమ్, సైట్ మేనేజర్ గ్లెన్‌తో గురువారం సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని, పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గుదిబండగా పాలమూరు ఎత్తిపోతల

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ లేఖ

సాక్షి,హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు రాష్ట్రానికి గుదిబండగా తయారైందని ఫోరం ఫర్‌గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) పేర్కొంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటి వరకు రూ. 31,850 కోట్లు ఖర్చు పెట్టారని, 2014లో శ్రీకారం చుట్టినా ఇప్పటి ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని ఆరోపించింది. ఇంత పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వారికి శిక్ష పడేలా చూడాలని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి లేఖ రాశారు. 2015లో మొదలై 3 సంవత్సరాలలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు 9 సంవత్సరాలు అయినా ఇంకా మధ్యలోనే ఆగి ఉందని, ఇది పూర్తి కావడానికి ఇంకా ఐదారు సంవత్సరాలు పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇంటర్ విద్య సమస్యలు పరిష్కరించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాచర్ల రామకృష్ణగౌడ్ వినతి

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ విద్యలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణ గౌడ్ కోరారు. సచివాలయంలో గురువారం ఆయన సీఎం రేవంత్‌ను కలసి ఇంటర్ విద్యలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కొత్త కాలేజీలకు సిబ్బందిని ఇవ్వాలని, 411మంది వొకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని కోరారు. కాలేజీలకు స్కావెంజర్లు, అటెండర్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం సిగ్గుపడాలి

నాడు గ్రామ స్వరాజ్యం.. నేడు అంతటా దయనీయం

విజయనగరం జిల్లా 'గుర్ల' దుస్థితే ఇందుకు నిదర్శనం

డయేరియా మృతుల కుటుంబాలకు వైఎస్ జగన్ పరామర్శ

గుర్ల మండలంలో డయేరియాతో 345 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో అంత కంటే ఎక్కువగా దాదాపు 450 మంది చికిత్స పొందారు. ఇప్పటికీ విజయనగరం జిల్లాలోని గరివిడి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో డయేరియా కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఇంకా 62 మంది చికిత్స పొందుతున్నారు. ఇంతటి దారుణమైన పరిస్థితి ఉంటే ప్రభుత్వం పట్టించుకోకపోగా ఏం చేస్తోంది? ఏదైనా ఇష్యూ జరిగితే దాన్ని ఎలా డైవర్ట్ చేయాలి.. ఎలా కవరప్ చేయాలి.. అది అసలు జరగనట్లు ఎలా చూపించాలి.. అన్న దిక్కుమాలిన ఆలోచన చేస్తోంది. అందుకు ప్రభుత్వ పెద్దలు సిగ్గుతో తలదించుకోవాలి.



విజయనగరం జిల్లా గుర్లలో భర్తను కోల్పోయిన కన్నమ్మను ఓదారుస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మేము విపక్షంలో ఉన్నప్పటికీ పార్టీ తరఫున బాధితులను ఆదుకుంటాం. డయేరియాతో చనిపోయిన 14 మంది కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తాం. ప్రతిపక్షంలో ఉన్న మేమే సాయం చేయడానికి ముందుకు వచ్చాం. అధికారంలో ఉన్న మీకు (చంద్రబాబు) మరింత బాధ్యత ఉంటుంది. మరి మీరు ఎంత ఇవ్వబోతున్నారో చెప్పండని సూటిగా ప్రశ్నిస్తున్నాం.

- వైఎస్ జగన్

- సమస్య వచ్చినప్పుడల్లా చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్
- మీ ఇళ్లలో ఎటువంటి కుటుంబ గొడవలు ఏం లేవా?
- చంద్రబాబు, ఎల్లో మీడియా స్వార్థం కోసం నిజాలు వక్రీకరించొద్దు

> "జగన్ గుంటూరుకు వస్తున్నాడు.. గుర్లకు వస్తున్నాడు.. అనే సరికి మళ్లీ టాపిక్ డైవర్ట్. మా చెల్లెలు, మా అమ్మ ఫొటోలు పెడతారు. అయ్యా చంద్రబాబూ.. ఆంధ్రజ్యోతి రాధాకృష్ణా.. ఈనాడు.. టీవీ5.. మిమ్మల్ని అందరినీ ఒకటే అడుగుతున్నా.. మీ ఇళ్లలో ఇటువంటి కుటుంబ గొడవలు ఏం లేవా? ఇవన్నీ ఘర్ ఘర్‌కీ కహానీలు. ప్రతి ఇంట్లో ఉన్న విషయాలే. వీటిని మీ స్వార్థం కోసం పెద్దవి చేసి, నిజాలను వక్రీకరించి చూపడం మానుకుని ప్రజల మీద ధ్యాస పెట్టండి. ప్రజల కష్టాల్లో పాలు పంచుకోవాలని చంద్రబాబుకు చెబుతున్నా.. మీడియా ముసుగులో చంద్రబాబును మోస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5తో పాటు దత్తపుత్రుడిని కూడా అడుగుతున్నా."

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ స్వరాజ్యం సాకారమైతే, కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే పరిస్థితులు ఎంత దారుణంగా మారాయనేదానికి 'గుర్ల' డయేరియా ఘటనే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా సమస్య వస్తే పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. బాధ్యత మరచి దాన్ని కప్పిపుచ్చుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుండటం సిగ్గు చేటని మండిపడ్డారు. కనీసం తాగునీటి క్లోరినేషన్ కూడా చేయని ఫలితంగా డయేరియా విజృంభించి విజయనగరం జిల్లా గుర్లలో 14 మంది చనిపోయిన దారుణ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. గురువారం ఆయన మృతుల కుటుంబాల వద్దకు వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతికి దారితీసిన పరిస్థితులను, ఇతరత్రా అన్ని వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. ప్రభుత్వం నుంచి పైసా సాయం కూడా అందలేదన్న వారి ఆవేదన విని చలించిపోయారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం నుంచి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగారు. 'వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల్లో నాలుగు అడుగులు వేస్తే విలేజ్ క్లినిక్స్ కనిపించేవి. అక్కడే రోజంతా, వారంలో ఏడు రోజుల పాటు అక్కడే నివాసం ఉండే సీహెచ్‌ఓలు కనిపించే వారు. వారికి అనుసంధానంగా ఏఎన్‌ఎంలు, వారికి రిపోర్ట్ చేస్తూ ఆశా వర్కర్లు కనిపించే వారు. విలేజ్ క్లినిక్స్‌తో పాటు ఒక పటిష్టమైన వ్యవస్థ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నడిచేది. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్స్‌ను అనుసంధానించి పీహెచ్‌సీల్లో డాక్టర్ల సంఖ్యను పెంచి, ప్రతి గ్రామానికి 15 రోజులకు ఒకసారి డాక్టర్లు వచ్చే వ్యవస్థ ఉండేది. అదే గ్రామంలో నాడు–నేడుతో బాగు పడిన స్కూళ్లలో పిల్లలు నవ్వుతూ కనిపించే వారు. రైతన్నలను చేయి పట్టుకుని నడిపించే రైతు భరోసా కేంద్రాలు కనిపించేవి. చక్కగా ఈ–క్రాపింగ్ జరిగేది. రైతులకు ఉచిత పంటల బీమా, పెట్టుబడి సాయం అందేది. సచివాలయంలో పనులు చేసిపెట్టే ఉద్యోగులు కనిపించే వారు. ఈ రోజు అవేవీ లేవు. గ్రామ స్వరాజ్యం దయనీయంగా తయారైందని చెప్పడానికి గుర్ల గ్రామం ఒక ఉదాహరణ' అని మండిపడ్డారు.

డైవర్షన్ పాలిటిక్సే చంద్రబాబు రాజకీయం

- ప్రతి అడుగులో ఈ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. ఏదైనా ఇష్యూ వస్తే దానిని డైవర్ట్ చేసేలా అడుగులు వేస్తోంది. ఈ ప్రభుత్వం తీరుపై మేము ఢిల్లీలో ధర్నా చేస్తే, ఆ రోజు మదనపల్లెలో ఏదో అగ్ని ప్రమాదం జరిగితే ఏకంగా హెలికాప్టర్‌లో డీజీపీని, అధికారులను పంపింది. అదే ఇక్కడ (గుర్లలో) 14 మంది చనిపోతే హెలికాప్టర్ కాదు కదా.. కనీసం మంత్రులు వచ్చి బాధిత కుటుంబాలను పలకరించలేదు.
- ఈ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైంది. ఎన్నికల ముందు సూపర్ సిక్స్.. సెవెన్.. అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి.. చిన్న పిల్లలు కనబడితే నీకు రూ.15 వేలు అని, ఆ పిల్లల తల్లులు కనబడితే నీకు రూ.18 వేలు అని, ఆ ఇంట్లో పిల్లల పెద్దమ్మలు కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, ఇంకా ఆ ఇంట్లో 20 ఏళ్ల వయసున్న వారు కనబడితే నీకు రూ.36 వేలు అని, ఆ ఇంట్లో ఎవరైనా కండువా వేసుకున్న రైతు కనిపిస్తే నీకు రూ.20 వేలు అని చెప్పి నమ్మించి మోసం చేశారు. ఇప్పుడు ప్రజలు ఇవన్నీ నిలదీస్తారని చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ.. తిరుపతి లడ్డూపై దుష్ప్రచారం చేశారు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలబడాల్సి ప్రతి సందర్భంలోనూ చంద్రబాబు ఇలా తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. ప్రతి దాంట్లోనూ డైవర్షన్. అదే చంద్రబాబు రాజకీయం.
- జగన్ గుంటూరుకు వస్తున్నాడు.. గుర్లకు వస్తున్నాడనే సరికి మళ్లీ టాపిక్ డైవర్ట్. మా చెల్లెలు, అమ్మ ఫొటో పెడతారు. అయ్యా చంద్రబాబూ.. ఆంధ్రజ్యోతి రాధాకృష్ణా.. ఈనాడు.. టీవీ5.. దత్తపుత్రా.. మిమ్మల్ని అందరినీ ఒకటే అడుగుతున్నా. మీ ఇళ్లలో ఇటువంటి కుటుంబ గొడవలు ఏం లేవా? మీ స్వార్థం కోసం నిజాలను వక్రీకరించడం మానుకుని ఇకనైనా ప్రజల మీద ధ్యాస పెట్టండి.
- ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అక్కచెల్లెమ్మల జీవితాలు చెల్లాచెదురవుతున్నాయి. చిన్న పిల్లల జీవితాలు నాశనమవుతున్నాయి. శాంతి భద్రతలు కుదేలైపోయాయి. ప్రభుత్వం మాది అని చెప్పి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు విచ్చలవిడిగా అక్కచెల్లెమ్మలు, చిన్న పిల్లల మీద దాడులు చేస్తున్నారు. ఇప్పటికైనా బాధితులకు క్షమాపణలు చెప్పి, వారికి సహాయం చేసేందుకు ప్రభుత్వం అడుగులు ముందుకు వేయాలి. ఈ ప్రభుత్వానికి ఇకనైనా బుద్ధి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.

ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా మహేశ్వరరావు, ధనశేఖర్, గుణ రంజన్

రాష్ట్రపతి ముర్ము ఆమోదముద్ర



మహేశ్వరరావు



గుణ రంజన్



చంద్ర ధనశేఖర్

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా మహేశ్వరరావు కుంచం, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణ రంజన్ నియమితులయ్యారు. వీరి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ ముగ్గురి నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్లు వీరు అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారు. తరువాత శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులవుతారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో చివ్వెంల మారుతి సంఘ బృందం ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కలెక్టర్ నందలాల్

అందరి భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యం

- స్వచ్ఛభారత్ ఉద్యమం లాంటిది
- సూర్యాపేట పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ


సూర్యాపేట: అందరి భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. 2047 నాటికి ఇండియా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని ఆయన ఆకాంక్షించారు. జిష్ణుదేవ్‌వర్మ గురువారం సూర్యాపేట జిల్లాలో పర్యటించారు. మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్లు సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో సూర్యాపేట జిల్లాలోని 475 గ్రామపంచాయతీలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం సంతోషకరమన్నారు. 2021లో 73 శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమని, ఇందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో సమర్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో రక్తహీనతను నివారించేందుకు ఉపయోగపడుతుందన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని, భవిష్యత్ అభివృద్ధి మహిళా సాధికారతపై ఆధారపడి ఉందన్నారు.

రాష్ట్రంపై ప్రపంచం దృష్టి: మంత్రి ఉత్తమ్

తెలంగాణ ఏర్పడిన తక్కువ వ్యవధిలోనే దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, తలసరి ఆదాయంలో సైతం అగ్రగామిగా ఉన్న రాష్ట్రంగా ముందుకు వెళుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రత్యేకించి ఐటీ, సాఫ్ట్‌వేర్, ఫార్మా, సైన్స్ రంగాల్లో తెలంగాణ.. దేశంలోనే కాకుండా, ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఈ వానాకాలం 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాష్ట్రంలో వస్తుందని చెప్పారు. ధాన్యం సేకరణకు రూ.20వేల కోట్లు అడ్వాన్స్‌గా ఉంచినట్టు తెలిపారు. అంతకుముందు సూర్యాపేట జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వివరించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులు, వారి వారి రంగాల్లో చేసిన కృషిని గవర్నర్‌తో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవానీశంకర్, సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

- ఒక్కో కార్మికునికి రూ.93,750 బోనస్ చెల్లింపు
- ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం




సాక్షి, హైదరాబాద్: ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్ (పీఎల్‌ఆర్‌ఎస్) కింద సింగరేణి కార్మికులకు శుక్రవారం మధ్యాహ్నం కల్లా రూ.358 కోట్ల దీపావళి బోనస్‌ను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సింగరేణి సంస్థపై గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గతేడాది కంటే ఈ సారి రూ.50 కోట్లను అధికంగా చెల్లిస్తున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.93,750 చొప్పున సంస్థలోని 40 వేల మంది కార్మికులకు బోనస్‌ను అందజేయనున్నారు. ఈ ఏడాది కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరపాలని భట్టి ఆదేశించారు.

నెలలో రూ.1,250 కోట్ల చెల్లింపు

సింగరేణి ఉద్యోగులకు సంస్థ లాభాల్లో 33 శాతం వాటా కింద రూ.796 కోట్లను దసరా సందర్భంగా కంపెనీ చెల్లించింది. ఒక్కో కార్మికుడు సగటున రూ.లక్షా 90 వేలను అందుకున్నాడు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా రూ.5 వేల చొప్పున చెల్లించారు. పండుగ అడ్వాన్స్ కింద ఒక్కో కార్మికునికి రూ.25 వేలు చొప్పున మరో రూ.90 కోట్లను కంపెనీ చెల్లించింది. లాభాల వాటా, పండుగ అడ్వాన్స్, దీపావళి బోనస్ కలిపి నెల రోజుల వ్యవధిలో సంస్థ రూ.1,250 కోట్లను చెల్లిస్తోంది. దీనివల్ల ఒక్కో కార్మికుడికి రూ.3 లక్షల వరకు ప్రయోజనం కలుగుతోందని సంస్థ తెలిపింది.

బరాజ్‌ల నిర్ణయం కేసీఆర్‌దే!

- నాటి సీఎం అధ్యక్షతన జరిగిన సమావేశంలోనే కాళేశ్వరంపై నిర్ణయాలు
- పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపిన రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు
- ఆరు గంటల క్రాస్ ఎగ్జామినేషన్‌లో 128 ప్రశ్నలు సంధించిన కమిషన్



కమిషన్ కార్యాలయానికి వెళ్తున్న రిటైర్డ్ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించాలని నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావే నిర్ణయం తీసుకున్నారని నీటిపారుదల శాఖ రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు చెప్పారు. 2016 జనవరిలో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన ఓ సమావేశంలోనే ఈ మేరకు నిర్ణయం జరిగిందని పేర్కొన్నారు. వ్యాప్కోస్ రూపొందించిన కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని, కేసీఆర్ స్వయంగా సంతకం చేశారని అన్నారు. ఈ డీపీఆర్ ఆధారంగా వివిధ కాంపోనెంట్ల అంచనాలను సిద్ధం చేయాలని కేసీఆర్ ఆదేశించారని వివరించారు. బరాజ్‌లను ఎక్కడ కట్టాలో ప్రభుత్వమే చెప్పగా, ఆ మేరకు డీపీఆర్‌ను వ్యాప్కోస్ సిద్ధం చేసిందన్నారు. నిర్మాణ దశలో అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల స్థలాలను మార్చినట్టు చెప్పారు. గ్రావిటీ కాల్వ పొడవు తగ్గించడం, నిల్వ సామర్థ్యం పెంచడం, అటవీ భూముల సేకరణను తగ్గించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం ఆరు గంటల పాటు నిర్వహించిన రెండో విడత ఎగ్జామినేషన్‌లో వెంకటేశ్వర్లు ఈ మేరకు వివరణ ఇచ్చారు. తొలి విడతలో ఆయనకు 71 ప్రశ్నలు వేసిన కమిషన్.. తాజాగా రెండో విడతలో ఏకంగా 128 ప్రశ్నలు సంధించింది. శుక్రవారం కూడా క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరుకావాలని ఆదేశించింది.

నిర్మాణ దశలో మార్పులు

'డీపీఆర్‌ను 2016 మార్చిలో కేంద్ర జల సంఘానికి(సీడబ్ల్యూసీ) సమర్పించిన తర్వాత నిర్మాణంలో పలు మార్పులు, చేర్పులపై నిర్ణయాలు జరిగాయి. డీపీఆర్‌లో అన్ని కాంపోనెంట్లు లేవు. గైడ్‌బండ్, ఫ్లడ్ బ్యాంకులు, డైవర్షన్ చానల్స్‌ను తర్వాత చేర్చాం. నిర్మాణ దశలో సైట్ పరిస్థితుల ఆధారంగా మరికొన్ని మార్పులు చేశాం. స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్సీ)లో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ మార్పులు జరిగాయి. డీపీఆర్‌లో అన్నారం బరాజ్‌ను 120 మీటర్ల ఎత్తులో నిర్మించాలని ప్రతిపాదించగా, అటవీ భూముల ముంపు, సైట్ పరిస్థితుల ఆధారంగా 119 మీటర్లకు కుదించాం. ప్రాథమికంగా మూడు బరాజ్‌లకు వేర్వేరు డీపీఆర్‌లను తయారు చేయగా, తర్వాత ఉమ్మడి డీపీఆర్‌ను తయారు చేశాం..' అని కమిషన్‌కు వెంకటేశ్వర్లు తెలిపారు.

సీడబ్ల్యూసీ చెప్పడంతోనే రీఇంజనీరింగ్

'ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు 2007లో రూ.17,875 కోట్లతో అనుమతిచ్చి 2008లో రూ.38,500 కోట్లకు అంచనాలను పెంచి రూ.6,156 కోట్ల పనులు సైతం పూర్తి చేశాక 2 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టు కోసం రీఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించాల్సిన అవసరం ఏమిటి?' అని కమిషన్ నిలదీసింది. 'తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బరాజ్‌కు మహారాష్ట్ర అభ్యంతరం తెలపడంతో 148 మీటర్లకు ఎత్తు తగ్గించి ఒప్పందం చేసుకున్నాం. ఆ ఎత్తులో బరాజ్ కడితే 44 టీఎంసీల లభ్యతే ఉంటుంది. తుమ్మిడిహెట్టి వద్ద నీటిలభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పడంతోనే రీఇంజనీరింగ్ చేశారు' అని వెంకటేశ్వర్లు వివరించారు.

మ్యాథమెటికల్లీ తప్పుడు నిర్ణయమే !

ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా రెండుదశల్లో కలిపి 304 మెగావాట్ల పంపుల సామర్థ్యంతో నీళ్లను ఎత్తిపోయడానికి వీలుండగా రీఇంజనీరింగ్ చేసి పంపుల సామర్థ్యాన్ని 11 వేల మెగావాట్లకు పెంచడం సరైందేనా అని కమిషన్ ప్రశ్నించగా, గణితపరంగా తప్పుడు నిర్ణయమేనని మాజీ ఈఎన్సీ పేర్కొన్నారు. కోల్‌బెల్ట్ ఏరియాలో మేడిగడ్డ బరాజ్ నిర్మించారా? అని ప్రశ్నించగా వాస్తవం కాదని ఆయన బదులిచ్చారు. బరాజ్ ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలున్నట్టు జాదవ్‌పూర్ వర్సిటీ ఇచ్చిన నివేదికను ప్రస్తావించగా దానితో తాను ఏకీభవించనని చెప్పారు. ప్రభుత్వ అధినేత ఆదేశాలతో బరాజ్‌లలో నీళ్లను నిల్వ చేశామని మరో ప్రశ్నకు బదులిచ్చారు. బెంగాల్ సహా 4 రాష్ట్రాల్లో నిర్మించిన బరాజ్‌లలో సికెంట్ పైల్స్ వాడినట్టు చెప్పగా.. తన స్వరాష్ట్రం బెంగాల్ పేరును ఉటంకించడంపై జస్టిస్ ఘోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు ఉచిత పరికరాలు

- గతంలో 75% వైకల్యం ఉంటేనే అర్హత
- ఇప్పుడు 40 శాతం దాటితే చాలు..
- 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ (టీవీసీసీ) కార్యాచరణ రూపొందిస్తోంది. దివ్యాంగులకు ఇచ్చిన పరికరాలకు సంబంధించి అర్హతల్లో మార్పులు చేయాలని టీవీసీసీ భావిస్తోంది. గతంలో 75 శాతం వైకల్యం ఉన్న వారికే పరికరాలు పంపిణీ చేయగా ఇప్పుడు బెంచ్ మార్క్ వైకల్యం (40 శాతం పైబడిన) ఉన్న వారికి కూడా ఉదారంగా పరికరాలు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తోంది. మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్‌లు, విద్యార్థి నేస్తం పేరిట వృత్తివిద్యా కోర్సులు చదివే దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించాలని టీవీసీసీ మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానించింది. అంధ, బధిర విద్యార్థులకు 5జీ ఫోన్లు, బ్రెయిలీ కిట్స్‌ను పంపిణీ చేయాలని కమిటీ తాజా సమావేశంలో నిర్ణయించారు. ముందుగా 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

బాబు వదిలిన కుట్ర బాణం

సొంత అన్న టార్గెట్‌గా షర్మిల అడుగులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా చంద్రబాబు వేస్తున్న ఎత్తుగడల్లో షర్మిల పూర్తిగా కూరుకుపోయారు. జగన్ వ్యతిరేకులందరితోనూ చేతులు కలిపి ఇటీవల ఎన్నికల్లో దారుణమైన అసత్యారోపణలు చేసిన షర్మిల.. ఇప్పుడు మరింత దిగజారిపోతున్నారు. అక్రమ కేసులెదుర్కొంటున్న జగన్‌ను న్యాయపరంగా ఇబ్బంది పెట్టాలన్న బాబు కుట్రలో పూర్తిగా లీనమైపోయారు.

గత్యంతరం లేక షర్మిలతో వైఎస్ జగన్ రాజీకి వచ్చారంటూ ఎల్లో మీడియా ఇస్తున్న కథనాలు... తల్లికి, చెల్లెలికి ఆస్తి ఇవ్వకుండా జగన్ కోర్టు మెట్లు ఎక్కారంటూ జాతీయ మీడియాలో వస్తున్న అర్ధసత్యాలు.. జగన్ లక్ష్యంగా టీడీపీ సోషల్ మీడియా కారుకూతలు... ఇవన్నీ ఈ కుట్రలో భాగమే.

అసలు వైఎస్ జగన్ ఆస్తులతో షర్మిలకు సంబంధమేంటి? కుటుంబ ఆస్తులన్నిటినీ తమ తండ్రి వైఎస్సార్ జీవించి ఉన్నపుడే పంపకాలు చేసేసినా.. చెల్లెలి పట్ల ప్రేమాభిమానాలతో తను సొంతంగా సంపాదించుకున్న ఆస్తుల్లోనూ వాటా ఇస్తానన్న జగన్‌ను షర్మిల ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? షర్మిల ఎలాంటి కుట్రల్లో భాగమవుతున్నారు? భావోద్వేగాలతో తల్లిని ముందుపెట్టి షర్మిల ఎలాంటి ప్రమాదకర క్రీడ ఆడుతున్నారు? ఒకసారి చూద్దాం.


షర్మిలకు పాతికేళ్ల కిందటే వివాహమైంది. ఆమెకు సొంత ఆస్తులూ ఉన్నాయి. పైపెచ్చు వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పాటు తాను సంపాదించిన ఆస్తులను కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి తను జీవించి ఉన్నప్పుడే కుటుంబీకులకు పంపకాలు చేశారు. దీన్లో భాగంగా షర్మిలకు పలు భూములు, పవర్ ప్రాజెక్టులతో సహా విలువైన ఆస్తులెన్నో దక్కాయి. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి వివాదాలూ లేవు. అందుకే వైఎస్సార్ మరణించాక ఆస్తులకు సంబంధించి ఆయన కుటుంబీకుల మధ్య ఎలాంటి వివాదాస్పద అంశాలూ తలెత్తలేదు.


సాక్షి, హైదరాబాద్: వైఎస్ జగన్‌కు తొలి నుంచీ వ్యాపార రంగంపై ఆసక్తి. స్వయంకృషితో కొన్ని వ్యాపారాలు ప్రారంభించి విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగారు. మరికొన్ని వ్యాపారాల్లో పెట్టుబడులు కూడా పెట్టారు. ఇవన్నీ ఆయన సొంతంగా చేసినవి కావటంతో వీటికి, కుటుంబ వారసత్వానికి ఎలాంటి సంబంధమూ లేదన్నది స్పష్టం. అందుకే వైఎస్సార్ జీవించి ఉన్నపుడు సైతం ఈ ఆస్తులు వైఎస్ జగన్ పేరిటే ఉన్నాయి. ఒక్కో మెట్టుగా ఆ సంస్థలను అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు జగన్. ఇక వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో మరణించాక జగన్‌ను తమ దారిలోకి తెచ్చుకోవటానికి కాంగ్రెస్ అధిష్టానం సామ దాన భేదోపాయాలకు దిగటం... అయినా లొంగకపోవటంతో చంద్రబాబుతో చేతులు కలిపి దండోపాయం పన్నటం... జగన్ వ్యాపారాల్లోకి వచ్చిన పెట్టుబడులన్నీ అక్రమమంటూ కేసులు బనాయించడం... ఇవన్నీ తెలుగు ప్రజలకు తెలిసినవే. కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవి కావటంతో జగన్ వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నారే కానీ లొంగలేదు. కాంగ్రెస్– టీడీపీ కుట్రలో భాగంగా జైలు పాలైన వైఎస్ జగన్... 2019లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఇవీ... చెల్లెలి పట్ల ప్రేమాభిమానాలంటే

2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తోడబుట్టిన చెల్లెలికి కూడా ఆర్థికంగా ఏదైనా చేయాలని సంకల్పించారు జగన్. ఆమెపై ఉన్న ప్రేమాభిమానాలతో తాను సొంతంగా ఆరంభించి అభివృద్ధి చేసుకున్న వ్యాపారాల్లో, తాను సంపాదించిన ఆస్తుల్లో కొంత వాటా ఇస్తానని చెప్పారు. తాను ప్రారంభించిన సాక్షి, భారతీ సిమెంట్ లాంటి విలువైన వ్యాపారాల్లో సైతం... తన వాటాలో 40 శాతాన్ని చెల్లెలికివ్వాలని జగన్ సంకల్పించారు. అదీ... కుటుంబంపై జగన్‌కున్న ప్రేమ. చెల్లెలంటే ఉన్న అభిమానం.

నిజానికి కాంగ్రెస్ అధిష్టానం కుట్రతో పెట్టిన కేసుల కారణంగా జగన్‌కు చెందిన ఆస్తులు ఇప్పటికీ చాలావరకూ ఈడీ, సీబీఐ జప్తుల్లో ఉన్నాయి. అటాచ్‌మెంట్లో ఉన్న ఆస్తులైనా, వాటిలో వాటాలైనా బదిలీ చేయటం, విక్రయించటం నిషేధం, చట్టవిరుద్ధం. అందుకే ఆయన తన ఆస్తుల్లో చెల్లెలికి ఇవ్వాలనుకుంటున్న వాటాలన్నిటినీ కోర్టు కేసులు పూర్తిగా తొలగిపోయాక బదిలీ చేస్తానని స్పష్టంగా చెప్పారు. మాటలతో ఊరుకోకుండా... కోర్టు కేసులు తొలగిపోయాక భవిష్యత్తులో తాను ఏ ఆస్తుల్ని షర్మిలకు ఇవ్వాలనుకుంటున్నదీ పొందుపరుస్తూ ఒక అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) తయారు చేశారు. తన చెల్లెలు కనక ఆమె పట్ల ఉన్న ప్రేమాభిమానాలతో ఈ ఆస్తుల్ని ఇవ్వాలని భావిస్తున్నట్లు ఎంఓయూలో స్పష్టంగా పేర్కొన్నారు. అక్రమ కేసులన్నీ తొలగిపోయాకే ఆస్తుల బదిలీ ఉంటుందని కూడా ఎంఓయూలో స్పష్టం చేశారు. వాస్తవానికి కుటుంబ ఆస్తులను వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉండగానే, ఆయనే పంపకాలు చేశారు. ఆయన మరణించిన పదేళ్ల తరవాత... జగన్ తను సొంతంగా సంపాదించుకున్న ఆస్తుల్లో సైతం చెల్లెలికి వాటా ఇవ్వాలనుకున్నారు. అదీ ఆమెపై ఉన్న ప్రేమాభిమానమంటే. ఇదీ... వాస్తవం.


Rs. 100
ONE HUNDRED RUPEES
INDIA NON JUDICIAL



చెల్లెలి పట్ల ప్రేమాభిమానాలతో తన సొంత ఆస్తుల్లో వాటాను ఆమెకు ఇవ్వాలని భావిస్తున్నట్లుగా వైఎస్ జగన్ రూపొందించిన ఎంఓయూ. సాక్షి, భారతీ సిమెంట్స్‌లో తనకున్న వాటాల్లో 40 శాతంతో పాటు పలు ఆస్తులను షర్మిలకు కేసులన్నీ తొలగిపోయాక ఇస్తానని ఈ ఎంఓయూలో ఆయన పేర్కొన్నారు.

న్యాయపరంగా ఇబ్బంది పెట్టేందుకు సరస్వతీ పవర్ షేర్ల అక్రమ బదిలీ!

వైఎస్ జగన్ తన చెల్లెలి పట్ల ప్రేమాభిమానాలతో ఇవ్వాలని సంకల్పించిన ఆస్తుల్లో సరస్వతీ పవర్ కూడా ఉంది. దీన్లో వైఎస్ జగన్ దంపతులతో పాటు వైఎస్ విజయమ్మ కూడా వాటాదారు. యాజమాన్య హక్కులు మారనంతవరకూ వాటాదార్ల మధ్య షేర్ల బదిలీ ఆమోదయోగ్యమేనన్న సాధారణ సూత్రం మేరకు అప్పటికే విజయమ్మ పేరిట 49 శాతం షేర్లను వైఎస్ జగన్ బదలాయించారు. వీటిని కేసులన్నీ తొలగిపోయాక తల్లి నుంచి షర్మిలకు బదలాయించవచ్చన్నది జగన్ ఉద్దేశం. అయితే మిగిలిన వాటా కూడా తనకివ్వాలని షర్మిల కోరటంతో... అది న్యాయవిరుద్ధం కనక కేసులన్నీ తొలగిపోయాక చేస్తానని జగన్ స్పష్టంచేశారు. అలా మాట చెప్పి ఊరుకోకుండా... చెల్లెలికి మరింత భరోసా కలిగేలా... తన నిబద్ధతను చాటుకుంటూ తల్లిని మధ్యవర్తిగా పెట్టి తల్లికి ఆ షేర్లను గిఫ్ట్‌డీడ్ రాశారు. ఆస్తుల బదిలీ చట్టవిరుద్ధం కనక గిఫ్ట్‌డీడ్‌ను పూర్తి చేయలేదు. అందుకే న్యాయ ప్రక్రియకు లోబడి కేసులన్నీ తొలగిపోయాకే షేర్లు ఇస్తానంటూ... ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు తనవద్దే ఉంచుకున్నారు. కేసులన్నీ తొలగిపోయాక, తాను షేర్ సర్టిఫికెట్లు ఇచ్చాక... తల్లి ఆ గిఫ్ట్‌డీడ్‌ను షేర్లుగా మార్చుకుని షర్మిలకు బదలాయించాలన్నది వారి ఒప్పందం. అందుకు తల్లి విజయమ్మ, షర్మిల అంతా సరేనన్నారు. ఇదిగో... ఇక్కడే కూటమి కుట్రను షర్మిల అమలు చేశారు. ఈడీ జప్తులో ఉన్న ఆస్తుల బదిలీ నిషిద్ధం కనక అలాంటివేమైనా చేస్తే జగన్ న్యాయపరంగా ఇబ్బంది పడతారు. సాంకేతికంగా ఆయన కోర్టు నిబంధనలను ఉల్లంఘించినవారవుతారు. ఈ విషయం షర్మిలకు స్పష్టంగా తెలుసు. తెలిసి కూడా... ఆయన్ను ఇబ్బంది పెట్టాలనే చంద్రబాబు కూటమి అజెండా మేరకు... తల్లి పేరిట ఉన్న గిఫ్ట్ డీడ్‌ను సోదరుడికి తెలియకుండా దుర్వినియోగం చేశారు. షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారాలు గానీ ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు గానీ.. కనీసం వైఎస్ జగన్ సంతకం గానీ లేకుండానే ఆ గిఫ్ట్ డీడ్‌ను తల్లి పేరిట షేర్లుగా మార్పించేశారు. అలా మార్చేముందు కనీసం షేర్‌హోల్డర్లను సంప్రదించాలన్న నిబంధనకు కూడా నీళ్లొదిలేశారు. వైఎస్ జగన్‌కు కనీసం సమాచారమూ ఇవ్వలేదు. మార్చడానికి షేర్ సర్టిఫికెట్లు అవసరమైనా... అవి పోయాయంటూ ఉద్దేశపూర్వకంగా అబద్ధాలకు దిగారు. జగన్ సంతకం లేకుండానే... గోప్యంగా వ్యవహారం నడిపించేశారు. ఇదండీ... జరిగిన కథ!

గోప్యత పాటించటంలో అర్థమేంటి?

మరీ ఇంతలా దిగజారిపోయి... రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపి మరీ సొంత సోదరుడిపై కుట్రలకు దిగుతున్న చెల్లెలి వ్యవహారాన్ని ఎలా చూడాలి? ఆస్తుల బదలాయింపు వల్ల తన సోదరుడు న్యాయపరంగా ఇబ్బంది పడతాడని తెలిసి కూడా... గిఫ్ట్ డీడ్‌ను షేర్లుగా మార్చుకుని దుర్వినియోగం చేశారంటే ఏమనాలి? దీనిపై జగన్‌కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా గోప్యత పాటించటంలో అర్థమేంటి?

ఆడిటర్ల తనిఖీలో వెల్లడి...

అదృష్టవశాత్తూ జగన్ సంస్థల ఆడిటర్లు రొటీన్‌గా కంపెనీలను చెక్ చేస్తున్నపుడు ఈ గిఫ్ట్ డీడ్‌ను మార్చుకున్న వ్యవహారం కాస్తా బయటపడింది. వాళ్లు అవాక్కై జగన్‌కు విషయం చెప్పారు. దీంతో జగన్ వెంటనే న్యాయ నిపుణులను సంప్రదించారు. ఇలా చేయవచ్చా? అని అడిగారు. సరస్వతీ పవర్ ఆస్తుల బదలాయింపుపై హైకోర్టు స్టే కూడా ఉన్నందున వాటి బదిలీ చట్టవిరుద్ధమని, దీన్ని తక్షణం నిలిపేయాల్సిందేనని వారు సూచించారు. దీంతో వారి సూచనల మేరకు తక్షణం ఈ గిఫ్ట్‌డీడ్ ఎగ్జిక్యూషన్‌ను నిలిపేయాలంటూ షర్మిలకు జగన్ లేఖ రాశారు. చట్టవిరుద్ధమన్న అంశాన్ని షర్మిల ఏమాత్రం పట్టించుకోకుండా... ఈ ఆస్తుల పంపకానికి సంబంధించి తండ్రి జీవించి ఉన్నపుడే చెప్పారంటూ పొంతన లేని సమాధానమిచ్చారు. పరోక్షంగా... జగన్‌ను న్యాయపరంగా ఇబ్బందిపెట్టాలన్న కూటమి కుట్రకు వంత పాడారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో... ఈ చట్టవిరుద్ధ బదిలీని నిలుపుదల చేయాలంటూ వైఎస్ జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇదీ జరిగింది.

అప్పటికే నగదుగా రూ.200 కోట్లు

2009లో వైఎస్సార్ మరణించాక 2019లో ఎంఓయూ చేసేవరకూ... అంటే పదేళ్ల వ్యవధిలో షర్మిలకు తల్లి ద్వారా, తాను సొంతంగా దాదాపు రూ.200 కోట్లను అందజేశారు జగన్. ఈ విషయాన్ని షర్మిల తన ఎన్నికల అఫిడవిట్లోనే పేర్కొన్నారు. అన్న నుంచి తీసుకున్నది అప్పుగా చూపించారామె. జగన్ తాను చెల్లెలికి ఇవ్వాలనుకుంటున్న ఆస్తులకు ఈ రూ.200 కోట్లు అదనం.

ప్రత్యర్థులతో చేతులు కలిపి మరీ..

చెల్లెలి పట్ల అభిమానంతో జగన్ తన సొంత ఆస్తులు భవిష్యత్తులో ఆమెకు సంక్రమించేలా అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసినప్పటికీ షర్మిల మాత్రం జగన్ సదుద్దేశాలకు భిన్నంగానే వ్యవహరిస్తూ వస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ఆయన మనసును గాయపరిచే రకరకాల చర్యలకు దిగారు. చంద్రబాబు కూటమి స్కెచ్‌లో భాగంగా మొదట తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిల... అక్కడ ఎన్నికల్లో పోటీ కూడా చేయకుండానే దుకాణం సర్దేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చి... రాజకీయంగా అణగదొక్కటానికి ఆయన కుటుంబాన్ని నానా ఇబ్బందులూ పెట్టిన కాంగ్రెస్ పార్టీలోనే తన పార్టీని విలీనం చేసేశారు. అంతేకాదు! ఆ విషయంలో కేసులు వేసి మరీ కాంగ్రెస్‌కు సహకరించిన చంద్రబాబు నాయుడి పంచన కూడా చేరిపోయారు. చివరికి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు తీసుకుని... చంద్రబాబుతో అంటకాగుతూ సొంత అన్నను రకరకాల అసత్యారోపణలతో ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. తన సోదరుడి పార్టీకి వ్యతిరేకంగా తల్లి చేత ఓ వీడియోలో మాట్లాడించి... ఎన్నికల ప్రచారం ముగియటానికి రెండు గంటల ముందు మోసపూరితంగా దాన్ని విడుదల చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, జగన్‌ను దెబ్బతీసి చంద్రబాబును గెలిపించడానికి శాయశక్తులా ప్రయత్నించారు.

వైఎస్ జగన్‌కు, షర్మిలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పంచిన ఆస్తుల వివరాలు..

వైఎస్ జగన్‌కు..

1. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లో ఉన్న 1,815 చదరపు గజాల బిల్డింగ్
2. పులివెందులలో 6.65 ఎకరాలు

షర్మిలకు:

1. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లో 280 చదరపు గజాల్లో ఉన్న బిల్డింగ్
2. ఇడుపులపాయలోని 51 ఎకరాల భూమి
3. 15 మెగావాట్ల ఎస్ఆర్ఎస్ హైడ్రో పవర్ ప్రాజెక్టు, స్మాల్ హైడ్రోపవర్ ప్రాజెక్టు లెసెన్స్
4. స్వస్తి పవర్ హైడ్రో ప్రాజెక్టులో 22.50 శాతం షేర్లు
5. విజయవాడ రాజ్ యువరాజ్ థియేటర్‌లో 35 శాతం షేర్లు
6. పులివెందులలో 7.6 ఎకరాలు
7. విజయలక్ష్మీ మినరల్స్ అండ్ ట్రేడింగ్ కంపెనీలో 100 శాతం వాటా

సరస్వతీ పవర్ షేర్ల బదిలీలో ఎప్పుడు ఏం జరిగిందంటే..?

2019 ఆగస్టు 31

1 వైఎస్ జగన్ – షర్మిల మధ్య ఒప్పందం: సోదర–సోదరీమణుల సంబంధానికి గుర్తుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు చెందిన కొన్ని ఆస్తులను చెల్లెలు షర్మిలకు బదిలీ చేయాలని ప్రతిపాదిస్తూ ఎంవోయూ చేసుకున్నారు. దీని ప్రకారం..

- A లీగల్ ప్రొసీడింగ్స్ ముగిసి తుది తీర్పు తర్వాత ప్రతిపాదిత బదిలీని అమలు చేయడానికి అంగీకరించారు. అంటే అప్పీలు చేసుకోవడానికి వీలులేని తుది ఉత్తర్వుల తేదీ నుంచి (ఎంవోయూలో రెండో క్లాజు)
- B అన్ని భౌతిక / నిర్మాణంలో ఉన్న ఆస్తులను తుది ఉత్తర్వులు వచ్చిన తర్వాత సాధ్యమైనంత త్వరగా షర్మిలకు స్వాధీనం చేయడం జరుగుతుంది. (ఎంవోయూలో క్లాజ్ 4.1)
- C ప్రతి స్థిరాస్తికి వైఎస్ జగన్ కన్వేయన్స్ డీడ్‌లను రిజిస్టర్ చేయాలి. (ఎంవోయూలో క్లాజ్ 3.1)
- D షేర్ల బదిలీకి సంబంధించి బదిలీ అమలు చేయడానికి అవసరమైన పత్రాలను రిజిస్టర్ చేయాలి (ఎంవోయూలో క్లాజ్ 3.2)

2019 డిసెంబర్

2 దాఖలైన అన్ని డిస్పోజబుల్ అప్పీళ్లపై యథాతథ స్థితిని కొనసాగిస్తూ తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో ఆర్డరు ఇచ్చింది.

3 గిఫ్ట్ డీడ్ జరగకముందు సరస్వతీ పవర్‌లో భాగస్వాముల వాటాలు ఇలా

వైఎస్ జగన్	29.88% వాటాతో	74,26,294 షేర్లు
వైఎస్ భారతి	16.30% వాటాతో	40,50,000 షేర్లు
వైఎస్ విజయమ్మ	1.42% వాటాతో	3,52,500 షేర్లు
సాండూర్ పవర్	18.80% వాటాతో	46,71,707 షేర్లు
క్లాసిక్ రియాల్టీ	33.60% వాటాతో	83,50,000 షేర్లు

2021 జూన్ 2

4 సరస్వతీ పవర్‌లో క్లాసిక్ రియాల్టీ, సాండూర్ పవర్ పేరిట ఉన్న 71,50,000 మరియు 46,71,707 షేర్లు వైఎస్ విజయమ్మ పేరిట బదలాయింపు

5 షేర్ల బదలాయింపు తర్వాత సరస్వతీ పవర్‌లో భాగస్వామ్య వాటాలు ఇలా..

వైఎస్ జగన్	29.88% వాటాతో	74,26,294 షేర్లు
వైఎస్ భారతి	16.30% వాటాతో	40,50,000 షేర్లు
వైఎస్ విజయమ్మ	48.99% వాటాతో	1,21,74,207 షేర్లు
క్లాసిక్ రియాల్టీ	4.83% వాటాతో	12,00,000 షేర్లు

6 **2021 జూలై 19** షర్మిల సూచనల మేరకు సరస్వతీ పవర్‌లో జనార్దన్‌రెడ్డి చాగారి కొత్త డైరెక్టర్‌గా నియామకం

7 **2021 జూలై 23** వైఎస్ విజయమ్మతో ఒప్పందం (ఎంవోయూ): పెండింగ్‌లో ఉన్న కోర్టు ప్రొసీడింగ్‌ల గురించి వైఎస్ విజయమ్మకు పూర్తి అవగాహన ఉంది. కోర్టు తుది తీర్పునకు లోబడి సరస్వతీ పవర్‌లో షేర్ల బహుమతిని అంగీకరించాల్సి ఉంటుందన్నది కూడా ఆమెకు తెలుసు.

8 **2021 జూలై 26** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన **74,26,294** షేర్లు, వైఎస్ భారతికి చెందిన **40,50,000** షేర్లు అన్ రిజిస్టర్ గిఫ్ట్ డీడ్ కింద బహుమతిగా ఇవ్వడం జరిగింది.

9 **2021 ఆగస్టు 14** డైరెక్టర్ల మార్పు: వైఎస్ జగన్ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న డైరెక్టర్లు జేజే రెడ్డి, ఏ.వేణుగోపాల్ రాజు బోర్డుకు రాజీనామా చేశారు. షర్మిల రికమెండేషన్ ప్రకారం కె.యశ్వనాథ్‌రెడ్డి డైరెక్టర్‌గా నియామకం.

10 **2024 జూలై 2**

ఆర్థిక సంవత్సరం 2022–23కి సంబంధించి సరస్వతీ పవర్ వార్షిక సర్వసభ్య సమావేశం జరుగుతుందని నోటీసు జారీ. కానీ ప్రస్తుత భాగస్వాములుగా ఉన్న వైఎస్ జగన్, వైఎస్ భారతి, క్లాసిక్ రియాల్టీలకు ఈ నోటీసులు ఇవ్వలేదు. ఈ నోటీసులో 14వ పాయింటుగా పేర్కొన్న కీలక అంశం ఏంటంటే..

1 ఏప్రిల్ 2023 నుంచి 24వ ఏజీఎం జూలై 15, 2024 మధ్య కాలంలో బ్యాలెన్స్‌షీట్‌లో జరిగిన షేర్ల బదిలీ గురించి అని పేర్కొన్నారు. వైఎస్ జగన్, వైఎస్ భారతికి చెందిన షేర్లు వైఎస్ విజయమ్మ పేరిట 2024 జూలై 6న బదలాయింపు జరిగినట్లు పేర్కొన్నారు.

- జూలై 2, 2024 ఇచ్చిన నోటీసులో భవిష్యత్ బదిలీ తేదీ జూలై 6, 2024గా పేర్కొన్నారు.
- ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు మాత్రం వైఎస్ జగన్, వైఎస్ భారతి, క్లాసిక్ రియాల్టీ పేరుతోనే ఉన్నాయి.
- షేర్ ట్రాన్స్‌ఫర్ డీడ్‌లపై వాటాదారులెవరూ సంతకం చేయలేదు.
- రిజిస్టర్ చేయని గిఫ్ట్ డీడ్‌ల అమలు గురించి ప్రస్తుత డైరెక్టర్లు ఎలాంటి విచారణ చేయలేదు.
- షేర్ల బదిలీకి సంబంధించి క్లాసిక్ రియాల్టీ నుంచి ఎటువంటి పత్రం లేదు.
- చెల్లుబాటు అయ్యే ఎటువంటి పత్రాలు లేకుండా పై లావాదేవీలు చేసినందుకు జనార్దనరెడ్డి చాగరి పేరు మీద 62,126 షేర్లు బదిలీ చేయబడ్డాయి.

11 2024 ఆగస్టు 27: షర్మిలకు లేఖ రాసిన వైఎస్ జగన్
12 2024 సెప్టెంబర్ 3: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)లో పిటిషన్ దాఖలు
13 2024 సెప్టెంబర్ 12: వైఎస్ జగన్‌కు లేఖ రాసిన షర్మిల
14 2024 సెప్టెంబర్ 17: షర్మిలకు లేఖ రాసిన వైఎస్ జగన్


HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD

సరస్వతీ పవర్‌లోని వాటాల బదిలీలపై స్టే ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేసిన పిటిషన్ మేరకు... స్టే మంజూరు చేస్తూ 2019 డిసెంబరు 2న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కాపీ



'నాన్న ఉండగానే మన మధ్య ఆస్తుల పంపకాలు పూర్తయ్యాయి. ఆ తర్వాత నా కృషితో కొన్ని వ్యాపారాలు ప్రారంభించాను. ఆస్తులు సంపాదించాను. వీటికి వారసత్వంతో సంబంధం లేదు. అయినా కేసులన్నీ పూర్తికాగానే ఆ మేరకు వాటా ఇస్తానన్నాను' అని చెల్లితో తన అనుబంధాలను గుర్తు చేసుకుంటూ ఆగస్టు 27వ తేదీన వైఎస్ జగన్.. షర్మిలకు రాసిన లేఖ.



మన మధ్య ఆస్తుల పంపకం నాన్న ఉండగానే పూర్తయింది. అయినా 2019లో.. అప్పటికి నాన్న చనిపోయి 10 ఏళ్లు, నీ వివాహం జరిగి 20 ఏళ్లయింది. అప్పటికీ చెల్లివనే ప్రేమ, మమకారంతో నేను సంపాదించిన ఆస్తుల్లో కూడా వాటా ఇద్దామనుకున్నా, ఆ మేరకు ఎంవోయూ కూడా చేశాను' అని వాస్తవాలు వివరిస్తూ గత నెల 17న జగన్.. షర్మిలకు రాసిన లేఖ.

ఇంకా ఎంఓయూకు కట్టుబడి ఉండాలా?

అసలు చెల్లెలికి జగన్ తన సొంత ఆస్తుల్లో వాటా ఎందుకు ఇస్తానన్నారు? ఆమెపై ఉన్న ప్రేమాభిమానాలతోనే కదా? పైపెచ్చు మాటలతో సరిపెట్టకుండా తాను ఇస్తానన్న ఆస్తుల వివరాలతో ఒక ఎంవోయూను కూడా రూపొందించారాయన. ఆ ఆస్తులకు సంబంధించి కేసులున్నాయి కనక... అవన్నీ తొలగిపోయాకే బదిలీ చేస్తానని అదే ఎంఓయూలో స్పష్టంగా పేర్కొన్నారు. మరి అలాంటి అన్నను ఇబ్బంది పెట్టడానికి షర్మిల ఇన్ని రకాల కుయుక్తులకు దిగుతుంటే ఏమనుకోవాలి? చివరకు ఆ ఎంఓయూను కూడా ఉల్లంఘిస్తూ తల్లి పేరిట ఉన్న గిఫ్ట్‌డీడ్‌ను షేర్లుగా మార్చుకున్నారంటే ఆమెకు ఎంఓయూ పట్ల, చట్టం పట్ల గౌరవం లేదనేగా అర్థం. సొంత అన్నను ఇబ్బంది పెట్టడమే ఏకైక లక్ష్యంగా సాగుతున్నారని తెలియటం లేదా? మరి ఇంకా ఆ ఎంఓయూకు కట్టుబడి ఉండాల్సిన అవసరం జగన్‌కు ఉందా? ఇదిగో... ఇదే విషయాల్ని పేర్కొంటూ గత నెలలో సోదరికి లేఖ రాశారు జగన్. షేర్ల బదిలీ చట్టవిరుద్ధం కనక దాన్ని నిలిపేయాలన్నారు. దానికి షర్మిల సమాధానమిస్తూ... తండ్రి బతికి ఉన్నప్పుడే ఈ మేరకు ఒప్పుకున్నారని పొంతన లేని సమాధానమిచ్చారు. తండ్రి చెప్పిన ప్రకారమే అయితే, అదే విషయాన్ని ఎంవోయూలో పేర్కొనేవారు కదా? చెల్లెలు కనక ప్రేమాభిమానాలతో ఈ ఆస్తులిస్తున్నట్లు ఎందుకు పేర్కొంటారు? అది కూడా తండ్రి మరణించిన పదేళ్ల తరవాత అలా ఎందుకు చేస్తారనే ప్రశ్నకు ఆమెవద్ద సమాధానం లేదు. పైపెచ్చు జగన్ ఇస్తానన్న ఆస్తులన్నీ ఆయన సొంతంగా ఆర్జించినవి. ఆయన పెట్టుబడులు పెట్టి నిర్మించినవి. ఆ వ్యాపారాలకు సంబంధించి జగన్ పలు అక్రమ కేసులనూ ఎదుర్కొంటున్నారు. ఇవే కేసుల్లో ఏడాదిన్నర పాటు జైల్లో కూడా ఉండి వచ్చారు. వీటికి సంబంధించి పెట్టుబడుల్లో కానీ, వ్యాపార నిర్మాణంలో గానీ షర్మిలకు ఏమాత్రం భాగం లేదు. ఒక్కరోజు కూడా ఆ వ్యాపారాలను చూసిన సందర్భాలు లేవు. ఒక్క రూపాయి పెట్టుబడి కూడా లేదు. మరి అలాంటి వ్యాపారాల్లో, ఆస్తుల్లో తనకు హక్కుందని ఎలా అంటారు? ఆమెకు నిజంగానే హక్కులు ఉండి ఉంటే ఆమె కూడా కేసులు ఎదుర్కోవాలి కదా? కానీ ఆమె ఏ కేసునూ ఎదుర్కోవటం లేదే? పైపెచ్చు జగన్‌పై అక్రమంగా ఈ కేసులు బనాయించిన కాంగ్రెస్‌కు ఇప్పుడామె నాయకురాలు. కేసులు ఎదుర్కొంటున్న జగన్‌ను ఇబ్బంది పెడుతూనే... జగన్ ఆస్తులు మాత్రం తనకు చెందాలనుకోవటంలోనే షర్మిల వ్యవహార శైలిని అర్థం చేసుకోవచ్చు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 25-10-2024



• పుప్పొడి నేత
పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే!
వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే!
అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి.
అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది.
'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్



శివాని నేత

ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్లభామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ



మన్నిదా బాను

ప్రాణం నిలిపి

స్త్రీ శక్తి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు ఢీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సైన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.



రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై–రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి





అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికేట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.

పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.



– వివిఎమ్ఆర్
ఫోటోలు: ఎస్ఎస్ ఠాకూర్

సూజీ బ్రెడ్

హెల్దీ డైట్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; ఇన్‌స్టంట్ ఈస్ట్ – టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; నీరు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; వెన్న – టీ స్పూన్; సీడ్స్ – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అరగంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో
ఆటోనో స్కూటరో కారో
బుక్ చేయొచ్చు. వస్తుంది.
కాని ఒంటెను బుక్ చేయొచ్చా?
దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు
ఎడారిలో తప్పిపోయారు.
ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు.
ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు.
ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న
ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

మెరిసే మేని ఛాయను కాపాడుకోవాలంటే..

బ్యూటిప్స్

- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.



- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.

● విన్నర్

సోల్జర్ సుప్రీత



'సోల్జర్ సుప్రీత' అనిపించుకోవాలనేది ఆమె కల. సైన్యంలో పని చేయడం అంటే మాటలు కాదు ఎన్నో కష్టాలు ఉంటాయి. ఆ కష్టాలను ఇష్టంగా స్వీకరించి తన కలను నెరవేర్చుకుంది గోదావరిఖనికి చెందిన సుప్రీత. పేద కుటుంబం కావడంతో డిగ్రీ చదువుకునేందుకు పార్ట్‌టైం ఉద్యోగం చేసింది సుప్రీత.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాసి బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. పశ్చిమ బెంగాల్‌లోని బైకంతాపూర్‌లో శిక్షణ పూర్తి చేసుకొని ఇండియా– బంగ్లాదేశ్ బార్డర్‌లో విధులకు సిద్ధమైంది సోల్జర్ సుప్రీత. బీఎస్ఎఫ్ జవాన్‌గా తన కలను నిజం చేసుకున్న సుప్రీతను ఆమె చదివిన కరీంనగర్ ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

'చాలామంది తల్లిదండ్రులు అమ్మాయిలను బార్డర్ ఉద్యోగాలకు పంపొద్దు అనుకుంటారు. కానీ మేము అలా ఆలోచించలేదు. ఎప్పుడు సుప్రీతను నిరాశపరచలేదు. మా కూతురు బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించడం మాకు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది' అంటున్నారు సుప్రీత తల్లిదండ్రులు రవీందర్‌రావు, రజిత.

నా అదృష్టం

స్కూల్ రోజుల నుంచి కాలేజీ రోజుల వరకు ఎంతో మంది వీరసైనికుల గురించి విన్నాను. సైన్యంలో పనిచేయాలని, తద్వారా దేశానికి సేవ చేయాలనేది నా కల. నేను కోరుకున్న విధంగా బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించి దేశ సరిహద్దులో ఉద్యోగం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.
- మాసిపెద్ది సుప్రీత

- సురుకొంటి సతీశ్ రెడ్డి, సాక్షి, కరీంనగర్

● స్ఫూర్తి

సాహసమే శ్వాసగా....

అభిరుచి. అంకితభావం. పట్టుదల ఒక దగ్గర చేరితే ఏమవుతుంది? అపురూప విజయం అవుతుంది. ఆడ్రియానా బ్రౌన్లీ సాధించిన చారిత్రక విజయం అవుతుంది. ప్రపంచంలోని 14 ఎత్తైన పర్వతాలను అధిరోహించిన అతి పిన్న వయస్కురాలిగా 23 ఏళ్ల ఆడ్రియానా బ్రౌన్లీ రికార్డ్ సృష్టించింది....



లండన్‌లో పుట్టి పెరిగిన బ్రౌన్లీకి చిన్నప్పటి నుంచి ఎత్తైన పర్వతాలను అధిరోహించిన వారి గురించి తెలుసుకోవడం అంటే ఇష్టం. నాన్న పర్వతారోహకుడు. పర్వతారోహణకు సంబంధించి ఆయన చెప్పే ఒళ్లు గగురుపాడిచే విషయాలను వినడం అంటే ఇష్టం.

ఎనిమిదేళ్ల వయసులో పర్వతారోహకుడైన తండ్రి నుంచి ప్రేరణ పొందింది బ్రౌన్లీ. పెద్ద పర్వతాలు అధిరోహించి పెద్ద పేరు తెచ్చుకోవాలని కలలు కనేది. ఇరవై ఏళ్ల వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడంతో ఆ కల సాకారం అయింది.

ఆక్సిజన్ లేకుండా గాషెర్బ్రమ్ 1కు చేరుకున్న అతి పిన్న వయస్కురాలిగా, కే2 శిఖరాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది. చైనాలోని 8,000 మీటర్‌ల ఎత్తులో ఉన్న పిషాపాంగ్మా పర్వతాన్ని అధిరోహించడం ద్వారా 14 శిఖరాల అధిరోహణను పూర్తి చేసింది.

నిర్మలమైన ఆకాశం సాక్షిగా, సూర్యోదయం వెలుగులో పిషాపాంగ్మా పర్వతం దగ్గరకు చేరుకోగానే బ్రౌన్లీ భావోద్వేగానికి గురైంది. 'శిఖరానికి చేరుకోక ముందే నా లక్ష్యం నెరవేరబోతుంది అనే ఆనందంలో ఏడ్వడం మొదలు పెట్టాను' అంటూ ఆ క్షణాలను గుర్తు చేసుకుంది.

బ్రౌన్లీ సాధించిన చారిత్రక విజయం కేవలం సంఖ్యకు సంబంధించినది కాదు. అంకితభావాన్ని, నిబద్ధతను ప్రతిఫలించే అపురూప విజయం అది. పర్వతారోహణ అనేది అభిరుచి మాత్రమే కాదు త్యాగాల సమాహారం. పర్వతారోహణపై దృష్టి పెట్టిన బ్రౌన్లీ టీనేజ్ సంతోషాలకు దూరమైంది. తన కలను సాకారం చేసుకోవడానికి యూనివర్శిటీకి దూరమైంది.

వ్యక్తిగత విజయాలపై మాత్రమే బ్రౌన్లీ దృష్టి పెట్టలేదు. పర్వతారోహణ విషయంలో యువతను ప్రోత్సహించడానికి, వారు తమ కలలను సాకారం చేసుకునే విషయంలో సహకరించడానికి నడుం కట్టింది.

'సాహసం మంచిదేగానీ దుస్సాహసం తగదు' అంటున్న బ్రౌన్లీ ఎంతోమంది పర్వతారోహకులను దగ్గర నుంచి చూసింది. వారిలో ఉత్సాహమే కనిపిస్తుంది. శిక్షణ లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

'సాహసాల పేరుతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం నాకు తెలుసు. పర్వతారోహణ పేరుతో సాహసాలకు దిగే కొద్ది మందికి ప్రాథమిక విషయాల్లో కూడా అవగాహన లేదని తెలుసుకున్నాను. ఉత్సాహమే కాదు శిక్షణ కూడా చాలా ముఖ్యం. అనుభవం లేని పర్వతారోహకులను ఎత్తైన శిఖరాలను అధిరోహించడానికి అనుమతించరాదు. వారు తమ ప్రాణాలతో పాటు ఇతరులకు ప్రమాదం కలిగించే అవకాశం ఉంది. ఎత్తైన శిఖరాలను అధిరోహించడానికి ప్రయత్నించే పర్వతారోహకులు ముందుగా చిన్న పర్వతాలను అధిరోహించేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి' అంటుంది బ్రౌన్లీ.

'ఎప్పుడు పర్వతాల గోలేనా' అని బ్రౌన్లీని స్నేహితులు వెక్కిరించేవారు. అయితే ఆమె అలాంటి వెక్కిరింపులను ఎప్పుడూ పట్టించుకోలేదు.

'జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి నచ్చిన మార్గాన్ని ఎంచుకోవచ్చు. ఆ లక్ష్యం మీకు ప్రత్యేకమైనది కావచ్చు. ఇతరులకు వింతగా అనిపించవచ్చు' అంటుంది బ్రౌన్లీ. ఒక పర్వతానికి మరో పర్వతానికి సంబంధం ఉండదు. ప్రతి పర్వతం తనదైన సవాళ్లు విసురుతుంటుంది. 'ప్రతి సవాలు విలువైనదే' అంటున్న ఆడ్రియానా బ్రౌన్లీ మరిన్ని సాహసాలకు సిద్ధం అవుతుంది.

యువర్స్



● టెస్ట్

మీ వినికిడి స్కోర్ ఎంత?

మీ వినికిడి సామర్థ్యం ఎంత అని తెలుసుకోవాలని ఉందా? అయితే దీనికి యాపిల్ ఎయిర్‌పాడ్స్ ప్రో 2 హియరింగ్ హెల్త్ సాఫ్ట్‌వేర్ సరైన సమాధానం చెబుతుంది. ఐ ఫోన్ లేదా ఐప్యాడ్‌లో వినికిడి పరీక్ష (హియరింగ్ టెస్ట్) తీసుకున్న తరువాత ఇయర్‌బడ్స్‌ను క్లినికల్–గ్రేడ్ హియరింగ్ ఎయిడ్‌గా మారుస్తుంది. పెద్ద శబ్దాల నుంచి వినికిడి సామర్థ్యం దెబ్బతినకుండా ప్రొటెక్ట్ చేస్తుంది.

ఒక్కసారి డివైజ్‌ను అప్‌డేట్ చేసిన తరువాత ఎయిర్‌పాడ్స్ సెట్టింగ్స్‌లో 'హియరింగ్ హెల్త్' సెక్షన్‌ను చూడవచ్చు.'యాపిల్ ఎయిర్ పాడ్స్ ప్రో2 వినికిడి పరీక్షలో నేను ఎడమ వైపు 6 డెసిబుల్స్, కుడివైపు 12 డెసిబుల్స్ కోల్పోయాను' అంటుంది యాపిల్ న్యూ హియరింగ్ హెల్త్ సాఫ్ట్‌వేర్‌ను పరిచయం చేసిన బ్రిడ్‌గెట్ కేరీ.

● గేమింగ్

గ్రహాంతరవాసులతో ఢీ



'ఎ క్వయిట్ ప్లేస్: ది రోడ్ అహెడ్' అనేది సర్వైవల్ హారర్ గేమ్. 'ఎ క్వయిట్ ప్లేస్ ఫిల్మ్ సిరీస్' ఆధారంగా రూపుదిద్దుకున్న గేమ్ ఇది. ఫస్ట్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి క్యారెక్టర్‌లను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. హైపర్ సెన్సిటివ్ వినికిడితో గ్రహాంతర జీవులు నివసించే పోస్ట్–ఆపోకలిప్టిక్ ప్రపంచాన్ని నేవిగేట్ చేయాలి. మైక్రోఫన్ ఆప్షన్స్‌తో సహా ఈ గేమ్‌లో రకరకాల ఫీచర్‌లు ఉన్నాయి.

జానర్: సర్వైవల్ హారర్ మోడ్: సింగిల్ ప్లేయర్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5. విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ప్రొఫైల్ కార్డ్ ఫీచర్



క్రియేటర్స్ కోసం కొత్త ప్రొఫైల్ కార్డ్ ఫీచర్‌ను తీసుకువస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది. 'మోర్ ఈజీ మోర్ ఫన్' అంటూ తీసుకువస్తున్న ఈ ఫీచర్, ప్రొఫైల్‌ను ఇతరులతో పంచుకోవడాన్ని సులభతరం, ఆహ్లాదకరం చేస్తుంది. ఈ ప్రొఫైల్ కార్డ్ యూజర్‌లకు యానిమేటెడ్ డిజిటల్ కార్డును క్రియేట్ చేసే అవకాశాన్ని ఇస్తుంది.

ప్రొఫైల్‌ను లింక్ చేసే క్యూఆర్ కోడ్‌తో పాటు బయో ఇన్‌ఫర్‌మేషన్, పేజీలకు లింకులు, ఇష్టమైన మ్యూజిక్‌తో పాటు ఇతర అంశాలను కూడా జోడించే ఆప్షన్‌లు ఇందులో ఉన్నాయి.

ఉదా: బ్యాక్‌గ్రౌండ్ రంగును మార్చవచ్చు, సెల్ఫీని జోడించవచ్చు. పేజీ బ్యాక్‌గ్రౌండ్‌గా కస్టమ్ ఇమోజీని జోడించవచ్చు.

యూట్యూబ్‌లో...

యూట్యూబ్ తన 'షార్ట్స్' ఫీచర్ అప్‌డేట్ గురించి ప్రకటించింది. క్రియేటర్‌లు మూడు నిమిషాల నిడివి గల వీడియోలను అప్‌లోడ్ చేయవచ్చు. ఈ ఎక్స్‌టెన్షన్ ద్వారా క్రియేటర్‌లకు తమ స్టోరీలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి వీలవుతుంది. అక్టోబర్ 15, 2024 ముందు అప్లోడ్ చేసిన కంటెంట్ లాంగ్ ఫామ్ వీడియోలుగా వర్గీకరించబడతాయి.

వ్యూయర్స్, క్రియేటర్‌లను దృష్టిలో పెట్టుకొని యూట్యూబ్ కొత్త ఫీచర్‌లను తీసుకురానుంది. వీటిలో 'ఫైన్–ట్యూనబుల్ ప్లేబ్యాక్ స్పీడ్'లాంటి హైలీ రిక్వెస్టెడ్ ఫీచర్‌లు కూడా ఉన్నాయి.

హోల్డ్ అప్ టేబుల్‌టాప్



బ్రాండ్: హోల్డ్ అప్ కలర్: బ్లాక్ ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్ కంపాటబుల్: ఆల్ ఫోన్స్ డివైజెస్: ఆల్ ఫోన్స్



మోటరోలా ఎడ్జ్ 50 నియో

డిస్‌ప్లే: 6.40 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్ రిజల్యూషన్: 1256×2760 పిక్సెల్స్ మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్ ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ బ్యాటరీ: 4310 ఎంఏహెచ్

వివో ఎక్స్ 200 ప్రో



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు వోఎస్: ఆండ్రాయిడ్ 15 రిజల్యూషన్: 2800×1260 పిక్సెల్స్ బరువు: 223 గ్రా. ర్యామ్: 16జీబి

● మ్యూజిక్ వరల్డ్

ఉత్సాహతరంగం



కె– పాప్ గర్ల్ గ్రూప్ 'ఫిఫ్టీ ఫిఫ్టీస్' సింగిల్ 'క్యూపిడ్' వైరల్ హిట్ అయింది. మ్యూజిక్ నోస్టాల్జియాకు అద్దం పట్టే 'ఫిఫ్టీ ఫీఫ్టీ' యూకే సింగిల్స్ చార్ట్, బిల్ బోర్డ్ హాట్ 100లలో టాప్‌లో ఉంది. 'ఫిఫ్టీ ఫిఫ్టీ' అనేది సగం వాస్తవికత, సగం ఉటోపియాను సూచించే పేరు.

ఏ హోప్‌లెస్ రొమాంటిక్ ఆల్ మై లైఫ్
సరౌండెడ్ బై కపుల్స్ ఆల్ ది టైమ్
ఐ గెస్ ఐ షుడ్ టేక్ ఇట్ యాజ్ ఏ సైన్
(హో వై? హో వై హో వై?).... ఇలా సాగే పాట యూత్‌ను ఉత్సాహంలో ముంచెత్తుతుంది.

'మిమ్మల్ని ఉత్సాహపరిచే ప్రేమ నుండి మీరు స్నేహితులతో పంచుకునే ప్రేమ వరకు ప్రేమలోని విభిన్న కోణాలను బంధించే ప్రయత్నం చేశాం' అంటున్నారు కె–పాప్ సభ్యులు.

కంగువ అరుదైన సినిమా - సూర్య

''నా సినిమా థియేటర్‌లో రిలీజై రెండేళ్లు దాటింది. అయినా 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' చిత్రం రీ రిలీజ్‌కి ఫ్యాన్స్ చూపించిన స్పందన చూసి భావోద్వేగానికి గురయ్యాను. నాపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతగా మీకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే 'కంగువ' లాంటి గొప్ప సినిమా చేశాను. మీరు ఇప్పటి దాకా స్క్రీన్ మీద చూడని ఒక అరుదైన మూవీ చేశాం'' అని హీరో సూర్య అన్నారు. శివ దర్శకత్వంలో సూర్య నటించిన చిత్రం 'కంగువ'. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రలు చేశారు. రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన 'కంగువ' నవంబరు 14న విడుదల కానుంది. ఈ సినిమాను నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సూర్య మాట్లాడుతూ–''కంగువ'లాంటి సినిమాలు చేసేందుకు దర్శకుడు రాజమౌళిగారు స్ఫూర్తినిచ్చారు. నటుడిగా కమల్‌హాసన్ గారిని చూసి స్ఫూర్తి పొందుతుంటాను. 'కంగువ' స్ట్రయిట్ తెలుగు సినిమా... ఇండియన్ సినిమా. తన వాళ్ల కోసం, తను నమ్మిన ధర్మం కోసం పోరాడే వీరుడి చిత్రమిది. మంచి సినిమాలు సమాజంలో ఎంతో మార్పు తీసుకొస్తాయి. నా 'కాక్క కాక్క' సినిమా చూసి ఒకరు ఐపీఎస్ ఆఫీసర్ అయ్యారు. 'జై భీమ్' సినిమా తర్వాత తమిళనాడులో 3 లక్షల మందికి ఇంటి పట్టాలు వచ్చాయి'' అని తెలిపారు.



● రాకేందు మౌళి, శివ, సూర్య, జ్ఞానవేల్ రాజా, శశి

శివ మాట్లాడుతూ– ''కంగువ' సినిమాను ఎంతో ప్యాషన్‌తో సూర్యగారి లాంటి ఎక్స్‌ట్రార్డినరీ హీరోతో కలిసి రూపొందించాను. మన దక్షిణాది సినిమాని ఎంత గొప్ప స్థాయికి తీసుకెళ్లాలో రాజమౌళిగారు చూపించారు. నాకు ఆయన ఎంతో స్ఫూర్తినిస్తారు. ఆయన 'విక్రమార్కుడు' సినిమాని తమిళంలో 'సిరుత్తై'గా రీమేక్ చేశాను. ఆ సినిమాతో నా ఇంటి పేరు ముందు 'సిరుత్తై' చేరింది'' అని పేర్కొన్నారు. ''కంగువ' కోసం టీమ్ అంతా ఎంతో ప్యాషనేట్‌గా హార్డ్‌వర్క్ చేశాం. మా సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది'' అని చెప్పారు కేఈ జ్ఞానవేల్ రాజా. రచయిత, నటుడు రాకేందు మౌళి, మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశి మాట్లాడారు.

సినిమా

పుష్ప ప్రొడ్యూసర్స్ అంటుంటే గర్వంగా అనిపిస్తోంది - రవిశంకర్, నవీన్



● ముఖేష్ మెహతా, లక్ష్మీకాంత్, నవీన్, రవిశంకర్, అనిల్ తడానీ, మాలీ

''మైత్రీ మూవీ మేకర్స్ అంటే ఇక్కడ తెలుసు. కానీ ముంబైలో 'పుష్ప' సినిమా ప్రొడ్యూసర్స్ అనగానే ఇంకా ఎక్కువ గౌరవం ఇస్తున్నారు. అది మాకు గర్వంగా అనిపిస్తోంది. 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లోని నటనకుగాను అల్లు అర్జున్ గారికి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు వచ్చింది. 'పుష్ప: ది రూల్' సినిమాతోనూ ఆయనకు జాతీయ అవార్డు వస్తుందనుకుంటున్నాం. అల్లు అర్జున్‌గారు అంత కష్టపడుతున్నారు. సుకుమార్ అండ్ టీమ్ కూడా శ్రమిస్తోంది'' అన్నారు నిర్మాత వై. రవిశంకర్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'పుష్ప: ది రైజ్'కు సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' చిత్రం రానుంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను డిసెంబరు 6న రిలీజ్ చేయనున్నట్లుగా ఆ మధ్య ప్రకటించారు. కానీ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'పుష్ప: ది రైజ్'ని డిసెంబరు 5న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నవీన్ ఎర్నేని మాట్లాడుతూ– ''పుష్ప: ది రూల్'ను గతంలో చెప్పిన డేట్ కంటే ఒక రోజు ముందుగానే రిలీజ్ చేస్తున్నాం. ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అభిప్రాయాలు, లాంగ్ వీకెండ్ అంశాలను దృష్టిలో పెట్టుకుని తేదీ మార్చాం'' అన్నారు. ''ఈ చిత్రంలో ముఖ్యంగా జాతర ఎపిసోడ్ హైలైట్‌గా ఉంటుంది. రికార్డు స్థాయిలో 'పుష్ప: ది రూల్' సినిమాకు 420 కోట్ల రూపాయల నాన్ థియేట్రికల్ బిజినెస్ జరిగింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్‌లో ఎవరు నటిస్తారనే విషయాన్ని త్వరలో వెల్లడిస్తాం. 'పుష్ప 3' కూడా ఉంటుంది'' అన్నారు వై. రవిశంకర్. 'పుష్ప: ది రూల్' సినిమా మలయాళం డిస్ట్రిబ్యూటర్ ముఖేశ్ మెహతా, హిందీ డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడానీ, కర్ణాటక డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్ రెడ్డి, తమిళనాడు డిస్ట్రిబ్యూటర్ మాలి, నైజాం డిస్ట్రిబ్యూటర్ మైత్రీ శశి, వెస్ట్ గోదావరి డిస్ట్రిబ్యూటర్ ఎల్వీఆర్ పాల్గొన్నారు.

ఈ సినిమాలోని ఓ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేయనున్నారా? అనే ప్రశ్నకు... "ఒక పాటకు అనుకున్నాం కానీ ఇప్పుడు ఆయన ఆ పాట చేయడంలేదు" అని నిర్మాతలు పేర్కొన్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ట్రబుల్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.


ఈ ట్రబుల్ సూపర్ గురూ!!



వినోదానికి భాష, ప్రాంతం ముఖ్యం కాదు. ప్రాంతాల సరిహద్దులు చెరిపేసి, భాషల హద్దులు మరిచి నవరసాల్లో హాస్యరసానికి పెద్ద పీట వేసే దర్శకులు ఈ ప్రపంచంలో చాలామందే ఉన్నారు. అందుకే వారు రూపొందించిన సినిమాలకు ప్రేక్షకాదరణ ఎక్కువ. స్వీడిష్ దర్శకుడు జాన్ హొంబర్గ్ ఇటీవల తీసిన 'ట్రబుల్' సినిమా ఇందుకు ఓ ఉదాహరణ. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. ఒక ఎలక్ట్రానిక్స్ షాపులో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్న కానీకి సంబంధించిన కథ ఈ 'ట్రబుల్'. కానీకి ఒక్కటే కూతురు. భార్య విడాకులిచ్చింది. కానీకి సాధారణంగా సమస్యలు రావు, అయితే సమస్యలను తానే కొని తెచ్చుకునే కన్ఫ్యూజ్డ్ పర్సన్. కానీ కానీ మంచి తెలివైనవాడు. ఓ టీవీని అమర్చేందుకు ఒకరి ఇంటికి వెళ్లినప్పుడు ఇతగాడి అత్యుత్సాహం ఓ హత్య కేసులో ఇరుక్కునేలా చేస్తుంది. కోర్టు అతనికి 18 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తుంది. జైల్లో వేరేవాళ్లు తవ్విన సొరంగం గుండా బయటపడి తన సమస్యను ఎలా అధిగమించుకుంటాడో నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ట్రబుల్'లోనే చూడాలి. ఈ సినిమాలో కానీ పాత్రకు ప్రముఖ నటుడు ఫిలిప్ బర్గ్ ప్రాణం పోశారు. తన కన్ఫ్యూజింగ్ భావాలతో ప్రేక్షకులను కితకితలు పెట్టిస్తాడు. అలాగే హీరోయిన్ పాత్రలో ఎమీ, విలన్ పాత్రలో ఇవా తమ పాత్రలకు సరైన న్యాయం చేశారు. పైన చెప్పినట్టు పేరుకు స్వీడిష్ సినిమా అయినా చక్కగా మన తెలుగులో డబ్ అయి ఉంది. వీకెండ్ మూవీ వాచర్స్‌కు మంచి హ్యూమరస్ మూవీ ఇది. ఈ 'ట్రబుల్' చూసి కాసేపు మీ ట్రబుల్స్ మరిచిపోండి.

– ఇంటూరు హరికృష్ణ

హాలీవుడ్ టార్జాన్ రాన్ ఎలీ ఇకలేరు



ప్రముఖ హాలీవుడ్ నటుడు రాన్ ఎలీ (86) ఇకలేరు. ఆయన మరణించిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా రాన్ ఎలీ కుమార్తె క్రిస్టెన్ వెల్లడించారు. ''ఓ గొప్ప వ్యక్తి ఈ ప్రపంచానికి దూరమయ్యారు. అలాగే నేను నా తండ్రిని కోల్పోయాను. నటుడిగా, రచయితగా, కుటుంబంలోని వ్యక్తిగా, కోచ్‌గా, గురువుగా, నాయకుడిగా ఆయన రాణించారు'' అని క్రిస్టెన్ పేర్కొన్నారు. ఇక అమెరికాలోని టెక్సాస్‌లో 1938లో జన్మించారు రాన్ ఎలీ. కెరీర్ ఆరంభంలో 'సౌత్ పెసిఫిక్', 'ది ఫిన్డ్ హూ వాక్డ్ ది వెస్ట్' వంటి చిత్రాల్లో నటించిన తర్వాత టెలివిజన్ సిరీస్ 'టార్జాన్'లో నటించే అవకాశం రాన్ ఎలీకి దక్కింది. టార్జాన్‌గా అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రాన్ ఎలీకి విపరీతమైన పాపులారిటీ వచ్చింది. ఇంకా 'ప్లే హౌస్ 90, థ్రిల్లర్, ఫేస్ ది మ్యూజిక్' వంటి సిరీస్‌లలో నటించారు రాన్. అలాగే 'డాక్ సావేజ్: ది మ్యాన్ ఆఫ్ బ్రాంజ్, వన్స్ బిఫోర్ ఐ డై' వంటి చిత్రాల్లోనూ నటించారాయన. 'షీనా' సిరీస్ తర్వాత కొంతకాలం నటనకు దూరంగా ఉన్న రాన్ 'ఎక్స్‌పెక్టింగ్ ఆమిష్' (2014) అనే సినిమాలో ఓ లీడ్ రోల్ చేశారు. ఇదే ఆయనకు చివరి సినిమా. ఈ సంగతి ఇలా ఉంచితే... రాన్ ఎలీ ఎప్పుడు మరణించారనే విషయంపై క్రిస్టెన్ క్లారిటీ ఇవ్వలేదు. కానీ ఆయన కొన్ని రోజుల క్రితమే మరణించారని, మరణ వార్తను క్రిస్టెన్ కాస్త ఆలస్యంగా బయటపెట్టారని వార్తలు వస్తున్నాయి.



● సమంత

రామ్‌చరణ్‌కు జోడీగా..?

'రంగస్థలం' (2018) తర్వాత హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. రామ్‌చరణ్ కెరీర్‌లోని ఈ 17వ సినిమాను ఈ ఏడాది మార్చిలో ప్రకటించారు. అయితే ఈ సినిమా చిత్రీకరణను వచ్చే ఏడాది చివర్లో ప్రారంభించాలనుకుంటున్నారని సమాచారం. అంతేకాదు... 'రంగస్థలం' సినిమాలో హీరోయిన్‌గా నటించిన సమంత ఈ సినిమాలోనూ హీరోయిన్‌గా చేస్తారని, ఆల్రెడీ సంప్రదింపులు జరిగాయని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి... 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్, సమంత మళ్లీ జోడీగా నటిస్తారా? లేదా అనే విషయంపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పడుతుంది.


బాలూగారి పాట మనసుని హత్తుకుంది - మోహన్‌లాల్



● పీఎస్ బలరామ్, మోహన్‌లాల్

అక్షయ్, మమితా బైజు జంటగా నటించిన చిత్రం 'డియర్ కృష్ణ'. దినేష్ బాబు దర్శకత్వంలో పీఎస్ బలరామ్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాలోని 'చిరుప్రాయం చేసుకున్న దోషమేంటో దైవమా...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను మోహన్‌లాల్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''లెజెండరీ సింగర్ బాలూగారు (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) పాడిన ఈ పాట నా మనసును హత్తుకుంది. ఈ పాటలాగే ఈ సినిమా కూడా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''హృదయాన్ని బరువెక్కించే ఓ వాస్తవ ఘటనతో ఈ సినిమాని రూపొందించాం'' అని తెలిపారు పీఎస్ బలరామ్. 'చిరుప్రాయం..' పాటకు గిరిపట్ల లిరిక్స్ అందించారు. ఈ సినిమాకు హరిప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్.

నీదే దునియా అంతా...



● వరుణ్ తేజ్

'హే రప్పా... రప్పా... రప్పా... రప్పా... యురేఖ... కూర్చుంటే ఏదీ రాదు... నిలబడి చూస్తుంటే కాదు... కలబడితే నీదే దునియా అంతా..' అంటూ మొదలవుతుంది 'మట్కా' సినిమాలోని 'తస్సాదియ్యా...' సాంగ్. వరుణ్ తేజ్ హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ ఇది. నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు. కరుణ కుమార్ దర్శకత్వంలో డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం నవంబరు 14న రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'తస్సాదియ్యా...' పాట లిరికల్ వీడియోను గురువారం విడుదల చేశారు. ఈ చిత్రం సంగీతదర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా మనో పాడారు. 'ఎవ్వడిని అడగొద్దంట... జీవితమే నేర్పిస్తుంది అంతా... తస్సాదియా..' అంటూ సాగుతుందీ పాట.

గ్యాంగ్‌స్టర్ రెడీ



● చంద్రశేఖర్, కాశ్వీ కాంచన్

చంద్రశేఖర్ రాథోడ్ నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. ఈ చిత్రంలో కాశ్వీ కాంచన్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన హీరో ఆకాష్ పూరి మాట్లాడుతూ– ''ఫైట్స్, కొరియోగ్రఫీ, ఎడిటింగ్, రచన, నిర్మాణం, దర్శకత్వం, నటన... ఇవన్నీ ఒక్కరే చేయడం సులభమైన విషయం కాదు. కానీ వీటన్నింటినీ చంద్రశేఖర్‌గారు ఒక్కరే అమేజింగ్‌గా చేశారు. చంద్రశేఖర్‌గారు కథ రెడీ చేస్తే నేను నటిస్తాను. 'గ్యాంగ్‌స్టర్' సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''హీరోగా నటించాలన్న నా కల ఈ సినిమాతో నెరవేరడం సంతోషంగా ఉంది'' అన్నారు చంద్రశేఖర్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 17	80,065
నిఫ్టీ ▽ 36	24,399

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,408	△	131
డోజోన్స్	42,399	▽	116
ఎఫ్‌టీఎస్ఈ 100	8,269	△	11
డాక్స్	19,443	△	65
షాంఘై	3,280	▽	23
నికాయ్	38,143	△	38

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	78,246	▽	446
బంగారం (99.5 స్వచ్ఛత)	77,933	▽	444
వెండి (కిలో)	97,493	▽	1369

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.66	84.68
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.87	111.71
€	యూరో	ఎస్‌బీఐ	89.60	92.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.15	57.35
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.57	66.24
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.52	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.00	23.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.92	12.75

ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో అమ్మకాలు

సూచీలకు స్వల్ప నష్టాలు • సెన్సెక్స్ 17 పాయింట్లు, నిఫ్టీ 36 పాయింట్లు మైనస్



ముంబై: ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు నాలుగోరోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 17 పాయింట్లు నష్టపోయి 80,065 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 36 పాయింట్లు పతనమై 24,399 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు., రోజంతా స్వల్ప శ్రేణిలో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 79,813 వద్ద కనిష్టాన్ని, 80,260 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 24,341- 24,481 పరిధిలో కదలాడింది. రియల్టీ, టెలికమ్యూనికేషన్, ఐటీ, ఇండస్ట్రియల్ షేర్లలోనూ అమ్మకాలు జరిగాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ సూచీలు అరశాతం మేర నష్టపోయాయి. మరోవైపు ఫార్మా, విద్యుత్, కమోడిటీ, ఇంధన, యుటిలిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి.

- సెప్టెంబర్ క్వార్టర్ నికర లాభం 2.50% క్షీణతతో హెచ్‌యూఎల్ షేరు అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి. బీఎస్ఈలో 6% నష్టపోయి రూ.2,503 వద్ద స్థిరపడింది. ఒక దశలో 8% పతనమైంది.
- మార్జిన్ల ఒత్తిళ్లు, డిమాండ్ రికవరీ ఆలస్యం కారణాలతో ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హెచ్‌యూఎల్ 6%, గోద్రేజ్ కన్జూమర్ 3%, నెస్లే 3% పతనమైంది. బ్రిటానియా 2.50%, టాటా కన్జూమర్ 2% ఐటీసీ 2% నష్టపోయింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
సైయంట్ డివిడెండ్ రూ.12	ఆన్‌లైన్ గేమింగ్‌కు మనీ లాండరింగ్ ముప్పు

సెన్‌కో గోల్డ్ అండ్ డైమండ్స్ ధన్‌తేరాస్ కలెక్షన్

కోల్‌కతా: సెన్‌కో గోల్డ్ అండ్ డైమండ్స్ ధన్‌తేరాస్ పురస్కరించుకుని తన 'షగన్' కలెక్షన్‌లో తక్కువ ధరలో సరికొత్త ఆభరణాలు విడుదల చేసింది. ఈ సందర్భంగా పలు ఆఫర్లు ప్రకటించింది. బంగారు ఆభరణాలపై ప్రతి గ్రాముకు రూ.450 తగ్గింపు, డైమండ్ కొనుగోలుపై 10% వరకు తగ్గింపు, వజ్రాభరణాలపై తయారీ చార్జీలపై 100% వరకు తగ్గింపు పొందవచ్చు. ఈ ఆఫర్ నవంబర్ 3 వరకు ఉంటుంది. కస్టమర్లు కొనుగోళ్ల ఆధారంగా లక్కీడ్రా ద్వారా మూడు ఎలక్ట్రిక్ వాహనాలు, 15 ఐఫోన్లు గెలుచుకోవచ్చు. ''సంప్రదాయాన్ని, ఆధునికతను సమతుల్యం చేసే విధంగా రూపొందించిన ఆభరణాలు ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తాయి'' అని కంపెనీ మార్కెటింగ్ హెడ్ జోయీటా సేన్ తెలిపారు.

ఎన్‌విడియాతో రిలయన్స్ జట్టు

కృత్రిమ మేధ మౌలిక సదుపాయాల కల్పనపై కసరత్తు
- దేశీయంగా ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు
- త్వరలో ఏఐ ఎగుమతి దేశంగా భారత్



ముకేశ్ అంబానీతో ఎన్‌విడియా సీఈవో జెన్‌సెన్ హువాంగ్

ముంబై: అమెరికన్ టెక్ దిగ్గజం ఎన్‌విడియా, దేశీ వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా చేతులు కలిపాయి. భారత్‌లో కృత్రిమ మేధ (ఏఐ) కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల కల్పన, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయడంపై కసరత్తు చేయనున్నాయి. రిలయన్స్‌కి చెందిన కొత్త డేటా సెంటర్‌లో ఎన్‌విడియాకి చెందిన బ్లాక్‌వెల్ ఏఐ చిప్‌లను వినియోగించనున్నారు. ఎన్‌విడియా ఏఐ సమిట్‌లో పాల్గొన్న సందర్భంగా కంపెనీ సీఈవో జెన్‌సెన్ హువాంగ్, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ఈ విషయాలు వెల్లడించారు. భాగస్వామ్యం కింద రూపొందించే అప్లికేషన్లను రిలయన్స్ .. భారత్‌లోని వినియోగదార్లకు కూడా అందించే అవకాశం ఉందని హువాంగ్ తెలిపారు. అయితే, ఈ భాగస్వామ్యానికి సంబంధించి పెట్టుబడులు, నెలకొల్పబోయే మౌలిక సదుపాయాల సామర్థ్యాలు మొదలైన వివరాలను వెల్లడించలేదు. 'చిప్‌ల డిజైనింగ్‌లో భారత్‌కి ఇప్పటికే ప్రపంచ స్థాయి నైపుణ్యాలు ఉన్నాయి. ఎన్‌విడియా చిప్‌లను హైదరాబాద్, బెంగళూరు, పుణెలో డిజైన్ చేస్తున్నారు. ఎన్‌విడియాలో మూడో వంతు ఉద్యోగులు ఇక్కడే ఉన్నారు' అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు సాఫ్ట్‌వేర్ సేవలతో ప్రపంచానికి ఐటీ బ్యాక్ ఆఫీస్‌గా పేరొందిన భారత్ ఇకపై అవే నైపుణ్యాలను ఉపయోగించి ఏఐ ఎగుమతి దేశంగా ఎదగవచ్చని చెప్పారు. 2024లో భారత కంప్యూటింగ్ సామర్థ్యాలు 20 రెట్లు వృద్ధి చెందుతాయని, త్వరలోనే ప్రభావవంతమైన ఏఐ సొల్యూషన్స్‌ను ఎగుమతి చేస్తుందన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీల్లో రెండో స్థానంలో ఉన్న ఎన్‌విడియాకు .. భారత్‌లో హైదరాబాద్ సహా ఆరు నగరాల్లో కార్యకలాపాలు ఉన్నాయి.


భారీ ఇంటెలిజెన్స్ మార్కెట్‌గా భారత్: అంబానీ

భారత్ ప్రస్తుతం కొత్త తరం ఇంటెలిజెన్స్ సాంకేతికత ముంగిట్లో ఉందని, రాబోయే రోజుల్లో వినూత్న ఆవిష్కరణలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తుందని ముకేశ్ అంబానీ చెప్పారు. 'అతిపెద్ద ఇంటెలిజెన్స్ మార్కెట్లలో ఒకటిగా భారత్ ఎదుగుతుంది. మనకు ఆ సత్తా ఉంది. ప్రపంచానికి కేవలం సీఈవోలనే కాదు ఏఐ సర్వీసులను కూడా ఎగుమతి చేసే దేశంగా భారత్ ఎదుగుతుంది' అని అంబానీ వ్యాఖ్యానించారు. దేశీయంగా పటిష్టమైన ఏఐ ఇన్‌ఫ్రా ఉంటే స్థానికంగా సామర్థ్యాలను పెంచుకోవడంతో పాటు అంతర్జాతీయ ఇంటెలిజెన్స్ మార్కెట్లో భారత్ కీలక దేశంగా మారగలదని ఆయన చెప్పారు. అమెరికా, చైనాలతో పాటు భారత్‌లో అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని అంబానీ చెప్పారు. డేటాను అత్యంత చౌకగా అందిస్తూ సంచలనం సృష్టించినట్లుగానే ఇంటెలిజెన్స్ విషయంలోనూ గొప్ప విజయాలతో ప్రపంచాన్ని భారత్ ఆశ్చర్యపర్చగలదని ఆయన పేర్కొన్నారు.

ఇన్ఫీ, టీసీఎస్‌లతో కూడా..

భారత మార్కెట్లో కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా టెక్ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, విప్రోలతో చేతులు కలుపుతున్నట్లు హువాంగ్ తెలిపారు. ఎన్‌విడియా ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫాం ఆధారిత ఏఐ సొల్యూషన్స్‌ను వినియోగించుకోవడంలో క్లయింట్లకు ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో తోడ్పడనున్నాయి. అలాగే ఇండస్ 2.0 అనే ఏఐ నమూనాను అభివృద్ధి చేసేందుకు ఎన్‌విడియా మోడల్‌ను టెక్ మహీంద్రా ఉపయోగించనుంది. అటు టాటా కమ్యూనికేషన్స్, యోటా డేటా సర్వీసెస్ వంటి సంస్థలకు ఎన్‌విడియా తమ హాపర్ ఏఐ చిప్‌లను సరఫరా చేయనుంది.

కోరమాండల్ రూ.800 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.800 కోట్లు పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రెండు నూతన ప్లాంట్ల ఏర్పాటుకు రూ.677 కోట్లు వెచ్చించాలని గురువారం సమావేశమైన బోర్డు నిర్ణయం తీసుకుంది. మిగిలిన మొత్తాన్ని మూలధన అవసరాలకు వినియోగిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ప్లాంటును రూ.513 కోట్లతో విస్తరిస్తోంది. ఇందులో భాగంగా 7,50,000 టన్నుల వార్షిక సామర్థ్యం గల గ్రాన్యులేషన్ ట్రెయిన్‌ను 24 నెలల్లో ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే కాకినాడ కేంద్రం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 22,50,000 టన్నులు ఉంది. వినియోగం 93 శాతానికి చేరిందని కంపెనీ తెలిపింది. 'ఈ విస్తరణతో కాకినాడ ప్లాంట్‌ను భారత్‌లో అతిపెద్ద ఎరువుల తయారీ కేంద్రాల్లో ఒకటిగా మారుస్తుంది. ఎరువుల రంగంలో సంస్థ నాయకత్వాన్ని సుస్థిరం చేస్తుంది' అని కోరమాండల్ తెలిపింది.

ఫంగిసైడ్స్ మల్టీ ప్రొడక్ట్..

అలాగే గుజరాత్‌లోని అంకలేశ్వర్ వద్ద 600 టన్నుల వార్షిక సామర్థ్యంతో ఫంగిసైడ్స్ మల్టీ ప్రొడక్ట్ ప్లాంట్‌ను రూ.164 కోట్లతో నెలకొల్పాలని నిర్ణయించింది. 18 నెలల్లో ఇది కార్యరూపంలోకి రానుంది. క్రాప్ ప్రొటెక్షన్ టెక్నికల్స్‌ను ఇక్కడ తయారు చేస్తారు. కోరమాండల్ క్రాప్ ప్రొటెక్షన్ ఫిలిప్పైన్స్‌లో (సీసీపీపీ) అదనంగా 6.67 శాతం వాటాను రూ.76 లక్షలతో కొనుగోలు చేయాలని బోర్డు నిర్ణయించింది. తద్వారా సీసీపీపీ పూర్తి అనుబంధ కంపెనీగా మారుతుందని వివరించింది.

తగ్గిన నికర లాభం..

సెప్టెంబర్ త్రైమాసికంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 13 శాతం క్షీణించి రూ.659 కోట్లకు చేరింది. ఎబిటా 8 శాతం తగ్గి రూ.975 కోట్లు నమోదైంది. టర్నోవర్ 6.4 శాతం ఎగసి రూ.7,433 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కోరమాండల్ షేరు ధర 2.46 శాతం లాభపడి రూ.1,640 వద్ద స్థిరపడింది.

ఐటీసీ లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 5,054 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా 2 శాతం పెరిగి రూ. 5,054 కోట్లను అధిగమించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 4,965 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 16 శాతం ఎగసి రూ. 22,282 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 19,270 కోట్ల టర్నోవర్ సాధించింది.

హోటళ్ల బిజినెస్ ఏకీకృతం

ప్రస్తుతం హోటళ్ల బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసే ప్రణాళికల్లో ఉన్న ఐటీసీ బోర్డు తాజాగా ప్రత్యర్థి సంస్థలలో గల వాటాలను ఏకీకృతం చేసే ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సొంత అనుబంధ సంస్థ రస్సెల్ క్రెడిట్(ఆర్‌సీఎల్) ద్వారా ఆతిథ్య రంగ దిగ్గజాలు ఒబెరాయ్, లీలా హోటళ్లలో గల వాటాలను కొనుగోలు చేయనుంది. ఈఐహెచ్(ఒబెరాయ్) లిమిటెడ్‌లో 1.52 కోట్ల ఈక్విటీ షేర్లను, హెచ్ఎల్‌వీ(లీలా)లో 34.6 లక్షల షేర్లను బుక్ విలువ ఆధారంగా కొనుగోలు చేయనుంది. దీంతో ఈఐహెచ్‌లో ఐటీసీకి 16.13 శాతం, హెచ్ఎల్‌వీలో 8.11 శాతం చొప్పున వాటా లభించనుంది. ప్రస్తుతం ఈఐహెచ్‌లో ఐటీసీకి 13.69 శాతం, ఆర్‌సీఎల్‌కు 2.44 శాతం చొప్పున వాటా ఉంది. ఇక హెచ్ఎల్‌వీలో ఐటీసీకి 7.58 శాతం వాటా ఉంది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 472 వద్ద ముగిసింది.

ఇండస్‌ఇండ్ లాభం డౌన్

క్యూ2లో రూ. 1,331 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 40 శాతం క్షీణించి రూ. 1,331 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,202 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 13,530 కోట్ల నుంచి రూ. 14,871 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం 5 శాతం పుంజుకుని రూ. 5,347 కోట్లను తాకింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.93 శాతం నుంచి 2.11 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.57% నుంచి 0.64 శాతానికి పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు 0.5 శాతం లాభంతో రూ. 1,279 వద్ద ముగిసింది.

రిలయన్స్ డిజిటల్ 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' సంబరాలు

ముంబై: దీపావళి పండుగ సందర్భంగా రిలయన్స్ డిజిటల్ 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్ వాచీలు, స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హోమ్ అప్లయెన్స్, ఎయిర్ పాడ్స్, ఏసీలు తదితర ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలపై తగ్గింపు ధరలు ఉన్నాయని తెలిపింది. ప్రముఖ బ్యాంకుల కార్డులతో చేసే కొనుగోళ్లపై రూ.15,000 వరకు తక్షణ డిస్కౌంట్ అందిస్తుంది. ఇన్–స్టోర్ షాపర్లు రూ.22,500 వరకు ప్రయోజనాలతో అనేక ఫైనాన్స్ ఆప్షన్లు పొందవచ్చు. ఈ ఆఫర్లన్నీ రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లలో ఈ నవంబర్ 3 వరకు చెల్లుతాయని కంపెనీ పేర్కొంది.



జర్మనీకి భారత్ షాక్

న్యూఢిల్లీ: ప్రపంచ చాంపియన్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జర్మనీ జట్టుతో గురువారం జరిగిన చివరిదైన రెండో మ్యాచ్‌లో టీమిండియా 5–3 గోల్స్ తేడాతో జర్మనీని ఓడించింది. భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్ (34వ, 48వ నిమిషాల్లో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (42వ, 43వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేయగా... అభిషేక్ (45వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. జర్మనీ జట్టుకు ఇలియన్ మజ్కోర్ (7వ, 57వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించగా... హెన్రిక్ మెర్ట్‌జెన్స్ (60వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత జట్టు 0–2తో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో భారత్ నెగ్గడంతో సిరీస్ 1–1తో సమమైంది. ఈ నేపథ్యంలో సిరీస్ విజేతను నిర్ణయించేందుకు ప్రత్యేకంగా 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో జర్మనీ 3–1తో భారత్‌పై గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంది.

భారత్ శుభారంభం

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై ఘనవిజయం
- రాణించిన దీప్తి శర్మ, రాధా యాదవ్



అహ్మదాబాద్: ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, స్పిన్నర్ రాధా యాదవ్ రాణించడంతో... న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో శుభారంభం చేసింది. గురువారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో టీమిండియా 59 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు 44.3 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. తేజల్ (64 బంతుల్లో 42; 3 ఫోర్లు), దీప్తి శర్మ (51 బంతుల్లో 41; 2 ఫోర్లు, 1 సిక్స్), షఫాలీ వర్మ (22 బంతుల్లో 33; 5 ఫోర్లు, 1 సిక్స్), యస్తిక భాటియా (43 బంతుల్లో 37; 5 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (36 బంతుల్లో 35; 1 ఫోర్) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో అమేలియా కెర్ 4, జెస్ కెర్ 3, ఎడెన్ కార్సన్ 2 వికెట్లు తీశారు. అనంతరం న్యూజిలాండ్ మహిళల జట్టు 40.4 ఓవర్లలో 168 పరుగులకే కుప్పకూలింది. బ్రూక్ హాలిడే (54 బంతుల్లో 39; 4 ఫోర్లు), మ్యాడీ గ్రీన్ (32 బంతుల్లో 31; 5 ఫోర్లు), లౌరెన్ (56 బంతుల్లో 26; 1 ఫోర్), జార్జియా (25 బంతుల్లో 25; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. భారత బౌలర్లలో రాధా యాదవ్ 3, సైమా ఠాకూర్ 2 వికెట్లు తీశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో ఉంది. ఇదే వేదికపై ఆదివారం రెండో వన్డే జరుగుతుంది.

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: షఫాలీ (సి) హాలిడే (బి) కార్సన్ 33; స్మృతి (సి) జార్జియా (బి) జెస్ 5; యస్తిక (సి) కార్సన్ (బి) అమేలియా 37; హేమలత (స్టంప్డ్) గేజ్ (బి) కార్సన్ 3; జెమీమా (ఎల్బీడబ్ల్యూ) (బి) సుజీ బేట్స్ 35; తేజల్ (స్టంప్డ్) గేజ్ (బి) అమేలియా 42; దీప్తి (బి) జెస్ 41; అరుంధతి (సి) సబ్–రోవ్ (బి) అమేలియా 14; రాధ (సి అండ్ బి) జెస్ 3; సైమా (సి) సబ్–రోవ్ (బి) అమేలియా 2; రేణుక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (44.3 ఓవర్లలో ఆలౌట్) 227. వికెట్ల పతనం:** 1–12, 2–49, 3–71, 4–91, 5–152, 6–181, 7–218, 8–223, 9–226, 10–227. **బౌలింగ్:** జెస్ కెర్ 8.3–0–49–3, మోలీ పెన్‌ఫోల్డ్ 5–0–28–0, కార్సన్ 10–0–42–2, సోఫీ డివైన్ 6–0–30–0, అమేలియా కెర్ 9–1–42–4, సుజీ బేట్స్ 5–0–30–1, హాలిడే 1–0–6–0.

న్యూజిలాండ్ మహిళల ఇన్నింగ్స్: సుజీ బేట్స్ (సి) యస్తిక (బి) సైమా 1; జార్జియా (సి అండ్ బి) దీప్తి 25; లౌరెన్ (సి) తేజల్ (బి) రాధ 26; సోఫీ (రనౌట్) 2; హాలిడే (సి అండ్ బి) సైమా 39; మ్యాడీ (రనౌట్) 31; గేజ్ (సి) సైమా (బి) అరుంధతి 9; జెస్ కెర్ (సి) సైమా (బి) రాధ 3; అమేలియా కెర్ (నాటౌట్) 25; మోలీ పెన్‌ఫోల్డ్ (బి) రాధ 1; కార్సన్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (40.4 ఓవర్లలో ఆలౌట్) 168. వికెట్ల పతనం:** 1–7, 2–40, 3–46, 4–79, 5–128, 6–128, 7–131, 8–167, 9–168, 10–168. **బౌలింగ్:** రేణుక 7–0–30–0, సైమా 7–0–26–2, దీప్తి 9–0–35–1, అరుంధతి 6–0–21–1, రాధ 8.4–0–35–3, హేమలత 2–0–11–0, షఫాలీ 1–0–10–0.

భారత రెజ్లర్లకు మూడు పతకాలు

టిరానా (అల్బేనియా): ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడు పతకాలు లభించాయి. మహిళల ఫ్రీస్టయిల్ 59 కేజీల విభాగంలో అంజలి రజత పతకం నెగ్గగా... 68 కేజీల విభాగంలో మోనిక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో అంజలి 4–7తో సోలోమియా (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోగా... మోనిక 5–3తో జిన్‌జె డు (చైనా)పై గెలిచింది. పురుషుల గ్రీకో రోమన్ 55 కేజీల విభాగంలో విశ్వజిత్ కాంస్య పతకాన్ని నెగ్గాడు. కాంస్య పతక బౌట్‌లో విశ్వజిత్ 14–10తో ఆడమ్ ఉల్‌బషేవ్‌ను ఓడించాడు.



వాషింగ్టన్ సుందర్

'సప్త' సుందర్

వాషింగ్టన్ సుందర్ టెస్టు మ్యాచ్ ఆడి మూడున్నరేళ్లు దాటింది. ఈ సిరీస్ తొలి టెస్టులో అతనికి చోటే లేదు. అయితే రంజీ ట్రోఫీలో ప్రదర్శన కారణంగా జట్టులో నలుగురు రెగ్యులర్ స్పిన్నర్లు ఉన్నా రెండో టెస్టు కోసం 16వ సభ్యుడిగా అతడిని అదనంగా ఎంపిక చేశారు. ఆఫ్ స్పిన్‌తో పాటు బ్యాటింగ్ చేయగల సామర్థ్యం అతనికి ఈ అవకాశం కల్పించింది. తొలి రోజు సుందర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. ఏకంగా ఏడు వికెట్లతో న్యూజిలాండ్‌ను పడగొట్టాడు. సహచర తమిళనాడు సీనియర్ అశ్విన్ తొలి మూడు వికెట్లతో మొదలు పెడితే సుందర్ దానిని కొనసాగించాడు. కివీస్‌ను 259 పరుగులకే పరిమితం చేసిన టీమిండియా... రోహిత్ శర్మ వికెట్ చేజార్చుకొని రోజును కాస్త నిరాశగా ముగించింది.

వాషింగ్టన్ సుందర్‌కు 7 వికెట్లు
- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 259 ఆలౌట్
- కాన్వే, రచిన్ అర్ధ సెంచరీలు
- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 16/1



రచిన్



కాన్వే

పుణే: భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టులో ఊహించినట్లుగానే తొలి రోజు నుంచే స్పిన్నర్ల జోరు మొదలైంది. ఆఫ్‌స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్ (7/59), రవిచంద్రన్ అశ్విన్ (3/64) ధాటికి న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 79.1 ఓవర్లలో 259 పరుగులకే ఆలౌటైంది. డెవాన్ కాన్వే (141 బంతుల్లో 76; 11 ఫోర్లు), రచిన్ రవీంద్ర (105 బంతుల్లో 65; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు చేశారు. అనంతరం ఆట ముగిసేసరికి భారత్ 11 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 16 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (0) డకౌట్ కాగా... యశస్వి జైస్వాల్ (6 బ్యాటింగ్), శుబ్‌మన్ గిల్ (10 బ్యాటింగ్) తమ దూకుడును కట్టిపెట్టి మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. ఈ మ్యాచ్ కోసం భారత్ మూడు మార్పులు చేసింది. కేఎల్ రాహుల్, సిరాజ్, కుల్దీప్ యాదవ్ స్థానాల్లో గిల్, ఆకాశ్‌దీప్, సుందర్ జట్టులోకి వచ్చారు.

ఈసారీ వారిద్దరే...

గత టెస్టు తరహాలోనే ఈ సారి కూడా కివీస్ టాప్–7లో కాన్వే, రచిన్ మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడగా... మిగతా వారంతా విఫలమయ్యారు. పేసర్లు వేసిన తొలి 7 ఓవర్లలో కివీస్ 5 ఫోర్లతో చకచకా 30 పరుగులు రాబట్టింది. అయితే ఇన్నింగ్స్ 8వ ఓవర్లోనే అశ్విన్‌ను బౌలింగ్‌కు దించడం ఫలితాన్ని అందించింది. తన ఐదో బంతికే టామ్ లాథమ్ (15)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న అతను కొద్ది సేపటికే విల్ యంగ్ (18)ను పెవిలియన్ పంపించాడు. ఈ దశలో కాన్వే, రచిన్ కలిసి జట్టును ఆదుకున్నారు. లంచ్ తర్వాత బుమ్రా వేసిన తొలి ఓవర్లో 3 ఫోర్లు కొట్టిన కాన్వే 109 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఎట్టకేలకు 62 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యం తర్వాత కాన్వేను అవుట్ చేసి అశ్విన్ ఈ జోడీని విడగొట్టాడు. అయితే రచిన్ మాత్రం చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఆకాశ్‌దీప్ ఓవర్లో రెండు వరుస ఫోర్లతో అతను 93 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకోగా... ఒకదశలో కివీస్ 197/3 స్కోరుతో పటిష్ట స్థితిలో నిలిచింది.

టపటపా...

స్పిన్నర్ సుందర్ కొత్త స్పెల్‌తో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. చక్కటి బంతితో రచిన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి కివీస్ పతనానికి శ్రీకారం చుట్టిన అతను తర్వాతి ఓవర్లో బ్లన్‌డెల్ (3) పని పట్టాడు. టీ విరామం తర్వాత చివరి సెషన్‌లో మిగిలిన ఐదు వికెట్లు తీసేందుకు సుందర్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. అతని బంతులను ఆడలేక బ్యాటర్లంతా వికెట్లు సమర్పించుకున్నారు. ఒక్క మిచెల్ సాన్‌ట్నర్ (51 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే కొద్దిసేపు పోరాడగలిగాడు. తన తొలి 13 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా తీయని సుందర్ తర్వాత 61 బంతుల వ్యవధిలో 7 వికెట్లు పడగొట్టడం విశేషం. ప్రత్యర్థి 10 వికెట్లను ఇద్దరు ఆఫ్ స్పిన్నర్లే కలిసి పడగొట్టడం భారత్ తరఫున ఇదే తొలిసారి. 62 పరుగుల వ్యవధిలో కివీస్ చివరి 7 వికెట్లు కోల్పోయింది.

స్కోరు వివరాలు


న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 15; కాన్వే (సి) పంత్ (బి) అశ్విన్ 76; యంగ్ (సి) పంత్ (బి) అశ్విన్ 18; రచిన్ (బి) సుందర్ 65; మిచెల్ (ఎల్బీ) (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) సుందర్ 3; ఫిలిప్స్ (సి) అశ్విన్ (బి) సుందర్ 9; సాన్‌ట్నర్ (బి) సుందర్ 33; సౌతీ (బి) సుందర్ 5; ఎజాజ్ (బి) సుందర్ 4; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (79.1 ఓవర్లలో ఆలౌట్) 259. వికెట్ల పతనం:** 1–32, 2–76, 3–138, 4–197, 5–201, 6–204, 7–236, 8–242, 9–252, 10–259. **బౌలింగ్:** బుమ్రా 8–2–32–0, ఆకాశ్‌దీప్ 6–0–41–0, అశ్విన్ 24–2–64–3, వాషింగ్టన్ సుందర్ 23.1–4–59–7, జడేజా 18–0–53–0.


భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 6; రోహిత్ (బి) సౌతీ 0; గిల్ (బ్యాటింగ్) 10; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (11 ఓవర్లలో వికెట్ నష్టానికి) 16. వికెట్ల పతనం:** 1–1. **బౌలింగ్:** సౌతీ 3–1–4–1, రూర్కే 3–2–5–0, ఎజాజ్ 3–1–5–0, సాన్‌ట్నర్ 2–0–2–0.


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

నెలకు ఎంత సంపాదిస్తే.. రిచ్ అనుకుంటారు?

నెలకు ఎంత సంపాదిస్తే మీరు రిచ్ అనుకుంటారు? పరిస్థితిని బట్టి, ప్రాంతాన్ని బట్టి, ఉద్యోగాన్ని బట్టి.. సంపాదన ఎక్కువో, తక్కువో ఉండటం కామనే. మరి మన దేశంలో నెలకు వివిధ స్థాయిల్లో సంపాదిస్తున్నవారు.. తాము ఏ కేటగిరీలోకి (పూర్, మిడిల్ క్లాస్, రిచ్.. ఇలా) వస్తామని భావిస్తున్నారో తెలుసా? ఇటీవల విడుదలైన 'యూగవ్- మింట్- సీపీఆర్ మిల్లినియల్ సర్వే'లో దీనిపై ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. నెలకు రూ.30 వేల నుంచి రూ.4లక్షల దాకా సంపాదిస్తున్నవారిని ప్రశ్నించి ఈ నివేదికను రూపొందించారు.









- సాక్షి సెంట్రల్ డెస్క్

స్కిల్స్ వర్సిటీ మంచి ఆలోచన

దక్షిణ కొరియాలో భారత రాయబారి అమిత్ కుమార్



సియోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: తెలంగాణలో స్కిల్స్ యూనివర్సిటీ కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆలోచన చాలా మంచిదని దక్షిణ కొరియాలో భారత రాయబారి అమిత్ కుమార్ అన్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్ పర్యటన కోసం వెళ్లిన రాష్ట్ర మంత్రుల బృందంలో ఉన్న మీడియా ప్రతినిధులతో ఆయన కాసేపు ముచ్చటించారు. షిప్పింగ్, సెమీ కండక్టర్ల తయారీ రంగంలో నైపుణ్యంగల మానవ వనరుల అవసరం ఉందని... స్కిల్స్ యూనివర్సిటీ ఈ అంతరాన్ని పూడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దక్షిణ కొరియాలో నైపుణ్య శిక్షణకు పెద్ద పీట వేస్తున్నారని.. ఇందుకోసం ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రత్యేక స్కూళ్లు ఉన్నాయన్నారు. చదువు పూర్తికాగానే నేరుగా పరిశ్రమల్లోని ఉద్యోగాల్లో చేరే వెసులుబాటు ఉంటుందని వివరించారు. దక్షిణ కొరియాలో ఆటోమొబైల్, టెలికం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, షిప్ బిల్డింగ్ రంగాల్లో అద్భుత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నదుల అభివృద్ధి ప్రాజెక్టులు దక్షిణ కొరియా అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయన్నారు. ఇదే విధానం మూసీ నది ప్రక్షాళనకు సైతం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ దక్షిణ కొరియా పర్యటనకు కొనసాగింపుగా కొరియా నుంచి పెట్టుబడిదారుల బృందాలు త్వరలోనే తెలంగాణకు వస్తాయని చెప్పారు.

నాలుగోరోజు 'గ్రూప్'కు 67.7 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పేపర్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్ అంశాలపై జరిగిన ఈ పరీక్షకు 67.7 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలకు 31383 మంది అభ్యర్థులతో పాటు.. కోర్టు అనుమతించిన 20 మంది స్పోర్ట్స్ కేటగిరీ అభ్యర్థులకు టీజీపీఎస్సీ అవకాశం కల్పించింది. గురువారం నాటి పరీక్షను 21264 మంది అభ్యర్థులు మాత్రమే రాశారు.

నమీ.. అందమైన ద్వీపం సుమీ

ఆహ్లాదకర వాతావరణంలో విందు, వినోదాలకు చిరునామాగా నిలుస్తున్న ఐలాండ్

దక్షిణ కొరియా రాజధాని సియోల్ నుంచి 63 కి.మీ. దూరంలో కేంద్రీకృతం

(సియోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి దోమూరి వెంకటేశ్వర్‌రెడ్డి)



దక్షిణ కొరియాలో పర్యాటకులు చూడదగ్గ ప్రదేశాల్లో నమీ ద్వీపం ఒకటి. ఇది సియోల్ నగరం నుంచి 63 కిలోమీటర్ల దూరంలో ఉంది. వివిధ వృక్షజాతులు, వన్యప్రాణుల నిలయం ఈ ద్వీపం. వసంతకాలంలో ఇక్కడ ఉండే చెర్రీ పూలు, మాగ్నోలియా చెట్లు వికసించడాన్ని చూసేందుకు రెండు కళ్లూ చాలవంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుత శీతాకాలంలో మంచు కురుస్తుండటంతో ఈ ద్వీపాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. నమీ ఐలాండ్ గురించి స్థానికంగా తప్ప పెద్దగా తెలియని కాలంలో.. 2002లో విడుదలైన దక్షిణ కొరియా టెలివిజన్ డ్రామా సిరీస్ 'వింటర్ సొనాటా' ఘన విజయం సాధించడం నమీ ద్వీప పేరును అంతర్జాతీయ స్థాయికి చేర్చింది. నమీ ద్వీపంలోని పచ్చని రహదారుల్లో షికారు కోసం సైకిళ్లను అద్దెకు తీసుకోవచ్చు. హాన్ నది వెంబడి పడవ ప్రయాణం చేయవచ్చు. సెంట్రల్ కొరియన్ పైన్ ట్రీ లైన్, ఫస్ట్ కిస్ గ్లాస్ సీక్వోవా బ్రిడ్జ్, దొడమ్‌శాంబాంగ్ గార్డెన్, వింటర్ సొనాటా స్టాట్యూ, మదర్ అండ్ చైల్డ్ స్టాట్యూ, మూన్ హిల్, మిలీనియం వాటర్ ఫాల్... ఇలా పదుల సంఖ్యలో పర్యాటక ఆకర్షణలు ఇక్కడ కొలువుదీరాయి. భోజన ప్రియులు, వైవిధ్యభరిత క్యూజిన్స్‌ను ఇష్టపడే వారి కోసం రుచికరమైన కొరియన్ వంటకాలతోపాటు అంతర్జాతీయ వంటకాలను అందించే రెస్టారెంట్లు, కేఫ్‌లకు సైతం ఇక్కడ కొదవలేదు.

వారసత్వ సంపద..: ఈ ద్వీపం ప్రకృతి సౌందర్య కేంద్రం మాత్రమే కాదు.. దక్షిణ కొరియా చారిత్రక వారసత్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కేంద్రం కూడా.. జోసెయోన్ రాజవంశం కాలంలో ప్రసిద్ధ సైనిక కమాండర్ జనరల్ నమీ పేరునే ఈ ద్వీపానికి పెట్టారు. ఆయన సాధించిన విజయాలకు అద్దంపట్టేలా జనరల్ నమీ మెమోరియల్ హాల్ ఏర్పాటు చేశారు. సందర్శకులు ద్వీపం చరిత్ర గురించి విపులంగా తెలుసుకోవచ్చు. దక్షిణ కొరియా చేతివృత్తులతో ఇక్కడ వివిధ ఆర్ట్ గ్యాలరీలు, మ్యూజియంలు కనువిందు చేస్తాయి.

ముగిసిన మంత్రుల కొరియా పర్యటన

(సియోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో దక్షిణ కొరియాలోని సియోల్ వెళ్లిన అధికారుల బృందం నాలుగు రోజుల పర్యటన ముగిసింది. ఈ పర్యటనలో భాగంగా ఒకప్పుడు మురికి కాలువలా ఉన్న చియోంగ్‌చియాన్, హాన్ నదుల పునరుద్ధరణ గురించి తెలుసుకొని మంత్రులు, అధికారులు అబ్బురపడ్డారు. అదే తరహాలో మూసీని కూడా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లో స్మార్ట్‌సిటీ నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్న నేపథ్యంలో ఇంచియాన్ స్మార్ట్‌సిటీలో పర్యటించిన బృందం.. అక్కడ ఎలాంటి సదుపాయాలు ఉన్నాయనే విషయంపై అధ్యయనం చేసింది. అక్కడి స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించి చిన్నారులకు అందుతున్న శిక్షణపై ఆరా తీసింది. అలాగే సియోల్‌లో నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ చర్యల గురించి తెలుసుకుంది. తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల సంసిద్ధత వ్యక్తం చేసిన ప్రముఖ వస్త్ర ఉత్పత్తుల సంస్థ యంగ్ వన్ కార్పొరేషన్ చైర్మన్, సీఈవో కీ హాక్ సంగ్‌తోనూ భేటీ అయింది. ఈ బృందంలో సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, వి. ప్రకాశ్‌గౌడ్, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో 74 ట్రామా కేర్ సెంటర్లు: దామోదర

మెదక్ జోన్: హైవేలపై రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు సత్వర చికిత్స కోసం రాష్ట్రంలో 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. ఆయన మెదక్‌లో గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి వైద్య కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే (కేన్సర్) ఆస్పత్రిని హబ్‌గా తీర్చిదిద్దటంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఐదు కేన్సర్ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. మధుమేహం, కేన్సర్, రక్తపోటు, గుండె జబ్బులపై గ్రామీణ ప్రజలకు అవగాహన పెంచేందుకు త్వరలోనే కార్యక్రమాలు చేపడతామన్నారు.

300 కిలోమీటర్లు రివర్స్ స్కేటింగ్

ప్రపంచ రికార్డు కోసం ఇద్దరు సోదరుల ప్రయత్నం



తల్లిదండ్రులతో రాజేష్, ఉమేష్

కూసుమంచి/భద్రాచలం అర్బన్/నేలకొండపల్లి/ఖమ్మం స్పోర్ట్స్: రోలర్ స్కేటింగ్ క్రీడాకారులైన 7, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు సోదరులు ప్రపంచ రికార్డు కోసం హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు 300 కిలోమీటర్లు రివర్స్ స్కేటింగ్ చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన కలకోట నవీన్‌కుమార్ కుటుంబం పదేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటోంది. ఈయన కుమారులైన రాజేశ్‌కుమార్, ఉమేశ్‌కుమార్ మూడేళ్లుగా స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. రోలర్ స్కేటింగ్‌లో ఇప్పటికే పలు పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించారు. తాజాగా బాలికా సంరక్షణపై అవగాహన కోసం జాతీయ పతాకం చేబూని రివర్స్ స్కేటింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ శివారు ఆర్‌ఎఫ్‌సీ నుంచి భద్రాచలం వరకు 300 కి.మీ. రివర్స్ స్కేటింగ్ ద్వారా చేరుకున్నారు. వీరిని తల్లిదండ్రులు, కోచ్‌లు పలు వాహనాల్లో అనుసరించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ కె.సురేశ్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్కేటింగ్ చేస్తూ భద్రాచలం బయలుదేరగా దారి పొడవునా వాహనదారులు ఆసక్తిగా తిలకించారు. కాగా, సోదరులిద్దరూ రాత్రి పొద్దుపోయాక భద్రాచలం చేరుకున్నారు. భద్రాచలం పర్యటనలో ఉన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోదరులు శుక్రవారం కలిసే అవకాశముంది.

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బెయిల్



సాక్షి, హైదరాబాద్: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.20 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఇద్దరి పూచీకత్తును రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కోర్టులో మేజిస్ట్రేట్‌కు సమర్పించాలని జానీని ఆదేశించింది. బాధితురాలి వ్యక్తిగత జీవితంలో జానీగాని, అతని కుటుంబ సభ్యులుగానీ ఎలాంటి జోక్యం చేసుకోవద్దని, బాధితురాలిని కలిసే ప్రయత్నం కూడా చేయవద్దని స్పష్టం చేసింది. జానీ మాస్టర్ తనను వేధించారని, పలుమార్లు అత్యాచారం చేశారని, మైనర్‌గా ఉన్నప్పుడే తనపై అత్యాచారం చేశారంటూ అతని అసిస్టెంట్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. పైగా మతం మార్చుకుని పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి కూడా చేశారని ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుల మేరకు జానీ మీద పోక్సో చట్టం కింద నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి.. గత నెలలో గోవాలో అరెస్టు చేశారు. అయితే, జాతీయ అవార్డు తీసుకునేందుకు ఈ నెల 6 నుంచి 10 వరకు ట్రయల్ కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కానీ ఆయనకు ఇచ్చిన అవార్డును వెనక్కు తీసుకోవడంతో బెయిల్ రద్దయింది. ఈ నేపథ్యంలో చంచల్‌గూడ జైలులో ఉన్న జానీ మాస్టర్ రెగ్యులర్ బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



సాక్షి, హైదరాబాద్: జర్మనీ–ఇండియన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్‌లో భాగంగా గురువారం తెలంగాణ శాసనసభను జర్మనీ దేశంలోని రెనిలాండ్ రాష్ట్ర పార్లమెంట్ సభ్యుల బృందం సందర్శించింది. రెనిలాండ్ రాష్ట్ర పార్లమెంట్ స్పీకర్ హెన్రిక్ హేరింగ్ నాయకత్వంలోని ఎనిమిది మంది సభ్యుల బృందానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నతమైనవని తెలిపారు.

అసెంబ్లీలో జర్మనీ ఎంపీలు

ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రం 2014 లో నూతనంగా ఏర్పడినట్లు పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభలో 119 మంది సభ్యులు, శాసనమండలిలో 40 మంది సభ్యులున్నారని వివరిస్తూ.. శాసనసభ సభ్యులను ప్రజలు ఎన్నుకొంటారని తెలిపారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడ్డారని వివరించారు. నిజాం హయాంలో నిర్మించిన పాత అసెంబ్లీ భవనాన్ని రూ.49 కోట్లతో ఆధునికీకరిస్తున్నామని, త్వరలోనే శాసనమండలిని అందులోకి మార్చుతామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని, ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, తోట లక్ష్మీకాంతారావు తదితరులు వివరించారు. ఈ సందర్భంగా జర్మనీ పార్లమెంటు సభ్యులను సత్కరించారు.



పదేళ్లు పూర్తి చేసుకున్న షీటీమ్స్

సాక్షి, హైదరాబాద్: పోకిరీల వేధింపుల నుంచి మహిళలను రక్షించేందుకు ఏర్పాటు చేసిన షీటీమ్స్ గురువారంతో పదేళ్లు పూర్తి చేసుకున్నట్టు మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయెల్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగంగా వేధింపులతో పాటు ఆన్‌లైన్ వేదికల్లో లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్‌కు పాల్పడే వారిపై షీటీమ్స్ బృందాలు కఠిన చర్యలు తీసుకుంటూ.. మహిళలకు మద్దతుగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అక్టోబర్ 24 2014లో హైదరాబాద్‌లో ప్రారంభమైన షీటీమ్స్‌ను క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించినట్టు వివరించారు. ప్రస్తుతం షీటీమ్స్‌లోని 30 పోలీస్ యూనిట్లలో 328 మంది అధికారులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 549 ఫిర్యాదులు షీటీమ్స్ బృందాలకు అందినట్టు వెల్లడించారు.

SHE TEAMS
TELANGANA POLICE
Safety for Her Ensured

2014 అక్టోబర్ నుంచి సెప్టెంబర్ 2024 వరకు షీటీమ్స్ పనితీరు ఇలా..

మొత్తం పిటిషన్లు..	66,617
నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు	6,319
నమోదు చేసిన పెట్టీ కేసులు	17,460
కౌన్సెలింగ్ (మైనర్లు, మేజర్లకు కలిపి)	15,343
షీటీమ్స్ హెచ్చరించి వదిలేసిన మైనర్ల సంఖ్య	16,169
రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న కేసుల సంఖ్య	13,895

మత, కులరహితుల వివరాలు కూడా సేకరించాలి

సామాజికవేత్త డీవీ రామకృష్ణారావు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియలో మత, కుల రహితుల వివరాలు కూడా ప్రత్యేకంగా సేకరించాలని సామాజికవేత్త డీవీ రామకృష్ణారావు గురువారం ఓ ప్రకటనలో కోరారు. 2011 జనాభా లెక్కల్లో భాగంగా దేశవ్యాప్తంగా మతం చెప్పని వారి సంఖ్య 28.6లక్షలు ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీరి సంఖ్య 4.6లక్షలుగా ఉందని చెప్పారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఈ అంశాలను పొందుపరచాలని ఈ మేరకు ప్రభుత్వానికి గతంలోనే వినతిపత్రాన్ని సమర్పించినట్లు ఆయన తెలిపారు.

మంచే మసకేసిందిలే..



నిర్మల్ జిల్లా కేంద్రాన్ని గురువారం ఉదయం మంచు తెరలు కమ్మేశాయి. ఉదయపు నడక కోసం వెళ్లినవారు చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు. ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు తొలగిపోలేదు. దీంతో 44 నంబర్ జాతీయ రహదారిపై వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అడవే ఆధారం.. అభివృద్ధికి దూరం


చెట్లు చేమలే వారి నేస్తాలు.. బొడ్డు గుడిసెలే నివాసాలు.. ఆకులు, అలములు, కందమూలాలే ఆహారం.. అడవిలో పుట్టి.. అడవిలో పెరిగి.. అడవే సర్వస్వంగా జీవిస్తున్నా ఎదుగూబొదుగూ లేని బతుకులు.. అభ్యున్నతికి నోచక.. అనాగరిక జీవనం సాగిస్తున్న చెంచుల బతుకులపై విశ్లేషణాత్మక కథనమిది.

అటవీ ఉత్పత్తులే చెంచుల జీవనాధారం

నల్లమలలో లభించే తేనె, మారెడుగడ్డలు, చింతపండు సేకరణ

క్రమంగా అంతరించిపోతున్న ఉత్పత్తులు

కనిపించని జిగురు, ఇప్పపూలు - ఆందోళనకరంగా చెంచుల జీవనం



ఇప్పపూలు సేకరిస్తున్న చెంచులు

అచ్చంపేట: చెంచుల అభ్యున్నతి, సంక్షేమానికి ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో రూ.కోట్లు కేటాయిస్తున్నా.. అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉన్నారు. నేటికీ వందలాది మంది చెంచులకు వ్యవసాయ భూమి లేదు. అటవీ ఉత్పత్తుల సేకరణతో కాలం వెళ్లదీస్తున్నారు. వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ భూ పంపిణీకి నోచుకోవడం లేదు. నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచుల అభివృద్ధి గణాంకాలకే పరిమితమైంది. వారికి ఉపాధి కల్పించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ, గిరిజన సహకార సంస్థతో పాటు ఐకేపీ, టీపీఎంయూ ఐటీడీఏలో అంతర్భాగంగా ఉన్నాయి. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, తాగునీటి వసతి వంటివి అమలు కావడం లేదని చెంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కా ఇళ్లు లేక రాత్రివేళ బొడ్డు గుడిసెల్లో కట్టెల మండల (నెగడి)తో కాలం వెళ్లదీస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను వైద్య, ఆరోగ్యశాఖ, ఐటీడీఏ పట్టించుకోక పోవడంతో చెంచుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. దీర్ఘకాలిక రోగాలతో పాటు మలేరియా, క్షయ, పక్షపాతం, కడుపులో గడ్డలు, విషజ్వరాలు, రక్తహీనత, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. అటవీ లోతట్టు ప్రాంతంలో జీవిస్తున్న చెంచుల జీవితాలు మరింత దుర్భరంగా ఉన్నాయి. వైద్యం, పౌష్టికాహారం, తాగునీరు అందక అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు.



బూడిపార్ల వేర్లను ఎండబెడుతున్న చెంచు మహిళ

దుర్భరంగా బతుకులు..

మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని చెంచుల సంక్షేమం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సున్నిపెంట (శ్రీశైలం)లో ఏర్పాటైన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రభావితంగానే కొనసాగింది. 2014 రాష్ట్ర విభజన అనంతరం 2015 మార్చి నుంచి అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థను (ఐటీడీఏ) ఏర్పాటు చేశారు. దీని పరిధిలో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలున్నాయి. ఆయా జిల్లాల్లోని 25 మండలాల్లో 172 గిరిజన గ్రామాలు, పెంటలు.. 4,041 చెంచు కుటుంబాలున్నాయి. 14,194 మంది గిరిజన జనాభా ఉంది. నల్లమల అటవీ ప్రాంతంలో 88 చెంచు పెంటల్లో 2,595 కుటుంబాలుండగా.. 8,784 మంది చెంచులు నివసిస్తున్నారు. వీరిలో 4,341 మంది పురుషులు, 4,449 మంది మహిళలున్నారు. అభయారణ్యం పరిధిలో లింగాల, అమ్రాబాద్, పదర మండలాలుండగా.. 18 చెంచు పెంటలున్నాయి. 12 పెంటల్లో పూర్తిగా చెంచులే నివసిస్తుండగా.. మిగతా పెంటల్లో చెంచులతో పాటు ఎస్సీ, ఎస్టీలున్నారు. అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని లోతట్టు అటవీ ప్రాంతంలోని పర్హాబాద్, మల్లాపూర్, పుల్లాయిపల్లి, రాంపూర్, అప్పాపూర్, భౌరాపూర్, ఈర్లపెంట, మేడిమెల్కల, సంగడిగుండాలు, ధారవాగు, తాటిగుండాలు, పెద్దూటి, బట్టిచింతల, ఎంకలపెంట, ఎర్రపెంట, పాత ధారారం, కుండిచింతబైలు తదితర చెంచు పెంటల్లో నివసించే వారి పరిస్థితి దుర్భరంగా ఉంది. గిరిజనుల అభివృద్ధికి బాటలు వేయాల్సిన ఐటీడీఏతో ఎలాంటి సంక్షేమ ఫలాలు అందకుండా పోతున్నాయి. వీరి జీవన స్థితిగతుల మార్పు, సమస్యల పరిష్కారానికి చెంచు సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్నోసార్లు పాదయాత్రలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టారు. విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, విద్యుత్ సౌకర్యాలతో పాటు ఇళ్లు లేక చెంచులు అంధకారంలో బతుకులు వెళ్లదీస్తున్నారు.



అడవిలో దొరికే గడ్డితో చీపుళ్లు తయారు చేస్తున్న చెంచు మహిళలు

ఫలాల సేకరణకు హద్దులు..

చెంచులు ప్రధానంగా అటవీ ఉత్పత్తుల సేకరణ, వేటపై ఆధారపడి జీవనం కొనసాగిస్తారు. అటవీ ప్రాంతంలో లభించే ఫలాల సేకరణకు హద్దులు ఏర్పాటు చేసుకుంటారు. వారు ఏర్పాటు చేసుకున్న సరిహద్దు ప్రాంతంలోనే ఉత్పత్తులు సేకరిస్తుంటారు. ఇది వంశపారంపర్యంగా వస్తున్న హక్కుగా చెబుతున్నారు. చెంచుల ఆచారాలు, ఇంటి పేర్లు.. చెట్లు, వన్యప్రాణుల పేర్లతో కూడి ఉంటాయి.



మన్ననూర్ జీసీసీలో అమ్మకానికి తెచ్చిన చింతపండు సంచులతో చెంచు మహిళలు

చెట్ల పెంపకం అంతంతే..

అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగించే చెంచుల బతుకులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. క్రమంగా అటవీ ఉత్పత్తులు అంతరించడం.. చెంచుల జీవన ప్రమాణాలు పెంచాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉండటంతో వారికి ఆహార కొరత ఏర్పడింది. నాగరికత ఎరుగని చెంచులు నేటికీ.. ఆహార సేకరణ దశలోనే ఉన్నారు. వీరి అభివృద్ధికి బాటలు వేయాల్సిన ఐటీడీఏ.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నది వాస్తవం. ఫలాలు ఇచ్చే చెట్ల పెంపకంపై అధికారులు దృష్టి సారించడం లేదు. వేసవిలో కనీసం ఉపాధి పనులు కూడా చేపట్టకపోవడంతో చెంచులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

అటవీ ఉత్పత్తులు ఇవే..

నల్లమల అటవీ ప్రాంతంలో తేనె, మారెడు గడ్డలు, జిగురు, చింతపండు, కుంకుడుకాయలు, ముష్టి గింజలు, ఎండు ఉసిరి, చిల్లగింజలు, నరమామిడి చెక్క, కరక్కాయలు, ఇప్పపువ్వు, ఇప్పగింజలు, కానుగ గింజలు, తునికాకు, బుడ్డపార్ల వేర్లు, వెదురుతో పాటు మరో పది రకాల ఉత్పత్తులు అడవిలో లభిస్తాయి. వాతావరణ పరిస్థితులు, రేడియేషన్ ప్రభావం వల్ల సహజసిద్ధంగా లభించే అటవీ ఫలాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. వీటికోసం చెంచులు పెద్ద పులులు ఇతర క్రూరమృగాలతో పొంచి ఉన్న ముప్పును సైతం లెక్కచేయడం లేదు. అటవీ ఉత్పత్తులు సేకరించి, గిరిజన కార్పొరేషన్ సంస్థ జీసీసీ కేంద్రాల్లో విక్రయిస్తూ.. తమకు కావలసిన సరుకులు తీసుకెళ్తారు. ఇప్పటికే తీగలు, గడ్డలు అంతరించిపోవడంతో చెంచులకు ఉపాధి లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం మొక్కల పెంపకంపై దృష్టి సారించినా.. చెంచులకు ఫలాలు ఇచ్చే మొక్కల పెంపకంపై మాత్రం ఆసక్తి చూపడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికే అడవిలో లభించే తునికాకు సేకరణను అటవీశాఖ అధికారులు పదేళ్లుగా నిలిపివేశారు. రేడియేషన్ కారణంగా తేనెటీగలు అంతరించిపోవడంతో తేనె తుట్టెలు కనిపించడం లేదు. తేనెటీగల పెంపకంపై ప్రభుత్వం చెంచులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. చెంచులు ఏడాది పొడవునా జిగురు, చింతపండు, తేనెపైనే ఆధారపడి జీవిస్తున్నారు.



నల్లమలలో లభించే జిగురు

ఉప్పుకైనా అప్పాపూరే..

చెంచులకు జీసీసీ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారు. నల్లమలలోని చెంచులందరూ కాలినడకన అప్పాపూర్ చెంచుపెంటకు వచ్చి వాటిని కొనుగోలు చేస్తారు. అటవీ వస్తువులను విక్రయించి, వాటి ద్వారా వచ్చిన డబ్బుతో బియ్యం, నూనె, పప్పు వంటి వస్తువులను కొనుగోలు చేస్తారు. వ్యాపారులు కొన్ని సరుకులకు బయటి మార్కెట్ కంటే ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. చెంచులకు నాసిరకం సరుకులు అంటగడుతున్నారు.

బీమా కల్పించాలి

ప్రభుత్వం తేనెకు మద్దతు ధర కల్పించడంతో పాటు.. తేనె సేకరణకు వెళ్లే ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. కొన్నేళ్లుగా స్వచ్ఛంద సంస్థలు మాత్రమే తేనె సేకరణలో మాకు ఉపయోగపడుతున్నాయి. వారు ఇచ్చిన కిట్లు కూడా పాడయ్యాయి. కొత్త వాటిని ఇవ్వలేదు. గతంలో పెంటలకు అందుబాటులో తేనె లభించేది. ఇప్పుడు అడవిలో చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది.

- బయన్న, మల్లాపూర్ చెంచుపెంట

పక్కా ఇళ్లు లేవు



లోతట్టు చెంచులు నేటికి అనాగరిక జీవితం కొనసాగిస్తున్నారు. అటవీ ఉత్పత్తులు తగ్గాయి. జీవనం కొనసాగడం కష్టంగా ఉంది. పక్కా ఇళ్లు లేక బొడ్డు గుడిసెల్లోనే కాపురం వెళ్లదీస్తున్నారు. ప్రత్యేక ఉపాధి తీసివేసిన తర్వాత పనులు లేకుండా పోయాయి. వైద్యం అందక రోగాల బారిన పడుతున్నారు.

- నిమ్మల శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఆదివాసీ చెంచు ఐక్యవేదిక

ఉపాధి కల్పనకు చర్యలు



చెంచుల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. చెంచుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్ యోజన) పథకం కింద 88 చెంచుపెంటల్లో 11 రకాల కార్యక్రమాలను విడతల వారీగా చేపడుతున్నాం. చెంచుపెంటల్లో 1,030 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదించి, పనులు ప్రారంభించాం. కొంతమంది చెంచులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆధార్‌కార్డులు అందజేశాం. ప్రత్యేక వైద్య వాహనం ఏర్పాటు చేశాం. మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

- రోహిత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో



విజిబుల్ పోలీసింగ్‌తోనే చోరీలకు విరుగుడు

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పెరుగుతున్న చోరీలు

మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలోనూ అదే పరిస్థితి

రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచితేనే చోరీలకు అడ్డుకట్ట

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి

వరంగల్ జిల్లా నర్సంపేటలో కొద్దిరోజుల క్రితం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పెద్ద మొత్తంలో నగదు, బంగారం పోయింది. అయితే నిందితులను పట్టుకున్నాం. ఇటీవల వరంగల్ వెస్ట్‌జోన్ పోలీసులు ఇద్దరు దొంగలను పట్టుకొని వారి నుంచి రూ.22.56 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో చోరీల నివారణకు విజిబుల్ పోలీసింగ్ పెంచుతున్నాం. ఠాణాల వారీగా కూడా సమీక్షిస్తున్నాం. ఎవరైనా విధులు సరిగా నిర్వర్తించకపోతే సదరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

- అంబర్ కిశోర్ ఝా, పోలీసు కమిషనర్, వరంగల్

సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వరంగల్ పోలీసు కమిషనరేట్‌తో పాటు మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో నమోదవుతున్న చోరీల సంఖ్య ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన ఈ విజిబుల్ పోలీసింగ్‌లో.. ముఖ్య నగరాలు, పట్టణాలతో పాటు గ్రామాల్లో పోలీసులు, పెట్రోకార్, బ్లూకోల్ట్ సిబ్బంది.. తరచూ పర్యటిస్తూ నిఘా పెంచితే దొంగల్లో భయం పుడుతుంది. అదే సమయంలో ప్రజల్లో భద్రత భావం పెరుగుతుంది. ఇలా విజిబుల్ పోలీసింగ్‌తో దొంగతనాలతో పాటు నేరాలు తగ్గే అవకాశముంది.

సిబ్బంది.. పెట్రోలింగ్ పెరగాలి

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో విస్తరించిన వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 150 చోరీలు జరిగాయి. మహబూబాబాద్‌లో 182, ములుగు 131, భూపాలపల్లి 78 చోరీ కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోల్చుకుంటే వీటి సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళనకరంగా మారింది. కానీ.. చోరీ కేసుల ఛేదనలో కీలకమైన సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో సిబ్బంది కొరత వల్ల కూడా దొంగలు పేట్రేగిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిటాచ్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ల నియామకం లేకపోవడం కూడా చోరీలు పెరగడానికి కారణంగా కనిపిస్తోంది. ఇంకోవైపు సమయాల్లో ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని పోలీసులు పెట్రోలింగ్ పూర్తి స్థాయిలో చేయకపోవడం దొంగలకు వరంగా మారిందన్న విమర్శలున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ తరహాలోనే విజిబుల్ పోలీసింగ్ ద్వారానే నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్న పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అంతగా అమలు కాకపోవడంతో దొంగతనాలు పెరిగేందుకు అస్కారం ఏర్పడింది. ఇంకా చాలావరకు చిన్నచిన్న దొంగతనాల కేసులు నమోదు కాలేదన్న విమర్శలున్నాయి.



ఫటాఫట్.. సైలెన్స్!

కర్నూలులోని కొండారెడ్డిబురుజు సమీపంలో సైలెన్సర్లను ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. నగరంలో అల్లరిమూకలు ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం వచ్చేవిధంగా బిగించుకున్న 110 సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయిస్తున్న దృశ్యాలు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్ శ్రీనివాసులు, కర్నూలు



స్వర్ణాల చెరువు.. గుర్రపు డెక్కకు నెలవు

నెల్లూరు బారాషాహిద్ దర్గా స్వర్ణాల చెరువు...రొట్టెల పండుగ నిర్వహించే సమయంలో ఇక్కడకు జనాలు పోటెత్తుతారు. ఆ సమయంలో ఇక్కడ పవిత్ర స్నానాలాచరిస్తారు. అయితే ఇదే స్వర్ణాల చెరువు..ప్రస్తుతం కనుచూపుమేరలో మొత్తం గుర్రపుడెక్కతో ఇలా మూసుకుపోయింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, విజయకృష్ణ, నెల్లూరు



కన్నా.. వికసించాలి నువ్వలా..!

విశాఖపట్నంలోని ఆర్.కె.బీచ్ వద్ద ఓ గోడకు వేసిన పెయింట్ పలువురిని విశేషంగా ఆకర్షిస్తోంది. మొక్కకు నీళ్లు పోస్తున్నట్లుగా ఉండే ఈ పెయింట్ వద్ద పలువురు ఫొటోలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో తన కుమారుడికి ఇక్కడ ఫొటో తీస్తున్న దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, పీఎల్ మోహన్, విశాఖపట్నం

క్లుప్తంగా...

మోదీ, వైష్ణవ్‌లకు శ్రీనివాసవర్మ ధన్యవాదాలు

సాక్షి, అమరావతి: కేంద్రమంత్రివర్గం అమరావతి రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం తెలపడం కీలక ఘట్టమని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని, రైల్వేమంత్రిలకు ధన్యవాదాలు తెలిపారు.

పట్టణ రవాణా మరింత మెరుగు: పురందేశ్వరి

శ్రీకాకుళంలోని రణస్థలంలో 6–లేన్ల ఎలివేటెడ్ కారిడార్ విస్తరణ కోసం రూ.252.42 కోట్ల బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి 'ఎక్స్'లో పేర్కొన్నారు.

జీతాలకు ఎఫ్ఆర్ఎస్ అనుసంధానంపై పునరాలోచన చేయాలి

సాక్షి, అమరావతి: జీతాలకు ఫేషియల్ రికగ్నేసన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) హాజరు అనుసంధానంపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ దయామణి గురువారం కోరారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలతో ఎఫ్ఆర్ఎస్ యాప్ ఓపెన్ అవ్వడానికి 10 నిమిషాలు పడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 10 నిమిషాలు ఆలస్యం అయ్యారంటూ వేతనాల్లో కోత విధిస్తామని షరతులు విధించడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

గుర్ల అనుభవాలతో మరింత సమన్వయంగా పనిచేయాలి

మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి : గుర్ల అతిసార ఘటనల అనుభవాలతో ప్రభుత్వ శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. డయేరియాపై గురువారం ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌తో కలిసి సమీక్ష నిర్వహించిన ఆయన ప్రజలు వ్యాధుల బారినపడకుండా చైతన్యం చేయాలన్నారు. పంచాయతీ, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆర్ఆర్‌టీ బృందాలు ఏర్పాటుచేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్: మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాల నివారణకు బస్ ఆపరేటర్లు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. రామవరప్పాడులోని గురువారం ఏపీ, తెలంగాణ ప్రైవేటు ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణకు హోమ్, హెల్త్, రవాణా శాఖల సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

టీటీడీ లడ్డూపై సీఎం బాబు వ్యాఖ్యలు దారుణం

సుప్రీం కోర్టులో కేఏ పాల్ పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు వ్యాఖ్యానించడం దారుణమని, అలా అన్నవారిని కఠినంగా శిక్షించాలంటూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

లడ్డూపై సీఎం చేసిన వ్యాఖ్యలతో వంద కోట్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు.ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ పి.కె. మిశ్రా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్ ధర్మాసనం గురువారం వర్చువల్‌గా విచారణ చేపట్టింది. ఈ కేసులో ఇప్పటికే సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది కదా అని ధర్మాసనం కేఏ పాల్‌కు తెలపగా.. తన పిటిషన్‌పై ప్రత్యేకంగా విచారణ జరపాలని ఆయన కోరారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణను వచ్చేనెల 22కు వాయిదా వేసింది.

ఆహార సరఫరా 'అక్షయపాత్ర'కు వద్దు

సాక్షి, అమరావతి: గిరిజన వసతి గృహాలు, గురుకులాల్లో ఆహారం అందించే కార్యక్రమాన్ని అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు అప్పగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. పౌష్టికాహారం కల్తీ జరుగుతుందనే సాకుతో రాష్ట్రవ్యాప్తంగా గిరిజన బిడ్డలకు అందించే ఆహారాన్ని అక్షయపాత్ర అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని పేర్కొంది.

సమోసా, చిప్స్ తింటున్నారా!

- అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌తో మధుమేహం ముప్పు
- విస్తుగొలిపే విషయాలను వెల్లడించిన ఐసీఎంఆర్
- మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్‌తో కలిసి పరిశోధనలు జరిపిన ఐసీఎంఆర్
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ క్లినికల్ ట్రయల్ రన్‌లోనూ ఇవే విషయాలు వెల్లడి
- బేకరీ ఉత్పత్తులు, ఫాస్ట్ ఫుడ్స్‌లోనూ ఏజీఈ అధికం
- పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలతో మధుమేహం నుంచి రక్షణ



సమోసా.. పకోడీ.. ఫ్రైడ్ చికెన్.. చిప్స్.. బిస్కెట్లు.. కేక్స్.. రెడీమేడ్ మీల్స్.. మయోనైజ్, గ్రిల్డ్ చికెన్.. డ్రై నట్స్.. వేయించిన వాల్‌నట్స్ వంటి ఆహార పదార్థాలు డయాబెటిస్ పెరిగేందుకు దోహదం చేస్తున్నాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) పరిశోధనలో వెల్లడైంది. మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్)తో కలిసి ఐసీఎంఆర్ ఇటీవల నిర్వహించిన పరిశోధనలో విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి. మరోవైపు కేంద్రంలోని శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ విభాగం నిర్వహించిన తాజా క్లినికల్ ట్రయల్ రన్‌లోనూ మధుమేహం ముప్పునకు పైన పేర్కొన్న ఆహార పదార్థాలే కారణమని స్పష్టమైంది. – సాక్షి, అమరావతి

ఏజీఈ అధికంగా ఉండటం వల్లే..

సమోసా, పకోడీ, ఫ్రైడ్ చికెన్, చిప్స్, నూడిల్స్, సూప్‌లు, ఇతర ప్యాక్డ్ ఆహార పదార్థాలను పిల్లల నుంచి పెద్దలు ఇష్టంగా తింటున్నారు. ఈ తరహా అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ (యూపీఎఫ్) దేశంలో మధుమేహం ముప్పును రోజురోజుకూ పెంచుతోంది. భారతదేశం ప్రపంచ మధుమేహ రాజధానికి ఉండటానికి హానికరమైన ఆహారపు అలవాట్లే కారణమవుతున్నాయి. ప్రస్తుతం దేశంలో 10.10 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో అడ్వాన్స్‌డ్ గ్లైకేషన్ అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలు రక్తంలో చక్కెరను పెంచుతున్నాయని తేలింది. అధునాతన గ్లైకేషన్ ముగింపు ఉత్పత్తులు (ఏజీఈ) హానికరమైన సమ్మేళనాలు. గ్లైకేషన్ అనే ప్రక్రియ ద్వారా ప్రోటీన్లు లేదా కొవ్వులు చక్కెరలతో సంకర్షణ చెందుతున్నప్పుడు మధుమేహం ఏర్పడుతుంది. ఏదైనా ఆహార పదార్థాన్ని వేయించినప్పుడు లేదా కాల్చినప్పుడు, అందులో ఏజీఈలు ఏర్పడతాయి. ఇవి ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాల వినియోగం ఊబకాయాన్ని పెంచుతోందని.. ఇది మధుమేహానికి ప్రధాన కారణమవుతోందని వెల్లడైంది. ఈ పరిశోధన ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఫుడ్ సైన్సెస్ అండ్ న్యూట్రిషన్‌లో ప్రచురించబడింది.

ఆయుర్దాయంపై ప్రభావం

టైప్–2 డయాబెటిస్ మనిషి ఆయుర్దాయంపైనా ప్రభావం చూపుతోంది. అధిక ఆదాయ వర్గానికి చెందిన 19 దేశాల్లో 15 లక్షల మంది జనాభా ఆరోగ్య రికార్డులపై అధ్యయనానికి సంబంధించిన అంశాలను ఇటీవల ది లాన్సెట్ డయాబెటిస్, ఎండోక్రైనాలజీలో ప్రచురించారు. 30 ఏళ్లలో టైప్–2 బారినపడిన వ్యక్తి సగటు ఆయుర్దాయం 14 ఏళ్లు క్షీణిస్తుందని, 40 ఏళ్ల వయసులో సమస్య తలెత్తితే పదేళ్లు, 50 ఏళ్లకు కనిష్టంగా ఆరేళ్ల చొప్పున ఆయుర్దాయం తగ్గుతోందని పరిశోధకులు తేల్చారు.

38 మందిపై.. 12 వారాల పరీక్ష



పరిశోధన నిమిత్తం ఎంపిక చేసిన 38 మందిపై 12 వారాల పాటు పరీక్షలు నిర్వహించారు. మధుమేహం లేనివారిని రెండు సమూహాలుగా విభజించారు. 12 వారాల పాటు ఒక సమూహానికి అడ్వాన్స్డ్ గ్లెకైషన్ ఎండ్ ప్రొడక్ట్స్ (ఏజీఈ) తక్కువగా ఉండే ఆహారం, మరో సమూహానికి ఏజీఈ అధికంగా ఉండే ఆహారాన్ని అందించారు. 12 వారాల అనంతరం పరిశీలిస్తే అధిక ఏజీఈ ఆహారం తిన్న సమూహంతో పోలిస్తే తక్కువ ఏజీఈ ఆహారం తిన్న సమూహంలోని వ్యక్తుల్లో టైప్–2 మధుమేహం ముప్పు తక్కువగా ఉందని గుర్తించారు. వీరిలో ఇన్సులిన్ నిరోధకత గణనీయంగా పెరిగిందని పరిశోధకులు వెల్లడించారు.

కేకులు, కుక్కీలు వంటి కాల్చిన ఆహారాల్లో ఏజీఈలు ఎక్కువగా ఉంటాయి. చిప్స్, సమోసాలు, పకోడీలు, వేయించిన చికెన్ వంటి వాటిలో పెద్ద పరిమాణంలో ఏజీఈ ఉంటోంది. అలాగే రెడీమేడ్ ఆహార పదార్థాల రూపంలో వచ్చే వనస్పతి, మయోనైస్ కూడా చక్కెరను పెంచుతాయి. కాల్చిన మాంసాలు, కాల్చిన గింజలలో ఏజీఈలు సమృద్ధిగా ఉంటాయి. వీటి వాడకం వల్ల చక్కెర వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఫ్రైడ్ ఫుడ్స్ స్థానంలో తక్కువ ఏజీఈ డైట్ తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు. ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి వాటిని చేర్చుకోవాలని ఐసీఎంఆర్ స్పష్టం చేసింది.

మిలమిలలాడే ఆహార పదార్థాలను వినియోగించొద్దు



పూర్వీకులు పాలిష్ చేయని దంపుడు బియ్యం, కూరగాయలు, పండ్లు ఆహారంగా తీసుకునే వారు. ప్రస్తుతం బియ్యం, చక్కెర, ఉప్పు ఇలా ప్రతీది తెల్లగా మిలమిలలాడేలా పాలిష్ చేస్తున్నారు. ఈ పాలిష్ ఆహార పదార్థాలను విడనాడాలి.

– పి.శ్రీనివాసులు, హెచ్‌వోడీ ఎండోక్రినాలజీ విభాగం, కర్నూలు మెడికల్ కాలేజీ

జీవన శైలిలో మార్పు రావాలి



టైప్–2 మధుమేహం అనారోగ్యకరమైన జీవన శైలి కారణంగా వస్తుంది. దీనికి తోడు హానికరమైన ఆహారపు అలవాట్లు తోడై పిల్లలు సైతం మధుమేహం బారినపడుతున్నారు. చదువు, వృత్తి, ఉద్యోగాల్లో ఒత్తిడిని అధిగమించడానికి ప్రయత్నించాలి. మధుమేహం అని తేలాక అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలి.


– డాక్టర్ వెంకట సందీప్, ఎండోక్రినాలజిస్ట్, గుంటూరు


ఏమిటీ అడ్వాన్స్డ్ గ్లెకైషన్ ఎండ్ ప్రొడక్ట్స్

ఫ్రై, రోస్ట్ (బాగా వేడి) చేసిన అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ (యూపీఎఫ్) ఆహారాన్ని తిన్నప్పుడు కార్బోహైడ్రేట్స్ శరీరంలో నేరుగా ప్రొటీన్స్, కొవ్వులతో కలిసి అడ్వాన్స్డ్ గ్లెకైషన్ ఎండ్ ప్రొడక్ట్స్(ఏజీఈ)లుగా రూపాంతరం చెందుతాయి. వీటివల్ల శరీరంలో హానికరమైన మాలిక్యుల్స్ తయారవుతాయి. ఇవి ఎక్కువ కావడంతో శరీరంలో ఇన్సులిన్ నిరోధకత తగ్గిపోతుంది. శరీరంలోని కణాల్లోకి గ్లూకోజ్‌ను అందించడంలో ఇన్సులిన్ తాళం చెవి మాదిరిగా పనిచేస్తుంది. ఏజీఈ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ నిరోధకతను దెబ్బతీస్తుంది. ఈ నేపథ్యంలో తిన్న ఆహారంలోని చక్కెర పదార్థాలు కణాలకు అందకుండా రక్తంలోని ఉండిపోయి టైప్–2 మధుమేహానికి దారి తీస్తుంది. అంతేకాకుండా ఊబకాయం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తుంది. ఈ క్రమంలో ఏజీఈ అధికంగా ఉండే బేకరీ, హోటల్స్‌లో తయారు చేసే కేక్స్, చిప్స్, ఐస్‌క్రీమ్స్, ఇంట్లో డీప్ ఫ్రై, ఫ్రై ఆహార పదార్థాలు తినడం తగ్గించాలని పరిశోధకులు స్పష్టం చేశారు.

'పాథోరోల్'తో 'ఈహెచ్‌పీ'కి చెక్

- ఆక్వా రంగానికి పెనుసవాల్‌గా మారిన ఈహెచ్‌పీ
- ఏటా 49 శాతం పంటపై ఈ వ్యాధి ఉధృతి





సాక్షి, అమరావతి: ఈ.హెచ్.పీ (ఎంటిరోసైటోజోన్ హెపటోపీనాయి)..ఇదొక మైక్రో స్పోరిడియన్ జాతికి చెందిన పరాన్నజీవి. ఆక్వా రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తోన్న ఈ వ్యాధి నియంత్రణకు ఓ చక్కని పరిష్కారం లభించింది. దాదాపు ఐదేళ్ల పాటు సుదీర్ఘ పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసిన 'పాథరోల్' రొయ్య రైతులకు అందుబాటులోకి వచ్చింది. ఆక్వాఆధారిత దేశాల్లో ఈహెచ్‌పీ వ్యాధి తీవ్రత, వాటిల్లుతున్న నష్టాలు, రైతులు పడుతున్న ఇబ్బందులు, వ్యాధి నియంత్రణలో పాథోరోల్ ప్రభావవంతంగా పనిచేస్తుందని ఈ మందు తయారు చేస్తున్న 'కెమిన్' సంస్థ వెల్లడించింది.

ఈహెచ్‌పీతో ఏటా 4వేల కోట్ల నష్టం

దేశీయ రొయ్యల సాగులో 49 శాతం విస్తీర్ణంలో ఈ వ్యాధి తీవ్ర ప్రభావం చూపు తున్నట్టు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐఏసీఆర్) గుర్తించింది. సమీప భవిష్యత్‌లో 100 శాతం చెరువులను ఈ వ్యాధి సంక్రమించే పెనుముప్పు ఉన్నట్టు ఐసీఏఆర్ హెచ్చరించింది. రొయ్యల ఆరోగ్యాన్నే కాదు..చెరువులను తీవ్ర ప్రభావితం చేస్తున్న ఈ వ్యాధి నియంత్రణ కోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోతుంది.. వ్యాధి నిరోధకశక్తిపై తీవ్ర ప్రభావం చూపే ఈహెచ్‌పీ వల్ల ఎదుగుదల లేక ఆశించిన కౌంట్‌లో రొయ్యలు పట్టుబడి పట్టలేక తక్కువ కౌంట్‌కే రైతులు తెగనమ్ముకోవల్సి వస్తోంది. ఈ వ్యాధి ఉధృతి వల్ల ఏటా రూ.4 వేల కోట్లకు పైగా రైతులు నష్టపోతున్నారు.

ఔషధ మొక్కల నుంచి 'పాథోరోల్'

ఆక్వా రంగంలో అపారమైన అనుభవం కల్గిన సౌత్ ఏషియాకు చెందిన కెమిన్ ఇండస్ట్రీ ఈ వ్యాధిని నియంత్రణ లక్ష్యంగా భారతీయ పరిశోధనా కేంద్రాలతో కలిసి జరిపిన విస్తృత పరిశోధనల ఫలితంగా 'పాథోరోల్'ను ఆవిష్కరించింది. ఔషద మొక్కల నుంచి అభివృద్ధి చేసిన ఈ మందును 20కు పైగా దేశాల్లో ఈహెచ్‌పీ సోకిన చెరువుల్లో ప్రయోగాత్మకంగా పరీక్షించి చూసింది. వినియోగంల్ల దుష్ప్రభావాలు ఉండవని పేర్కొంది.

సహాయక చర్యలకు నేవీ సిద్ధం



విశాఖలోని ఐఎన్ఎస్ దేగా నుంచి సహాయక సామగ్రి సిద్ధం చేస్తున్న నేవీ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: ఒడిశా, పశ్చిమ బెంగాల్‌పై విరుచుకుపడేందుకు దూసుకొస్తున్న తీవ్ర తుపాను 'దానా' ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేందుకు తూర్పు నావికాదళం సిద్ధమైంది. విశాఖ కేంద్రంగా తుపాను సహాయక సిబ్బంది ప్రభావిత ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అందుబాటులో ఉన్న సహాయక, డైవింగ్ బృందాల్ని ఇప్పటికే ఒడిశాకు నేవీ అధికారులు పంపించారు. రోడ్డు, వాయు మార్గాల ద్వారా సామాగ్రి తరలింపునకు చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో సముద్రం నుంచి కూడా సహాయక చర్యలు అందించేందుకు రెండు యుద్ధ నౌకలు విశాఖ నుంచి బయలుదేరుతున్నాయని తూర్పు నౌకాదళాధికారులు వెల్లడించారు. కమాండ్ బేస్ విక్చువల్లింగ్ యార్డ్(బీవీవై) మెటీరియల్ ఆర్గనైజేషన్, నేవల్ హాస్పిటల్ ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణి మొదలైన యూనిట్లకు చెందిన సిబ్బంది ఒడిశా, బెంగాల్ రాష్ట్రాలకు పయనమయ్యారు.

ఆడపిల్లలపై దాడులకు వైఎస్ జగనే కారణం

మంత్రి కె.అచ్చెన్నాయుడు

టెక్కలి: రాష్ట్రంలో ఆడపిల్లలపై దాడులకు మాజీ సీఎం వైఎస్ జగనే కారణమని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాల వల్ల ఇప్పుడు బడ్డీ కొట్లలో గంజాయి దొరుకుతుందన్నారు. అందువల్లే ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో నాలుగు నెలల తమ పాలనలో ఏదో జరిగిపోతోందంటూ జగన్ భ్రమలు కల్పిస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులను అధిగమించి పాలన అందజేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. గురువారం అర్ధరాత్రి వరకు 64,447 మంది స్వామివారిని దర్శించుకోగా 25,555 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.38 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. సర్వదర్శనం భక్తులకు 8 గంటల సమయం పడుతోంది. ఏడు కంపార్ట్‌మెంట్లలో భక్తులు దర్శనార్థమై వేచియున్నారు.

ఘనంగా పునర్వసు నక్షత్ర హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్దనున్న ప్రాచీన రామాలయంలో గురువారం హోమాన్ని నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామ పారాయణ చేశారు. భక్తులకు ప్రసాదాన్ని అందించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు


శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. విశేషాలంకరణలో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

31న అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

సింహాచలం: దీపావళి పురస్కరించుకుని ఈ నెల 31న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనాలు సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఆలయంలో మనవాళ్ల మహామునులు తిరునక్షత్రం పూజలు నిర్వహించనున్నారు.

ఏఎన్‌యూ యువజనోత్సవాలు ప్రారంభం

ఏఎన్‌యూ: యువతీయువకుల కేరింతలు, యువ కళాకారుల ప్రదర్శనలు, ఆటపాటల నడుమ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ యువజనోత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. 3 రోజులపాటు జరుగుతున్న యువజనోత్సవాలను గురువారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు ప్రారంభించారు. వర్సిటీ పరిధిలో 30 కళాశాల నుంచి కళా బృందాలు ఈ యువజనోత్సవాల్లో పాల్గొంటున్నాయి. తొలిరోజు మ్యూజిక్, థియేటర్ ఆర్ట్స్ పోటీలలో విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శనలు ఇచ్చారు. క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్ట్రన్ వోకల్ సోలో, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్ లలో యువతీయువకుల ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. మిమిక్రీలో విద్యార్థుల హావభావాలు, వాక్చాతుర్యం అద్భుతంగా ఉందని కళాభిమానులు ప్రసంశించారు.



నైపుణ్యం కోర్సులతో ఉపాధి అవకాశాలు

విశాఖ సిటీ: నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం ఏయూలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఏయూ అందించే సర్టిఫికెట్‌కు విలువ ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు.

ఏయూ విభాగాల్లో రెక్టార్ తనిఖీలు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలోని పలు విభాగాలను గురువారం రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లిష్, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీతో సహా పలు విభాగాలను సందర్శించారు.

సోషల్ వర్క్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

విశాఖ సిటీ: ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. సోషల్ వర్క్ ఫస్టియర్ విద్యార్థులు ప్రభుత్వ మానసిక చికిత్సాలయం, ఆర్‌సీడీ ఆస్పత్రులను సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక సమస్యలు, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం, రోగులకు అందించే చికిత్సలు, సామాజిక సేవ తదితర అంశాలపై విద్యార్థులకు అధ్యాపకులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.

ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో సైతం రిజర్వేషన్లు కల్పించాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు లెక్కపోగు జయరాజ్ డిమాండ్ చేశారు. తెలంగాణలో పారిశ్రామిక పార్కుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌తో పాటు.. రూ.50 లక్షల సబ్సిడీ ఇస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రైవేట్ ఇండస్ట్రీ పార్కులో ఏర్పాటు చేయడానికి తక్కువ ధరకే భూమినిచ్చి పన్నుల మినహాయింపుతో పాటు అనేక ఆర్థిక ప్రోత్సాహకాలు ఇస్తున్నదని తెలిపారు.

'కులగణన కోసం ఉద్యమం'

సాక్షి, అమరావతి: బీసీల కులగణన జరగకపోతే సర్కారు పునాదులు కదులుతాయని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, విశ్రాంత డీజీపీ డాక్టర్ పూర్ణచంద్రరావు హెచ్చరించారు. బీసీలకు కావాల్సింది డ్రోన్లు కాదని, రాజ్యాధికారమని స్పష్టం చేశారు. బీసీ సంఘాల సమన్వయ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన సమావేశం గురువారం విజయవాడలోని ఓ హోటల్‌లో జరిగింది. అనంతరం పూర్ణచంద్రరావు విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీల డిమాండ్లకు అనుగుణంగా అక్కడి ప్రభుత్వం కులగణనపై చర్యలకు ఉపక్రమించిందని, బీసీల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే ఏపీ ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. .

వైద్యసేవ ఫీల్డ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సాక్షి, అమరావతి: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను గురువారం ఆయన మీడియాకు విడుదల చేశారు. 18 ఏళ్లుగా చాలీచాలని వేతనాలకే సేవలు అందిస్తున్న వారిని సైతం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సేవలనుంచి తప్పించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని ధ్వజమెత్తారు.

యువతకు అన్ని విధాలా అండ

సాక్షి, అమరావతి: కాపు భవనాల నిర్మాణాలతో యువతకు అన్ని విధాలా అండగా నిలిచేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు రాష్ట్ర బీసీ, సంక్షేమశాఖ మంత్రి సవిత వెల్లడించారు. గురువారం ఆమె తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయాన్ని పరిశీలించారు. 2014–19 నాటి పథకాలన్నింటినీ మరోసారి అమలు చేయనున్నట్లు తెలిపారు.

వాట్ నెక్ట్స్



• పూరి జగన్నాథ్ • వీవీ వినాయక్ • కృష్ణవంశీ • చంద్రశేఖర్ ఏలేటి • సురేందర్ రెడ్డి • నందినీ రెడ్డి • పరశురాం • శ్రీకాంత్ అడ్డాల • శివ నిర్వాణ • వంశీ పైడిపల్లి • మెహర్ రమేశ్ • అజయ్ భూపతి



• సంకల్ప్ రెడ్డి

ఓ సినిమా విజయం అనేది డైరెక్టర్ల కెరీర్‌ని నిర్ణయిస్తుంది అంటారు. హిట్టు పడితే వరుస ఆఫర్లు వస్తాయి. అదే ఫ్లాపులొస్తే కెరీర్‌కి బ్రేకులు పడతాయి. నెక్ట్స్ చాన్స్ ఇచ్చే హీరో ఎవరు? అనే ప్రశ్న మొదలవుతుంది. అయితే జయాపజయాలతో సంబంధం లేకుండానూ అవకాశాలు దక్కుతాయనుకోండి. కానీ కారణం ఏదైనా ప్రస్తుతం కొందరు దర్శకులు మాత్రం ఏ ప్రాజెక్ట్ ఫైనలైజ్ చేయలేదు. వాట్ నెక్ట్స్? అనే ప్రశ్నకు జవాబు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ఆ వివరాల్లోకి వెళదాం...

కృష్ణవంశీ పేరు చెప్పగానే కుటుంబ కథా చిత్రాలు గుర్తొస్తాయి. బంధాలు, బంధుత్వాలు, అనురాగం, ఆప్యాయతలు, భావోద్వేగాలను తనదైన శైలిలో తెర కెక్కిస్తుంటారాయన. అంతేకాదు... సమాజంలోని ప్రస్తుత పరిస్థితులు, వాస్తవ ఘటనల నేపథ్యంలోనూ సినిమాలు రూపొందిస్తుంటారు కృష్ణవంశీ. తొలి సినిమా 'గులాబీ' నుంచి గత ఏడాది తెరకెక్కించిన 'రంగ మార్తాండ' వరకూ మధ్యలో 'నిన్నే పెళ్లాడతా, మురారి, ఖడ్గం, రాఖీ, చందమామ, శశిరేఖా పరిణయం, గోవిందుడు అందరివాడేలే'...' ఇలా పలు హిట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించారు కృష్ణవంశీ. కాగా 2017లో వచ్చిన 'నక్షత్రం' తర్వాత దాదాపు ఆరేళ్ల గ్యాప్ తీసుకున్నారాయన. ఆ తర్వాత వచ్చిన 'రంగమార్తాండ' (2023) సినిమా ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించి, కన్నీరు పెట్టించింది. ఆ చిత్రం తర్వాత కృష్ణవంశీ ప్రాజెక్టుపై ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా లేదు. సో... నెక్ట్స్ ఏంటి? అంటే వెయిట్ అండ్ సీ.

ఒకప్పుడు కమర్షియల్ హిట్స్‌కి కేరాఫ్‌గా నిలిచిన పూరి జగన్నాథ్ ఇప్పుడు సక్సెస్ వేటలో ఉన్నారు. 'బద్రి, ఇడియట్, పోకిరి, దేశ ముదురు, చిరుత, బుజ్జిగాడు, బిజినెస్‌మేన్, టెంపర్, పైసా వసూల్, ఇస్మార్ట్ శంకర్' వంటి ఎన్నో హిట్ చిత్రాలు తన ఖాతాలో వేసుకున్నారు పూరి. అయితే 'ఇస్మార్ట్ శంకర్' సినిమా తర్వాత ఆయన్ని హిట్ వరించలేదు. విజయ్ దేవరకొండ హీరోగా పూరి తెరకెక్కించిన పాన్ ఇండియన్ ఫిల్మ్ 'లైగర్' ఆశించిన ఫలితాన్నివ్వలేదు. హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా వచ్చిన 'డబుల్ ఇస్మార్ట్' కూడా ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. దీంతో నెక్ట్స్ పూరి జగన్నాథ్ ప్రాజెక్ట్ ఏంటి? ఏ హీరోతో ఆయన సినిమా చేయనున్నారు? వంటి ప్రశ్నలకి జవాబు లేదు. ప్రభాస్, పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, ఎన్టీఆర్ వంటి హీరోలకు ఆయన హిట్స్ ఇచ్చారు. ప్రస్తుతం వారంతా పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. దీంతో ఇప్పటికిప్పుడు పూరి జగన్నాథ్‌కి డేట్స్ ఇచ్చే వీలు లేదు. ఇలాంటి సమయంలో ఆయన తర్వాతి సినిమా ఏంటి? అనే ఆసక్తి ఇండస్ట్రీ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లో నెలకొంది. సరైన కథ, కాంబినేషన్ కుదిరితే మళ్లీ ఆయన బౌన్స్ బ్యాక్ అవడం కష్టమేమీ కాదు.

మాస్ సినిమాలు తీయడంలో వీవీ వినాయక్ శైలి ప్రత్యేకం. హీరోలకు మాస్ ఎలివేషన్స్ ఇవ్వడంలోనూ ఆయనకి ఆయనే సాటి. అలాగే కమర్షియల్ సినిమాలకు కొత్త విలువలు నేర్పిన దర్శకుడిగా వినాయక్‌కి పేరుంది. 'ఆది, చెన్నకేశవ రెడ్డి, దిల్, ఠాగూర్, బన్ని, లక్ష్మి, యోగి, కృష్ణ, అదుర్స్, నాయక్, ఖైదీ నంబర్ 150' వంటి ఎన్నో విజయవంతమైన సినిమాలు తీశారాయన. అయితే చిరంజీవి రీ ఎంట్రీ ఇచ్చిన 'ఖైదీ నంబర్ 150' (2017) సినిమా హిట్ తర్వాత వినాయక్ తీసిన 'ఇంటిలిజెంట్' (2018) సినిమా నిరాశపరచింది. ఆ చిత్రం తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు వినాయక్. ప్రభాస్ హిట్ మూవీ 'ఛత్రపతి' సినిమాని బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో హిందీలో 'ఛత్రపతి' (2023) పేరుతోనే రీమేక్ చేశారు. ఆ తర్వాత ఆయన్నుంచి కొత్త ప్రాజెక్ట్ ప్రకటన ఏదీ రాలేదు. ఆ మధ్య 'దిల్' రాజు నిర్మాతగా వీవీ వినాయక్ హీరోగా ఓ సినిమా రానుందంటూ వార్తలు వచ్చాయి. ఈ సినిమా కోసం తన బాడీ లాంగ్వేజ్‌ని సైతం మార్చుకున్నారు వినాయక్. అయితే ఆ సినిమా పట్టాలెక్కలేదు. మరి ఇప్పుడు వినాయక్ ప్రయాణం డైరెక్టర్‌గానా? నటుడిగానా? అన్నది తెలియాలంటే కొద్ది రోజులు వేచి చూడాలి.

కల్యాణ్‌రామ్ హీరోగా రూపొందిన 'అతనొక్కడే' (2005) సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు సురేందర్ రెడ్డి. 'కిక్, రేసుగుర్రం, ధృవ, సైరా నరసింహారెడ్డి' వంటి విజయవంతమైన సినిమాలను తన ఖాతాలో వేసుకున్నారాయన. చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు. అయితే అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి తెరకెక్కించిన 'ఏజెంట్'(2023) సినిమా భారీ అంచనాలతో విడుదలైనా బాక్సాఫీస్ వద్ద అంచనాలను అందుకోలేకపోయింది. ఆ సినిమా తర్వాత సురేందర్ రెడ్డి తెరకెక్కించబోయే మూవీపై ఇప్పటివరకూ ఒక్క ప్రకటన కూడా వెలువడలేదు. ఫలానా హీరోతో ఆయన నెక్ట్స్ మూవీ ఉంటుందనే టాక్ కూడా ఇప్పటివరకూ ఎక్కడా వినిపించలేదు. మరి... ఆయన తర్వాతి సినిమా ఏంటి? అనే ప్రశ్నకు జవాబు రావాలంటే వేచి ఉండాలి.

ప్రభాస్ హీరోగా నటించిన 'మున్నా' (2007) మూవీతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చారు వంశీ పైడిపల్లి. తెలుగులో ఇప్పటివరకూ ఆయన తీసింది ఐదు చిత్రాలే అయినా (మున్నా, బృందావనం, ఎవడు, ఊపిరి, మహర్షి) అన్నీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. మహేశ్‌బాబు హీరోగా వచ్చిన 'మహర్షి' (2019) సినిమా తర్వాత ఆయన మరో తెలుగు సినిమా చేయలేదు. విజయ్ హీరోగా తమిళంలో 'వారిసు' (తెలుగులో 'వారసుడు') సినిమా చేశారు. ఈ చిత్రం విడుదలై దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఆయన తర్వాతి ప్రాజెక్టుపై ఇప్పటివరకూ క్లారిటీ లేదు. ఆ మధ్య షాహిద్ కపూర్ హీరోగా వంశీ ఓ బాలీవుడ్ మూవీ చేసేందుకు రెడీ అవుతున్నారనే వార్తలొచ్చాయి. తెలుగు సినిమాలని డబ్బింగ్ చేసి హిందీలో విడుదల చేసే గోల్డ్ మైన్ అనే సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మించనుందని, ఆగస్టులో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందనే వార్తలు వినిపించినా ఈ ప్రాజెక్టు ఇప్పటివరకూ పట్టాలెక్కలేదు. మరి వంశీ పైడిపల్లి తర్వాతి చిత్రం టాలీవుడ్‌లోనా? బాలీవుడ్‌లోనా? లేకుంటే మరో భాషలో ఉంటుందా? అనేది చూడాలి.

దర్శకుడు పరశురాం 'గీతగోవిందం' (2018) సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకోవడమే కాదు... హీరో విజయ్ దేవరకొండని వంద కోట్ల క్లబ్‌లోకి తీసుకెళ్లారు పరశురాం. ఆ సినిమా హిట్ అయినా నాలుగేళ్లు వేచి చూశారాయన. ఆ తర్వాత మహేశ్‌బాబు హీరోగా 'సర్కారువారి పాట' (2022) సినిమా తీసి, హిట్ అందుకున్నారు. అనంతరం విజయ్ దేవరకొండ హీరోగా 'ఫ్యామిలీ స్టార్' చిత్రం తీశారు. ఈ ఏడాది ఏప్రిల్ 5న భారీ అంచనాలతో విడుదలైన ఈ సినిమా ఫర్వాలేదనిపించుకుంది. ఈ సినిమా రిలీజై ఆర్నెల్లు దాటినా పరశురాం తర్వాతి సినిమాపై స్పష్టత లేదు. గతంలో నాగచైతన్య హీరోగా ఓ సినిమా చేయనున్నారనే వార్తలు వినిపించినా ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే 'ఫ్యామిలీ స్టార్' నిర్మించిన నిర్మాత 'దిల్' రాజు బ్యానర్‌లోనే పరశురామ్ మరో సినిమా చాన్స్ ఉందని టాక్. మరి ఆయన నెక్ట్స్ ప్రాజెక్ట్ ఏంటి? అనేది వేచి చూడాలి.

ఇరవయ్యేళ్ల ప్రయాణంలో ఏడు సినిమాలు తీశారు దర్శకుడు మెహర్ రమేశ్. వాటిలో రెండు కన్నడ సినిమాలున్నాయి. ఆయన తీసిన ఐదు తెలుగు చిత్రాలు 'కంత్రి, బిల్లా, శక్తి, షాడో, భోళా శంకర్'. వెంకటేశ్‌తో తీసిన 'షాడో' (2013) తర్వాత ఒక్క సినిమా కూడా చేయలేదు మెహర్ రమేశ్. అయితే ఇన్నేళ్ల నిరీక్షణ తర్వాత చిరంజీవి రూపంలో అదృష్టం ఆయన్ని వరించింది. 'భోళా శంకర్' సినిమా చేసే మంచి అవకాశం ఇచ్చారు చిరంజీవి. 2023 ఆగస్టు 11న ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమా రిలీజై ఏడాదికి పైగా అయినప్పటికీ తన తర్వాతి సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ రాలేదు. మరి.. మెహర్ రమేశ్ నెక్ట్స్ మూవీ ఏంటి? వెయిట్ అండ్ సీ.

ఇదిలా ఉంటే... 2021న విడుదలైన నితిన్ 'చెక్' మూవీ తర్వాత డైరెక్టర్ చంద్రశేఖర్ ఏలేటి తర్వాతి సినిమాపై ఇప్పటికీ స్పష్టత లేదు. అలాగే 'అన్నీ మంచి శకునములే' (2023) తర్వాత దర్శకురాలు నందినీ రెడ్డి నెక్ట్స్ ప్రాజెక్ట్ ఏంటి? అనేదానిపై క్లారిటీ లేదు. అదే విధంగా 'ఆర్‌ఎక్స్ 100' మూవీ ఫేమ్ అజయ్ భూపతి 'మంగళవారం' (2023) సినిమా రిలీజై దాదాపు ఏడాది కావస్తున్నా ఆయన తర్వాతి చిత్రంపై ఎలాంటి అప్‌డేట్ రాలేదు. కాగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన 'పెదకాపు 1' సినిమా 2023లో విడుదలైంది. ఈ మూవీకి సీక్వెల్‌గా 'పెదకాపు 2' ఉంటుందని చిత్రయూనిట్ గతంలో ప్రకటించినా ఇప్పటివరకూ ఎలాంటి వివరాలు తెలియరాలేదు. అలాగే శివ నిర్వాణ దర్శకత్వం వహించిన 'ఖుషి' సినిమా విడుదలై ఏడాది దాటిపోయినా ఆయన తర్వాతి సినిమా ఏంటి? అనేదానిపై ఎలాంటి ప్రకటన లేదు. అదే విధంగా 'ఘాజీ' మూవీ ఫేమ్ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి నెక్ట్స్ ప్రాజెక్ట్‌పైనా ఎలాంటి అప్‌డేట్ లేదు. ఆయన తెరకెక్కించిన 'ఐబీ 71' (2023) అనే హిందీ చిత్రం రిలీజై ఏడాదిన్నర దాటినా తర్వాతి సినిమా టాలీవుడ్‌లో ఉంటుందా? బాలీవుడ్‌లో ఉంటుందా? అనే వివరాలు తెలియాల్సి ఉంది.

- దేరంగుల జగన్



• రామ్ చరణ్

చలో మైసూర్

హీరో రామ్‌చరణ్ మైసూర్‌కు వెళ్లనున్నారట. రామ్ చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామా మూవీలో అన్నదమ్ముల్లా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తారనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా కోసం మేకోవర్ అవుతున్నారు రామ్‌చరణ్. బరువు పెరుగుతున్నారు. కాగా ఈ సినిమా తొలి షెడ్యూల్ నవంబరు చివర్లో మైసూర్‌లో ప్రారంభం కానుందని సమాచారం. రామ్‌చరణ్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దాదాపు ఇరవై రోజులు మైసూర్‌లో చిత్రీకరణ జరిపిన తర్వాత తదుపరి షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 చివర్లో విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది.

యాక్షన్.. థ్రిల్



• కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ వైజాగ్‌లో మొదలైంది. కల్యాణ్‌రామ్‌తో పాటు విజయశాంతి, శ్రీకాంత్, సయీ మంజ్రేకర్, పృథ్వీరాజ్ పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్టుతో పాటు ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించడానికి ప్లాన్ చేసింది యూనిట్. 15 రోజుల పాటు జరిగే ఈ వైజాగ్‌లో షెడ్యూల్‌తో ఈ సినిమా మేజర్ చిత్రీకరణ పూర్తవుతుంది. సోహైల్ ఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాకు 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.

శింబుకు జోడీగా..?



హీరోయిన్ మీనాక్షీ చౌదరి కెరీర్ జెట్ స్పీడ్‌తో దూసుకెళుతోంది. ఇప్పటికే ఈ బ్యూటీ నటించిన 'గుంటూరు కారం, సింగపూర్ సెలూన్, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' చిత్రాలు రిలీజ్ అయ్యాయి. మీనాక్షి నటించిన ఇతర చిత్రాలు 'లక్కీ భాస్కర్, మెకానిక్ రాకీ, మట్కా' కూడా ఈ ఏడాదిలోనే రిలీజ్‌కు ముస్తాబు అవుతున్నాయి. ఇక తాను హీరోయిన్‌గా కమిటైన సినిమాల చిత్రీకరణలు దాదాపు పూర్తి కావడంతో మీనాక్షీ చౌదరి కొత్త సినిమాలు సైన్ చేసేందుకు కథలు వింటున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల దర్శకుడు అశ్వత్ మారిముత్తు చెప్పిన కథ విన్నారట మీనాక్షి. కథ నచ్చడంతో శింబు హీరోగా నటించనున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించేందుకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. అలాగే చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర'లో కూడా మీనాక్షీ చౌదరి ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా కనిపిస్తారు.

• మీనాక్షీ చౌదరి



• కిరణ్ అబ్బవరం

జాతర మొదలుపెడదామా?

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన తాజా చిత్రం 'క'. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, కేఏ ప్రొడక్షన్స్‌పై చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమాని దీపావళి సందర్భంగా ఈ నెల 31న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు. ఈ మూవీ ట్రైలర్‌ని గురువారం ప్రదర్శించారు. 'క' ట్రైలర్ చూస్తే... చుట్టూ కొండల మధ్య ఉన్న కృష్ణగిరి అనే అందమైన ఊరిలో పోస్ట్‌మేన్‌గా పని చేస్తుంటాడు అభినయ వాసుదేవ్. అక్కడ సత్యభామతో ప్రేమలో పడతాడు వాసుదేవ్. ఉత్తరాలు పంచే క్రమంలో 1979 ఏప్రిల్ 22న అభిషేక్ పేరుతో వచ్చిన ఉత్తరం వాసుదేవ్ జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఆ ఉత్తరంలో ఏముందో చెప్పమంటూ ఓ ముసుగు వ్యక్తి వాసుదేవ్‌ను బెదిరిస్తాడు. ఆ ఉత్తరంలో ఏముంది? వాసుదేవ్‌ను ఆ ముసుగు వ్యక్తి, అతని గ్యాంగ్ ఎందుకు వెంటాడుతున్నారు? అనే అంశాలు ఉన్నాయి. 'జాతర మొదలుపెడదామా..' అంటూ ట్రైలర్ చివర్లో ముసుగు వ్యక్తిగా వాసుదేవ్ రావడం సర్‌ప్రైజ్ ట్విస్ట్ ఇచ్చింది. ఈ సినిమాకి సీఈఓ: రహస్య గోరక్ (కేఏ ప్రొడక్షన్స్), కెమెరా: విశ్వాస్ డానియేల్, సతీష్ రెడ్డి మాసం, సంగీతం: సామ్ సీఎస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చవాన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: రితికేష్ గోరక్, లైన్ ప్రొడ్యూసర్: కేఎల్ మదన్, సహ నిర్మాతలు: చింతా వినీషా రెడ్డి, చింతా రాజశేఖర్ రెడ్డి.

సూర్య సరసన?



• సూర్య



• మృణాల్ ఠాకూర్

'సీతారామం' సినిమాతో తెలుగులో పాపులార్టీ తెచ్చుకున్న హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తమిళ పరిశ్రమ ఎంట్రీ ఖరారైందా? అంటే అవుననే అంటోంది కోలీవుడ్. పైగా ఇది బంపర్ చాన్స్. స్టార్ హీరో సూర్య సరసన మృణాల్ ఓ చిత్రంలో నటించే చాన్స్ దక్కించుకున్నారట. ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకు మృణాల్‌ని సంప్రదించారట. ఈ బ్యూటీ దాదాపు కన్ఫార్మ్ అయ్యారని టాక్. ఇక అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం. ఇదిలా ఉంటే... అత్యంత భారీ బడ్జెట్‌తో యాక్షన్ అడ్వంచరస్ మూవీగా డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఇది సూర్యకు 45వ చిత్రం. ఇటీవలే ఈ చిత్రం పూజా కార్యక్రమాలు జరిగాయి. నవంబరులో రెగ్యులర్ షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారు. ఇక ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్, మరో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది.

జీఎంఆర్ నష్టాలు రెండింతలకుపైనే



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (గతంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నష్టాలు రెండింతలకుపైగా పెరిగి రూ.429 కోట్లకు చేరాయి. 2023-24 క్యూ2లో కంపెనీ రూ.190 కోట్ల నష్టం చవిచూసింది. ఎబిటా రూ.962 కోట్లు నమోదైంది. టర్నోవర్ రూ.2,162 కోట్ల నుంచి రూ.2,598 కోట్లకు చేరింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 0.43 శాతం ఎగసి రూ.82.55 వద్ద స్థిరపడింది.

జీఎంఆర్ గ్రూప్ రూ. 6,300 కోట్ల నిధుల సమీకరణ

అబుధాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) నుంచి రూ. 6,300 కోట్ల మేర నిధులను రుణ రూపంలో సమీకరిస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. గ్రూప్‌లో భాగమైన జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ (జీఈపీఎల్) రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు ఈ నిధులను ఉపయోగించుకోనున్నట్లు వివరించింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్)కి జీఈపీఎల్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తోంది. జీఎంఆర్ గ్రూప్ దేశీయంగా మూడు (ఢిల్లీ, హైదరాబాద్, గోవా), విదేశాల్లో రెండు (ఫిలిప్పీన్స్, ఇండొనేషియా) విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. ఇటీవలి కాలంలో కార్పొరేట్ రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకున్నట్లు జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ గ్రంధి ఈ సందర్భంగా తెలిపారు. ప్రపంచస్థాయి రవాణా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న సంస్థలకు దన్నుగా ఉండాలనే తమ లక్ష్యానికి అనుగుణంగా నిధులను సమకూర్చినట్లు ఏడీఐఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇన్‌ఫ్రా విభాగం) ఖదీమ్ అల్ రెమైతీ వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-10-2024	
విశాఖ	540-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

నేటి బోర్డు సమావేశాలు

జీపీసీఎల్, డీఎల్ఎఫ్, కోల్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, బంధన్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, జమ్మూ కాశ్మీర్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇక్రా లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఓరియంట్ ఎలక్ట్రానిక్స్, ప్రజ్ ఇండస్ట్రీస్, శక్తి పంప్స్, ఐనాక్స్ విండ్ ఎనర్జీ, యురేకా ఇండస్ట్రీ, గో ఫ్యాషన్, ఎంఐఐఎల్, బాలకృష్ణ ఇండస్ట్రీస్, కామత్ హోటల్స్, జీ మీడియా, అపోలో పైప్స్, ఫీనిక్స్ మిల్స్, ఎన్ఐఐటీ, మహీంద్రా లైఫ్ స్పేస్ డెవలపర్స్, నోవార్టిస్ ఇండియా, తత్వ చింతన్ ఫార్మా, టీటీకే హెల్త్‌కేర్, టోరెంట్ ఫార్మా, ఎల్ఐసీ గోల్డ్ ఈటీఎఫ్, యూటీఐ ఏఎంసీ, చోళా ఇన్వెస్ట్‌మెంట్, ఇండస్ ఫైనాన్స్, జేఎం ఫైనాన్సియల్స్, మాక్స్ ఎస్టేట్స్

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	10,501.00	4.34
HDFCBANK	1,725.00	2.57
ASIANPAINT	3,043.00	1.7
M&M	2,998.95	1.17
EICHERMOT	4,798.10	0.68

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,015.90	-7.08
KOTAKBANK	1,782.50	-4.73
BAJAJFINSV	1,758.55	-3.37
BPCL	331	-3.36
INDUSINDBK	1,306.45	-3.03

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,675
ఎన్ఎస్ఈ	1,23,864
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,45,971
ఎఫ్ఐఐ	- 5,062
డీఐఐ	+ 1,442

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.84	$ 73.15
బ్రెంట్	74.85	$ 75.89

సైయంట్ డివిడెండ్ రూ.12



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ సర్వీసెస్ కంపెనీ సైయంట్ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.12 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 2.3 శాతం అధికమై రూ.177 కోట్లు సాధించింది. ఎబిటా రూ.206 కోట్లు, ఎబిటా మార్జిన్ 14.2 శాతం నమోదైంది. టర్నోవర్ 1.8 శాతం క్షీణించి రూ.1,450 కోట్లుగా ఉంది. ఎంబెడెడ్ సిలికాన్ ప్రొడక్ట్ కంపెనీ అజిమత్ ఏఐలో 27.3 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నట్టు సైయంట్ తెలిపింది. అలాగే అబు దాబీకి చెందిన టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సర్వీసెస్ ప్రొవైడర్ అబు దాబీ అండ్ గల్ఫ్ కంప్యూటర్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదిరిందని వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో సైయంట్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే గురువారం 3.10 శాతం ఎగసి రూ.1,775.75 వద్ద స్థిరపడింది.

ఆన్‌లైన్ గేమింగ్‌కు మనీ లాండరింగ్ ముప్పు

- కట్టడికి తక్షణ చర్యలు తీసుకోవాలి
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి
- డిజిటల్ ఇండియా ఫౌండేషన్ నివేదిక



న్యూఢిల్లీ: అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశీ ఆన్‌లైన్ గేమింగ్ రంగానికి మనీలాండరింగ్ నుంచి గణనీయంగా ముప్పు పొంచి ఉందని డిజిటల్ ఇండియా ఫౌండేషన్ ఒక నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో విస్తరించిన డిజిటల్ ఎకానమీని, ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమను కాపాడేందుకు సత్వర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. చట్టవిరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఆపరేటర్లను కట్టడి చేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని, చట్టబద్ధమైన ఆపరేటర్లతో వైట్‌లిస్ట్ తయారు చేయాలని, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అడ్డుకట్ట వేయాలని, అంతర్జాతీయంగా పరస్పరం సహరించుకోవాలని పేర్కొంది. అలాగే మోసపూరిత విధానాలు పాటించే ప్లాట్‌ఫాంల జోలికి వెళ్లకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని, పటిష్టమైన ఇన్వెస్టిగేటివ్ బృందాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది.

అయిదేళ్లలో 7.5 బిలియన్ డాలర్లకు పరిశ్రమ..

నివేదిక ప్రకారం 2020- 2023 ఆర్థిక సంవత్సరాల మధ్య 28 శాతం వార్షిక వృద్ధితో భారతీయ రియల్ మనీ గేమింగ్ (ఆర్ఎంజీ) రంగం అంతర్జాతీయ మార్కెట్లో కీలక పరిశ్రమగా మారింది. వచ్చే ఐదేళ్లలో ఈ రంగం ఆదాయం 7.5 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. కోట్ల కొద్దీ గేమర్లు పరిశ్రమ వృద్ధికి దోహదపడుతున్నారు. దీనితో ఫిన్‌టెక్, క్లౌడ్ సర్వీసెస్, సైబర్-సెక్యూరిటీ వంటి అనుబంధ రంగాల్లో కూడా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- యూజర్‌కు భద్రత, సైబర్ సెక్యూరిటీపరమైన సవాళ్లు మొదలైనవి పరిశ్రమ పురోగతికి అవరోధాలుగా మారొచ్చు. దేశీయంగా చట్టవిరుద్ధమైన బెట్టింగ్ మార్కెట్లో ఏటా 100 బిలియన్ డాలర్ల డిపాజిట్లు వస్తుండటం ఈ సవాళ్ల తీవ్రతకు నిదర్శనం.
- చట్టవిరుద్ధమైన ఆపరేటర్లను కట్టడి చేసేందుకు నియంత్రణ సంస్థలు ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ మిర్రర్ సైట్స్, అక్రమ బ్రాండింగ్, అలవిగాని హామీలతో చాలా ప్లాట్‌ఫాంలు నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పర్యవేక్షణ, చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోంది.
- దేశీయంగా 400 పైచిలుకు స్టార్టప్‌లు 10 కోట్ల మంది రోజువారీ ఆన్‌లైన్ గేమర్లు ఉన్నారు. వీరిలో 9 కోట్ల మంది డబ్బు చెల్లించి గేమ్స్ ఆడుతుంటారు. ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక లక్ష మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2025 నాటికి 2,50,000 ఉద్యోగాలను కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఇంతటి భారీ పరిశ్రమకు నిర్దిష్టంగా ఒక నియంత్రణ సంస్థ అంటూ లేకపోవడం, పర్యవేక్షణ.. ఏకరూప ప్రమాణాలు లేకపోవడం వంటి అంశాలు సమస్యలుగా ఉంటున్నాయి.

దేశంలో ల్యాండ్ డీల్స్ జోరు

ఏడాదిలో 65 శాతం వృద్ధి: సీబీఆర్ఈ



న్యూఢిల్లీ: భారత రియల్ ఎస్టేట్ రంగంలో భూముల క్రయవిక్రయాలు ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్‌లో భారీగా పెరిగాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ ప్రకారం.. 100 కంటే ఎక్కువ భూ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాల్లో భాగంగా సుమారు 1,700 ఎకరాలు చేతులు మారాయి. గతేడాది ఇదే కాలంలో 60 డీల్స్‌కుగాను 1,200 ఎకరాలు చేతులు మారాయి. డీల్స్ సంఖ్య పరంగా ఈ ఏడాది 65 శాతం వృద్ధి నమోదైంది. ల్యాండ్ డీల్స్‌లో ఆరు ప్రధాన భారతీయ నగరాలు ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, పుణే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ ఏడాది జరిగిన ల్యాండ్ డీల్స్‌లో రెసిడెన్షియల్ 61 శాతం, ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ 13 శాతం, ఆఫీస్ విభాగం 8 శాతం నమోదయ్యాయి. విభిన్న రకాల ఆస్తులకు సంబంధించి పెరిగిన భూ ఒప్పంద కార్యకలాపాలు బలమైన పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను, భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ అభివృద్ధి చెందుతున్న తీరుతెన్నులను ప్రతిబింబిస్తున్నట్లు సీబీఆర్ఈ తెలియజేసింది. ''రెసిడెన్షియల్, ఆఫీస్, డేటా సెంటర్ల వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలలో బలమైన వృద్ధిని చూస్తున్నాం. భారత రియల్ ఎస్టేట్ రంగం యొక్క దీర్ఘకాలిక అవకాశాలపై పెట్టుబడిదారులు మరింత నమ్మకంగా ఉన్నారనడానికి ఇది నిదర్శనం. ఈ ఆశావాదం భారత్‌ను రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు వ్యూహాత్మక మార్కెట్‌గా నిలుపుతోంది. వివిధ మార్కెట్లలో బలమైన డిమాండ్, అనుకూల ఆర్థిక పరిస్థితులతో కలిపి వృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించింది. మార్కెట్ స్థిరత్వం, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను నొక్కి చెప్పే వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా ఈ ఊపు కొనసాగుతుందని ఆశిస్తున్నాం'' అని సీబీఆర్ఈ వివరించింది.

ఎఫ్అండ్‌వో అంటే టైమ్‌పాస్ వ్యవహారం కాదు..

సెబీ సభ్యుడు అశ్వనీ భాటియా

ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్ అనేదేమీ టైమ్‌పాస్‌గా చేసే ఆషామాషీ వ్యవహారం కాదని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అశ్వని భాటియా వ్యాఖ్యానించారు. ఇన్వెస్టర్లు దీన్ని మరింత సీరియస్‌గా తీసుకోవాలని మార్నింగ్‌స్టార్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సూచించారు. సెబీ అధ్యయనం ప్రకారం సంస్థాగత ఇన్వెస్టర్లే ఎఫ్అండ్‌వోలో లాభపడుతుండగా, 93 శాతం మంది రిటైల్ ఇన్వెస్టర్లు నష్టపోతున్నారని వెల్లడైన విషయాన్ని భాటియా గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే చిన్న మదుపరుల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో ఎఫ్అండ్‌వో ట్రేడింగ్‌ను కట్టడి చేసేందుకు సెబీ తీసుకుంటున్న చర్యలను ఇన్వెస్టర్లు వ్యతిరేకిస్తుండటం సరికాదని ఆయన తెలిపారు. 2020లో కరోనా వైరస్ మహమ్మారి తర్వాత నుంచి ఎఫ్ అండ్ ఓలో రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. అయితే, ఎఫ్అండ్‌వో సెగ్మెంట్లో రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య పెరగడం మంచిదేమీ కాదని, ఆందోళనకరమని భాటియా అభిప్రాయపడ్డారు. ''అంతర్జాతీయంగా నమోదయ్యే డెరివేటివ్స్ వాల్యూమ్స్‌లో సగభాగం పైగా వాటా భారత్‌దే ఉండటం గొప్పగా అనిపించినా, ఇది మనం ధరించడానికి ఇష్టపడని కిరీటంలాంటిది'' అని వ్యాఖ్యానించారాయన. మరోవైపు, ఎస్ఎంఈ ఐపీవోల విషయంలో అసంబద్ధమైన హంగామాను నివారించేందుకు, ధరల్లో అవకతవకలు జరగకుండా చూసేందుకు నియంత్రణ సంస్థ, స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ విభాగాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాయని భాటియా తెలిపారు. త్వరలోనే సెబీ దీనిపై ఒక చర్చాపత్రాన్ని కూడా ప్రవేశపెట్టనుందని వెల్లడించారు.



ఆఫీస్ స్పేస్‌కు రికార్డు స్థాయి డిమాండ్

సెప్టెంబర్ క్వార్టర్‌లో 24.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీ

- 14 త్రైమాసికాల కనిష్టానికి వేకెన్సీ రేటు
- 2024లో 80మిలియన్ ఎస్ఎఫ్‌టీ మించొచ్చు
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అంచనా



న్యూఢిల్లీ: కార్యాలయ వసతుల లీజింగ్ (ఆఫీస్ స్పేస్)కు బలమైన డిమాండ్ కొనసాగుతోంది. సెప్టెంబర్ త్రైమాసికంలో దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ పట్టణాల్లో (టాప్-8) 24.8 మిలియన్ చదరపు అడుగుల మేర (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ లీజింగ్ నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలోని గణాంకాలతో పోల్చి చూస్తే 66 శాతం పెరిగింది. ఆఫీస్ స్పేస్ లీజింగ్ మార్కెట్ చరిత్రలో త్రైమాసికం వారీ ఇది రెండో గరిష్ట స్థాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 9 నెలల్లో 66.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీ మేర లీజింగ్ నమోదైంది. పూర్తి ఏడాదికి 80 మిలియన్ ఎస్ఎఫ్‌టీ దాటిపోతుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ 'కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్' సంస్థ అంచనా వేసింది. గతేడాది టాప్-8 పట్టణాల్లో 74.5 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్ లీజు లావాదేవీలు నమోదయ్యాయి. 2018లో 49.1 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2019లో 67.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2020లో 46.6 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2021లో 50.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2022లో 72 మిలియన్ ఎస్ఎఫ్‌టీ చొప్పున లీజింగ్ నమోదైంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఆఫీస్ మార్కెట్ గణాంకాలతో కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఒక నివేదికను విడుదల చేసింది.

పటిష్ట మార్కెట్

''మార్కెట్ మూలాలు బలంగా ఉండడంతో భారత ఆఫీస్ మార్కెట్లో లీజింగ్ అసాధారణ స్థాయిలో కొనసాగుతోంది. టాప్-8 పట్టణాల్లో వేకెన్సీ రేటు (ఖాళీగా ఉన్న ఆఫీస్ స్పేస్) తక్కువగా ఉండడం ఆఫీస్ వసతులకు బలమైన డిమాండ్‌ను సూచిస్తోంది''అని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఇండియా సీఈవో అన్షుల్ జైన్ తెలిపారు. ఈ వృద్ధిలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని.. ఆవిష్కరణలు, వృద్ధికి కీలక అవుట్‌సోర్స్ మార్కెట్‌గా భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తున్నాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక తెలిపింది. ఇటీవలి కాలంలో సగటు త్రైమాసికం లీజింగ్ 20 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంటోందని, 2024 మొత్తం మీద లీజింగ్ 80 మిలియన్ ఎస్ఎఫ్‌టీని దాటుతుందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ టెనెంట్ రిప్రజెంటేషన్ ఎండీ వీరబాబు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో సరఫరా పరిమితంగా ఉన్నట్టు చెప్పారు. సమీప కాలంలో సరఫరా పెరగొచ్చని.. అయినా సరే డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. టాప్-8 పట్టణాల్లో వేకెన్సీ రేటు 17.1 శాతంగా సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైంది. ఇది 14 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. జూన్ త్రైమాసికంతో పోల్చి చూస్తే 0.60 శాతం మేర వేకెన్సీ రేటు తగ్గింది. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ పట్టణాల గణాంకాలు ఈ నివేదికలో ఉన్నాయి.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

లాభాల్లోకి అదానీ విల్మర్

క్యూ2లో రూ. 311 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం అదానీ విల్మర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 311 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 131 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,331 కోట్ల నుంచి రూ. 14,565 కోట్లకు ఎగసింది. అదానీ గ్రూప్, సింగపూర్ సంస్థ విల్మర్ మధ్య ఏర్పాటైన భాగస్వామ్య కంపెనీ ఇది. ఫార్చ్యూన్ బ్రాండ్‌తో వంట నూనెలుసహా పలు ఎఫ్ఎంసీజీ ప్రొడక్టులను రూపొందిస్తున్న విషయం విదితమే. కాగా.. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్-సెప్టెంబర్) కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 1,232 కోట్ల నిర్వహణ లాభం, రూ. 624 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు అదానీ విల్మర్ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ విల్మర్ షేరు బీఎస్ఈలో 7 శాతం జంప్‌చేసి రూ. 340 వద్ద ముగిసింది.

అదానీ టోటల్ గ్యాస్ లాభం ప్లస్

రూ. 178 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ టోటల్ గ్యాస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 178 కోట్లను తాకింది. సీఎన్‌జీ, పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) అమ్మకాలు బలపడటం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 168 కోట్లు ఆర్జించింది. ఫ్రెంచ్ దిగ్గజం టోటల్ ఎనర్జీస్‌తో అదానీ గ్రూప్ ఏర్పాటు చేసిన భాగస్వామ్య కంపెనీ ఇది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 12 శాతం ఎగసి రూ. 1,315 కోట్లకు చేరింది. ఈ కాలంలో సీఎన్‌జీ అమ్మకాలు 19 శాతం జంప్‌చేసి 162 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల(ఎంఎస్‌సీఎం)ను తాకగా.. పీఎన్‌జీ విక్రయాలు 7 శాతం పుంజుకుని 80 ఎంఎస్‌సీఎంకు చేరాయి. దీంతో 8 శాతం అధికంగా రూ. 313 కోట్ల ఇబిటాను సాధించింది.

ఫలితాల నేపథ్యంలో అదానీ టోటల్ గ్యాస్ షేరు బీఎస్ఈలో 8 శాతం జంప్‌చేసి రూ. 755 వద్ద ముగిసింది.

మాస్‌చిప్ లాభంలో 168 శాతం వృద్ధి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెమికండక్టర్ రంగంలో ఉన్న మాస్‌చిప్ టెక్నాలజీస్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 168 శాతం ఎగసి రూ.9.7 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 50 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఎబిటా 51 శాతం దూసుకెళ్లి రూ.16.75 కోట్లు సాధించింది. టర్నోవర్ 75 శాతం అధికమై రూ.125.6 కోట్లు నమోదైంది. ఏప్రిల్-సెప్టెంబర్ ఆదాయం 2023-24 టర్నోవర్‌లో 70 శాతానికి సమానమని, బలమైన వృద్ధికి ఇది నిదర్శనమని కంపెనీ తెలిపింది.

బీఎస్ఈలో మాస్‌చిప్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే గురువారం 4.99 శాతం దూసుకెళ్లి రూ.226.15 వద్ద స్థిరపడింది.

డిక్సన్ టెక్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 412 కోట్లు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్(ఇండియా) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు ఎగసి రూ. 412 కోట్లకు చేరింది. మొబైల్, ఈఎంఎస్ విభాగం అమ్మకాలు ఇందుకు దోహదపడ్డాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 113 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రెట్టింపై రూ. 11,534 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ. 4,943 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు మూడు రెట్లు పెరిగి రూ. 11,212 కోట్లుగా నమోదయ్యాయి. ఆదాయంలో 82 శాతం వాటాను ఆక్రమిస్తున్న మొబైల్, ఈఎంఎస్ విభాగం అమ్మకాలు మూడు రెట్లు ఎగసి రూ. 9,444 కోట్లను తాకాయి. అయితే లెడ్ టీవీ, రిఫ్రిజిరేటర్ విభాగం విక్రయాలు 2 శాతం నీరసించి రూ. 1,413 కోట్లకు పరిమితమయ్యాయి. హోమ్ అప్లయెన్సెస్ ఆదాయం 22 శాతం జంప్‌చేసి రూ. 444 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో డిక్సన్ టెక్ షేరు బీఎస్ఈలో 1.3 శాతం క్షీణించి రూ. 15,064 వద్ద ముగిసింది.


లారస్ లాభంలో 46 శాతం క్షీణత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ కంపెనీ లారస్ ల్యాబ్స్ సెప్టెంబర్ త్రైమాసికంలో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 46 శాతం క్షీణించి రూ.20 కోట్లు నమోదు చేసింది. ఎబిటా 3 శాతం పడిపోయి రూ.182 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా మార్జిన్ 0.5 శాతం తగ్గి 14.9 శాతం, గ్రాస్ మార్జిన్ 2.7 శాతం పెరిగి 55.2 శాతంగా ఉంది. టర్నోవర్‌లో ఎలాంటి మార్పు లేకుండా రూ.1,224 కోట్లు ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో లారస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే గురువారం 0.22 శాతం ఎగసి రూ.450.35 వద్ద స్థిరపడింది.

పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ లాభం అప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 848 కోట్లను తాకింది. కంపెనీకి ప్రధానమైన గుజరాత్‌లోని దహేజ్ దిగుమతి టెర్మినల్ సామర్థ్య వినియోగం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 818 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 7 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

షేరు 2% క్షీణించి రూ. 338 వద్ద ముగిసింది.

గోద్రెజ్ కన్జూమర్ లాభం అప్

క్యూ2లో రూ. 491 కోట్లు ● షేరుకి రూ. 5 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం గోద్రెజ్ కన్జూమర్ ప్రాడక్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం ఎగసి రూ. 491 కోట్లను అధిగమించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 433 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం స్వల్పంగా 2 శాతం పుంజుకుని రూ. 3,647 కోట్లను తాకింది. మొత్తం వ్యయాలు రూ. 3,034 కోట్లుగా నమోదయ్యాయి. గుడ్ నైట్, సింథాల్, హిట్ తదితర సుప్రసిద్ధ బ్రాండ్ల కంపెనీ దేశీ అమ్మకాలు 6 శాతం అధికమై రూ. 2,301 కోట్లకు చేరాయి. ఇండోనేషియాలో విక్రయాలు 9 శాతం ఎగసి రూ. 514 కోట్లయ్యాయి. ఆఫ్రికా నుంచి 21 శాతం తక్కువగా రూ. 645 కోట్ల ఆదాయం నమోదైంది. ఇతర మార్కెట్ల నుంచి అమ్మకాలు 36 శాతం జంప్‌చేసి రూ. 248 కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో గోద్రెజ్ కన్జూమర్ షేరు బీఎస్ఈలో 2.6 శాతం క్షీణించి రూ. 1,259 వద్ద ముగిసింది.

ఏసీసీ లాభం నేలచూపు

రూ. 200 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ సిమెంట్ దిగ్గజం ఏసీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 200 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2023-24) ఇదే కాలంలో రూ. 388 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,435 కోట్ల నుంచి రూ. 4,614 కోట్లకు స్వల్పంగా పుంజుకుంది. గత ఐదేళ్లలోనే ఇది ఒక క్వార్టర్‌లో అత్యధిక ఆదాయమని కంపెనీ పేర్కొంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 4,127 కోట్ల నుంచి రూ. 4,453 కోట్లకు పెరిగాయి. కాగా.. 2024 జనవరిలో ఏషియన్ కాంక్రీట్స్ అండ్ సిమెంట్స్‌ను స్వాధీనంలోకి తీసుకున్న నేపథ్యంలో ఫలితాలను పోల్చి చూడతగదని ఏసీసీ తెలియజేసింది. ఏషియన్ కాంక్రీట్స్‌లో మిగిలిన 55 శాతం వోటింగ్ వాటా మూలధనంతోపాటు.. కంపెనీకి సొంత అనుబంధ సంస్థ ఏషియన్ ఫైన్ సిమెంట్స్‌ను రూ. 423 కోట్ల నగదుకు కొనుగోలు చేసినట్లు ఏసీసీ వెల్లడించింది.

ఏసీసీ షేరు ఎన్ఎస్ఈలో 0.4 శాతం లాభంతో రూ. 2,266 వద్ద ముగిసింది.

దక్షిణాఫ్రికాదే తొలి టెస్టు

- బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్లతో విజయం
- ఆరు వికెట్లతో మెరిసిన రబడ


రబడ

మిర్పూర్: ఆసియా ఉపఖండంలో దక్షిణాఫ్రికా జట్టు పదేళ్ల విరామం తర్వాత టెస్టు మ్యాచ్‌లో గెలిచింది. బంగ్లాదేశ్ జట్టుతో గురువారం ముగిసిన తొలి టెస్టులో మార్క్‌రమ్ సారథ్యంలోని దక్షిణాఫ్రికా ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 106 పరుగుల విజయలక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 22 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. టోనీ డి జార్జి (52 బంతుల్లో 41; 7 ఫోర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (37 బంతుల్లో 30 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 283/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 89.5 ఓవర్లలో 307 పరుగులకు ఆలౌటైంది. మెహదీ హసన్ మిరాజ్ (97; 10 ఫోర్లు, 1 సిక్స్) మూడు పరుగుల తేడాలో సెంచరీని చేజార్చుకున్నాడు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ 46 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్‌ను దెబ్బ తీశాడు. కేశవ్ మహరాజ్‌కు 3 వికెట్లు దక్కాయి. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన కైల్ వెరీన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ గెలుపుతో దక్షిణాఫ్రికా జట్టు రెండు టెస్టుల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టెస్టు ఈనెల 29 నుంచి చట్టోగ్రామ్‌లో జరుగుతుంది. ఆసియా గడ్డపై దక్షిణాఫ్రికా చివరిసారి 2014లో గాలెలో శ్రీలంకపై విజయం సాధించింది.

'ధ్యాన్‌చంద్' ఇకపై అర్జున లైఫ్‌టైమ్ అవార్డుగా...

న్యూఢిల్లీ: దివంగత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ పేరిట ఇచ్చే జీవిత సాఫల్య పురస్కారం పేరును కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ మార్చింది. క్రీడాకారులు వారి కెరీర్‌లో కనబరిచిన విశేష సేవలకు గుర్తింపుగా 2002 నుంచి 'ధ్యాన్‌చంద్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేయడం మొదలు పెట్టారు. దీన్ని ఇకపై 'అర్జున లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డుగా అందజేయనున్నారు. ఒలింపిక్స్, పారాలింపిక్స్, ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి పతకాలు అందించిన వారికి ఈ పురస్కారాన్ని ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. 2023లో మంజూష కన్వర్ (షట్లర్), వినీత్ కుమార్ (హాకీ), కవిత సెల్వరాజ్ (కబడ్డీ)లకు ఈ జీవితసాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ ఏడాది అవార్డుల కోసం నామినేషన్లను దాఖలు చేసేందుకు వచ్చే నెల 14వ తేదీ వరకు గడువు ఉంది. 'ఖేలో ఇండియా' భాగంగా యూనివర్సిటీ స్థాయిలో జరిగే పోటీల్లో ఓవరాల్ విజేతకు మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ ట్రోఫీని అందజేస్తారు. వీటితో పాటు ఎప్పట్లాగే ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులు కూడా ఉంటాయి.



పోరాడి ఓడిన శ్రీజ

మోంట్‌పెలియర్ (ఫ్రాన్స్): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ టోర్నీ నుంచి భారత స్టార్, పారిస్ ఒలింపియన్ ఆకుల శ్రీజ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 25వ ర్యాంకర్ శ్రీజ 11–6, 7–11, 1–11, 11–8, 8–11తో ప్రపంచ 13వ ర్యాంకర్ అడ్రియానా డియాజ్ (ప్యూర్టోరికో) చేతిలో పోరాడి ఓడిపోయింది. 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తెలంగాణకు చెందిన శ్రీజ తన సర్వీస్‌లో 17 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 21 పాయింట్లు స్కోరు చేసింది. తొలి రౌండ్‌లో ఓడిన శ్రీజకు 4,250 డాలర్ల (రూ. 3 లక్షల 57 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

క్వార్టర్ ఫైనల్లో శ్రీవల్లి రష్మిక



అడిలైడ్ (ఆస్ట్రేలియా): ప్లేఫోర్డ్ ఓపెన్ అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో భారత రెండో ర్యాంకర్, తెలంగాణ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 303వ ర్యాంకర్ రష్మిక 6–4, 6–1తో గాబ్రియేలా (ఆస్ట్రేలియా)పై గెలిచింది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ విభాగంలో రష్మిక–వైదేహి (భారత్) జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో రష్మిక–వైదేహి ద్వయం 4–6, 6–7 (5/7)తో యుకీ నైటో–నహో సాటో (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.



మకుటం లేని మహారాణి

హాకీకి రాణి రాంపాల్ వీడ్కోలు | మహిళల హాకీకి వన్నె తెచ్చిన భారత స్టార్ ఫార్వర్డ్

14 ఏళ్లకే అరంగేట్రం | 254 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం | 205 గోల్స్‌తో తనదైన ముద్ర

రాణి సారథ్యంలో టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టు

భారత పురుషుల హాకీ జట్టుకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. దిగ్గజాలూ ఉన్నారు. కానీ మహిళల హాకీకి ఆదరణే అంతంత మాత్రం! ఇలాంటి ఆటలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన రాణి రాంపాల్... తన ఆటతీరుతో నిజంగా 'రాణి'గా ఎదిగింది. బాల్యంలో పేదరికం వెంటాడినా... పెద్దయ్యాక ఆటలో గోల్స్ వేటలో పడింది. మేటి ఫార్వర్డ్ ప్లేయర్‌గా, తదనంతరం కెప్టెన్‌గా జట్టును నడిపించింది. టోక్యో ఒలింపిక్స్‌లో ఆమె సారథ్యంలోని భారత మహిళల జట్టు త్రుటిలో కాంస్యం కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచింది.

న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణి రాంపాల్ తన 16 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు గురువారం ఆమె ప్రకటించింది. మహిళల జట్టులో అరుదైన మేటి క్రీడాకారిణిల్లో ఆమె ఒకరు. 'పారిస్' కంటే ముందు జరిగిన టోక్యో విశ్వక్రీడల్లో భారత మహిళల జట్టుకు పతకం రేసులో నిలిచే సత్తా ఉందని తన సారథ్యంతో చాటి చెప్పిన స్టార్ ఫార్వర్డ్ రాణి. దురదృష్టవశాత్తూ కాంస్య పతక పోరులో రాణి బృందం ఓడి చివరకు నాలుగో స్థానంలో నిలిచింది. భారత మహిళల హాకీ చరిత్రలో ఒలింపిక్స్ పతకం లేకపోవచ్చేమోగానీ... నాలుగో స్థానంతో దేశంలో మహిళల హాకీ భవిష్యత్తుకు బంగారు బాట వేసింది.

ఇదీ నేపథ్యం...

హరియాణాలోని మారుమూల పల్లెకు చెందిన నిరుపేద కుటుంబ నేపథ్యం రాణి రాంపాల్‌ది. తండ్రి రాంపాల్ రోజూ బండిలాగితే వచ్చే అరకొర డబ్బులతో వీరి కుటుంబం పూట గడిచేది. అలాంటి చిన్నారి ఓ హాకీ స్టిక్ చూడగలదేమో కానీ కొనుక్కోలేదు. బాల్యంలో సరైన తిండిలేక పోషకాహార లోపంతో కనబడే రాణిని చూసిన జిల్లాస్థాయి కోచ్ ఆమెకు కోచింగ్ నిరాకరించాడు. కానీ ఆ బాలిక మాత్రం మక్కువ పెంచుకున్న హాకీ ఆటపై మనసు లగ్నం చేసింది. విరిగిపోతే పడేసిన ఓ హాకీ స్టిక్‌తో అదేపనిగా ప్రాక్టీస్ చేసింది. అలా మెల్లిగా స్థానిక జట్టులోకి వచ్చి... ఎన్నో ఒడిదొడుకులు, పేదరికపు కష్టాలు, ఆటుపోట్లకు ఎదురీది ఎట్టకేలకు 14 ఏళ్ల వయసులో భారత జట్టులోకి ఎంపికై అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. ఆ తర్వాత ఏళ్లు గడుస్తున్న కొద్దీ పేరుకు తగ్గట్టే భారత మహిళల హాకీ జట్టుకు 'రాణి' అయ్యింది. ఫీల్డ్‌లో చక్కని సమయస్ఫూర్తి, పాస్‌లలో చురుకుదనం, ప్రత్యర్థి గోల్‌పోస్ట్ వద్ద కొరకరాని ఫార్వర్డ్‌గా ఎదిగింది. తదనంతరం జట్టు సారథ్య బాధ్యతలు చేపట్టాక భారత్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఆసియా క్రీడలు, ప్రపంచకప్, ఒలింపిక్స్‌లో మహిళల జట్టుకు అద్భుతం చేసే సత్తా ఉందని కెప్టెన్‌గా నిరూపించింది. తాజాగా 29 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రకటించింది.

కెరీర్‌లో ఘనతలు

స్టార్ ఫార్వర్డ్ రాణి సారథ్యంలోనే టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు నాలుగో స్థానం లభించింది. 2018 మహిళల ప్రపంచకప్ హాకీ (లండన్)లో క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. అదే ఏడాది ఆసియా క్రీడల్లో రాణి జట్టు రజత పతకం గెలిచింది. చిరు ప్రాయంలో అంతర్జాతీయ కెరీర్‌ను ఆరంభించిన ఆమె 254 అంతర్జాతీయ మ్యాచ్‌లాడి 205 గోల్స్ చేసింది. 2020లో ఆమె ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును ప్రదానం చేసింది. అదే ఏడాది నాలుగో పౌర పురస్కారమైన 'పద్మశ్రీ' కూడా ఆమె కీర్తి కిరీటంలో చేరింది. ఆమె 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో సాధించిన మైలురాళ్లకు ఘనమైన గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించుకున్న హాకీ ఇండియా ఆమె జెర్సీ నంబర్ 28కి రిటైర్మెంట్ ఇచ్చింది. గురువారం న్యూఢిల్లీలో భారత్, జర్మనీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం రాణిని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవియా సన్మానించి రూ. 10 లక్షలు నగదు పురస్కారం అందజేశారు.


రాణి రాంపాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవియా, జర్మనీ మంత్రి రాబర్ట్ హబెక్. చిత్రంలో రాణి తల్లిదండ్రులు కూడా ఉన్నారు

నాకే ఆశ్చర్యమనిపిస్తోంది

నా క్రీడా ప్రయాణం చూసుకుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది. ఇన్నేళ్లు భారత్‌కు ఆడతానని ఏనాడు అనుకోలేదు. పేదరికంలో కష్టాలు చూసిన ఆ కళ్లతోనే ఆటపై దృష్టి పెట్టాను. అనుకున్నది సాధించాను. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. కానీ ఏనాడూ నిరాశ చెందలేదు. భారత్‌కు ఆడటంపట్ల ఎంతో గర్విస్తున్నాను. నిజం చెప్పాలంటే నేను 254 మ్యాచ్‌ల్లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తానని గానీ, 200 పైచిలుకు గోల్స్ సాధిస్తానని గానీ ఎప్పుడు అనుకోలేదు. బాల్యంలో నాన్న ఆ తర్వాత కుటుంబం, నా కోచ్ బల్‌దేవ్‌సింగ్ నా లైఫ్‌ను తీర్చిదిద్దారు. బల్‌దేవ్‌లాంటి కోచ్, టీచర్ దొరకడమే నా అదృష్టం. ఆటలో నైపుణ్యం నేర్పిన అతను జీవితానికి సరిపడా పాఠాలూ చెప్పారు. రిటైర్మెంట్ నిర్ణయం కఠినమైనా తప్పదు. దీనికిదే సరైన సమయమని భావిస్తున్నా. భారత సబ్ జూనియర్ జట్టుకు ఇటీవల కోచ్‌గా నన్ను నియమించారు. త్వరలో జరిగే హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)లో హరియాణా–పంజాబ్‌కు చెందిన సూర్మా హాకీ మహిళల జట్టుకు కోచ్, మెంటార్‌గా సరికొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాను. ఒలింపిక్స్‌లో మా జట్టు పోడియంలో నిలువలేదు... కానీ భవిష్యత్తులో తప్పకుండా పతకాలు సాధిస్తుంది. –రాణి రాంపాల్

సాజిద్ మాయాజాలం

- ఆరు వికెట్లతో రాణించిన పాక్ స్పిన్నర్
- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 267 ఆలౌట్
- 89 పరుగులతో ఆదుకున్న జేమీ స్మిత్


జేమీ స్మిత్



సాజిద్

రావల్పిండి: ఇంగ్లండ్ బ్యాటర్ల బలహీనతపై పాకిస్తాన్ దెబ్బ కొట్టింది. స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌ను రూపొందించి మూడో టెస్టులో శుభారంభం చేసింది. గురువారం మొదలైన మూడో టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 68.2 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. ముల్తాన్‌లో జరిగిన రెండో టెస్టులో పాకిస్తాన్ స్పిన్నర్లు సాజిద్ అలీ, నోమన్ అలీ తమ స్పిన్ మాయాజాలంతో ఇంగ్లండ్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. రావల్పిండిలోనూ ఈ ఇద్దరు మరోసారి ఇంగ్లండ్‌ను ఇబ్బంది పెట్టారు. ఆఫ్ స్పిన్నర్ సాజిద్ ఖాన్ 128 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టగా... ఎడంచేతి వాటం స్పిన్నర్ నోమన్ అలీ 88 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. మరో వికెట్ లెగ్ స్పిన్నర్ జాహిద్ మహమూద్‌కు లభించింది. ఒకదశలో ఇంగ్లండ్ జట్టు 118 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో జేమీ స్మిత్ (119 బంతుల్లో 89; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగ చకచకా పరుగులు చేశాడు. గస్ అట్కిన్సన్ (39; 5 ఫోర్లు)తో కలిసి జేమీ స్మిత్ ఏడో వికెట్‌కు 105 పరుగులు జోడించి ఇంగ్లండ్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. ఓపెనర్లు బెన్ డకెట్ (52; 4 ఫోర్లు, 1 సిక్స్), జాక్ క్రాలీ (29; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 56 పరుగులు జత చేశారు. క్రాలీని నోమన్ అలీ అవుట్ చేశాక ఇంగ్లండ్ ఇన్నింగ్స్ తడబడింది. ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 73 పరుగులు సాధించింది. అబ్దుల్లా షఫీక్ (14; 1 ఫోర్), సయీమ్ అయూబ్ (19; 1 ఫోర్), కమ్రాన్ గులామ్ (3) అవుటయ్యారు. షాన్ మసూద్ (16 బ్యాటింగ్), సౌద్ షకీల్ (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



'హాల్ ఆఫ్ ఫేమ్'లో షరపోవా, బ్రయాన్ బ్రదర్స్

న్యూపోర్ట్: అంతర్జాతీయ టెన్నిస్ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో రష్యా స్టార్ మరియా షరపోవా... మేటి డబుల్స్ జోడీ బ్రయాన్ బ్రదర్స్ బాబ్, మైక్‌లకు చోటు లభించింది. బ్యాలెట్ సెలెక్షన్స్ ఓటింగ్ ద్వారా ఈ ముగ్గురిని ఎంపిక చేశారు. ఐదు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించిన షరపోవా 2020లో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పింది. షరపోవా ఆస్ట్రేలియన్ ఓపెన్ (2008), వింబుల్డన్ (2004), యూఎస్ ఓపెన్ (2006) గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను ఒక్కోసారి నెగ్గగా... ఫ్రెంచ్ ఓపెన్‌ను (2012, 2014) రెండుసార్లు సొంతం చేసుకొని 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' ఘనత సాధించింది. కవల సోదరులైన బాబ్, మైక్ బ్రయాన్‌లు అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 438 వారాలు నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచారు. అంతేకాకుండా 16 గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్‌ను దక్కించుకున్నారు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గడంతోపాటు 2007లో అమెరికా జట్టు డేవిస్ కప్ టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించారు.



ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి వైదొలుగుతున్నాం

ప్రభుత్వ జోక్యమే కారణమన్న డబ్ల్యూఎఫ్‌ఐ

న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నుంచి వైదొలుగుతున్నామని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) తెలిపింది. ఈ మేరకు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ)కు సమాచారం ఇచ్చింది. సమాఖ్య వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం పెరిగిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. అల్బేనియాలోని టిరానాలో ఈ నెల 28 నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్ జరుగనుంది. ఒలింపిక్స్‌లో భాగంకాని 12 కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు. ఇటీవల అండర్–23 విభాగంలో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించేందుకు డబ్ల్యూఎఫ్‌ఐ ఏర్పాట్లు చేయగా, సుదీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లు ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని, క్రీడాశాఖ సస్పెన్షన్‌కు గురైన సమాఖ్యకు ట్రయల్స్ నిర్వహించే అధికారం లేదని కోర్టుకెక్కారు. దీంతో సెలక్షన్ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు కోర్టుకు నివేదించింది. 'కేంద్ర క్రీడాశాఖ తమ సమాఖ్యపై విధించిన సస్పెన్షన్ వల్లే డబ్ల్యూఎఫ్‌ఐ ఎలాంటి విధాన నిర్ణయాలు తీసుకోలేకపోతోంది. కేవలం కొద్ది మంది చేస్తున్న ఆందోళన వల్ల చాలా మంది రెజ్లర్లకు నష్టం వాటిల్లుతుంది' అని డబ్ల్యూఎఫ్‌ఐ అధికారి ఒకరు వెల్లడించారు.

చెన్నైయిన్, గోవా మ్యాచ్ 'డ్రా'

చెన్నై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో భాగంగా గురువారం చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), గోవా ఎఫ్‌సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 2–2 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. గోవా తరఫున ఉదాంత సింగ్ (45వ నిమిషంలో), అర్మాండో సాదికు (51వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. చెన్నైయిన్ జట్టుకు విల్మార్ జోర్డాన్ (11వ నిమిషంలో), చీమా చుక్వూ (79వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. 13 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ప్రస్తుతం చెన్నైయిన్ జట్టు 8 పాయింట్లతో ఐదో స్థానంలో, గోవా జట్టు 6 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్నాయి.

వారియర్స్, స్టీలర్స్ బోణీ


జైపూర్ పింక్ పాంథర్స్, హరియాణా స్టీలర్స్ మ్యాచ్ దృశ్యం

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో బెంగాల్ వారియర్స్, హరియాణా స్టీలర్స్ తొలి విజయాన్ని నమోదు చేసుకున్నాయి. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్ 32–29 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్ జట్టును ఓడించగా... హరియాణా స్టీలర్స్ 37–25 పాయింట్ల తేడాతో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ జట్టుపై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో తమిళ్ తలైవాస్ (రాత్రి 8 గంటల నుంచి); బెంగళూరు బుల్స్‌తో పుణేరి పల్టన్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.

యూపీ యోధాస్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ జట్టు సమష్టిగా రాణించింది. ఆరుగురు బెంగాల్ ప్లేయర్లు పాయింట్లు సాధించి తమ జట్టు విజయానికి దోహద పడ్డారు. రెయిడర్ మణీందర్ సింగ్ 8 పాయింట్లతో అదరగొట్టగా... సుశీల్ కాంబ్రేకర్, నితిన్ ధన్‌కర్ 7 పాయింట్ల చొప్పున సాధించారు. డిఫెండర్ ఫజల్ అత్రాచి మూడు పాయింట్లు స్కోరు చేశాడు. యూపీ యోధాస్ తరఫున ఆల్‌రౌండర్ భరత్ అత్యధికంగా 13 పాయింట్లు సాధించాడు. భవాని రాజ్‌పుత్ నాలుగు పాయింట్లు, గగన్ గౌడ మూడు పాయింట్లు స్కోరు చేశారు. జైపూర్‌తో జరిగిన పోరులో వినయ్ అద్భుత ఆటతీరుతో హరియాణా జట్టు గెలుపులో ముఖ్యపాత్ర పోషించాడు. వినయ్ 10 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నవీన్ ఆరు పాయింట్లు సాధించగా.. శివమ్ నాలుగు పాయింట్లు, రాహుల్ మూడు పాయింట్లు స్కోరు చేశారు. జైపూర్ తరఫున అభిజిత్ మలిక్ ఏడు పాయింట్లు సాధించాడు.

సహజ పరాజయం



సాక్షి, హైదరాబాద్: అబీర్టో టాంపికో ఓపెన్ డబ్ల్యూటీఏ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి తొలి రౌండ్‌ను దాటలేకపోయింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో సహజ పరాజయం పాలైంది. టాప్ సీడ్, ప్రపంచ 97వ ర్యాంకర్ నూరియా పారిజా దియాజ్ (స్పెయిన్)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 284వ ర్యాంకర్ సహజ 5–7, 4–6తో ఓటమి చవిచూసింది. గంటా 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది.

డబ్బు ఇవ్వడం చట్టవిరుద్ధం

- ఎలాన్ మస్క్‌కు అమెరికా న్యాయశాఖ నోటీసులు

వాషింగ్టన్: భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆయుధాలు ధరించే హక్కుకు మద్దతు పలుకుతూ ఆన్‌లైన్ పిటిషన్‌పై సంతకం చేస్తే రోజులో ఒకరికి 10 లక్షల డాలర్లు ఇస్తానని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రకటించడాన్ని అమెరికా ప్రభుత్వం తప్పుబట్టింది. ఇది ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేస్తూ మస్క్‌ను అమెరికా న్యాయశాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఎన్నికల చట్ట ఉల్లంఘనలపై న్యాయశాఖలోని పబ్లిక్ ఇంటిగ్రిటీ విభాగం మస్క్‌కు చెందిన సూపర్ పీఏసీ కంపెనీకి హెచ్చరిక లేఖను పంపింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు, ఆయుధాలు ధరించే హక్కుకు మద్దతుగా పిటిషన్‌పై సంతకం చేస్తే ఎన్నికల తేదీదాకా ప్రతి రోజూ ఒక విజేతకు 10 లక్షల డాలర్లు ఇస్తానని మస్క్ బంపర్ ఆఫర్ ప్రకటించిన విషయం విదితమే. ట్రంప్‌కు మద్దతుగా పలువురు టెక్ పారిశ్రామికవేత్తలతో ఏర్పాటైన సూపర్ పీఏసీ అనే సంస్థ తమ వెబ్‌సైట్‌లో ఈ ఆఫర్‌ను అందుబాటులో ఉంచింది. అమెరికా ఎన్నికల ఫలితాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించే స్వింగ్ రాష్ట్రాలైన పెన్సిల్వేనియా, జార్జియా, నెవడా, అరిజోనా, మిషిగన్, విస్కాన్సిన్, నార్త్ కరోలినాలోని ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఈ ఆన్‌లైన్ పిటిషన్ కార్యక్రమం దాఖలైంది. అయితే ఈ పిటిషన్‌పై సంతకం చేయాలంటే నిర్దిష్ట రాష్ట్రాల్లో రిజిస్టర్డ్ ఓటరు అయి ఉండాలనే షరతు విధించారు. ఈ షరతుకు లోబడి ఇప్పటివరకు గెలిచిన ఇద్దరు వ్యక్తులకు 10 లక్షల డాలర్ల చెక్కులను అందజేశారు. శనివారం హారిస్‌బర్గ్‌లో ఒకరు, ఆదివారం పిట్స్‌బర్గ్‌లో మరొకరు ఈ చెక్కులను అందుకున్నారు. అయితే ఓటుకు నోటు వ్యవహారంపై అమెరికాలో నిషేధం అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో డబ్బు ఇవ్వడాన్ని చట్టవిరుద్ధంగా పరిగణిస్తూ హెచ్చరిక లేఖను జారీ చేశారు. అయితే, ప్రభుత్వం పంపిన లేఖపై సంస్థగానీ, ఎలాన్ మస్క్‌గానీ ఇంకా స్పందించలేదు. అయితే ఓటు వేసే వాళ్లు మాత్రమే ఈ ఆన్‌లైన్ పిటిషన్‌లో సంతకం చేయాలనే నిబంధన లేదని, ఏ పార్టీకి చెందినా, చెందకపోయినా, ఎన్నికల్లో ఓటువేసే ఉద్దేశంలేకపోయినా ర్యాండమ్‌గా విజేతను ఎంపికచేస్తామని మస్క్ మరో పోస్ట్‌లో వివరణ ఇవ్వడం గమనార్హం.



కుమారుడు సెవెల్‌తో గార్సియా (ఫైల్)

కొడుకు ప్రాణం తీసిన కృత్రిమ మేధ!

అమెరికాలో చాట్‌బాట్ యాప్‌పై కేసు వేసిన ఓ తల్లి

సీటీఆర్ఎల్.. యువతపై కృత్రిమ మేధ ప్రభావాన్ని తెరపై ఆవిష్కరించిన సినిమా. అమెరికాలో ఓ యువకుని జీవితంలో అలాంటి ఘటనే జరిగింది. తన కొడుకు ఆత్మహత్యకు ఏఐ చాట్‌బాట్ కారణమంటూ ఫ్లోరిడాలో ఓ తల్లి కోర్టుకెక్కారు. తన 14 ఏళ్ల కొడుకు చాట్‌బాట్‌తో మానసికంగా అనుబంధాన్ని ఏర్పరుచుకున్నాడని, దాన్నుంచి భావోద్వేగపూరితమైన మెసేజ్ వచ్చిన కాసేపటికే ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె ఆరోపించారు. కృత్రిమ మేధ యాప్‌లతో పొంచి ఉన్న కొత్తతరహా పెను ప్రమాదాలు, ఆయా యాప్‌లపై ఇంకా సరైన నియంత్రణ లేకపోవడాన్ని ఈ అంశం మరోసారి తెరపైకి తీసుకొచ్చింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పట్టభద్రుడైన థెరపిస్ట్‌లా ప్రభావం చూపింది: తల్లి

14 ఏళ్ల సెవెల్ సెట్జర్ తరచుగా 'క్యారెక్టర్.ఏఐ'అనే చాట్‌బాట్ యాప్‌ను ఉపయోగిస్తున్నాడు. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'పాత్ర డేనెరిస్ టార్గేరియన్‌ను పోలిన పాత్రను సృష్టించుకుని సంభాషిస్తున్నాడు. చాట్‌బాట్‌తో వర్చువల్ సంబంధాన్ని ఏర్పరుచుకున్నాడు. క్యారెక్టర్.ఏఐ చాట్‌బాట్ టీనేజర్ అయిన తన కొడుకును లక్ష్యంగా చేసుకుందని, అతను ఆత్మహత్య ఆలోచనలను వ్యక్తం చేసిన తర్వాత ఆ యాప్ అదేపనిగా ఆత్మహత్య అంశాన్ని లేవనెత్తి పిల్లాడు ఆత్మహత్య చేసుకునేలా ఉసిగొల్పిందని అతని తల్లి అమెరికాలోని ఓర్లాండోలో ఫిర్యాదుచేశారు. చాట్‌బాట్ తన పిల్లాడిపై ఒక పట్టభద్రుడైన థెరపిస్ట్‌గా తీవ్ర ప్రభావం చూపించిందని ఆమె ఆరోపించారు. చనిపోవడానికి ముందు ఏఐతో జరిగిన చివరి సంభాషణలో సెవెల్ చాట్‌బాట్‌ను ప్రేమిస్తున్నానని, 'మీ ఇంటికి వస్తాను'అని చెప్పాడని దావాలో పేర్కొన్నారు. తన కుమారుడి మరణంలో క్యారెక్టర్.ఏఐ చాట్‌బాట్ ప్రమేయం ఉందని తల్లి మేగన్ గార్సియా ఆరోపించారు. మరణం, నిర్లక్ష్యం, ఉద్దేశపూర్వకంగా మానసిక క్షోభను కలిగించినందుకు నిర్దిష్ట నష్టపరిహారాన్ని కోరుతూ గార్సియా దావా వేశారు.

గూగుల్‌పై దావా

ఈ దావాలో సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్, దాని మాతృసంస్థ ఆల్ఫాబెట్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆగస్టులో క్యారెక్టర్.ఏఐలో గూగుల్ భారీ స్థాయిలో వాటాలను కొనుగోలుచేసింది. గూగుల్ ఆగమనంతో ఈ యాప్ అంకురసంస్థ మార్కెట్ విలువ ఏకంగా 2.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. అయితే క్యారెక్టర్.ఏఐ అభివృద్ధిలో తమ ప్రత్యక్ష ప్రమేయం లేదని గూగుల్ ప్రతినిధి ఒకరు తెలిపారు. అయితే తమ యాప్ వినియోగదారుల్లో ఒకరిని కోల్పోవడం హృదయవిదారక విషయమని సంస్థ తన 'ఎక్స్'ఖాతాలో ఒక ప్రకటన చేసింది. సెవెల్ కుటుంబానికి సంతాపం తెలిపింది. 'కృత్రిమ మేధ అనేది నిజమైన వ్యక్తి కాదు. ఈ విషయాన్ని వినియోగదారులకు మరోసారి స్పష్టంగా గుర్తుచేస్తున్నాం. ఈ మేరకు డిస్‌క్లైమర్‌ను సవరిస్తున్నాం. భద్రతను పెంచడానికి అదనపు ఫీచర్లను జోడిస్తాం'అని సంస్థ తెలిపింది. అయితే చాట్‌బాట్ కారణంగా వ్యక్తి మరణం అమెరికాలో పెద్ద చర్చను లేవనెత్తింది. ఇలాంటి కృత్రిమమేధ కారణంగా ఎవరికైనా హాని జరిగితే దానికి బాధ్యులు ఎవరు?. ఆ బాధ్యత ఎవరు తీసుకుంటారు? అన్న చర్చ మొదలైంది. ఇతర నియంత్రణ చట్టాల వంటి సెక్షన్ 230 అనేది కృత్రిమ మేధకు వర్తిస్తుందా అనే అంశమూ డిజిటల్ నిపుణుల చర్చల్లో ప్రస్తావనకొచ్చింది.

ఫిలిప్పీన్స్‌లో వరదలు.. 23 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్ ఈశాన్య ప్రాంతాన్ని ట్రామి తుపాను అతలాకుతలం చేస్తోంది. బికోల్ ప్రాంతంతోపాటు క్వెజాన్ ప్రావిన్స్‌లో నీట మునిగిన ఘటనల్లో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క నాగా నగరంలోనే ఏడుగురు చనిపోయారు. రెండు నెలల్లో కురవాల్సిన వర్షం కేవలం 24 గంటల్లోనే నమోదైందని అధికారులు తెలిపారు. ఆల్బే ప్రావిన్స్‌లో మయోన్ అగ్ని పర్వతం నుంచి వెల్లువెత్తుతున్న బురద ప్రవాహం అనేక నివాస ప్రాంతాలను ముంచెత్తింది. ఇళ్లపైకి చేరిన వారిని, వరదలో చిక్కుకున్న వారిని యంత్రాంగం మోటారు బోట్లలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. ట్రామి తుపానుతో 75,400 మంది నిరాశ్రయులయ్యారని మొత్తం 20 లక్షల మందిపై ప్రభావం చూపిందని ప్రభుత్వం తెలిపింది. బుధ, గురు వారాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. చాలా ప్రాంతాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సాయం అందించడం కూడా కష్టంగా మారిందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని ప్రభుత్వం పేర్కొంది.



కామరిన్స్ సురి ప్రావిన్స్‌లో ప్రజలను రబ్బర్ బోట్లలో తరలిస్తున్న కోస్ట్‌గార్డ్

యూపీ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ దూరం

- తొమ్మిది స్థానాల్లోనూ పోటీ చేయనున్న ఎస్పీ
- సీట్లు కాదు..గెలుపే ముఖ్యమన్న అఖిలేశ్

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టకూడదని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న తొమ్మిది స్థానాలను ఇండియా కూటమిలో భాగంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీకే వదిలేయడంతో పాటు ఆ పార్టీ అభ్యర్థులకే మద్దతివ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు కాంగ్రెస్ నిర్ణయం చేసిందని ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అవినాష్ పాండే గురువారం తెలిపారు. నిజానికి పాండే ప్రకటనకు ముందే ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఉప ఎన్నికల్లో మొత్తం తొమ్మిది స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థులందరూ తమ పార్టీ ఎన్నికల గుర్తు 'సైకిల్'పై పోటీ చేస్తారని ప్రకటించారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఐక్యంగా ఉన్నాయని, భారీ విజయం కోసం భుజం భుజం కలిపి పనిచేస్తాయని, ఈ ఎన్నికల విజయంతో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తామని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అఖిలేశ్ ప్రకటన అనంతరం కాంగ్రెస్ తన నిర్ణయాన్ని అధికారికంగా వెల్లడించింది. నిజానికి ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న 9 స్థానాలకు గానూ కాంగ్రెస్ 5 స్థానాలను ఆశించింది. దీనిపై చర్చలు కొనసాగుతుండగానే 6 స్థానాల్లో ఎస్పీ ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన మూడు స్థానాల్లో ఘాజియాబాద్, ఖైర్ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఇచ్చేందుకు సుముఖత తెలిపింది. అయితే ఈ రెండు స్థానాల్లోనూ గెలుపు అవకాశాలు లేకపోవడం, బీజేపీకి మెరుగైన అవకాశాలు ఉండటంతో ఈ స్థానాల్లో పోటీ చేయకూడదని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటూ'ఇండియా కూటమి 9 స్థానాల్లో పోటీ చేస్తోంది. మాకు గుర్తు ముఖ్యం కాదు..బీజేపీ దుష్పరిపాలన అంతం ముఖ్యం. శాంతి భద్రతలు ముఖ్యం'అని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ పేర్కొన్నారు. దీనికి కౌంటర్‌గా బదులిచ్చిన బీజేపీ, 'కాంగ్రెస్ ముక్త్ భారత్'నినాదాన్ని ఎస్పీ నిజం చేస్తోందని ఎద్దేవా చేసింది.

కూల్చివేత బాధితులు కోర్టుకు రావొచ్చు

- మూడు రాష్ట్రాలపై కోర్టు ధిక్కరణకు సుప్రీం 'నో'

న్యూఢిల్లీ: బుల్డోజర్ న్యాయానికి సుప్రీంకోర్టు బ్రేక్ వేసినా.. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్తాన్ అధికారులు దీన్ని ఉల్లంఘించారని, ఈ మూడు రాష్ట్రాలపై కోర్టు ధిక్కరణ అభియోగాలు నమోదు చేయాలని దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తిరస్కరించింది. పిటిషనర్‌కు కూల్చివేత బాధితుడు కాదని, ఆయనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వాటితో ఎలాంటి సంబంధం లేదని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ పి.కె.మిశ్రా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం పేర్కొంది. తేనెతుట్టను కదల్చాలని తాము అనుకోవడం లేదని, కూల్చివేత బాధితులు ఎవరైనా ఉంటే కోర్టుకు రావొచ్చని స్పష్టం చేసింది. నిందితులు అయినంత మాత్రాన వారి ఇళ్లను, ఇతర నిర్మాణాలను కూల్చవద్దని సుప్రీంకోర్టు బుల్డోజర్ న్యాయానికి బ్రేక్ వేసిన విషయం తెలిసిందే. తమ అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని తెలిపింది. దీనిపై తాము దేశవ్యాప్తంగా అమలయ్యేలా మార్గదర్శకాలు జారీచేస్తామని చెప్పింది. అయితే ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే.. అది గుడి అయినా, మసీదు అయినా కూల్చివేయాల్సిందేనని స్పష్టం చేసింది. కోర్టు అనుమతి లేకుండా కూల్చివేత చేపట్టవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ కాన్పూర్, హరిద్వార్, జైపూర్‌లలో అధికారులు కూల్చివేతలకు దిగారని, కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని పిటిషనర్ తరఫున న్యాయవాది పేర్కొన్నారు. ఒకచోట అయితే ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే కూల్చివేతకు పాల్పడ్డారని తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమణనను మాత్రమే తొలగించారని, పిటిషనర్‌కు నేరుగా దీనితో ఎలాంటి సంబంధం లేదు కాబట్టి ఆయనకు వాస్తవాలు తెలియవని ఉత్తరప్రదేశ్ తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ వాదించారు. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా పిటిషనర్ సుప్రీంకోర్టుకు వచ్చారని అన్నారు. ఈ కూల్చివేతలతో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదు కాబట్టి... పిటిషన్‌ను అనుమతించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. పైన పేర్కొన్న మూడు ఘటనల్లో ఇద్దరు జైళ్లో ఉన్నారని పిటిషనర్ తెలుపగా.. వారి కుటుంబీకులు కోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం బదులిచ్చింది.

గాజా స్కూల్‌పై ఇజ్రాయెల్ దాడి

17 మంది పాలస్తీనియన్లు మృతి

దెయిర్ అల్-బలాహ్: గాజాలోని నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని స్కూల్ భవనంపై గురువారం ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 13 మంది చిన్నారులు, 18 ఏళ్ల మహిళలున్నారని పాలస్తీనా వైద్య విభాగం తెలిపింది. ఘటనలో గాయపడిన మరో 42 మంది దగ్గర్లోని ఔదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడిపై ఇజ్రాయెల్ ఆర్మీ స్పందించలేదు. హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆర్మీ తరచూ శరణార్థులు తలదాచుకుంటున్న స్కూల్ భవనాలపై దాడులకు దిగుతోంది. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. గతేడాది అక్టోబర్ 7వ తేదీన గాజాలోని హమాస్ లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు మొదలుపెట్టింది. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 42 వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు మృతి చెందారు. క్షతగాత్రులు లక్ష వరకు ఉంటారని అంచనా. తాము 17 వేల మంది హమాస్ మిలిటెంట్లను చంపేశామంటున్న ఇజ్రాయెల్ ఆర్మీ సంబంధిత ఆధారాలను మాత్రం వెల్లడించడం లేదు. హమాస్, ఇజ్రాయెల్ ఆర్మీ మధ్య యుద్ధం కారణంగా గాజాలోని 23 లక్షల మందిలో 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు.



గాజాలోని నుసెయిరత్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన ఓ స్కూల్ భవనం శిథిలాల గుండా నోట్‌బుక్ పట్టుకుని నడుస్తున్న ఓ బాలుడు

ఆస్పత్రుల్లో మందుల కొరత

ఉత్తర గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ ఆర్మీ తరచూ చేస్తున్న దాడులతో నివాసాలు నేలమట్టమవుతున్నాయి. వందల సంఖ్యలో పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. వేలాదిగా నిరాశ్రయులవుతున్నారు. మళ్లీ బలం పుంజుకుంటున్న హమాస్ సాయుధులే లక్ష్యంగా దాడులు చేస్తున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ అంటోంది. అయితే, ఈ దాడుల్లో గాయపడిన ఇంటెన్సివ్ కేర్‌లోని 14 మంది చిన్నారులు సహా సుమారు 150 మంది తమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఉత్తర గాజాలోని కమాల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ హొసమ్ అబూ సఫేఫ్ తెలిపారు. వైద్య సిబ్బంది, మందుల కొరత కారణంగా గంటకొకరు చొప్పున తుది శ్వాస విడుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను ఆయన విడుదల చేశారు.

ముగ్గురు లెబనాన్ సైనికులు మృతి

బీరుట్: ఇజ్రాయెల్ ఆర్మీ గురువారం జరిపిన దాడిలో లెబనాన్ ఆర్మీకి చెందిన ముగ్గురు చనిపోయారు. యటెర్ పట్టణంలో క్షతగాత్రులను తరలిస్తున్న ఒక ఆర్మీ అధికారి, ఇద్దరు సిబ్బంది చనిపోయినట్లు ఆ దేశ ఆర్మీ 'ఎక్స్'లో తెలిపింది. సెప్టెంబర్‌లో హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్ ఆర్మీ మధ్య భీకర పోరు మొదలయ్యాక యటెర్‌పై దాడి జరగడం ఇది ఎనిమిదోసారని పేర్కొంది.

ప్రజాపద్దుల కమిటీ భేటీకి మాధవీ పురి డుమ్మా

న్యూఢిల్లీ: సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) చైర్‌పర్సన్ హోదాలో ఉంటూ గౌతమ్ అదానీ గ్రూప్‌కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధవీ పురీ బచ్ గురువారం పార్లమెంట్ ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) సమావేశానికి గైర్హాజరయ్యారు. సెబీ పనితీరును మాధవీ పురి మసకబార్చారంటూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ గతంలో ఆరోపణలు చేయడంతో సెబీ పనితీరును ఆమె సమక్షంలోనే సమీక్షించేందుకు పీఏసీ సిద్ధమైన విషయంతెల్సిందే. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో పీఏసీ చైర్మన్, కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన సమావేశం ఉదయం 11 గంటల ప్రాంతంలో మొదలైంది. అయితే చివరి నిమిషంలో అత్యవసర పనుల కారణంగా తాను ఢిల్లీలో సమావేశానికి రాలేకపోతున్నానని రెండు గంటలముందు మాధవీ సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె లేకుండా సమీక్ష అనవసరమని భావించి వేణుగోపాల్ సమావేశాన్ని మధ్యాహ్నానికి వాయిదావేశారు.

శిల్పంలో మార్పులు 'సుప్రీం' బార్ అభ్యంతరం

న్యూఢిల్లీ: తమను సంప్రతించకుండా సుప్రీంకోర్టులో న్యాయదేవత రూపం, సుప్రీంకోర్టు చిహ్నంలో మార్పులు చేయడంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ మేరకు నిరసన తెలుపుతూ న్యాయవాదుల సంఘం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచనలమేరకు ఇటీవల సుప్రీంకోర్టు గ్రంథాలయంలో నూతన న్యాయదేవత విగ్రహాన్ని ఏర్పాటుచేయడం తెల్సిందే. కళ్లకు గంతలు లేకుండా, ఖడ్గం బదులు ఎడమ చేతిలో రాజ్యాంగ ప్రతితో, తలపై కిరీటంతో శ్వేతవర్ణంలో న్యాయదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీనిపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సారథ్యంలోని ఎస్సీబీఏ అభ్యంతరం తెలిపింది. ''కోర్టు చిహ్నం, న్యాయదేవత విగ్రహాల్లో పెను మార్పులు జరిగాయి. బాధితులకు కోర్టుల్లో న్యాయం అందే క్రతువులో మేం కూడా భాగస్వాములమే. అలాంటిది మమ్మల్ని కనీసం సంప్రతించకుండా మార్పులు చేశారు''అని తీర్మానంలో పేర్కొన్నారు. ఎన్నాళ్ల నుంచి సుప్రీం లాయర్లు కోరుతున్న స్థలంలో కేఫ్, లాంజ్ ఏర్పాటుచేయకుండా అక్కడ మ్యూజియంను ప్రతిపాదించడం సహేతుకం అనిపించుకోదని అసోసియేషన్ పేర్కొంది.

ప్రధాని మోదీతో ఒమర్ అబ్దుల్లా భేటీ



ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛమిస్తున్న ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా గురువారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. కశ్మీర్‌లో శాంతిభద్రతల పరిస్థితిని ఆయనకు వివరించారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఇటీవల అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని సీఎం ఒమర్ ప్రధానికి అందజేశారు. కేంద్ర పాలిత ప్రాంతం నుంచి జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలని, కశ్మీర్ ప్రత్యేకతను పరిరక్షించాలని ఈ సందర్భంగా కోరారు. వీరి భేటీ అరగంటపాటు జరిగింది. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతోనూ ఆయన సమావేశమయ్యారు. వారం క్రితం సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొట్ట మొదటిసారిగా ఢిల్లీకి వచ్చిన ఒమర్ బుధవారం హోం మంత్రి అమిత్ షాను కలిశారు.

ఆస్కార్ రిటైరయ్యింది..!

ముంబై: పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ నివాసం ముంబైలోని అంటీలియా వద్ద పేలుడు పదార్థాలను కనిపెట్టి పెను ప్రమాదాన్ని నివారించిన పోలీసు జాగిలం 'ఆస్కార్'విధుల నుంచి విశ్రాంతి తీసుకుంది. మలబార్ హిల్ ప్రాంతంలో ఉన్న అంబానీ నివాసం సమీప పార్కింగ్ ప్లేస్‌లో 2021 ఫిబ్రవరి 25న ఆగంతకులు ఉంచిన జిలెటిన్ స్టిక్స్‌ను ఇది పసిగట్టింది. అప్పట్లో ఈ విషయం దేశ వ్యాప్త సంచలనం సృష్టించింది. ఆస్కార్ బుధవారం తోటి శునకం మిలోతోపాటు రిటైరయ్యింది. ఈ సందర్భంగా జరిగిన వేడుకకు అదనపు కమిషనర్ వినీత్ సాహూ సహా పలువురు అధికారులు హాజరై జాగిలాలకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముంబై పోలీసు విభాగం బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్(బీడీడీఎస్)లో 2014లో చేరిన ఆస్కార్ పదేళ్లపాటు వీవీఐపీ భద్రతతోపాటు బెదిరింపులు, బెదిరింపు కాల్స్ సమయంలో విధులను సమర్థవంతంగా నిర్వహించిందని ఓ అధికారి తెలిపారు. మిలో కూడా వీవీఐపీలు, కీలక సంస్థల భద్రతతోపాటు అనుమానాస్పద బ్యాగుల తనిఖీ విధుల్లో పాల్గొందని చెప్పారు. రిటైరయ్యాక ఈ రెండు జాగిలాలకు ఏసీ వసతి సౌకర్యంతోపాటు రవాణా సమయంతో ఏసీతో కూడిన వాహనం సమకూర్చుతామని, ఇవి అందించిన సర్వీసులకు గుర్తింపుగా 'వాల్ ఆఫ్ ఫేమ్'ను ఏర్పాటు చేశామని చెప్పారు.

అధ్యక్ష పదవికి అయోగ్యుడు

- ట్రంప్‌పై హారిస్ ధ్వజం

వాషింగ్టన్: దేశాధ్యక్ష పదవిని చేపట్టే యోగ్యత డొనాల్డ్ ట్రంప్‌కు లేదని డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ ధ్వజమెత్తారు. 'ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నపుడు తనకు అడాల్ఫ్ హిట్లర్‌కు ఉన్నటువంటి ఆర్మీ జనరల్స్ కావాలని చెప్పాడని మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లీ వెల్లడించారు. దీనిపై కమల స్పందించారు. 'అమెరికా రాజ్యాంగానికి విధేయులైన సైన్యం ట్రంప్‌కు అక్కర్లేదు. వ్యక్తిగతంగా తనకు విధేయులైన సైన్యం ఆయనకు కావాలి. చట్టాన్ని ఉల్లంఘించమన్నా, రాజ్యాంగంపై తాము చేసిన ప్రతిజ్ఞను మరిచిపోయి నడుచుకోమన్నా.. మారుమాట్లాడకుండా తన ఆదేశాలను పాటించే సైన్యం ట్రంప్‌కు కావాలి'అని హారిస్ విలేకరులతో అన్నారు. 'సహచర అమెరికన్లను అంతర్గత శత్రువులుగా ట్రంప్ గతవారం పదేపదే సంబోధించారు. అమెరికన్ పౌరులపై దేశ సైన్యాన్ని వాడతాననీ చెప్పారు'అని హారిస్ పేర్కొన్నారు. 'మాజీ అధ్యక్షుడిది అతివాద భావజాలం. నిరంకుశత్వం. నియంతలను ఆరాధిస్తారు. ఇది ఆయనే చెప్పారు. తప్పకుండా ఫాసిస్టు నిర్వచనం కిందకు వస్తారు'అని జాన్ కెల్లీ న్యూయార్క్ టైమ్స్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

తోషఖానా కేసులో ఇమ్రాన్ భార్యకు బెయిల్

ఇస్లామాబాద్: తోషఖానా అవినీతి కేసులో 9 నెలలుగా జైలు జీవితం అనుభవిస్తున్న పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ భార్య బుష్రా బీబీ(50) గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసులో మరింత దర్యాప్తు అవసరం లేదన్న విచారణాధికారి అభిప్రాయం మేరకు ఇస్లామాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ మియాన్‌గుల్ హస్సన్ బుధవారం బుష్రాకు రూ.10 లక్షల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) అధ్యక్షుడు కూడా అయిన ఇమ్రాన్‌ఖాన్‌కు, బుష్రాకు తోషఖానా అవినీతి కేసులో కోర్టు గతంలో 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ప్రధానిగా ఉండగా విదేశీ ప్రముఖుల నుంచి తోషఖానా(ప్రభుత్వ ఖజానా)కు అందిన బహుమతుల విక్రయం ద్వారా లాభం పొందినట్లు ఇమ్రాన్ దంపతులపై ఆరోపణలున్నాయి. ఈ కేసు తదుపరి విచారణ 26న జరగనుంది.

వారం పాటు 'ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం'

- నవంబర్ 13–20 తేదీల మధ్య ఎగ్జిట్ పోల్స్‌పై ఆంక్షలు

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధాన్ని అమలు చేయనుంది. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు రెండు పార్లమెంటరీ స్థానాలు, 48 శాసనసభ నియోజకవర్గాలలో ఉప ఎన్నికల సందర్భంగా మీడియా సంస్థలు లేదా మరే ఇతర పద్ధతిలో ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయడాన్ని ఎన్నికల సంఘం నిషేధించింది. ఈ మేరకు అధికారిక నోటిఫికేషన్ తెలిపింది. నవంబర్ 13 నుంచి నవంబర్ 20 వరకు ఎగ్జిట్ పోల్స్‌పై ఆంక్షలు విధించారు.

జామియా మిలియా వీసీగా మజార్ ఆసిఫ్


న్యూఢిల్లీ: జామియా మిలియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ మజార్ ఆసిఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదేశాలు జారీ చేశారు. జాయినైనప్పటి నుంచి ఐదేళ్లపాటు లేదా 70 ఏళ్లు వచ్చే వరకు ఆ హోదాలో కొనసాగుతారని పేర్కొన్నారు. మజార్ ఆసిఫ్ ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జేఎన్‌యూ పూర్వ విద్యార్థి అయిన మజార్ ఆసిఫ్ 2020 నూతన విద్యా విధానం ముసాయిదా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. పర్షియా–అస్సామీస్–ఇంగ్లిష్ డిక్షనరీ సహా పర్షియన్, ఇంగ్లిష్, అస్సామీ భాషల్లో 9 పుస్తకాలు రచించారు.

వాటర్ ట్యాంక్ కూలి ఐదుగురు మృతి

పుణే: మహారాష్ట్రలోని థానె జిల్లాలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంక్ కూలి ఐదుగురు కార్మికులు చనిపోగా మరో ఐదుగురు గాయపడ్డారు. పింప్రి చించ్‌వాడ్ ప్రాంతంలోని భోసారిలోని లేబర్ క్యాంప్ గురువారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. ట్యాంక్ కూలడంతో దాని కింద స్నానం చేస్తున్న కార్మికులు శిథిలాల్లో కూరుకుపోయారు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే ముగ్గురు చనిపోగా మరో ఇద్దరు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఐదుగురు క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు.

మల్కిభ రాముడిగా పేరొందిన కుతుబ్‌షాహీ రాజు?

పదిహేనో శతాబ్దం చివరి నాటికి క్షీణ దశకు చేరిన బహమనీ సామ్రాజ్యం అయిదు రాజ్యాలుగా చీలిపోయింది. అందులో గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యం ఒకటి. ఈ రాజ్యస్థాపకుడు సుల్తాన్ కులీకుతుబ్‌షా. ఇతడు 1496 నుంచి 1518 వరకు సుబేదార్‌గా తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. 1518లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. కుతుబ్‌షాహీలు తొలుత తెలంగాణను పాలించారు. 1565లో విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత ఇతర తెలుగు ప్రాంతాలు కూడా వీరి ఆధీనంలోకి వచ్చాయి. తెలంగాణ అనే పదం వీరి కాలం నుంచే ప్రాచుర్యం పొందింది. కుతుబ్‌షాహీలు సుమారు రెండు శతాబ్దాల (1496-1687) పాటు తెలంగాణను పాలించారు. వీరు తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను ఆదరించి తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీ యుగం

కులీకుతుబ్‌షా తన బంధువులతో కలసి మధ్య ఆసియా నుంచి దక్కన్‌కు వలస వచ్చాడు. ఇతడు బహమనీ సుల్తాన్ మహమూద్ షా (1482–1518) కొలువులో చేరి సేనాపతి అయ్యాడు. ఆ సమయంలో ఇతడు తెలంగాణ ప్రాంతంలో దోపిడీ దొంగలను అణచివేశాడు. ఎదురు తిరిగిన సామంతులను దారిలోకి తెచ్చాడు. 1487లో బహమనీ రాజ్యంలో దక్కనీ, అఫాకీ(స్థానికేతర)ల మధ్య ఘర్షణలు తలెత్తాయి. కులీ వీటి నుంచి సుల్తాన్‌ను రక్షించాడు. గోవా పాలకుడైన బహదూర్ జిలానీ (1493) సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటును అణచివేసే ప్రయత్నంలో నాటి తెలంగాణ పాలకుడైన కుతుబ్ ఉల్‌ముల్క్ డకానీ మరణించాడు. దీంతో మహమూద్ షా ఆ బాధ్యతను కులీకుతుబ్‌షాకు అప్పగించాడు. తిరుగుబాటును కులీ పూర్తిగా అణచి వేశాడు. దీంతో మహమూద్‌షా అతడికి కుతుబ్ ఉల్‌ముల్క్ బిరుదునిచ్చి 1496లో గోల్కొండ జాగీర్‌దార్‌గా నియమించాడు. కులీకుతుబ్‌షా 1518లో స్వతంత్రం ప్రకటించుకొని తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. గోల్కొండను కాకతీయుల కాలంలో నిర్మించారు. దీన్ని గతంలో మంగళారం అని పిలిచేవారు. కులీ స్వతంత్రంగా పాలన చేపట్టిన తొలినాళ్లలో మెదక్ జిల్లా కోహిర్ నుంచి ఓరుగల్లు వరకు మాత్రమే ఇతడి పాలనలో ఉండేది. ఓరుగల్లు నుంచి తూర్పు తీరం వరకు ఉన్న ప్రాంతాన్ని షితాబ్‌ఖాన్ (సీతాపతిరాజు) పాలించేవాడు. ఇతడు గజపతుల సామంతుడు. షితాబ్‌ఖాన్ 1504లో ఓరుగల్లు కోటను కైవసం చేసుకున్నాడు. ఇతడు స్వతంత్రంగా ఓరుగల్లు రాజ్యపాలన చేపట్టాడు. ఇతడి మంత్రి ఎనుములపల్లి పెద్దనామాత్యుడు. చరిగొండ ధర్మన్న అనే కవి పెద్దనామాత్యుడి వద్ద ఆశ్రయం పొందాడు. ధర్మన్న రచించిన చిత్రభారతంలో షితాబ్‌ఖాన్ ప్రశంస కనిపిస్తుంది. వరంగల్, ఖమ్మంమెట్టు, నల్లగొండ ప్రాంతాలు షితాబ్‌ఖాన్ రాజ్యంలో భాగంగా ఉండేవి. కులీకుతుబ్‌షా ఓరుగల్లుపై దాడి చేసి ఇతణ్ని సంహరించాడు.

రాజ్య విస్తరణ

రాచకొండ, పానుగల్లు, ఘనపురం (మహబూబ్‌నగర్), దేవరకొండ, నల్లగొండ, ఉర్లుగొండ, ఉండ్రుగొండ, అనంతగిరి దుర్గాధిపతులు స్వతంత్రంగా పరిపాలించేవారు. కృష్ణదేవరాయల మరణానంతరం (1529) కులీకుతుబ్‌షా ఈ దుర్గాలను జయించి రాజ్యాన్ని విస్తరించాడు. తర్వాత కరీంనగర్ జిల్లాలో కివాం ఉల్‌ముల్క్‌ను ఓడించాడు. ములంగూర్, ఎల్లందుల, రామగిరి కోటలను స్వాధీనం చేసుకున్నాడు. ఆదిల్‌షాతో యుద్ధం చేసి కోవిలకొండను ఆక్రమించాడు. హరిచంద్ తిరుగుబాటును అణచి నల్లగొండను వశం చేసుకున్నాడు. తర్వాత కృష్ణానదీ తీరం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. కొండపల్లి, ఇంద్రకొండ, ఏతగిరి, దుర్గాధీశులను ఓడించాడు. దీంతో కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న తీరాంధ్ర కూడా ఇతడి పాలనలోకి వచ్చింది. కులీకుతుబ్‌షా కవి పండితులను ఆదరించాడు. ఇతడికి ఆరుగురు కుమారులు. చివరివాడైన ఇబ్రహీం కుతుబ్‌షాను దేవరకొండ పాలకుడిగా నియమించాడు.

యువరాజు, పెద్ద కుమారుడైన హైదర్ ముందే మరణించాడు. రెండో కుమారుడైన కుతుబుద్దీన్ యువరాజు అయ్యాడు. కానీ రాజకీయాల పట్ల శ్రద్ధ పెట్టలేదు. మిగతా ముగ్గురు తండ్రి బతికుండగానే సింహాసనాన్ని ఆకాంక్షించారు. నాలుగో కుమారుడైన అబ్దుల్ కరీం తిరుగుబాటు చేశాడు. ఇతడు బీజాపూర్ వెళ్లి సుల్తాన్‌తో సంప్రదింపులు జరిపాడు. గోల్కొండను ముట్టడించాలని భావించాడు. ఆ ప్రయత్నాల్లోనే మరణించాడు. కులీకుతుబ్‌షా మూడో కుమారుడైన జంషీద్, అయిదో కుమారుడైన దౌలత్ వారసత్వం కోసం కలహించుకున్నారు. దీంతో కులీకుతుబ్‌షా జంషీద్‌ను గోల్కొండలో, దౌలత్‌ను భువనగిరిలో బంధించాడు. జైలు నుంచి తప్పించుకున్న జంషీద్ తండ్రిని హత్య చేశాడు. సోదరుడైన కుతుబుద్దీన్‌ను చిత్రహింసలకు గురి చేసి జైల్లో ఉంచాడు. అనంతరం సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతడు రాజ్యాన్ని విస్తరించలేదు. కానీ తన రాజ్య భాగాలను కోల్పోలేదు.

మల్కిభరాముడు

కులీ ఆరో కుమారుడు ఇబ్రహీం కుతుబ్‌షా (1550–80). ఇతడు విజయనగర రాజుల సాయంతో సింహాసనాన్ని ఆక్రమించాడు. కవి పండితులను ఆదరించి మల్కిభరాముడిగా పేరొందాడు. ఇతడు విజయనగరంలో ఏడేళ్లపాటు శరణార్థిగా ఉన్నాడు. వారి సహాయంతోనే సింహాసనాన్ని ఆక్రమించాడు. కానీ వారి పతనానికే కారణమయ్యాడు. బీజాపూర్, అహ్మద్‌నగర్, గోల్కొండ, విజయనగర రాజులు దక్కన్‌పై ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇబ్రహీం తళ్లికోట యుద్ధంలో విజయనగర రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడాల్సి వచ్చింది. ఈ యుద్ధంలో ఓటమి వల్ల విజయనగర సామ్రాజ్యం పతనావస్థకు చేరింది. దీంతో ఇబ్రహీం కుతుబ్‌షా తీరాంధ్రను జయించడానికి మార్గం సుగమమైంది. ఇతడు 1571లో రాజమండ్రి, దాని పరిసర ప్రాంతాలను జయించాడు. 1579లో కొండవీటిని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత వినుకొండ, ఖమ్మం దుర్గాలను, కసింకోటను వశం చేసుకున్నాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా తన పాలనా కాలంలో హుస్సేన్‌సాగర్, ఇబ్రహీం పట్నం చెరువులను తవ్వించాడు. ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్, లంగర్ (భిక్షా గృహాలు)ను ఏర్పాటు చేశాడు. మూసీనదిపై పురానాపూల్ వంతెనను నిర్మించాడు.

ఇబ్రహీం మరణానంతరం మహమ్మద్ కులీ కుతుబ్‌షా (1580–1612) అధికారం చేపట్టాడు. ఇతడు 14వ ఏట రాజ్యానికొచ్చాడు. ఇతడు ఇబ్రహీం, భాగీరథిల సంతానం. దక్కన్ ముస్లింల సహకారంతో అశ్వారావు చేసిన కృషి వల్ల మహమ్మద్ కులీ అధికారంలోకి వచ్చాడు. ఇతడు కవి అయినప్పటికీ రాజ్య విస్తరణలో అలక్ష్యం ప్రదర్శించలేదు. దక్షిణాన పెనుగొండ, గండికోటలను జయించాడు. తూర్పున శ్రీకాకుళం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. అనేక తిరుగుబాట్లను అణచివేశాడు. 1592లో రాజధానిని గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు మార్చాడు. ఇదే సమయంలో మొగలులు విజృంభించి 1590 నాటికి ఉత్తర భారతాన్నంతా ఆక్రమించారు.

అనంతరం వారు దక్కన్‌పై దృష్టి సారించి అహ్మద్‌నగర్‌ను వశపర్చుకున్నారు. ఈ ప్రభావం మహమ్మద్ కులీపై కూడా పడింది. ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ ఇవేవీ కులీ కళాపోషణను ప్రభావితం చేయలేదు. తన ప్రియురాలైన భాగమతి పేరు మీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. కులీ ఆమెకు హైదర్ మహల్ అనే పేరు పెట్టాడు. దీంతో భాగ్యనగరం హైదరాబాద్‌గా వ్యవహారంలోకి వచ్చింది.

ఇతడు చార్మినార్ (1591), చార్‌కమాన్(1592), జామామసీద్(1597–1598)లను నిర్మించాడు. దారుల్ షిఫా, దాద్ మహల్, ఖుదాదాద్ మహల్, నద్ది మహల్‌లను నిర్మించాడు. భాగెమహమ్మది, బన్సత్ ఘాట్, కోహినూర్ తదితర నిర్మాణాలు చేపట్టాడు. ఇవన్నీ ఇతడి కళాభిరుచికి నిదర్శనం.

కులీ మరణం తర్వాత అతడి అల్లుడయిన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా(1612–26) సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతడు మొగలులతో సఖ్యతగా వ్యవహరించాడు. ఇతడి కాలంలోనే డచ్చివారు, బ్రిటిషర్లు తీరాంధ్ర వెంట వర్తక స్థావరాల్ని నెలకొల్పారు. మహమ్మద్ కుతుబ్‌షా ఖైరతాబాద్ మసీద్‌ను నిర్మించాడు. మక్కా మసీదు నిర్మాణానికి పునాది వేశాడు. 1624లో ఈద్‌గాను నిర్మించాడు. అమ్మాన్ భవనం, నబీబాగ్ కూడా ఇతడి కాలం నాటివే.

పతనం ఆరంభం..

మహమ్మద్ తర్వాత అతడి పెద్ద కుమారుడైన అబ్దుల్లా కుతుబ్‌షా(1626–72) రాజ్యానికి వచ్చాడు. ఇతడు మొగలుల నుంచి స్వతంత్రతను నిలబెట్టుకోలేకపోయాడు. దక్కన్‌లో మొగలులను ఎదిరించిన మలికంబర్ 1626లో, బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షా 1627లో మరణించారు. వీరి మరణంతోపాటు కొన్ని ఇతర కారణాల వల్ల దక్కన్‌పై మొగలుల దండయాత్రకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

మొగల్ చక్రవర్తి షాజహాన్ 1636లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతడితో సంధి చేసుకుని మొగలుల ఆధిపత్యాన్ని అంగీకరించాడు. నాటి నుంచి కుతుబ్‌షాహి రాజ్య క్షీణదశ ప్రారంభమైంది. అబ్దుల్లా ఒకవైపు సామంతుడిగా ఉంటూనే కర్ణాటక రాజ్యంపై ఆధిపత్యం కోసం ప్రయత్నించాడు. తన సేనాని మహ్మద్ సయీద్ మీర్‌జుంలాను 1645లో కర్ణాటకపై దండయాత్రకు పంపాడు. ఫలితంగా కర్ణాటక రాజ్య తూర్పు భాగాలు అబ్దుల్లా రాజ్యంలో భాగమయ్యాయి. 1653లో విశాఖపట్టణం సుల్తాన్ వశమైంది. తీరాంధ్ర గోల్కొండ సామ్రాజ్యంలో విలీనమైంది. ఈ విజయాలతో విదేశీ వర్తకుల వ్యాపార స్థావరాలు గోల్కొండ రాజ్య పరిధిలోకి వచ్చాయి. దీంతో వారికి గోల్కొండ రాజ్యంతో సంబంధాలు ఏర్పడ్డాయి.

కర్ణాటక విజయాలతో అబ్దుల్లా సేనాని మహమ్మద్ సయీద్‌లో అత్యాశ మొదలైంది. ఇతడు తిరుగుబాటు చేసి స్వతంత్రం ప్రకటించుకున్నాడు. దక్కన్ సుబేదార్, షాజహాన్ కుమారుడైన ఔరంగజేబుకు చాడీలు చెప్పాడు. అతడి మాటలు నమ్మిన ఔరంగజేబు 1656లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతి కష్టం మీద ఔరంగజేబుతో సంధి చేసుకున్నాడు. కుతుబ్‌షా తన రెండో కుమార్తెను ఔరంగజేబు కుమారుడైన మహమ్మద్ సుల్తాన్‌కు ఇవ్వడానికి అంగీకరించాడు. మహమ్మద్‌ను తన వారసుడిగా ప్రకటించడానికి, కోటి హొన్నులు కప్పం కట్టడానికి అబ్దుల్లా ఒప్పుకున్నాడు. దీంతో గోల్కొండలో మొగల్ అధికారుల ఆధిపత్యం పెరిగింది. ఫలితంగా గోల్కొండ రాజ్యం తన ప్రాభవాన్ని కోల్పోయింది. ఈ సంక్షోభాన్ని అదనుగా భావించిన ఐరోపా కంపెనీలు కుతుబ్‌షాహీల పట్ల అవిధేయంగా ప్రవర్తించాయి. సంక్షోభానంతరం అబ్దుల్లా వారిని దారిలోకి తెచ్చుకున్నాడు.

తానీషా పాలన

1672లో అబ్దుల్లా మరణించడంతో వారసత్వ వివాదం ఏర్పడింది. అనూహ్య పరిస్థితుల్లో అబుల్ హసన్ తానీషా (1672–87) కుతుబ్‌షాహీ రాజ్య వారసుడయ్యాడు. తానీషా సుల్తాన్ పదవిని చేపట్టగానే ఔరంగజేబుకు అనేక కానుకలు పంపాడు. మొగలులకు సామంతుడిగా ఉండేందుకు అంగీకరించాడు. ఇందుకు ఔరంగజేబు ఒప్పుకున్నాడు. కానీ తానీషా శివాజీకి సహాయపడకూడదని, పేష్కను సమయానికి చెల్లించాలని షరతులు విధించాడు. మొగలులతో ఎప్పటికైనా ప్రమాదమేనని తానీషా భావించాడు. అందుకే రాజ్యాన్ని పటిష్టం చేసే పనిలో నిమగ్నమయ్యాడు. తాను అధికారంలోకి రావడానికి తోడ్పడిన ముజఫర్‌ను మీర్ జుమ్లా (ప్రధానమంత్రి)గా నియమించాడు. కానీ అతడు అన్ని వ్యవహారాల్లో తలదూర్చేవాడు. అది సహించని తానీషా ముజఫర్‌ను తొలగించాడు. హనుమకొండకు చెందిన మాదన్నను ప్రధానిగా, అక్కన్నను సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించాడు. మాదన్న రాజ్య వ్యవహారాలను చక్కదిద్దాడు. కర్ణాటక ప్రాంతంలో పాశ్చాత్య వర్తకులు సృష్టించిన అలజడులను అణచివేశాడు. తిరుగుబాటుదారులపై కఠిన చర్యలు తీసుకున్నాడు. ఉన్నత పదవుల నుంచి స్థానికేతరులను తొలగించి స్థానికులను నియమించాడు. నీటి వనరుల నిర్మాణాలు చేపట్టి వ్యవసాయాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాడు. దళారీలను తొలగించి రైతులపై జరిగే దౌర్జన్యాలను అరికట్టాడు. గనులను పునరుద్ధరించి రాజ్య సంపదను పెంచాడు.


ఔరంగజేబు దండయాత్ర

ఇదే సమయంలో ఔరంగజేబు దక్కన్ రాజ్యాలన్నింటినీ నిర్మూలించడానికి ఉద్యుక్తుడయ్యాడు. మొగలుల నుంచి రాజ్యాన్ని రక్షించుకోవడానికి తానీషా 1677లో శివాజీతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి కుదరడంలో అక్కన్న మాదన్నలు ముఖ్య పాత్ర పోషించారు. ఇది ఔరంగజేబు ఆగ్రహానికి కారణమైంది. కొంత కాలానికి శివాజీ మరణించాడు. దీంతో ఔరంగజేబు అదను చూసుకొని 1685లో గోల్కొండపై దండెత్తాడు. మొగలు సైన్యానికి ఔరంగజేబు కుమారుడైన షా ఆలం నాయకత్వం వహించాడు.

మొదట గోల్కొండకే విజయం లభించింది. కానీ సేనానుల నమ్మక ద్రోహంతో గోల్కొండ ఓడిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో తానీషా మొగలులతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారం పాత బకాయిల కింద మొగలులకు కోటి హొన్నులు చెల్లించాలి. ఏటా రెండు లక్షల హొన్నుల కప్పం చెల్లించాలి. మల్ఖేడు, సేడం ప్రాంతాలను మొగలులకు అప్పగించాలి. అక్కన్న మాదన్నలను పదవుల నుంచి తొలగించాలి. మొదటి మూడు షరతులను తానీషా అమలు చేశాడు.

కానీ అక్కన్న మాదన్నలను తొలగించడంలో ఆలస్యం చేశాడు. ఇది సహించని ముస్లిం సర్దార్లు 1686 మార్చి 24 రాత్రి అక్కన్న మాదన్నలను హత్య చేశారు. వారి తలలను ఔరంగజేబుకు కానుకగా పంపారు. అయినా ఔరంగజేబు సంతృప్తి చెందలేదు. బీజాపూర్ ఆక్రమణ అనంతరం 1687 ఫిబ్రవరి 7న మళ్లీ గోల్కొండపై దండెత్తాడు. ఎనిమిది నెలల హోరాహోరీ యుద్ధం తర్వాత ఒక సేనాని ద్రోహంతో గోల్కొండ మొగలుల వశమైంది. అబుల్ హసన్ తానీషాను బంధించి దౌలతాబాద్ కోటకు తరలించారు. దీంతో కుతుబ్‌షాహీల పాలన అంతరించింది. గోల్కొండ రాజ్యం మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది.

అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?



టెట్/డీఎస్సీ

చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగాజీ

వైయక్తిక భేదాలు

1. వీటిలో శాబ్దికేతర సామూహిక పరీక్ష?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) ఆర్మీ బీటా 4) భాటియా నిష్పాదన
2. వీటిలో శాబ్దిక పరీక్ష కానిది?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) రావన్స్ ప్రోగ్రెసివ్ టెస్ట్
   4) ఒటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష
3. సెప్టెంబరు 5, 1971 ఏ వారం? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే రాజు అనే విద్యార్థి క్యాలెండర్ సహాయంతో ఆదివారం అని సమాధానం ఇచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం రాజు ఉపయోగించిన ఉత్పత్తి?
   1) యూనిట్లు 2) వర్గాలు
   3) అంతర్భావాలు 4) సంబంధాలు
4. ఈ-మెయిల్, టెలిగ్రాం, పోస్ట్ కార్డు, బుక్‌లో వేరుగా ఉన్నదేది? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. బుక్ తప్ప మిగిలినవి ప్రసార సాధనాలని రాము సమాధానమిచ్చాడు. రాములో గమనించే ఉత్పత్తి గిల్‌ఫర్డ్ ప్రకారం?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
5. అవగాహన అనే లక్ష్యంతో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
6. వినియోగమనే లక్ష్యంలో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
7. ప్రజ్ఞా విభాజన పట్టికకు సంబంధించి సరి కాని ప్రవచనం?
   1) సగటు కంటే తక్కువ 81–90 ప్రజ్ఞా లబ్ధి
   2) అల్పబుద్ధులు 51–70 ప్రజ్ఞాలబ్ధి
   3) ఉన్నత ప్రజ్ఞావంతులు121–140ప్రజ్ఞాలబ్ధి
   4) మంద బుద్ధులు 25–50 ప్రజ్ఞాలబ్ధి
8. ప్రజ్ఞా విభజన పట్టికలో ఆరోహణ క్రమంలోని సరైన జతను గుర్తించండి?
   1) మందబుద్ధులు, అల్పబుద్ధులు, మూఢులు, బుద్ధిహీనులు
   2) మందబుద్ధులు, మూఢులు, అల్పబుద్ధులు, బుద్ధిహీనులు
   3) మూఢులు, బుద్ధిహీనులు, అల్ప బుద్ధులు, మందబుద్ధులు
   4) బుద్ధిహీనులు, మందబుద్ధులు, అల్ప బుద్ధులు, మూఢులు
9. Rose పదం చూసినప్పుడు ప్రయోజ్యుడు XOP అనే అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?
   1) స్మృతి- విస్మృతి 2) ద్వంద్వ సంసర్గలు
   3) గుర్తింపు 4) ఏదీకాదు
10. 'మానవులందరూ మర్త్యులే. సోక్రటీస్ మానవుడు కాబట్టి మర్త్యుడే' అని ఆలోచించడం ఏ రకమైన ఆలోచన?
    1) విభిన్న 2) హేతుబద్ధ
    3) ఊహాలోచన 4) సమైక్య
11. రిమోట్ అసోసియేషన్ టెస్ట్ ఏ ప్రవర్తనాంశాన్ని మాపనం చేస్తుంది?
    1) సృజనాత్మకత 2) ప్రజ్ఞ
    3) సహజ సామర్థ్యాలు 4) స్మృతి
12. వీటిలో సరికాని జత?
    1) అమూర్తంగా ఆలోచించడమే ప్రజ్ఞ–టెర్మన్
    2) గ్రహణ శక్తిని ప్రజ్ఞ అంటారు– గాల్టన్
    3) భౌతిక సామాజిక పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తించడమే ప్రజ్ఞ– పియాజే
    4) అభ్యసించగల సామర్థ్యమే ప్రజ్ఞ–స్పెన్సర్
13. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించేది?
    1) రాజు శారీరకంగా బలవంతుడు, ఉద్వేగంగా అస్థిరుడు
    2) రాజు స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత గలవాడు
    3) రాజు చదవడం, రాయడం రెండూ ఇష్టపడతాడు
    4) రాజు గణితం కంటే సాంఘిక శాస్త్రాన్ని ఇష్టపడతాడు
14. వీటిలో సరికాని జత?
    1) డాల్టన్ ప్రణాళిక- మోరిసన్
    2) విన్నెట్కా ప్రణాళిక- వాష్ బర్న్
    3) గారీ ప్రణాళిక–విలియం బర్ట్
    4) నాన్ గ్రేడెడ్ పద్ధతి- గుడ్ లాడ్
15. ప్రజ్ఞ, సృజనాత్మకతలకు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) ప్రజ్ఞ ఉన్న వ్యక్తులందరూ సృజనా త్మకంగా ఉండాలని లేదు
    2) సృజనాత్మకత ఉన్న వారందరికీ ఎంతో కొంత ప్రజ్ఞ ఉంటుంది
    3) సృజనాత్మకంగా ఉండాలంటే ప్రజ్ఞ అవసరం లేదు
    4) విభిన్న ఆలోచన ఉన్నవారికి సృజనాత్మకత ఎక్కువ
16. ఉపాధ్యాయుడు 4×5×6 అనే ప్రశ్నను ఇచ్చినపుడు విద్యార్థి ఉపయోగించే విషయం?
    1) చిత్రాలు 2) చిహ్నాలు
    3) వర్గాలు 4) సంబంధాలు
17. పావురం, గరుడపక్షి, నెమలి, కంగారుల్లో సరికానిది గుర్తించమని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. కంగారు జంతువు, మిగిలినవి పక్షులని విద్యార్థి సమాధానమిచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం విద్యార్థి ఉపయోగించిన ఆలోచన ఫలితం?
    1) పద్ధతులు 2) వర్గాలు
    3) సంబంధాలు 4) యూనిట్లు
18. విద్యార్థి శారీరక వయసు పదేళ్లు. ఐతే 16 ఏళ్ల వారికి ఉద్దేశించిన పరీక్షను సాధించాడు. ప్రజ్ఞా లబ్ధి ఆధారంగా అ విద్యార్థి ఏ వర్గీకరణకు చెందుతాడు?
    1) ఉన్నత 2) అత్యున్నత
    3) సగటుకంటే ఎక్కువ 4) ప్రతిభ కలవారు
19. రెండు ప్రపంచయుద్ధాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపాయి. మూడో ప్రపంచయుద్ధం జరిగితే అనర్థాలేమిటి? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. గిల్‌ఫర్డ్ ప్రకారం ఆ విద్యార్థి ఉపయోగించిన ఉత్పన్నాలు?
    1) వర్గాలు 2) సంబంధాలు
    3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
20. వీనిలో సాధారణ కారకం(జి)కు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) అభ్యసనం, సాధారణ ప్రజ్ఞను ప్రభావితం చేస్తుంది
    2) వంశపారంపర్యత సాధారణ ప్రజ్ఞను నిర్ధారిస్తుంది
    3) గణితం, సైన్సులో ప్రతిభ సాధారణ కారకంపై ఆధారపడి ఉంటుంది.
    4) సాధారణ కారకం (జి) ప్రజ్ఞను నిర్ధారించే ప్రధాన అంశం
21. ద్వికారక సిద్ధాంతం ప్రకారం తీవ్ర భాషాపరమైన అభిరుచులు ఏ కారకంపై ఆధారపడి ఉంటాయి?
    1) జి 2) పి 3) ఎస్ 4) జి1
22. వీటిలో వ్యక్తంతర్గత భేదాన్ని సూచించేది?
    1) రాణి తన వయసు వారితోపాటు మార్కులు సాధిస్తుంది
    2) రాణి తెలుగులో చూపిన అభిరుచి గణితంలో చూపదు
    3) రాణి క్రీడల్లో ఇతరుల కంటే ప్రతిభ చూపుతుంది
    4) రాణి క్రీడలు, చదువుకు సమాన ప్రాధాన్యమిస్తుంది
23. వీటిలో సరికాని ప్రవచనం?
    1) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగు పర్చుకోలేం
    2) జ్ఞానం ప్రజ్ఞ అనే గమ్యాన్ని చేరడానికి సహకరిస్తుంది
    3) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగు పర్చుకోవచ్చు
    4) ప్రజ్ఞ వల్ల జ్ఞాన సముపార్జన జరుగుతుంది
24. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించనిది?
    1) రాజులో తన వయసువారి కంటే మానసిక పరిపక్వత ఎక్కువ
    2) రాజు చదవడం ఇష్టపడినంత రాయడం ఇష్టపడడు
    3) రాజు తన స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత కలవాడు
    4) రాజు క్రికెట్ ఏ స్థాయిలో ఆడతాడో హాకీ కూడా అదేస్థాయిలో మిగతావారి కంటే బాగా ఆడగలడు

సమాధానాలు

1) 4	2) 3	3) 4	4) 1	5) 4
6) 3	7) 4	8) 3	9) 2	10) 2
11) 1	12) 4	13) 2	14) 1	15) 3
16) 2	17) 2	18) 2	19) 3	20) 1
21) 3	22) 2	23) 3	24) 2	

మనోవిజ్ఞాన శాస్త్రం- స్వభావం, పద్ధతులు

1. విద్యపై సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావాన్ని కనుక్కోవడానికి చేసే పరిశోధనలో స్వతంత్ర చరం?
   1) వయసు 2) ప్రజ్ఞ
   3) సాంఘిక ఆర్థిక స్థితి 4) విద్య
2. వీటిలో ప్రవర్తన లక్షణాన్ని వర్ణించడంలో సరైన ప్రవచనం?
   1) స్తబ్దమైంది 2) స్థిరమైంది
   3) గతి శీలమైంది 4) అచేతనమైంది
3. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థుల ను మూడు సమూహాలుగా విభజించాడు. వీటిలో మొదటి సమూహానికి హోంవర్క్ చేస్తే బహుమతి ఇస్తానని తెలిపాడు. రెండో సమూహానికి హోంవర్క్ ఇచ్చాడు. కానీ దండన/ బహుమతి ప్రకటించలేదు. మూడో సమూహానికి ఇంటి పని చేయక పోతే దండిస్తానని చెప్పాడు. ఇందులో నియంత్రిత సమూహం?
   1) ఒకటోది 2) రెండోది
   3) మూడోది 4) ఒకటి, మూడు సమూహాలు
4. నవజాత శిశువును అధ్యయనం చేయడానికి ఉపయోగపడని పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
5. 'నిన్నటికంటే ఈ రోజు పాఠం బాగా అర్థమైందని'టీచర్‌తో విద్యార్థి చెప్పినప్పుడు ఆ విద్యార్థి ఉపయోగించిన పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
6. వ్యక్తి అధ్యయనంలో అన్ని విషయాలను సక్రమంగా విశ్లేషణ చేయడానికి ఉపయో గించాల్సిన పరిశీలన పద్ధతి?
   1) సంచరిత 2) అసంచరిత
   3) నియంత్రిత 4) అంతఃపరిశీలన
7. విద్యామనోవిజ్ఞాన శాస్త్రం ఆధునిక విద్యకందించిన విషయం?
   1) ఆశయాలు ఎందుకు నిర్ణయించుకోవాలి
   2) ఏ ఆశయాలు నిర్ణయించుకోవాలి
   3) ఎలా లక్ష్యాలు సాధించాలి
   4) ఏ పాఠ్యాంశాలు బోధించాలి
8. 'పని చేయని, పని చేసే తల్లులు–వారి పిల్లల సాధన' అనే అంశాల గురించి ప్రయోగ పూర్వకంగా ఫలితాలు తెలుసుకో వాలనుకున్న పరిశీలకుడు పరీక్షించాల్సిన స్వతంత్ర చరం?
   1) పని చేయని తల్లులు
   2) పనిచేసే తల్లులు 3) 1, 2
   4) పనిచేసే తల్లుల పిల్లల విద్యాసాధన
9. కేస్‌స్టడీలో ప్రధానంగా ఉపయోగించే పద్ధతి?
   1) ప్రయోగ 2) అసంచరిత పరిశీలన
   3) సమాంతర అధ్యయన(Cross Sectional)
   4) కాలక్రమ (Longitudinal)
10. ప్రయోగ పద్ధతిలో వేర్వేరు వయసున్న శిశువులను ప్రయోజ్యులుగా ఎంపిక చేసుకొని అధ్యయనం చేసే పద్ధతి?
    1) సంచరిత పరిశీలన
    2) అసంచరిత పరిశీలన
    3) సమాంతర అధ్యయన (Cross Sectional)
    4) కాలక్రమ (Longitudinal)
11. ప్రజ్ఞ ప్రభావం సృజనాత్మకతపై ఉండదని పేర్కొన్న పరిశోధకుడు నియంత్రించిన మధ్యస్థ చరం?
    1) ప్రజ్ఞ 2) సృజనాత్మకత
    3) ప్రేరణ 4) ప్రజ్ఞ, సృజనాత్మకత
12. సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావం విద్యార్థుల సాధనపై ఉంటుందనే పరిశోధనలో ప్రయోగ ఫలితం?
    1) విద్యార్థుల సాంఘిక ఆర్థిక స్థితి
    2) విద్యార్థుల వైఖరి 3) విద్యార్థుల సాధన
    4) విద్యార్థుల అభిరుచి
13. బోధనానుభవం ప్రభావం బోధనా సామర్థ్యంపై ఉందో లేదో తెలుసుకోవాల నుకునే ప్రయోగంలో బోధనాభిరుచి ఏ చరం?
    1) స్వతంత్ర 2) పరతంత్ర
    3) మధ్యస్థ 4) అస్థిర
14. 'నేను ఆందోళనలో ఉన్నానని' పేర్కొన్న వ్యక్తి ఉపయోగించిన పద్ధతి?
    1) పరిశీలన 2) అంతఃపరీక్షణ
    3) ప్రయోగ 4) వ్యక్తి అధ్యయన
15. ఉపాధ్యాయుడు ఆట స్థలంలో విద్యార్థుల ప్రవర్తనను వీడియో సహాయంతో గమనించడం ఏ పరిశీలన?
    1) నియంత్రిత 2) సంచరిత
    3) ప్రయోగ 4) అసంచరిత
16. శైశవ దశలోని లక్షణాలను తెలుసుకోవడానికి తగని పద్ధతి?
    1) ప్రయోగ 2) వ్యక్తి అధ్యయన
    3) అంతఃపరీక్షణ 4) పరిశీలన
17. వ్యక్తి అధ్యయన పద్ధతిలో సమస్యాత్మక విద్యార్థి కానిది?
    1) ప్రతిభావంతుడు
    2) అభ్యసన వైకల్యత ఉన్నవాడు
    3) సగటు ప్రజ్ఞ ఉన్న విద్యార్థి
    4) చదువులో వెనకబడిన విద్యార్థి
18. గ్రామీణ/పట్టణ ప్రాంతాల ప్రభావం విద్యార్థి వ్యక్తీకరణ నైపుణ్యాలపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగ పరిశోధనలో మధ్యస్థ చరం కానిది?
    1) వ్యక్తీకరణ నైపుణ్యాలు 2) అభిరుచి
    3) కుటుంబం 4) విద్యార్హతలు
19. విల్ హెల్మ్ ఊంట్‌కు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) సంరచనాత్మక వాదానికి మూలపురుషుడు
    2) సంసర్గవాదానికి మూలపురుషుడు
    3) మనోవిజ్ఞానశాస్త్ర పితామహుడు
    4) ప్రయోగాత్మక మనో విజ్ఞానశాస్త్ర పితామహుడు
20. హెర్బర్ట్ సోపానాల్లో సరైన వరుస క్రమం?
    1) సన్నాహం, సంసర్గం, ప్రదర్శన, అన్వయం,సాధారణీకరణం, సింహా వలోకనం
    2) సన్నాహం, ప్రదర్శన, అన్వయం, సంసర్గం,సాధారణీకరణం, సింహావ లోకనం
    3) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, సింహావలోకనం, అన్వయం
    4) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, అన్వయం, సింహా వలోకనం.
21. జీన్ పియాజె తన ముగ్గురి పిల్లల సంజ్ఞానాత్మక వికాసాన్ని అనేక ఏళ్ల పాటు పరిశీలించాడు. ఇది ఏ రకమైన పరిశోధనా పద్ధతి?
    1) అంతఃపరిశీలన
    2) సమాంతర (Cross sectional)
    3) కాలక్రమ (Longitudinal)
    4) వ్యక్తి అధ్యయన పద్ధతి
22. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థు లను రెండు సమూహాలుగా విభజించి, ఒక సమూహానికి స్వతంత్ర చరం ప్రవేశ పెట్టాడు. రెండో సమూహానికి స్వతంత్ర చరం ప్రవేశపెట్టలేదు. ప్రయోగం అనంతరం ఫలితాలు విశ్లేషించాడు. ఇది ఏ రకమైన సమూహ నమూనా?
    1) ఏక 2) నియంత్రిత
    3) పరిభ్రమణ 4) ద్వి
23. ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధిస్తూ విద్యార్థుల ఇంగితాలను గమనించడం ఏ పరిశీలన?
    1) అసంచరిత 2) ప్రయోగ
    3) సంచరిత 4) స్వయం
24. ప్రస్తుత నార్కోఅనాలిసిస్ పద్ధతికి మూలమైన వాదం?
    1) గెస్టాల్ట్ 2) మనో విశ్లేషణ
    3) ప్రవర్తన 4) సంరచనాత్మక
25. ఆదాయ ప్రభావం ఉద్యోగ సంతృప్తిపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగంలో మధ్యస్థచరం కానిది?
    1) ఉద్యోగి వైఖరి 2) ఉద్యోగి సంతృప్తి
    3) ఉద్యోగి అభిరుచి 4) ఉద్యోగి ప్రేరణ

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 2	5) 2
6) 1	7) 3	8) 3	9) 4	10) 3
11) 3	12) 3	13) 3	14) 2	15) 4
16) 3	17) 3	18) 1	19) 2	20) 4
21) 3	22) 2	23) 3	24) 3	25) 2

కాలానికి ప్రామాణిక ప్రమాణం ఏది?

భౌతిక శాస్త్రంలో ముందుగా భౌతిక రాశులు, బలం, ఉష్ణం, కాంతి, ధ్వని, అయస్కాంతత్వం, విద్యుత్ మొదలైన పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి. వీటి కోసం 10వ తరగతి వరకు ఉన్న భౌతిక శాస్త్ర పాఠ్యపుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. వీటితో పాటు శుద్ధగతిక శాస్త్రం, విశ్వ గురుత్వాకర్షణ, ప్రవాహిలు, తలతన్యత, ద్రవ్యరాశి కేంద్రం, ఆధునిక భౌతిక శాస్త్రం లాంటి అంశాలపై కూడా ఇటీవల ప్రశ్నలు అడుగుతున్నారు. వీటి కోసం 6 నుంచి 10వ తరగతి పాఠ్యపుస్తకాలతోపాటు ఇంటర్మీడియట్ స్థాయి పుస్తకాలను కూడా చదవాలి. అభ్యర్థికి 10వ తరగతి వరకు ఉన్న అన్ని అంశాలపై సాధారణ అవగాహన ఉండాలనేది జనరల్ స్టడీస్ ముఖ్య ఉద్దేశం. పరీక్షల దృష్ట్యా జనరల్ సైన్స్‌లో భౌతిక శాస్త్రానికి వెయిటేజీ ఉంది.



శిక్షణా సంస్థల్లో కొంతమంది అధ్యాపకులు తరచుగా కొన్ని టాపిక్స్‌ను మాత్రమే బోధించి, వాటి నుంచే ప్రశ్నలు వస్తాయని చెబుతారు. కానీ పోటీ పరీక్షలకు సంబంధించి నిర్దిష్టంగా ఒక టాపిక్ నుంచి ప్రశ్నలు వస్తాయని చెప్పలేం. వర్తమాన అంశాల ప్రాధాన్యాల ఆధారంగా ఏ పాఠ్యభాగం నుంచైనా ప్రశ్నలు ఇవ్వవచ్చు. అందువల్ల అభ్యర్థులు గత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్నల సరళిపై అవగాహన పెంచుకొని వాటికి అనుగుణంగా సన్నద్ధమవ్వాలి.

భౌతిక శాస్త్రంలో సాధారణంగా స్టాండర్డ్ జీకే, ప్యూర్ సైన్స్, అప్లయిడ్ సైన్స్ లేదా జనరల్ సైన్స్ అనే మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. శాస్త్రవేత్తలు, పరికరాల పేర్లు, ఆవిష్కరణలు- సంవత్సరాలు మొదలైనవి స్టాండర్డ్ జీకేకు సంబంధించిన అంశాలు. కొన్ని ఉదాహరణలు..

1. టెలిస్కోప్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
2. అచ్చుయంత్రాన్ని కనుగొన్నదెవరు?
3. విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదించిందెవరు?
4. ఐన్‌స్టీన్‌కు ఏ సిద్ధాంతానికి నోబెల్ బహుమతి లభించింది?
5. ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి ఏ సంవత్సరంలో లభించింది?
6. 'యురేకా' అని అరిచిందెవరు?

సమాధానాలు

1) గెలీలియో
2) జాన్ గూటెన్ బర్గ్
3) న్యూటన్
4) ఐన్‌స్టీన్ 'ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్' కనుగొన్నందుకు నోబెల్ బహుమతి లభించింది. వాస్తవానికి ఈయన సాపేక్ష సిద్ధాంతానికి నోబెల్ వస్తుందని భావించారు.
5) 1921
6) ఆర్కిమెడిస్. గ్రీకు భాషలో 'యురేకా' అంటే 'కనుగొన్నాను' లేదా 'తెలుసుకున్నాను'అని అర్థం. నూతన విషయాన్ని కనుగొన్న సందర్భంలో ఆర్కిమెడిస్ 'యురేకా' అని గట్టిగా అరుస్తూ వీధుల వెంట తిరిగారు.

ప్యూర్ సైన్స్‌లో భాగంగా ఒక్కోసారి ఫిజిక్స్‌లో సమస్య (ప్రాబ్లం)లపై కూడా ప్రశ్నలు అడగవచ్చు. సులభమైన అంశాలు, దాదాపుగా నేరుగా సమాధానం గుర్తించేవిధంగా ఈ ప్రశ్నలు ఉంటాయి. గతంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో సమస్యలపై అడిగిన కొన్ని ప్రశ్నలను గమనించండి.

1. ఒక వస్తువు వేగాన్ని రెట్టింపు చేస్తే దాని గతిశక్తి ఎన్నిరెట్లు అవుతుంది?
2. ఒక రేడియోధార్మిక మూలకం అర్ధజీవిత కాలం 4 సంవత్సరాలు. అయితే అది 3/4వ వంతు విఘటనం చెందడానికి పట్టే కాలం ఎంత?
3. ఒక గ్రహం, దాని నక్షత్రానికి మధ్య ఉన్న దూరం రెట్టింపు అయితే దాని ఆవర్తన కాలం ఎన్ని రెట్లు అవుతుంది?

సమాధానాలు

1) 4 రెట్లు 2) 8 సంవత్సరాలు
3) $2\sqrt{2}$ రెట్లు

మూడో విభాగమైన అప్లయిడ్ సైన్స్ నుంచి అత్యధిక ప్రశ్నలు వస్తాయి. ఫిజిక్స్‌లో సుమారు తొంభై శాతం ప్రశ్నలు ఈ విభాగం నుంచే ఉంటాయి. దీంట్లో భాగంగా మౌలికాంశాలతో పాటు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

వివిధ ధర్మాలు, నియమాలు,సూత్రాలు, సిద్ధాంతాలు, వాటి అనువర్తనాలపై ప్రశ్నలు అడుగుతారు.

ఉదా: కాంతి ధర్మాలు, అయస్కాంతాల సాధారణ ధర్మాలు, ధ్వని ధర్మాలు.

నియమాలకు సంబంధించి న్యూటన్ గమన నియమాలు, కెప్లర్ గ్రహగమన నియమాలు, న్యూటన్ విశ్వ గురుత్వాకర్షణ నియమం, ఆర్కిమెడిస్ సూత్రం, ప్లవన సూత్రం, బెర్నౌలీ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం, పాస్కల్ సూత్రం మొదలైనవాటిని క్షుణ్నంగా చదవాలి. వీటి ఆధారంగా నిజ జీవితంలో జరిగే సంఘటనల్ని విశ్లేషించుకోవాలి. అభ్యర్థి సబ్జెక్ట్‌కు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించడంతో పాటు జనరల్ సైన్స్‌లో ప్రశ్నలను అడగడంలో ఉన్న మరో ముఖ్య ఉద్దేశం విశ్లేషణా సామర్థ్యాన్ని పరీక్షించడం. విషయాన్ని బట్టీపట్టడం కంటే అర్థం చేసుకుంటూ చదివినప్పుడే ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా సమాధానాలను గుర్తించవచ్చు. ఎక్కువగా ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలను చదవడం వల్ల నిర్మాణాత్మక పరిజ్ఞానం, సామర్థ్యం, తార్కిక విశ్లేషణ సాధ్యం కాదు. అందువల్ల ప్రధాన కాన్సెప్టులను క్షుణ్నంగా అధ్యయనం చేయడం ప్రయోజనకరం. పాఠ్యాంశాలపై పట్టు సాధించిన తర్వాత సాధ్యమైనంత ఎక్కువగా ప్రశ్నలను సాధన చేయాలి. అభ్యర్థులు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని చదివితే మంచి మార్కులు సంపాదించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఒక వస్తువు భారం దేంట్లో గరిష్ఠంగా ఉంటుంది?
   1) శూన్య ప్రదేశం 2) హైడ్రోజన్
   3) గాలి 4) నీరు
2. నీటిలో తేలియాడుతున్న వస్తువు దృశ్య భారం ఎంత?
   1) శూన్యం
   2) వస్తువు నిజ భారంలో సగం
   3) వస్తువు నిజ భారానికి సమానం
   4) వస్తువు నిజ భారానికి రెట్టింపు
3. ఒక ప్రవాహిలో మునిగి ఉన్న వస్తువు ఘ.ప. 200 ఘనపు సెంటీమీటర్లు. అయితే అది ఎంత ఘనపరిమాణం ఉన్న నీటిని స్థానభ్రంశం చెందిస్తుంది?
   1) 0 2) 50 ఘ.సెం.మీ.
   3) 200 ఘ.సెం.మీ.
   4) 400 ఘ.సెం.మీ
4. ఒక ప్రవాహిలో వేలాడుతున్న వస్తువు దృశ్య భారం ఎంత?
   1) దాని నిజ భారానికి రెట్టింపు
   2) నిజ భారానికి సమానం
   3) నిజ భారంలో సగం 4) శూన్యం
5. ఆకుపచ్చని కాంతిలో పసుపు పచ్చని పుష్పం ఏ వర్ణంలో కనిపిస్తుంది?
   1) తెలుపు 2) నలుపు
   3) ఆకుపచ్చ 4) పసుపు పచ్చ
6. కిందివాటిలో ప్రాథమిక వర్ణం కానిది?
   1) ఎరుపు 2) ఆకుపచ్చ
   3) పసుపుపచ్చ 4) నీలం
7. అణు రియాక్టర్లలో మితకారిణి విధి ఏమిటి?
   1) చర్యా వేగాన్ని మార్చడం
   2) న్యూట్రాన్ల వేగాన్ని పెంచడం
   3) న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడం
   4) ఉష్ణోగ్రతను తగ్గించడం
8. భారజలం రసాయనిక నామం?
   1) డై హైడ్రోజన్ ఆక్సైడ్
   2) హైడ్రోజన్ డయాక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) హైడ్రోజన్ పెరాక్సైడ్
9. ఒకే సైజు, ఒకే ఆకృతిలో ఉన్న A, B అనే రెండు లోహపు డబ్బాలను ఒకే పదార్థంతో తయారు చేశారు. వాటిని 4°C ఉష్ణోగ్రత వద్దనున్న నీటితో పూర్తిగా నింపి ఒకదాన్ని వేడిచేసి, మరో దాన్ని చల్లారిస్తే ఆ రెండింటిలో నీటి ఘనపరిమాణం ఏమవుతుంది?
   1) Aలో పెరిగి Bలో తగ్గుతుంది
   2) Aలో తగ్గి Bలో పెరుగుతుంది
   3) రెండింటిలో పెరుగుతుంది
   4) రెండింటిలో తగ్గుతుంది
10. పీడనం పెరగడం వల్ల నీటి భాష్పీభవన స్థానం?
    1) పెరుగుతుంది
    2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
11. కిందివాటిలో దయా అయస్కాంత పదార్థం కానిది?
    1) బంగారం 2) వజ్రం
    3) కోబాల్ట్ 4) ఆల్కహాల్
12. మాక్ నంబర్ దేనికి సంబంధించింది?
    1) ఉష్ణోగ్రత 2) వేగం
    3) పీడనం 4) భారం
13. ఒక ట్యూబ్ లైట్ 40 వాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. దాన్ని ఎన్ని గంటలపాటు వెలిగిస్తే 1 యూనిట్ కరెంట్ వినియోగం అవుతుంది?
    1) 40 2) 25
    3) 24 4) 10
14. ఉష్ణోగ్రతతో నీటి స్పర్శ కోణం?
    1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) స్పర్శ కోణం ఉష్ణోగ్రతపై ఆధారపడదు
15. భూస్థావర ఉపగ్రహాలు భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తు వద్ద తిరుగుతాయి?
    1) 1000 కి.మీ. 2) 3200 కి.మీ.
    3) 3600 కి.మీ. 4) 36,000 కి.మీ.
16. భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లేకొద్ది పీడనం?
    1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
17. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందెవరు?
    1) టాలమీ 2) కోపర్నికస్
    3) గెలీలియో 4) న్యూటన్
18. భూమిపై ప్రదేశం లేదా విశ్వంలోని ఏదైనా స్థానం ఆధారంగా ఒక వస్తువు ద్రవ్యరాశి, భారానికి సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ద్రవ్యరాశి, భారం రెండూ స్థిరంగా ఉంటాయి
    2) ద్రవ్యరాశి, భారం రెండూ మారతాయి
    3) ద్రవ్యరాశి స్థిరంగా ఉంటుంది కానీ భారం మారుతుంది
    4) భారం స్థిరంగా ఉంటుంది కానీ ద్రవ్యరాశి మారుతుంది
19. 1 కేజీ, 10 కేజీల ద్రవ్యరాశి ఉన్న రెండు వస్తువులను సమాన వేగాలతో నిటారుగా పైకి విసిరితే, ఆ రెండింటిలో ఏది గరిష్ఠ ఎత్తుకు చేరుతుంది?
    1) 1 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    2) 10 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    3) రెండూ సమాన గరిష్ఠ ఎత్తునకు చేరుకుంటాయి
    4) వాటి గరిష్ఠ ఎత్తు అనేది పైకి విసిరిన సాధారణ వేగంపై ఆధారపడి ఉంటుంది
20. కాలానికి ప్రామాణిక ప్రమాణం ఏది?
    1) సెకన్ 2) నిమిషం
    3) గంట 4) రోజు

సమాధానాలు

1) 1;	2) 1;	3) 3;	4) 4;
5) 2;	6) 3;	7) 3;	8) 3;
9) 3;	10) 1;	11) 3;	12) 2;
13) 2;	14) 2;	15) 4;	16) 1;
17) 2;	18) 3;	19) 3;	20) 1

What is the average selling price of..

BANK EXAMS
QUANTITATIVE APTITUDE


Model Questions

Directions (Q. No. 1-5) : Study the pie chart carefully and answer the given questions.


The Pie chart shows the percentage breakup of the people is living in a six floors building and the other pie chart shows the percentage breakup of the male members are living in that building.

Note: All the data is given for 2017.

Total number of people = X



Total number of male = 300



1. If the total number of females live on 3^{rd} floor is $^1/_{3}{}^{rd}$ of the total number of males live on 3^{rd} floor then find the total number of people lives on 3^{rd} floor and 4^{th} floor together?
   a) 166 b) 176
   c) 156 d) 148
   e) 184
2. If the total number of females live on 5^{th} and 6^{th} floor together is 32 then find the difference between the total number of people lives on 1^{st} and 2^{nd} floor together to that of the total number of people lives on 5^{th} and 6^{th} floor together?
   a) 100 b) 72 c) 80
   d) 84 e) 96
3. If the total number of females live on 3^{rd} floor is 50% of the total number of males lives on 2^{nd} floor then the total number of people live on 1^{st} floor is what percentage of the total number of people live on 2^{nd} floor?
   a) 72% b) 85%
   c) 90% d) 55%
   e) 80%
4. The total number of people live on 5^{th} floor in 2017 is 80. In 2018, the total number of people live on all floors together is increased by 20% from that previous year then find the difference between the total number of people lives on 1^{st} and 3^{rd} floor together to the total number of people lives on 4^{th} and 6^{th} floor together in 2018. (The percentage breakup in 2018 will remain the same)
   a) 144 b) 156
   c) 162 d) 140
   e) 136



5. The total number of males live on 1^{st} floor, 2^{nd} floor and 3^{rd} floor together is approximately what percentage more/less than of the total number of males live on 4^{th} floor, 5^{th} floor and 6^{th} floor together.
   a) 167% b) 97%
   c) 67% d) 34%
   e) 125%

Directions (Q. 6-10): Study the following information carefully and answer the given questions.

Among 400 cricket players, 45% played in IPL-1 and 6.25% played only in IPL-1. Again, 57.5% players played in IPL-2 and 11.25% players played only in IPL-2. Again, 72.5% players played in IPL-3 and 27.5% players played only in IPL-3. Twenty per cent players played in all three IPL tournaments.

6. How many players are there who played in IPL 1 and IPL2 but not in IPL 3?
   a) 30 b) 35 c) 40
   d) 65 e) 45
7. What is the percentage of players who played in IPL 2 and IPL 3 but not in IPL 1?
   a) 12.5% b) 16.25%
   c) 22.75% d) 24%
   e) None of these
8. What is the percentage of the players who played in at least two IPL tournaments?
   a) 30% b) 35%
   c) 45% d) 50%
   e) 55%
9. The number of players who played only in either IPL 1 or IPL 2 is what percentage of the players who played in all three IPL?
   a) 72% b) 75%
   c) 82.5% d) 85%
   e) None of these
10. The number of players who played in at most one IPL tournament is what percentage more/less than the number of players who played in at least one IPL?
    a) 55% more b) 55% less
    c) 40% more d) 40% less
    e) None of these

Direction (Q. No. 11-15): Refer the following line graph and answer the questions based on it.

The line graph shows the percentages of markup on CP and discount offered on MP of six different articles sold by a shopkeeper.



11. Selling price of article C is Rs.528 and the marked prices of articles C and E are the same. What is the average selling price of both the articles in Rupees?
    a) 534.5 b) 544.5 c) 554.5
    d) 524.5 e) None of these
12. Cost Price of article A is Rs.450 and that of article D is Rs.600. What is the ratio of marked price of both the articles?
    a) 5 : 6 b) 3 : 4 c) 3 : 5
    d) 4 : 5 e) None of these
13. If the cost price of article E is double to that of article A, the marked price of article E is how much percent more than that of article A?
    a) 50% b) 40% c) 60%
    d) 30% e) None of these
14. For which article, the profit percent is the minimum?
    a) D and E b) D c) E
    d) E and F e) None of these
15. If the cost price of each of the article B and F is Rs.800, then what is the total profit earned by shopkeeper on both the articles?
    a) Rs.152 b) Rs.248
    c) Rs.184 d) Rs.216
    e) Cannot be determined

KEY & SOLUTIONS

1.

Floor	Total number of males
1^{st} floor	15
2^{nd} floor	24
3^{rd} floor	36
4^{th} floor	105
5^{th} floor	66
6^{th} floor	54

The total number of males on 3^{rd} floor = 36

The total number of females on 3^{rd} floor 36/3 = 12

The total number of people on 3^{rd} floor = 36 + 12 = 48

So, we know that


12% = 48

The total number of people on 3^{rd} floor and 4^{th} floor

= 12% + 32% = 44%

The total number of people on 3^{rd} floor and 4^{th} floor

= (48/12)× 44 = 44× 4 = 176 ***Ans: b***

2. The total number of males live on 5^{th} and 6^{th} floor together
   = 66 + 54 = 120
   The total number of females live on 5^{th} and 6^{th} floor together = 32
   The total number of people live on 5^{th} and 6^{th} floor together
   = 120 + 32 = 152
   So, (20% + 18%) = 152
   38% = 152
   The percentage of people live on 1^{st} and 2^{nd} floor together
   = 8% + 10% = 18%
   So, required difference
   = 38 − 18 = 20%
   Then, (152/38)×20 = 80 ***Ans: c***
3. The percentage of the total number of people live on 1^{st} floor = 8%
   The percentage of the total number of people live on 2^{nd} floor = 10%
   So, required percentage =
   = (8/10)×100 = 80% ***Ans: e***
4. The total number of people live on 5^{th} floor in 2017 = 80
   So, 20% = 80
   100% = (80/20) ×100 = 400
   So the total number of people lives on all floors in 2017 = 400
   So the total number of people lives on all floors in 2018
   = (400/100)×120 = 480
   So, required difference
   = (32% + 18%) − (8% + 12%)
   = 30%
   Then, (30/100)×480 = 144 ***Ans: a***
5. The total percentage of people live on 1^{st}, 2^{nd} floor and 3^{rd} floor together
   = 5 + 8 + 12 = 25%
   The total percentage of people live on 4^{th}, 5^{th} floor and 6^{th} floor together
   = 35 + 22 + 18 = 75%
   So, required percentage
   = [(75-25)/75]×100
   = (50/75)×100 = 67%(Approx) ***Ans: c***
6. 

   x + y + 80 + 25 = 180
   or x + y = 75 ______(i)
   y + z + 80 + 110 = 290
   or, y + z = 100 ______(ii)
   x + z + 80 + 45 = 230
   or x + z = 105 ______(iii)
   From eqn (i), (ii) and (iii),
   x = 40, y = 35, z = 65 ***Ans: c***
7. Required percentage
   = (65/400)×100 = 16.25 ***Ans: b***
8. At least two IPL = 40 + 35 + 65 + 80
   = 220
   Required%
   = (220/400)×100 = 55% ***Ans: e***
9. Only IPL-1 = 25, only IPL-2 = 45
   ∴ Total = 70
   Required%
   = (70/80)×100 = 87.5% ***Ans: e***
10. At least one IPL = 400
    At most one IPL = 25 + 45 +110 = 180
    ∴ Required%
    = [(400-180)/400]×100 = 55% ***Ans: b***
11. Marked price of article C
    = [100/(100-20)]×528 = Rs.660
    Then, marked price of article E
    = Rs. 660
    Selling price of article E
    = 660×(100-15)/100 = Rs.561
    Required average
    = (528+561)/2 = Rs.544.5 ***Ans: b***
12. Required ratio
    = 450×(100+60)/100: 600×(100+50)/100
    = 4 : 5 ***Ans: d***
13. Let the cost price of article A be Rs. 100
    Then, the cost price of article E
    = Rs. 200
    Marked price of article A
    = 100 + 60% of 100 = 160
    Marked price of article E
    = 200 +20% of 200 = 240
    Required percentage
    = [(240-160)/160]×100 = 50% ***Ans: a***
14. Profit% = (100+Markup%) × [(100-Discount%)/100]-100
    Profit% for article A
    = (100+60) × [(100-25)/100]-100
    = 20%
    Similarly,
    Profit% for article B = 19%
    Profit% for article C = 32%
    Profit% for article D = 5%
    Profit% for article E = 2%
    Profit% for article F = 8% ***Ans: c***
15. Profit% = (100+markup%) × [(100-Discount%)/100]-100
    Profit % for article B = 19%
    Profit % for article F = 8%
    Total profit = 19% of 800 + 8% of 800
    = 27% of 800 = Rs. 216 ***Ans: d***